

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+20+40 పేజీల ఆదివారం అనుబంధం వెల:₹6.00 సంపుటి: 11 సంచిక: 313

ఆదివారం 3-2-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

బోల్డ్ & రకుల్



ఎవరో డామ్ డిషుకు ఫెల్లో.. డామ్ డిషుకు కామెంట్ పెడితే.. రక్కేసింది. అది మీడియా అంతా పాక్కేసింది. మరి 'వాట్ డు యు థింక్' అని మేమడిగితే.. బోలెడు విషయాలు బోల్డుగా చెప్పింది.

– ఫ్యామిలీలో



నేడు చివరి వన్డే

వెల్లింగ్టన్‌లో కివీస్‌తో తలపడనున్న భారత్ – స్పోర్ట్స్‌లో



1 హైకోర్టు జడ్జిలుగా పనిచేసేందుకు బీసీలు పనికి రారంటూ ఒక ముఖ్యమంత్రి కొలీజియానికి లేఖ రాశారని జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్ ఆరోపించారు.. ఆ ముఖ్యమంత్రి ఎవరు?

2 తన సమకాలికుడైన ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రిగా వ్యవహరిస్తున్న సీనియర్ బీసీ నేతను సంబంధిత శాఖ వ్యవహారాల్లో పూర్తిగా దూరం పెట్టిన సీఎం ఎవరు?

3 దేవదాయ శాఖ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న బీసీ వర్గానికి చెందిన మంత్రిని అమరావతిలో వెంకన్న ఆలయం శంకుస్థాపనకు పిలవవద్దని చెప్పిన సీఎం ఎవరు?

4 తనకు మెమోరాండం ఇవ్వడానికి వచ్చిన నాయీ బ్రాహ్మణులను వేలెత్తి చూపించి బెదిరిస్తూ సెక్రటేరియట్‌లో కాలుపెట్టనివ్వబోనంటూ ఆగ్రహోదగ్రుడైన సీఎం ఎవరు?

5 తమను ఎస్సీల్లో చేరుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని విశాఖలో ఆందోళన చేసిన మత్స్యకారులను భయపెడుతూ తమాషాలు చేస్తున్నారా, మీ సంగతి చూస్తా.. అని హెచ్చరించిన సీఎం ఎవరు?

6 చేపల వేటపైనే ఆధారపడి జీవించే మత్స్యకారులకు డీజిల్‌పై సబ్సిడీ ఇవ్వకుండా ఎగ్గొట్టింది, గల్లంతైన జాలర్ల కుటుంబాలకు పరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టింది ఎవరు?

7 అధికారంలోకి రాగానే బీసీ డిక్లరేషన్‌ను అమలు చేస్తానని చెప్పి ఎగ్గొట్టిన సీఎం ఎవరు?

బీసీ వర్గాలను దారుణంగా వంచించిన ఆ నేత..

ఎవరు.. ఇంకెవరు?

2014 టీడీపీ మేనిఫెస్టోలో బీసీలకు 120కి పైగా హామీలిచ్చిన చంద్రబాబు

బీసీలకు రూ.10,000 కోట్లతో ప్రత్యేక బడ్జెట్ ఒట్టి మాటే

అరకొర కేటాయింపులు, వ్యయం చేయకుండా ఆంక్షలు

బీసీ డిక్లరేషన్ బుట్టదాఖలు..

బీసీ మంత్రుల అధికారాలకు కత్తెర.. పెత్తనం బాబులదే

ఆర్డీఓని కూడా బదిలీ చేసే అధికారం లేని కేఈ

రాజధాని భూసమీకరణ, భూకేటాయింపుల్లోనూ అంతే


పేదలకు చదువుల వెలుగు పంచిన ఫీజుల పథకానికి బాబు తూట్లు

బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వైఎస్సార్ హయాంలోనే అసెంబ్లీలో తీర్మానం



2 లో

వైఎస్సార్ వెలిగించిన చదువుల దీపం..




కనీస చదువులు కూడా పూర్తి చేయకుండానే డ్రాపౌట్లుగా మిగిలిపోతున్న నిరుపేద బీసీ విద్యార్థులను హైస్కూలు గడప దాటించి వృత్తి విద్యా కళాశాలల్లో చదువుకునే అవకాశం కల్పించిన బ్రహ్మాస్త్రం వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్. ఇంట్లో చదువుల దీపం వెలిగితేనే ఆ కుటుంబంలో వెలుగులు వెదజల్లుతాయనేది వాస్తవం. దీన్ని గ్రహించినందువల్లే దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారు. పూరి గుడిసెలో తల దాచుకునే పేద కుటుంబం కూడా ఫీజుల పథకం వల్లే తమ బిడ్డలను ఇంజనీర్లు, డాక్టర్లుగా చూడగలిగింది. గ్రామీణ పేద విద్యార్థులకు సైతం ట్రిపుల్ ఐటీల్లో చదివే భాగ్యం దక్కింది. అలాంటి అద్భుత పథకాన్ని సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రీయింబర్స్ బకాయిలు విడుదల చేయకుండా దెబ్బ తీసి నీరుగార్చారు.

జయరాం హత్య కేసు..

మేనకోడలి పాత్రపై అనుమానాలు!

పోలీసుల అదుపులో శిఖా చౌదరి

కంచికచెర్లలో శిఖాను విచారించిన కృష్ణా జిల్లా ఎస్పీ



శిఖా చౌదరి

- మరో ముగ్గురిని విచారిస్తున్న పోలీసులు
- హైదరాబాద్‌లో శిఖా ఇంటిలో సోదాలు
- జయరామ్ ఇంటిని పరిశీలించిన పోలీసులు
- దస్పల్లా హోటల్ సీసీ టీవీ పుటేజీ స్వాధీనం

సాక్షి, అమరావతి బ్యూరో/హైదరాబాద్: కోస్టల్ బ్యాంకు డైరెక్టర్, ఎన్నారై చిగురుపాటి జయరాం (55) హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కృష్ణా జిల్లా నందిగామ మండలం ఐతవరం వద్ద హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి పక్కన కారులో జయరాం మృతదేహాన్ని గురువారం అర్ధరాత్రి పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. వాహనంలో ఆయన మృతదేహం పడి ఉన్న తీరును బట్టి హత్యగా భావిస్తున్న పోలీసులు.. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ వివాదాలతో పాటు వివాహేతర సంబంధం కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. జయరామ్ హత్య కేసులో ఆయన మేనకోడలు శిఖా చౌదరి పాత్రపై అనుమానాలు రేకెత్తడంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ఆమెను నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను కంచికచెర్ల సర్కిల్ స్టేషన్‌లో ఉంచి జిల్లా ఎస్పీ త్రిపాఠి స్వయంగా విచారించారు. దాదాపు 20 గంటలపాటు విచారించినప్పటికీ అమె పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ఆమెతో పాటు మరో ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌లోని జయరామ్, శిఖా చౌదరి నివాసాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు.

జయరామ్ ఎక్కడెక్కడికి వెళ్లారు?

జయరామ్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అతను ఎక్కడెక్కడికి వెళ్లాడు అనే కోణంలో కృష్ణా జిల్లా పోలీసులు ఆరా తీస్తున్నారు. దాన్నిబట్టి మొదట దస్పల్లా హోటల్ వద్దకు వెళ్లి అక్కడి సీసీ టీవీ పుటేజీలను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. జయరామ్‌తో పాటు ఎవరైనా కొత్తవ్యక్తులు ఉన్నారా అనే కోణంలో హోటల్ సిబ్బందిని

మిగతా 5వ పేజీలో ▶



రేపు సీఈసీని కలవనున్న వైఎస్ జగన్

- ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఫిర్యాదు
- డీజీపీ వ్యవహారశైలిపై కూడా?

5లో

మీరు ఓడిపోతే ఎలాగంటున్నారు

- మా పెట్టుబడుల మాటేమిటని విదేశీ పారిశ్రామికవేత్తలు ప్రశ్నిస్తున్నారు
- సర్వేలతో వైఎస్సార్‌సీపీ నేతలు సంబరపడుతున్నారు
- నెలకు రూ.500 లెక్కన రైతులకు మోదీ ముష్టి ఇస్తారట
- డ్వాక్రా మహిళలకు ఉచితంగానే రూ.10వేలు
- కృష్ణాజిల్లా కేసరపల్లి పసుపు – కుంకుమ సభలో సీఎం చంద్రబాబు



సాక్షి, విజయవాడ: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నోట ఓటమి మాట వచ్చింది. తాను విదేశాలకు వెళ్లినప్పుడు 'ఈసారి ఎన్నికల్లో మీరు ఓడిపోతే మేము పెట్టిన పెట్టుబడులు ఏమవుతాయని' చాలామంది పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారని ఆయనన్నారు. 'మా ప్రజలకు నేను అన్నీ చేస్తున్నాను.. ఓడిపోయే సమస్యే లేదు. తిరిగి అధికారంలోకి వస్తా'మని భరోసా ఇచ్చామని చెప్పారు. రేపు తమ ప్రభుత్వం వచ్చాకే పెట్టుబడి పెట్టేందుకు ఒకరిద్దరు వాయిదా వేసుకుంటున్నారన్నారు. కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం కేసరపల్లి గ్రామంలో శనివారం పసుపు – కుంకుమ

మిగతా 4వ పేజీలో ▶



విజయవాడ ఎయిర్‌పోర్ట్‌లో సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్‌కు స్వాగతం పలుకుతున్న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్

నేడు హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభం

- సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్‌చే ప్రారంభోత్సవం
- సుప్రీంకోర్టులోని తెలుగు న్యాయమూర్తుల హాజరు

- వివరాలు 2లో

సీబీఐ కొత్త చీఫ్ శుక్లా



- సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) కొత్త చీఫ్‌గా మధ్యప్రదేశ్ మాజీ డీజీపీ రిషికుమార్ శుక్లా(58)ను కేంద్రం ఎంపిక చేసింది. ఆయన సీబీఐ డైరెక్టర్‌గా రెండేళ్లపాటు కొనసాగుతారని తెలిపింది. ఈ మేరకు సిబ్బంది వ్యవహారాల శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

15లో

ఇదండీ సంగతి



...రాష్ట్రాలకు మనం ఏమీ ఇవ్వకున్నా! తీసుకున్నాం చాలు!

అసలే అధికరేట్లు.. ఆపై ఎక్సెస్..

రాజధాని పనులంతే!



రిజర్వాయర్ల నిర్మాణం, వాగుల విస్తరణ, పూడికతీత పనుల్లో మేత!

నిబంధనలకు విరుద్ధంగా ఎక్సెస్‌కు టెండర్లు ఖరారు.. కేంద్రం, ఆర్థికశాఖ అభ్యంతరాలు బేఖాతర్

సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో ఏ పనులు చేపట్టినా రాత్రికి రాత్రే భారీ వ్యయంతో కూడుకున్నవిగా మారిపోతున్నాయి. అంతర్జాతీయ స్థాయి పేరు చెబుతూ ప్రభుత్వ పెద్దలు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ విభాగాల అభ్యంతరాలు బుట్టదాఖలవుతున్నాయి. 'ముఖ్య'నేత ఎంపిక చేసిన కాంట్రాక్టు సంస్థలకే పనులు దక్కేలా టెండర్ల వ్యవహారాలను సీఆర్‌డీఏ నిర్వహిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వరద నియంత్రణ పనులంటూ..

రాజధాని అమరావతి ప్రాంతంలో శాఖమూరు, నీరుకొండ రిజర్వాయర్ల నిర్మాణంతోపాటు కొండవీటివాగు, పాలెంవాగు విస్తరణ, పూడికతీత పనులను ప్రపంచబ్యాంకు రుణంతో చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించారు. అయితే అసలు ఇంతవరకు ఈ రుణం ఇంకా మంజూరు కాకున్నా వెంటనే వరద నియంత్రణ పనులను చేపట్టకుంటే రాజధాని మునిగిపోయే ప్రమాదం ఉందని సీఆర్‌డీఏ పేర్కొంది. 0.03 టీఎంసీల సామర్థ్యం కలిగిన శాఖమూరు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.69.70 కోట్ల వ్యయం అవుతుందని తొలుత అంచనా వేశారు. అనంతరం కొండవీటివాగు, పాలెంవాగులను 36.55 కిలోమీటర్ల మేర విస్తరించడంతోపాటు పూడికతీత పనులను చేర్చారు. ఈ పనులను అదనంగా చేర్చినా

మిగతా 5వ పేజీలో ▶

బాబు భజన సభల్లో..

పింఛన్‌దారులకు చుక్కలు

- సభ జరుగుతున్న రోజే పింఛన్లు ఇస్తామంటూ ప్రచారం
- అప్పుడు తీసుకోకుంటే పింఛన్లు రద్దవుతాయని జన్మభూమి కమిటీల బెదిరింపులు

పింఛన్‌ల కోసం నిరీక్షించి ముగ్గురి మృతి

4 లో

తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో

మూడు బంగారు కిరీటాలు మాయం

- 1.300 కిలోల బరువు ఉంటాయన్న అధికారులు
- విచారణ ప్రారంభించిన టీటీడీ, పోలీసులు

13లో

విజయవాడకు సీజేఐ జస్టిస్ గొగొయ్ రాక

- గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికిన హైకోర్టు సీజే ప్రవీణ్‌కుమార్
- దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ గొగొయ్.. ఆలయ మర్యాదలతో స్వాగతం
- అమ్మవారి సేవలో సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సుభాష్‌రెడ్డి
- సీజేఐను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం చంద్రబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/గన్నవరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్‌కు శనివారం గన్నవరం విమానాశ్రయంలో పలువురు న్యాయాధిపతులు, ప్రభుత్వాధిపతులు స్వాగతం పలికారు. ఏపీ హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభోత్సవానికి న్యూఢిల్లీ నుంచి విమానంలో జస్టిస్ రంజన్ గొగొయ్ దంపతులు విచ్చేశారు. వీరితోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డిలు కూడా గన్నవరం చేరుకున్నారు. విమానాశ్రయంలో సీజేఐ, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికినవారిలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులతో పాటు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్రనాథ్‌రాయ్, రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పి.నారాయణ, రాజ్యసభ సభ్యులు కె.రవీంద్రకుమార్, జిల్లా న్యాయమూర్తి వై.లక్ష్మణరావు, జిల్లా కలెక్టర్ బీ.లక్ష్మీకాంతం, నగర పోలీస్ కమిషనర్ ద్వారకాతిరుమలరావులు ఉన్నారు.

దుర్గమ్మకు సీజేఐ ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను శనివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్‌తోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సుభాష్‌రెడ్డి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్‌లు విచ్చేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన న్యాయమూర్తులకు ఆలయ ఈవో వి.కోటేశ్వరమ్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఈవో అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సుభాష్‌రెడ్డిలకు ఆశీర్వచనం అందజేస్తున్న వేదపండితులు



సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం చంద్రబాబునాయుడు

సీజేఐతో చంద్రబాబు భేటీ

సాక్షి, అమరావతి: సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్‌ను సీఎం చంద్రబాబు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏపీ హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభానికి వచ్చిన జస్టిస్ గొగొయ్ నోవాటెల్ హోటల్లో విడిది చేశారు.

నేడు హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభం

- సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్‌చే ప్రారంభోత్సవం
- సుప్రీంకోర్టులోని తెలుగు న్యాయమూర్తుల హాజరు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక భవన ప్రారంభోత్సవం ఆదివారం జరగనుంది. సీఆర్‌డీఏ పరిధిలో నేలపాడులో నిర్మించిన ఈ తాత్కాలిక భవనాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగొయ్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టులోని తెలుగు న్యాయమూర్తులు జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ రామయ్యగారి సుభాష్‌రెడ్డి, ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్‌లతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పలువురు న్యాయమూర్తులు, ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు. అయితే హైకోర్టు తాత్కాలిక భవనం నుంచి కార్యకలాపాలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్న విషయంపై ఇంతవరకూ పూర్తి స్పష్టత లేదు. ఫిబ్రవరి 15 అనంతరం ఈ భవనం నుంచి హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభించవచ్చు. భవనాన్ని ఇప్పటికే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన ద్వారం పైభాగంలో మూడు సింహాల బొమ్మ ఏర్పాటు చేశారు.

2.5 లక్షల చ.అడుగుల్లో నిర్మాణం

ఈ తాత్కాలిక భవనాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. రూ.110 కోట్లతో జీ+2 అంతస్తుల్లో నిర్మించిన భవనాన్ని భవిష్యత్తులో జీ+ 5కు పెంచుకునే వెసులుబాటు ఉంది. 2.5 లక్షల చదరపు అడుగుల్లో ఈ తాత్కాలిక భవన నిర్మాణాన్ని ప్రారంభించగా.. మొదటి అంతస్తులో కోర్టు హాళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. రెండో అంతస్తులో నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. హైకోర్టు భవనం నాలుగు వైపులా రాజస్తాన్ స్టోన్‌ను పరిచారు. వాహనాల పార్కింగ్‌కు విశాలమైన స్థలం కేటాయించారు.

100 అడుగుల స్తూపం

జాతీయ జెండా ఎగురవేసేందుకు హైకోర్టు భవనం ఎదుట ఏర్పాటు చేసిన 100 అడుగుల స్తూపం ప్రత్యేక ఆకర్షణగా ఉంది. హైకోర్టు భవనం పక్కనే జీ+5 అంతస్తుల్లో న్యాయవాదుల కోసం మరో భవనం నిర్మిస్తున్నారు. 2.5 లక్షల రికార్డులు భద్రపరిచేలా ఏర్పాట్లు చేశారు. మహిళా న్యాయవాదులకు ప్రత్యేక గది, ప్రభుత్వ న్యాయవాదులకు చాంబర్లు, సువిశాలమైన క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, న్యాయవాదులు, కక్షిదారుల కోసం తాత్కాలిక హైకోర్టు భవనానికి వచ్చేందుకు వీలుగా విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి బస్సులు నడపనున్నారు. తాత్కాలిక భవనం ఎదురుగా న్యాయమూర్తులకు విల్లాలు సిద్ధం చేస్తున్నారు. ఆ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

నిఘా నీడలో నేలపాడు

గుంటూరు: నేలపాడు గ్రామ పరిధిలో ఆదివారం హైకోర్టు తాత్కాలిక భవనం ప్రారంభోత్సవం నేపథ్యంలో గట్టి నిఘా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రూరల్ ఎస్పీ ఎస్.వి.రాజశేఖరబాబు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీజేఐతో పాటు పలువురు సుప్రీం, తెలుగు రాష్ట్రాల హైకోర్టుల న్యాయమూర్తులు హాజరవుతున్న కారణంగా భద్రతను మరింత పెంచారు.





నేలపాడులో సీజేఐ జస్టిస్ గొగొయ్ ప్రారంభించనున్న హైకోర్టు తాత్కాలిక భవనం.. హైకోర్టులోని ఓ కోర్టు గది

షర్మిల కేసులో ఒకరి అరెస్టు

- ప్రకాశం జిల్లా వాసి పెద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు గుంటూరులో సంకెళ్లు
- ఏపీ ప్రభుత్వం రెండెకరాల భూమి ఇచ్చిందని విచారణలో వెల్లడి
- తెలంగాణలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



పోలీసులు అదుపులోకి తీసుకున్న పెద్దిశెట్టి వెంకటేశ్వరావు

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోదరి వైఎస్ షర్మిలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, అభ్యంతరకరమైన పోస్టుల కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. యూట్యూబ్‌తో పాటు పలు వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేసి దాదాపు 60 పోస్టులపై తీవ్ర అసభ్యకర కామెంట్లు చేసిన ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేముల గ్రామానికి చెందిన పెద్దిశెట్టి వెంకటేశ్వరరావును గుంటూరులో శనివారం అరెస్టు చేశారు. అతడు గుంటూరులోని ఆర్‌వీఆర్ కాలేజీలో ఎంసీఏ చదువుతున్నాడు. సొంతూరైన వేములలో తమ కుటుంబానికి రెండెకరాల భూమిని ఏపీ ప్రభుత్వం ఇచ్చిందని పోలీసుల విచారణలో వెంకటేశ్వరరావు వెల్లడించినట్లు సమాచారం. గుంటూరులో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చిన వెంకటేశ్వరరావును పోలీసులు ఆదివారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నారు.

ఐపీ అడ్రస్‌తో గుర్తించాం...

తనపై ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని జనవరి 14న వైఎస్ షర్మిల హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ''షర్మిలపై తీవ్ర అసభ్యకర కామెంట్లు చేసిన వెంకటేశ్వరరావును గూగుల్ ఇచ్చిన ఇంటర్నెట్ ప్రోటోకాల్(ఐపీ) అడ్రస్ ఆధారాలతో గుర్తించాం. ఇప్పటికే ఈ కేసులో యూట్యూబ్, వెబ్‌సైట్లలో పోస్టులు పెట్టిన 18 మందికి సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చాం. అందరినీ విచారించాం. చాలా వీడియోలు, పోస్టులకు వెంకటేశ్వరరావు తీవ్ర అసభ్యకర కామెంట్లు పెట్టినట్లు గుర్తించాం'' అని షర్మిల కేసును పర్యవేక్షిస్తున్న హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

మంచిర్యాల, ఆదిలాబాద్‌లో ఇద్దరు కస్టడీలోకి...

వెంకటేశ్వరరావు మాదిరిగానే వైఎస్ షర్మిలపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర కామెంట్లు చేసిన ఇద్దరిని తెలంగాణ రాష్ట్రంలో మంచిర్యాల, ఆదిలాబాద్‌లో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నట్టు తెలిసింది. ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన మూడు వెబ్‌సైట్లలోని పోస్టుల ఆధారంగా వీరంతా అసభ్యకర కామెంట్లు పెట్టారని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అలాగే షర్మిలపై అసభ్యకర కామెంట్లు పెట్టిన ఇతరులను గుర్తించేందుకు ఐపీ అడ్రస్‌లు, లాగిన్ వివరాలు ఇవ్వాలంటూ యూట్యూబ్ నిర్వాహకులకు ఇప్పటికే పోలీసులు లేఖలు రాశారు. ఈ వివరాలు కూడా వస్తే మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉంది.

ఎవరు.. ఇంకెవరు?

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన తరగతులకు చేయూతనందించి అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అడుగడుగునా అవమానిస్తూ అణగదొక్కుతున్నారు. నాలుగున్నరేళ్ల పాటు మాయ మాటలతో మభ్యపుచ్చి ఇప్పుడు ఎన్నికలు ముంచుకు రావడంతో బీసీలే తమ దేవుళ్లంటూ కొంగ జపం చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావ సమయంలో బీసీలకు ఎన్టీఆర్ రాజకీయంగా ప్రాధాన్యం కల్పించినా దొడ్డిదారిన టీడీపీని హస్తగతం చేసుకున్న చంద్రబాబు మాత్రం వారిని ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నారనేది పరిశీలకుల నిశ్చితాభిప్రాయం. చంద్రబాబు గత తొమ్మిదిన్నరేళ్ల పాలనను చూసినా, ఇప్పుడు అధికారంలో ఉండగా జరుగుతున్న పరిణామాలను గమనించినా బీసీలను ఆయన నయవంచనకు గురి చేశారనేది స్పష్టమవుతుంది.

నీరుగార్చేసిన నిర్వాకం బాబుదే..

పేద వర్గాలకు చెందిన పలువురు ఉన్నత ఉద్యోగాలు, గౌరవనీయమైన వృత్తుల్లో స్థిరపడేలా తీర్చిదిద్దిన ఘనత వైఎస్సార్ తెచ్చిన ఫీజుల పథకానిదే. పేద కుటుంబాల జీవన విధానంలో సానుకూల మార్పులతోపాటు సమాజంలో మన్ననలు పొందే స్థితికి వైఎస్సార్ తీసుకురాగలిగారు. ఈ తరహా ఆలోచనలను సీఎం చంద్రబాబు ఏమాత్రం చేయలేకపోగా నిరుపేద విద్యార్థులకు వరం లాంటి ఫీజుల పథకాన్ని నీరుగార్చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తూ ర్యాంకుల ప్రాతిపదికను తెచ్చి సాంకేతిక, ఉన్నత చదువుల వైపు బీసీ విద్యార్థులు కన్నెత్తి చూడకుండా కట్టడి చేశారని ఆయా సంఘాల నేతలు గుర్తు చేస్తున్నారు. '2014 నుంచి ఇప్పటివరకు ఏటా ఫీజు రీయింబర్స్ బకాయిలు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. పూర్తి ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు ఇచ్చేది లేదంటూ కళాశాలలు యాజమాన్యాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాయి. ఫలితంగా వేలాది మంది బీసీ, ఇతర పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సుల్లో చేరలేకపోతున్నారు. హాస్టల్ మెస్ ఛార్జీలు, స్కాలర్‌షిప్‌లను పెంచాలని ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డిమాండ్ చేస్తున్నా నాలుగున్నరేళ్లుగా ఆలకించలేదు' అని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు లెనిన్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు రాము పేర్కొన్నారు.

బకాయిలు రూ.500 కోట్లు

వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజుల పథకాన్ని వంద శాతం అమలు చేయాలని ఆయన మృతి చెందిన తర్వాత ధర్నా చేసిన చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చాక మాత్రం నిర్వీర్యం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి రూ.500 కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు నానా కష్టాలు పడుతున్నారు. ఆధార్‌తో సంబంధం లేకుండా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చదువుకునేందుకు వేల మంది విద్యార్థులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు.

గీత కార్మికులకు కల్లే దిక్కంటున్న బాబు: ధర్మాన

'ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద కుటుంబాలకు చెందినవారు ఉన్నత ఉద్యోగాల్లో కొనసాగుతుంటే సమాజంలో కచ్చితంగా ప్రత్యేక గౌరవం దక్కుతుంది. వారి జీవన విధానంలో అన్ని విధాలా మార్పు ఉంటుంది. ఈ తరహా మార్పును ఆశించే వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఇళ్ల నిర్మాణం లాంటి పథకాలను తెచ్చారు. చంద్రబాబు తీరు ఇందుకు పూర్తి భిన్నం. తాటి చెట్టు ఎక్కేవాడు తాటిచెట్టు ఎక్కుతూనే ఉండాలి. కల్లు గీతపైనే ఆధారపడి జీవించాలి. పోగులు నేసేవాడు పోగులు నేస్తుండాలి. డోలు, సన్నాయి, క్షురక వృత్తిదారులు ఆ పనులకే పరిమితం కావాలి. ఎదుగుబొదుగూ లేకా మగ్గిపోతుండాలి. ఆదరణ పేరుతో నాసిరకం వస్తువులు విదిలించడం తప్ప బీసీలకు చంద్రబాబు చేసింది ఏముంది?' అని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. గత నాలుగున్నరేళ్లలో టీడీపీ తరపున రాజ్యసభకు పంపిన వారిలో ఎవరెవరు ఉన్నారో, ఇతర పదవుల నియామకాలను పరిశీలిస్తే బీసీల పట్ల చంద్రబాబు డొల్లతనం బట్టబయలవుతుందన్నారు.

టీడీపీ మేనిఫెస్టోలో బీసీలకిచ్చిన హామీలు	అమలు స్థితి
2012లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం ఎన్నికల్లో బీసీలకు వంద స్థానాలు	అందులో సగం సీట్లు కూడా ఇవ్వలేదు
రూ.10 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్	నాలుగున్నరేళ్లలో ఆ ఊసేలేదు
నామినేటెడ్ పదవుల్లో మూడో వంతు బీసీలకు	ఇవ్వలేదు
వర్సిటీల వీసీలు, పాలకమండళ్లలో 33 శాతం రిజర్వేషన్లు	పట్టించుకోలేదు
కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు	30 సార్లు ఢిల్లీ వెళ్లినా ఆ ప్రయత్నమే చేయలేదు
విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు 33.5 శాతానికి పెంపు	అమలు చేయలేదు
బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు	అమలు చేయలేదు
ఆధార్‌తో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్	అమలు చేయలేదు
చేతి, కుల వృత్తుల వారి ఫెడరేషన్లు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో అనుసంధానం	అమలు చేయలేదు
చేనేతలకు రూ.1000 కోట్లతో ప్రత్యేక నిధి, బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు కేటాయింపు	ఈ ప్రతిపాదనే లేదు
గీత కార్మికుల కోసం ఎక్సైజ్ శాఖ నుంచి కల్లు వృత్తిని తప్పించడం	అమలు చేయలేదు
రైతుబజార్ల మాదిరిగా మేకలు, గొర్రెలు విక్రయబజార్లు	అమలు చేయలేదు
దోభీఘాట్లకు తక్కువ టారిఫ్‌తో విద్యుత్	అమలు చేయలేదు
రజకులను ఎస్సీలుగా గుర్తించేందుకు చర్యలు	పట్టించుకోలేదు
క్షౌరశాలలకు తక్కువ టారిఫ్‌తో విద్యుత్	అమలు చేయలేదు
గాండ్లను బిసి–బి నుంచి ఎస్సీలుగా మార్చేందుకు చర్యలు	పట్టించుకోలేదు
సగర్లను బీసీ–డి నుంచి ఎలోకి మార్చేందుకు చర్యలు	పట్టించుకోలేదు

ఎన్నికల జపమే తప్పు...

ఎన్నికల ముంగిట బీసీల జపం చేస్తున్న సీఎం చంద్రబాబు తన పాలనలో వారిని పట్టించుకోకపోగా తీవ్ర అవమానాలకు గురి చేశారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. గత ఎన్నికల్లో బీసీలకిచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కదాన్ని పరిపూర్ణంగా అమలు చేయలేదని గుర్తు చేస్తున్నారు. బీసీలను మోసగించేందుకు 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు 120కిపైగా హామీలను ప్రకటించి అనంతరం వాటన్నింటినీ బుట్టదాఖలు చేశారు. చేతివృత్తులు, సాంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీ కుటుంబాలకు ఐదేళ్లుగా ఎలాంటి న్యాయం జరగలేదు. మైనింగ్‌పై బీసీలకు హక్కులు కల్పిస్తామని చెప్పి ఇసుక, ఇటుకను కూడా టీడీపీ నేతల చేతుల్లోనే పెట్టారు. కుమ్మరులను కనీసం చెరువుల్లో మట్టిని కూడా తవ్వుకోనివ్వకుండా అమ్ముకొని సొమ్ము చేసుకున్న ఘనత టీడీపీ నేతలకే దక్కింది.

బీసీ డిక్లరేషన్ గాలికి..

తాము అధికారంలోకి వస్తే బీసీల తలరాతలు మార్చేస్తామంటూ 2012లో విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌ను గద్దెనెక్కాక చంద్రబాబు బుట్టదాఖలు చేశారు. ఈ డిక్లరేషన్‌ను తు.చ. తప్పకుండా అమలు చేస్తామని గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి ఆ తరువాత ఆ సంగతే గాలికి వదిలేశారు. నాలుగున్నరేళ్లుగా దీన్ని పట్టించుకోకుండా తీరిగ్గా ఇప్పుడు జయహో బీసీ సదస్సులో బీసీ డిక్లరేషన్‌కు చట్టబద్ధత తెస్తామంటూ మరోసారి హామీ గుప్పించడం గమనార్హం. అధికారంలో ఉండగా ఏమాత్రం పట్టించుకోకుండా మరోసారి తమకు అవకాశం కల్పిస్తే అమలు చేస్తామంటూ మాయమాటలు చెప్పడం ఆయనకే చెల్లిందని టీడీపీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం చంద్రబాబు రూ.పది వేల కోట్లతో బీసీలకు ప్రత్యేక బడ్జెట్ పెడతామని ఘనంగా ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టకపోగా కేటాయింపులను సైతం ఖర్చు చేసిన పాపాన పోలేదు. బీసీ డిక్లరేషన్ ప్రకారం దామాషా పద్ధతిలో బీసీలకు వంద సీట్లు కేటాయిస్తామని చెప్పిన మాటను తుంగలో తొక్కి కనీసం అందులో సగం స్థానాలను కూడా ఇవ్వలేదు.

బీసీలకు జగన్ హామీతో ఉలిక్కిపడ్డ బాబు

బీసీలకిచ్చిన హామీలు అమలు చేయపోగా వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలను చంద్రబాబు కాపీ కొడుతుండటం గమనార్హం. పాదయాత్రలో పేదల కష్టాలను చూసి చలించిన వైఎస్ జగన్ బీసీ అధ్యయన వేదిక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నివేదిక రాగానే బీసీ గర్జన నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఉలిక్కిపడ్డ చంద్రబాబు హడావుడిగా జయహో బీసీ కార్యక్రమానికి తెర తీసినట్లు పేర్కొంటున్నారు. బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మారుస్తామని, అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని జగన్ ప్రకటించగా... జయహో బీసీ సదస్సులో చంద్రబాబు వాటినే ప్రకటించడంపై బీసీ వర్గాల్లోనే విస్మయం వ్యక్తమవుతోంది. చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం కోసం వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో ప్రైవేటుబిల్లు ప్రవేశపెట్టారు. ఈ సమావేశాల్లో అది చర్చకు వచ్చే అవకాశం ఉంది.

ఆదరణ-2 పేరుతో ఆర్భాటం..

టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇన్నేళ్ల పాటు ఆదరణ పథకం గురించి పట్టించుకోకుండా కొద్ది నెలల క్రితమే ఆదరణ–2 పేరుతో రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఉప్పర్లు, వడ్డెరలు, కమ్మరులకు కంటితుడుపుగా కొద్ది పనిముట్లు ఇచ్చి వాటినే గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. ఈ పథకానికి 7.5 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 2 లక్షల మందికే పనిముట్లు ఇచ్చి చేతులు దులుపుకోవడం గమనార్హం.

మత్స్యకారుల డీజిల్ సబ్సిడీకి ఎగనామం

టీడీపీ సర్కారు మత్స్యకారులకు డీజిల్‌పై సబ్సిడీ ఇవ్వకుండా ఎగ్గొట్టింది. వారు వేటాడిన చేపలకు మార్కెటింగ్ సౌకర్యం, కనీసం నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీ సదుపాయం కూడా కల్పించలేదు. వేటకు వెళ్లి గల్లంతైన జాలర్ల కుటుంబాలకు ఏళ్ల గడిచినా పరిహారమివ్వలేదు. శ్రీకాకుళం జిల్లాలోనే 80 మందికి పైగా మత్స్యకారులు గల్లంతు కాగా ఇప్పటివరకూ పరిహారం అందలేదు. రాష్ట్రంలో తీరం ప్రాంతం విస్తారంగా ఉన్నా గుజరాత్ తదితర రాష్ట్రాలకు మత్స్యకారులు వలస వెళ్లి చిక్కుకుపోయి పాకిస్థాన్ జైళ్లలో మగ్గాల్సిన దుస్థితిని కల్పించారు.

నేతన్నలకు వెయ్యి కోట్ల ప్రత్యేక నిధి ఏది?

చేనేత కార్మికులకు రూ.వెయ్యి కోట్ల ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు హామీ అమలుకు నోచుకోలేదు. చేనేత కార్మికుల రుణాలన్నింటినీ మాఫీ చేసి ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పిన బాబు నాలుగున్నరేళ్లలో ఆ ఊసే ఎత్తలేదు. చేనేతలకు ఇస్తున్న సబ్సిడీని రూ.600 నుంచి వెయ్యికి పెంచుతామని చెప్పి పట్టించుకోలేదు. ఆప్కో రిబేటు కింద చేనేతలకు చెల్లించాల్సిన సబ్సిడీ సొమ్మును ఇవ్వకుండా వారిని అప్పుల పాలు చేశారు. బీసీ వర్గాలకు చెందిన 11 ఫెడరేషన్లకు అరకొర నిధులిచ్చి సవాలక్ష ఆంక్షలు పెట్టడంతో రుణాలు అందక అల్లాడే దుస్థితి నెలకొంది. కాపు కార్పొరేషన్ తరహాలో బీసీ కార్పొరేషన్, ఫెడరేషన్ల ద్వారా బీసీలకు వ్యక్తిగత రుణాలు సులభంగా మంజూరు చేయాలని కోరుతున్నా ఆలకించడం లేదు. ఈ ఫెడరేషన్లను బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో అనుసంధానం చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్నా చంద్రబాబు పట్టించుకోవడం లేదని ఆ వర్గం నేతలు వాపోతున్నారు. న్యాయస్థానాల్లో బీసీ వర్గాలకు చెందిన జడ్జిలు నియమితులు కాకుండా అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు కొలిజీయంకు నివేదిక పంపిన చరిత్ర చంద్రబాబుదని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య వెల్లడించడాన్ని బట్టి బీసీల పట్ల బాబుకు ఏమాత్రం ప్రేమ ఉందో బోధపడుతోంది.

బీసీ సంక్షేమానికి బడ్జెట్ (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయించిన బడ్జెట్	ఖర్చు చేసిన బడ్జెట్
2014-15	3,129	2,057
2015-16	3,231	2,720
2016-17	4,430	3,045
2017-18	5,013	4,783
2018-19	6,213	5,500
మొత్తం	22,016	18,105

కులాలకిచ్చిన హామీలు గాలికి..

రజకులు, గాండ్లను ఎస్సీలుగా మారుస్తామని, సగర్లను బీసీ–డీ నుంచి ఏలోకి, పూసల బీసీ–డి నుంచి ఏలోకి, ఆరెకటికలను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తామని, కురుబ–కురువలను బీసీ–డి నుంచి ఎస్టీలుగా మారుస్తామని, గవరలను బీసీ–డి నుంచి బీసీ–ఏగా, పద్మశాలీలను బీసీ–బీ నుంచి బీసీ–ఏలోకి, నాగ వంశస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి, మజ్జులను బీసీ–డీలోకి, విశాఖ కాపులను తూర్పు కాపులుగా గుర్తిస్తామని పలు కులాలకిచ్చిన హామీలను చంద్రబాబు గాలికి వదిలేశారు. మరోసారి అధికారమిస్తే ఇవన్నీ చేస్తామని కొత్తగా హామీ ఇవ్వడం పట్ల సొంత పార్టీ నేతలే విస్తుపోతున్నారు.

బీసీలకు కనీస గుర్తింపు లేదు...

రాష్ట్రంలో బీసీలు 52 శాతంతో 139 కులాల్లో 2.5 కోట్ల మందికిపైగా ఉన్నప్పటికీ వారికి కనీస ప్రాధాన్యం దక్కడం లేదని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచే వారి నైజాన్ని గుర్తించామన్నారు. చంద్రబాబు చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండదనేందుకు ఎంబీసీ కార్పొరేషన్ ఒక ఉదాహరణ అని జోగి రమేష్ పేర్కొన్నారు. 32 కులాలతో ఎంబీసీ కార్పొరేషన్ అని ప్రకటించి ఇంతవరకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

రెవెన్యూ మంత్రికి తెలియకుండా భూ కేటాయింపులు!

రాజకీయాల్లో చంద్రబాబు సమకాలీకుడు, పార్టీలో సీనియర్ నేత, బీసీ వర్గానికి చెందిన డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి అధికారాలకు చంద్రబాబు కోత వేశారు. రెవెన్యూ శాఖలో ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీ అధికారాలను ఆయనకు కాకుండా తన ఆధీనంలోని జీఏడీకి అప్పగించారు. భూముల కేటాయింపులను కూడా ఆ శాఖను పర్యవేక్షించే కేఈతో సంబంధం లేకుండా అప్పగించేస్తున్నారు. రాజధాని అమరావతి కోసం 33 వేల ఎకరాలు తీసుకున్నా కేఈకి తెలియకుండా తనకు సన్నిహితుడైన మంత్రి నారాయణతో ఆ పని చక్కబెట్టుకున్నారు. భూములు కేటాయించేందుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘంలో రెవెన్యూమంత్రికి స్థానం లేకుండా చేసిన ఘనత కూడా చంద్రబాబుదే.

పేదల అవసరాలపై జగన్‌కు స్పష్టమైన అవగాహన..

పేదల విషయంలో ఎంత దయార్థ్ర హృదయుడిగా వైఎస్ రాజశేఖరరెడ్డి మెలిగారో అంతకన్నా మిన్నగా వైఎస్ జగన్ ఉంటారనేది తమ సంపూర్ణ విశ్వాసమని వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు జంగా కృష్ణమూర్తి, కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. 'పేదలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైఎస్సార్ ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలు అందరితో నీరాజనాలు అందుకున్నాయి. వాటిని మెరుగ్గా తీర్చిదిద్దడంతోపాటు ప్రజామోద పథకాల రూపకల్పనకు జగన్ శ్రీకారం చుట్టారు. పేదల ప్రతి సమస్యను ఆయన సుదీర్ఘ పాదయాత్రలో గుర్తించారు. వాటన్నింటిపైనా అధ్యయనం చేయాలని కమిటీని నియమించి అన్ని ప్రాంతాలకు పంపారు. నివేదిక రూపొందించి సమీక్షించారు. పేదల అవసరాలపై ఆయన స్పష్టమైన అవగాహనతో ఉన్నారు. ప్రజాశీర్వాదంతో అధికారంలోకి రాగానే వాటిని చిత్తశుద్ధితో అమలు చేస్తారు. తండ్రికి మించిన తనయుడని ప్రజల చేత జగన్ అనిపించుకుంటారు' అని వారు చెప్పారు.

మిగిలిన మంత్రులూ ఉత్సవ విగ్రహాలే

మంత్రివర్గం, పార్టీలో కీలక స్థానంలో ఉన్న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడికి కూడాచంద్రబాబు చేతిలో అవమానాలు తప్పలేదు. సొంత జిల్లాలో యనమల మాట చెల్లుబాటు కాకుండా చేశారు. అన్నవరం దేవస్థానం ఈఓగా యనమల తాను చెప్పిన వారిని నియమించుకోలేని పరిస్థితి ఉందంటే ఆయనకు ప్రభుత్వంలో ఎంతటి ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న కళా వెంకట్రావు సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదు. మరో బీసీ మంత్రి కొల్లు రవీంద్ర ఉన్నా అధికారాలన్నీ చంద్రబాబు, ఆయన తనయుడి చేతుల్లోనే ఉన్నాయి. బీసీ మంత్రి పితాని సత్యనారాయణ తన సొంత జిల్లాలోనే పని చేయించుకునే పరిస్థితి లేదు. బీసీ మంత్రులు, ప్రజాప్రతినిధుల్లో చాలామందిది ఇదే పరిస్థితి. కృష్ణా జిల్లాలోని 17 మార్కెట్ కమిటీ ఛైర్మన్లలో 14 చోట్ల ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించడాన్ని బట్టి బీసీలకు లెక్కలేనన్ని పదవులిచ్చామని చెప్పుకుంటున్న ప్రకటనలో వాస్తవం ఎంత ఉందో తేటతెల్లమవుతోంది. వైఎస్ హయాంలో బీసీలైన బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, కేపీ సారథి వంటి నేతలు ప్రధాన శాఖలు నిర్వహించి కీలకంగా వ్యవహరించారని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు.

వైఎస్ హయాంలోనే 33 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం...

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈమేరకు మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేయించడంతోపాటు 2008 ఆగస్టు 29వ తేదీన అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించడం గమనార్హం. బీసీలకు చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు ఉంటే రాజ్యాధికారం వారికి చేరువవుతుందని అప్పట్లోనే చెప్పారు. ఇక రజక, వడ్డెర, వాల్మీకి కులాలను ఎస్టీల జాబితాలో చేర్చాలని జాతీయ ఎస్టీ కమిషన్‌కు నివేదించాలని వైఎస్ మంత్రి వర్గం అప్పట్లోనే నిర్ణయం తీసుకుంది. అయితే ఒక కులాన్ని ఒక వర్గం నుంచి మరో వర్గంలోకి మార్చే అధికారం రాష్ట్రానికి లేనందున కేంద్రం పరిధిలోనే చేయాలని నిర్ణయించారు. ఆరె, ఆరెవాళ్లు, ఆరోళ్లు, బొందిలి, ఆరె మరాఠి, మరాఠ (బ్రాహ్మణేతర), అరకలిస్, సురభి నాటకాళ్లవాళ్లు, నీలి రాజన్నల, రాజన్నలు, బారె, బార్య, మరార్, తంబోలి, మాలి కులాలను బీసీల జాబితాలో చేర్చేందుకు బీసీ కమిషన్ చేసిన సిఫార్సులకు వైఎస్సార్ ప్రభుత్వం అప్పట్లోనే ఆమోదం తెలిపింది.

గోదావరిలో ముగ్గురు యువకుల గల్లంతు


శ్రీనివాసరెడ్డి


శేషు


శివారెడ్డి

కుక్కునూరు: పుట్టినరోజు వేడుక మూడు కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. చేతికందివచ్చిన కొడుకులు తమకు అండగా ఉంటారనుకున్న సమయంలో విధి వారిని గోదావరి రూపంలో మింగేసింది. స్నేహితుడి పుట్టిన రోజు వేడుక చేసుకునేందుకు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాగినేనిపోటురెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు వేలేరు గ్రామం సమీపంలోని కిన్నెరసాని వాగు వద్దకు వచ్చారు. వారిలో ముగ్గురు యువకులు కందూరు శ్రీనివాసరెడ్డి, కారంపూడి శేషు, తిరుమలరెడ్డి శివరెడ్డి కిన్నెరసాని వాగు గోదావరిలో కలిసే ప్రదేశంలో స్నానానికి దిగారు. అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో ముగ్గురూ మునిగి గల్లంతయ్యారు. ముగ్గురూ అవివాహితులు. కందూరు శ్రీనివాసరెడ్డి ఐటీసీలో ఉద్యోగి కాగా, మిగిలిన ఇద్దరు ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న కుక్కునూరు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 7.15 గంటల వరకు గాలింపు జరిపినా మృతదేహాలు లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు.

చెన్నై బీచ్‌లో ముగ్గురు విద్యార్థుల మృతి

సాక్షి, చెన్నై: చెన్నై మెరీనా బీచ్‌లో స్నానానికి వెళ్లిన ముగ్గురు విద్యార్థులు ప్రమాదవశాత్తు మృతి చెందారు. శుక్రవారం ఈ ఘటన జరుగగా శనివారం వీరి మృతదేహాలు బయటపడ్డాయి. తాంబరం సమీపంలోని సేలయూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు పది మంది శుక్రవారం మెరీనా బీచ్‌కు వెళ్లారు. వారిలో ముగ్గురు విద్యార్థులు స్నానానికి సముద్రంలోకి దిగారు. అలల తాకిడి అధికంగా ఉండటంతో సముద్రంలోకి కొట్టుకుపోయారు. సహచర విద్యార్థులు కేకలు పెట్టేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు శుక్రవారం సాయంత్రం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే చీకటి పడటంతో మృతదేహాల కోసం గాలింపు కష్టతరంగా మారింది. శనివారం ఉదయం నీలంకరై, పట్టినంబాక్కం, బీసెంట్ నగర్ బీచ్‌లలో వేర్వేరు ప్రాంతాల్లో మృతదేహాలు బయటపడ్డాయి. ఆ మృతదేహాలు తమ పిల్లలవేనని తల్లిదండ్రులు గుర్తించారు. మృతిచెందిన వారిలో సతీష్ (14), వినోద్ కుమార్ (14), సెంథిల్ కుమార్ (14) ఉన్నారు.

డీజీపీ కార్యాలయం సందర్శించిన రిటైర్డ్ డీజీపీ దొర

సాక్షి, అమరావతి: రిటైర్డ్ డీజీపీ హెచ్‌జే దొర శనివారం మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం డీజీపీ ఆర్పీ ఠాకూర్, పలువురు ఐపీఎస్ అధికారులతో కలిసి కొద్దిసేపు ఇష్టాగోష్టిలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల ఏడీజీ రవి శంకర్ అయ్యన్నార్, డీఐజీలు ఘట్టమనేని శ్రీనివాస్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న దొర

ఆనంద్ తేల్ తుమ్డే అరెస్ట్‌పై లెఫ్ట్ మండిపాటు

అర్బన్ నక్సలైట్ పేరిట అంబేడ్కర్ మనవడు అరెస్ట్

సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు, పౌరహక్కుల నేత ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుమ్డే అరెస్ట్‌ను వామపక్షాలు ఖండించాయి. ముంబై విమానాశ్రయంలో మహారాష్ట్ర పోలీసులు తుమ్డేను శనివారం తెల్లవారుఝామున అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కులం– వర్గం సమస్యపై విస్తృత అధ్యయనం చేసిన ప్రొఫెసర్ తేల్ తుమ్డేను అర్బన్ నక్సలైట్ పేరిట అరెస్ట్ చేయడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డీవీ కృష్ణ, వెంకటేశ్వర్లు, పలువురు ప్రజా సంఘాల నేతలు వేర్వేర్లు ప్రకటనల్లో ఖండించారు. ఆంగ్ల పత్రిక– ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో కాలమిస్ట్ అయిన తుమ్డేకు మహారాష్ట్ర కోరేగాం ఆందోళనలో పాత్ర ఉందని ఆరోపించి కొంత కాలంగా వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మోదీ హత్యకు కుట్రపన్నారనే ఆరోపణపై ఇప్పటికే విరసం నేత వరవరరావును అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోరేగాం ఘటనను పీష్వాలకు, దళితులకు మధ్య జరిగిన ఘటనగా చూడొద్దని చెబుతూ తేల్‌తుమ్డే ఆ ఘటనను వ్యతిరేకించారు. అలాంటి వ్యక్తిపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడాన్ని తప్పుపట్టారు. ఈ అరెస్ట్ ఎన్డీఏ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. తుమ్డేపై కేసును ఎత్తివేసి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను నాలుగు వారాల పాటు అరెస్ట్ చేయకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ పూణే పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండించారు.

సెర్చ్ కమిటీలను రద్దు చేయాలి

- కమిటీల్లో ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి స్థానం సరికాదు
- హైకోర్టులో పిల్ దాఖలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లను నియమించడానికి ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలను రద్దు చేసి, యూజీసీ నిబంధనల మేరకు తాజాగా సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసేలా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీన్ని తిరుపతికి చెందిన ప్రొఫెసర్ పి.మునిరత్నంరెడ్డి దాఖలు చేశారు. ఇందులో సీఎస్, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి, యూజీసీ చైర్మన్, శ్రీ వేంకటేశ్వర, పద్మావతి మహిళ, ఆదికవి నన్నయ, ద్రవిడ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలను ప్రతివాదులుగా చేర్చారు. హైకోర్టు సైతం గతంలో వీసీలను యూజీసీ నిబంధనల ప్రకారమే నియమించాలని స్పష్టంగా చెప్పిందని పిటిషనర్ వివరించారు. సెర్చ్ కమిటీలో ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిని ప్రభుత్వ నామినీగా నియమించడం యూజీసీ నిబంధనలకు విరుద్ధమన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం.. ఉన్నత విద్యలో ప్రముఖ వ్యక్తిని సెర్చ్ కమిటీలో సభ్యుడిగా నియమించాల్సి ఉందన్నారు. ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ఉన్నత విద్యలో ప్రముఖ వ్యక్తి కిందకు రారని వివరించారు. ప్రతి వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా వ్యవహరిస్తారని, ఈ కౌన్సిల్.. సెర్చ్ కమిటీలో వర్సిటీ ప్రతినిధిని ఎంపిక చేస్తుందన్నారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఉన్న వ్యక్తిని సెర్చ్ కమిటీలో సభ్యుడిగా నియమించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఆయా వర్సిటీల్లోసెర్చ్ కమిటీల్లో ముఖ్య కార్యదర్శిని ప్రభుత్వ నామినీగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను రద్దు చేయాలని కోరారు.

‘సబ్‌ప్లాన్ నిధులు మళ్లిస్తే సహించం’

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ ప్రభుత్వం ఎన్నికల తాయిలాల కోసం పసుపు–కుంకుమ పథకానికి ఎస్సీ, ఎస్టీలకు చెందిన స్పెషల్ కాంపోనెంట్ నిధులను మళ్లించాలని చూస్తే సహించబోమని జాతీయ దళిత హక్కుల సమాఖ్య హెచ్చరించింది. అత్యంత వెనుకబడిన వారి సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సబ్‌ప్లాన్ నిధులను టీడీపీ ప్రభుత్వం పసుపు–కుంకుమకు మళ్లించడాన్ని అడ్డుకుంటామని, ప్రభుత్వ తీరుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5న ఆందోళనలు చేపడతామని సంఘం జాతీయ అధ్యక్షుడు కె.ఆనందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జరిమానా వద్దులే..నజరానా ఇస్తాం

బొల్లినేనికి సర్కార్ బంపరాఫర్

- తారకరామతీర్థ సాగరం పనుల అంచనా మళ్లీ రూ.268.93 కోట్లు పెంపు!
- ఆర్థికశాఖ అభ్యంతరాలు బుట్టదాఖలు..
- సకాలంలో పనులు చేయని కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చిన అధికారులపై ప్రభుత్వ పెద్దల ఆగ్రహం

సాక్షి, అమరావతి: సకాలంలో పనులు చేయని కాంట్రాక్టర్‌కు జరిమానా విధించాల్సిన సర్కారు నజరానాల వర్షం కురిపిస్తోంది. అంచనా వ్యయాన్ని పెంచి ఇప్పటికే రూ.120.93 కోట్ల మేర లబ్ధి చేకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెంచి రూ.268.93 కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చేందుకు సిద్ధమైంది.మూడేళ్లలో రెండుసార్లు అంచనా వ్యయాన్ని పెంచడంపై ఆర్థికశాఖ అభ్యంతరాలు బుట్టదాఖలయ్యాయి.

అంచనాలు పెంచి మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు...

విజయనగరం జిల్లా గుర్ల మండలం కోటగాండ్రేడు వద్ద చంపావతి నదిపై 2.70 టీఎంసీల సామర్థ్యంతో తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్టును నిర్మించి కొత్తగా 24,710 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు 8,172 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే పనులకు 2005 ఫిబ్రవరి 19వతేదీన రూ.220.04 కోట్లతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. బొల్లినేని శీనయ్యకు చెందిన సీఆర్18జీ–బీఎస్‌పీసీఎల్(జేవీ) ఈ ప్రాజెక్టు పనులను రూ.181.50 కోట్లకు దక్కించుకుంది. ఒప్పందం ప్రకారం 2008 మే నెల నాటికే పనులు పూర్తి కావాల్సి ఉన్నా పూర్తి చేయకపోవడంతో గడువు మరో రెండేళ్లు పొడిగించారు. అయితే ఆ గడువు కూడా దాటిపోయినా పనులు పూర్తి చేయడంలో విఫలమైన కాంట్రాక్టర్‌పై వేటు వేయాల్సిన టీడీపీ సర్కారు అందుకు విరుద్ధంగా వ్యవహరించింది.



ప్రాజెక్టు డిజైన్ మారడం వల్ల తనకు గిట్టుబాటు కావడం లేదంటూ కాంట్రాక్టర్ మొండికేయడంతో 2015లో మట్టి కట్టలో 2.200 కి.మీ. నుంచి 5.749 కి.మీ. వరకూ, 0.00 నుంచి 0.890 కి.మీ. వరకు (డైక్–1) పనులను సీఆర్18జీ–బీఎస్‌పీసీఎల్ నుంచి తప్పించారు. ఆ పనుల విలువ రూ.51.30 కోట్లే. కానీ వాటి అంచనా వ్యయాన్ని రూ.172.23 కోట్లకు పెంచేసి బొల్లినేని శీనయ్యకే చెందిన ఎస్‌సీఎల్ (శీనయ్య కంపెనీ లిమిటెడ్) ఇన్‌ఫ్రాటెక్‌కు కట్టబెట్టేశారు. అంటే రూ. 120.93 కోట్ల మేరకు కాంట్రాక్టర్‌కు ప్రయోజనం చేకూర్చినట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.220.04 కోట్ల నుంచి 471.31 కోట్లకు పెంచేస్తూ 2015 సెప్టెంబరు 19న సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటివరకూ కేవలం రూ.37.34 కోట్ల విలువైన 20.57 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

నోటీసులిచ్చిన అధికారులపై చిందులు..

ఒప్పందం మేరకు పనులు చేయడంలో విఫలమైన కాంట్రాక్టర్‌కు గత అక్టోబర్‌లో 61–సీ నిబంధన కింద అధికారులు నోటీసులు జారీ చేశారు. కాంట్రాక్టర్ సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో సారంగం, కుడి, ఎడమ కాలువ పనుల నుంచి తొలగించి రూ.99.77 కోట్ల అంచనాతో గత డిసెంబర్ 17న టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏపీడీఎస్ఎస్ నిబంధనల ప్రకారం ఇందులో 95 శాతాన్ని పాత కాంట్రాక్టర్ నుంచి జరిమానాగా వసూలు చేయడానికి సిద్ధమయ్యారు. కాంట్రాక్టర్ దీన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తేవడంతోపాటు కోర్టుని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు టెండర్లను నిలుపుదల చేశారు. నిబంధనల ప్రకారం వ్యవహరించిన అధికారులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు అందుకు భిన్నంగా చీవాట్లు పెట్టినట్లు జలవనరుల శాఖ అధికారులు వెల్లడించారు. పనులు గిట్టుబాటు కాకుంటే కొట్టినా సరే కాంట్రాక్టర్లు పనులు చేయరంటూ తీర్మానించిన ప్రభుత్వ పెద్దలు అంచనా వ్యయాన్ని పెంచేయాలంటూ ఒత్తిడి తెచ్చారు. తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.471.31 కోట్ల నుంచి రూ.740.24 కోట్లకు పెంచుతూ అధికారులు ప్రతిపాదనలు పంపారు.

ఆర్థికశాఖ అభ్యంతరాలు బేఖాతర్..

తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టు కోసం మరో 136.14 ఎకరాల భూమిని సేకరించాలి. 799 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. 2015 సెప్టెంబరు 19న అంచనా వ్యయం పెంచిన సమయంలోనే భూసేకరణ, నిర్వాసితుల పునరావాసానికి నిధులు కేటాయించారు. అంటే తాజాగా అంచనా వ్యయాన్ని రూ.268.93 కోట్లు పెంచుతూ పంపిన ప్రతిపాదనలు కేవలం కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చడం కోసమేనని స్పష్టమవుతోంది. ఆర్థిక శాఖ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ మూడేళ్లలోనే అంచనా వ్యయాన్ని రూ.268.93 కోట్లు ఎలా పెంచేస్తారంటూ ప్రశ్నించింది. పనుల పరిమాణం పెరగడం వల్లే అంచనా వ్యయాన్ని పెంచాల్సి వచ్చిందన్న జలవనరుల శాఖ వాదనను కొట్టిపారేసింది. ఈ వ్యవహారం సీఎం చంద్రబాబు దృష్టికి రావడంతో ఆర్థిక శాఖ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

8వేల ‘ఆయుష్మాన్’ వెల్‌నెస్ సెంటర్లు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 8వేల వెల్‌నెస్ సెంటర్లు పనిచేయనున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని కుమార్ చౌబే ప్రకటించారు. ఈ పథకం కింద ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2022 కల్లా 1.5 లక్షల ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. వీటి ద్వారా బీపీ, డయాబెటిస్, క్యాన్సర్, వృద్ధాప్య సంబంధ వ్యాధులకు చికిత్స అందిస్తామన్నారు. ‘వెల్‌నెస్ సెంటర్ల ద్వారా సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కల్పించడంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 8వేల వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి రావడం నాకు సంతోషంగా ఉంది’ అని శనివారం జరిగిన జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎమ్)స్టీరింగ్ గ్రూప్ 6వ సమావేశానికి అధ్యక్షత వహించిన చౌబే పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎం కింద ఉచిత డయాగ్నస్టిక్ సర్వీస్‌ను ప్రారంభిస్తామని సంబంధిత రాష్ట్రాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, గిరిజన వ్యవహారాలు, శిశు, మహిళా అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పట్టణ వ్యవహారాలు, సామాజిక న్యాయం సాధికారిత, ఉన్నత విద్య విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

18 నుంచి పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు

సాక్షి, అమరావతి: ఏపీలో పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల షెడ్యూల్‌లో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఈ నెల 15 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని ఇంతకముందు ప్రకటించగా.. తాజాగా ఈ నెల 18 నుంచి మార్చి 2 వరకు నిర్వహిస్తామని తెలిపింది.

నాసిరకం ట్యాబ్‌లతో ఏఎన్‌ఎంల కుస్తీ

- సరిగా పనిచేయకపోవడంతో సతమతం
- వివరాల నమోదుకు అష్టకష్టాలు
- సాఫ్ట్‌వేర్ ప్రొవైడరకు ఫోన్ చేసినా ఫలితం శూన్యం
- పెరుగుతున్న పనిభారంతో తీవ్ర మానసిక ఒత్తిడి

సాక్షి, అమరావతి : ప్రభుత్వం నాసిరకం ట్యాబ్‌లను సరఫరా చేయడంతో అష్టకష్టాలు పడుతున్నామని ఏఎన్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఏఎన్‌ఎంల నియామకాల్లేకపోవడంతో.. ఉన్నవారిపై పని భారం పడుతోంది. ఈ పరిస్థితుల్లో వారిపై మరింత పని ఒత్తిడి పెరుగుతుండటంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఏఎన్‌ఎం డిజీయాప్ పేరుతో ఒక కొత్త సాఫ్ట్‌వేర్‌ను వేసి దాదాపు ఏడువేల మంది ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ట్యాబ్‌లను సరఫరా చేసింది. ఈ ట్యాబ్‌లన్నీ నాసిరకమైనవి. డిజీయాప్ వేశాక ఆరోగ్య ఉపకేంద్రాల్లో జరిగే కార్యక్రమాలు, అక్కడికొచ్చే గర్భిణుల వివరాలు నమోదు చేస్తుంటే.. అవి నమోదు కావడంలేదు. ఒక్కోసారి నమోదైనా సాయంత్రానికల్లా ఆ వివరాలు మాయమవుతున్నాయి. ట్యాబ్‌లకు సమస్య వస్తే ఫోన్ చేయలంటూ ఇచ్చిన నంబర్లకు ఫోన్ చేసినా ఆ సంస్థ ప్రతినిధులు స్పందించడం లేదని ఏఎన్‌ఎంలు చెబుతున్నారు.

అది ఉండగా.. ఇదెందుకో!

ప్రధానంగా ఈ యాప్ ద్వారా గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ప్రసవం అయ్యాక పిల్లలకు వేసిన వ్యాక్సిన్‌ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదుచేయాలి. ఆ వివరాలను ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయానికి పంపాలి. దీనికోసం కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో ఆర్‌సీహెచ్ (రీప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్) పోర్టల్‌ను రూపొందించింది. ఇక్కడ నమోదు చేస్తే సరిపోతుంది. కానీ కమీషన్ల కోసం కొత్త సాఫ్ట్‌వేర్‌ను తేవడం, దీనికోసం ట్యాబ్‌లు నాసిరకమైనవి కొనడంతో పనిభారంతో సతమతమవుతున్నామని ఏఎన్‌ఎంలు వాపోతున్నారు. ట్యాబ్‌లలో నమోదు చేయడంతో పాటు ఆర్‌సీహెచ్ పోర్టల్లోనూ పొందుపరచాల్సి ఉంది. ఏ రోజుకారోజు వివరాలు ట్యాబ్‌లోకి ఎక్కించాకే ఇళ్లకు వెళ్లాలి. ప్రభుత్వం ఇచ్చిన ఇంటర్నెట్ సిమ్‌కార్డులు మారుమూల గ్రామాల్లో పనిచేయడం లేదు. వివరాలు అప్‌లోడ్ చేసే అవకాశం లేకుండాపోతోంది. రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకూ ట్యాబ్‌లతో కుస్తీ పట్టాల్సి వస్తోంది. దీనిపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. చాలా రాష్ట్రాలో కేంద్రం రూపొందించిన ఆర్సీహెచ్ పోర్టల్‌ను అనుసరిస్తున్నారని, ఇక్కడే లేనిపోనివన్నీ అమల్లోకి తెచ్చి నిధులు దుబారా చేస్తున్నారని మండిపడుతున్నారు.

కబళిస్తున్న స్వైన్‌ఫ్లూ!

- దేశవ్యాప్తంగా ఏడేళ్లలో 8 వేల మంది మృతి
- ఈ కాలంలో 1.14 లక్షల మందికి సోకిన వైరస్
- వ్యాధి నియంత్రణలో ప్రభుత్వ వర్గాల వైఫల్యం



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా స్వైన్‌ఫ్లూ విజృంభిస్తోంది. ఏడాదికేడాదికి దీని తీవ్రత వాతావరణ పరిస్థితిని బట్టి మారుతూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా స్వైన్ ఫ్లూపై నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం 2012 నుంచి ఈ ఏడాది జనవరి 27 వరకు అంటే ఏడేళ్లలో దేశవ్యాప్తంగా 1.14 లక్షల మందికి స్వైన్‌ఫ్లూ సోకింది. అందులో 8,119 మంది మృతి చెందారు. స్వైన్‌ఫ్లూ సోకిన వారిలో 7.12 శాతం మంది మరణించారు. కేంద్ర నివేదిక వివరాలను తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. 2015లో అత్యధికంగా 42,592 మందికి స్వైన్‌ఫ్లూ సోకగా, అందులో ఏకంగా 2,990 మంది చనిపోయారు. ఆ తర్వాత అత్యధికంగా 2017లో 38,811 మందికి సోకగా, 2,270 మంది చనిపోయినట్లు కేంద్ర నివేదిక తెలిపింది. 2014లో తక్కువగా 937 మందికి ఫ్లూ రాగా, అందులో 218 మంది మృతిచెందారు.

మహారాష్ట్రలో మరీ దారుణం...

ఈ ఏడేళ్లలో మహారాష్ట్రలోనే అత్యధికంగా స్వైన్‌ఫ్లూ కేసులు నమోదయ్యాయి. మృతుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. 2012 నుంచి ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో 19,786 కేసులు నమోదు కాగా, 2,509 మంది మృతి చెందారు. అంతే కాదు గతేడాది 2,593 కేసులు నమోదు కాగా, 461 మంది చనిపోయారు. తెలంగాణలో 2014 నుంచి ఇప్పటివరకు 6,617 మందికి స్వైన్‌ఫ్లూ సోకగా, 169 మంది మృతిచెందారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి 27 వరకు తెలంగాణలో అత్యధికంగా 245 కేసులు నమోదయ్యాయి. ఎవరూ చనిపోలేదని కేంద్రం తెలిపింది. ఇక ఏపీలోనూ 2014 నుంచి ఇప్పటివరకు 1,208 మందికి ఫ్లూ సోకగా, అందులో 79 మంది చనిపోయారు. స్వైన్‌ఫ్లూపై అవగాహన కల్పించకపోవడం, నియంత్రణ చర్యలు కొరవడటమే విస్తృతి కావడానికి కారణంగా వైద్యులు చెబుతున్నారు.

సికింద్రాబాద్-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. సికింద్రాబాద్–కాకినాడ టౌన్ (07436/07435) ప్రత్యేక రైలు ఫిబ్రవరి 7, 9, 15, 21 తేదీల్లో రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.25 గంటలకు కాకినాడ టౌన్ చేరుతుంది. తిరుగుప్రయాణంలో ఫిబ్రవరి 8, 10, 17, 24 తేదీలలో రాత్రి 10.20 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.50 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. హైదరాబాద్–కాకినాడ టౌన్ (07001/07002) ప్రత్యేక రైలు ఫిబ్రవరి 5న రాత్రి 6.50కు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6కు కాకినాడ టౌన్ చేరుతుంది. తిరుగుప్రయాణంలో ఫిబ్రవరి 6వ తేదీ రాత్రి 9కు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.15 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

సీఎం చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించి సమ్మెను నివారించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సీఎం చంద్రబాబుకు శనివారం లేఖ రాశారు. ఆర్టీసీలో ఉన్న తొమ్మిది కార్మిక సంఘాలలో మొత్తం 8 సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం ఫిబ్రవరి 6 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నట్టు పేర్కొన్నారు. అసలే నష్టాలు చవిచూస్తున్న ఆర్టీసీకి ఈ సమ్మె మరింత భారంగా పరిణమించనుందని ఆందోళన వ్యక్తం చేశారు. డీజిల్ పెరుగుదల, ప్రైవేటు అక్రమ రవాణా వల్ల ఆర్టీసీ నాలుగేళ్లుగా రూ.3,126 కోట్ల నష్టాల్లో ఉందని తెలిపారు. ఆర్టీసీని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

ఎర్రచందనం పరిరక్షణకు సీఎస్ అధ్యక్షతన కమిటీ

సాక్షి, అమరావతి: ఏపీలో ఎర్రచందనం అడవుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఎర్రచందనం పరిక్షణ కమిటీని నియమించింది. సీఎస్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, రవాణా కమిషనర్, ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, రాష్ట్ర అటవీ దళాల అధిపతి సభ్యులుగా ఉన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కమిటీ తప్పని సరిగా సమావేశమవుతుంది. ఎర్రచందనం పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. ఈమేరకు అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అనంతరాము ఇటీవల జీవో జారీ చేశారు.



లాహిరి లాహిరి లాహిరిలో..

ఐఆర్‌సీటీసీలో క్రూయిజ్ టూరిజం ● హైదరాబాద్ నుంచి కోపెన్‌హాగెన్‌కు విమానయానం

అక్కడి నుంచి విలాసవంతమైన నౌకలో పర్యటన ● జూన్ 24 నుంచి జూలై 7 వరకు ప్రయాణం

ఇప్పటి వరకు విమాన సర్వీసులు, రైలు, రోడ్డు మార్గాల్లో పర్యాటకులకు జాతీయ, అంతర్జాతీయ టూర్ ప్యాకేజీలను అందిస్తోన్న ఐఆర్‌సీటీసీ మొట్టమొదటిసారి క్రూయిజ్ టూర్‌కు శ్రీకారం చుట్టింది. విలాసవంతమైన నౌకలో ఆహ్లాదకరమైన సముద్రయానం.. నౌకలోనే భోజనం, వసతి, స్విమ్మింగ్‌పూల్, బార్, రెస్టారెంట్ వంటి అన్ని సదుపాయాలతో విదేశాలను చుట్టివచ్చే అద్భుతమైన అవకాశాన్ని కల్పించింది. పర్యాటక ప్రియుల మదిని దోచే విధంగా రూపొందించిన క్రూయిజ్‌టూర్ త్వరలో అందుబాటులోకి రానుంది. ఈ పర్యటన కోసం ఇప్పటి నుంచే బుకింగ్ సదుపాయాన్ని కల్పించారు. మొత్తం 12 రాత్రులు, 13 ఉదయాల పాటు ఈ ప్రయాణం కొనసాగుతుంది. డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్ నుంచి 'నార్వేజియన్ గేట్‌వే'నౌకలో బయలుదేరి వివిధ దేశాల్లో పర్యటిస్తూ తిరిగి కోపెన్‌హాగెన్‌కు చేరుకుంటారు. ఇందుకోసం నగరవాసులు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లి అక్కడి నుంచి విమానంలో దుబాయ్ మీదుగా కోపెన్‌హాగెన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణం కూడా అలాగే ఉంటుంది. ఇందుకోసం ఐఆర్‌సీటీసీ మొత్తం ఏర్పాట్లు చేస్తోంది. కోపెన్‌హాగెన్ నుంచి బయలుదేరి వెళ్లే క్రమంలో వచ్చే వివిధ దేశాలను సందర్శిస్తారు. ఆయా నగరాల్లో సైట్‌సీయింగ్ ఉంటుంది. కోపెన్‌హాగెన్ నుంచి బయలుదేరే నార్వేజియన్ గేట్‌వే జర్మనీ, పోలండ్, ఫిన్‌లాండ్, రష్యా, స్పెయిన్, స్వీడన్‌ల మీదుగా తిరిగి కోపెన్‌హాగెన్ చేరుకుంటుంది. జూన్ 24 నుంచి జూలై 7 వరకు కొనసాగే ఈ పర్యటన కోసం ఐఆర్‌సీటీసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. – సాక్షి, హైదరాబాద్

పర్యటన ఇలా..

నార్వేజియన్ గేట్‌వే క్రూయిజ్ టూర్ ప్యాకేజీలోనే విమాన ప్రయాణం కూడా ఉంటుంది. ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ విమానం (ఈకే 513)లో 24వ తేదీన ఢిల్లీ నుంచి దుబాయ్ చేరుకుంటారు. అదేరోజు అక్కడి నుంచి కనెక్టింగ్ ఫ్లైట్ (ఈకే 151)లో బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కోపెన్‌హాగెన్ చేరుకుంటారు. పర్యటన అనంతరం జూలై 5న (ఈకే 152) కోపెన్‌హాగెన్ నుంచి రాత్రికి దుబాయ్‌కి చేరుకొని అక్కడి నుంచి (ఈకే 510) జూలై 6 తెల్లవారుజామున ఢిల్లీ చేరుకుంటారు. దీనికి అనుగుణంగా హైదరాబాద్ నుంచి ఢిల్లీ ప్రయాణం ఉంటుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఐఆర్‌సీటీసీ అధికారులు పర్యవేక్షిస్తారు. అలాగే ఢిల్లీలో హోటల్‌లో ఉచిత బస సదుపాయం కూడా కల్పిస్తారు.



ధరల వివరాలు..

ఫిబ్రవరి 28 వరకు బుకింగ్ చేసుకొనే వారికి ఒక్కరికి రూ. 4,83,630 చొప్పున, ఇద్దరికి కలిపి బుక్ చేసుకొంటే ఒక్కొక్కరికి రూ. 2,95,817 చొప్పున నార్వేజియన్ గేట్‌వే క్రూయిజ్ ప్యాకేజీ ఉంటుంది. ముగ్గురికి కలిపి బుక్ చేసుకొంటే ఒక్కొక్కరికి రూ. 2,63,634 చొప్పున ఉంటుంది. పిల్లలకు రూ. 2,43,516 చొప్పున చార్జీలు విధించారు. ఈ పర్యటనలో భాగంగా జూన్ 25న ఉదయం 5 గంటలకు కోపెన్‌హాగెన్ పోర్టు నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు బెర్లిన్ చేరుకుంటారు. అక్కడి నుంచి రోజు వరుసగా పోలండ్, ఫిన్లాండ్, రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్, స్వీడన్ దేశాల్లో పర్యటించి జూలై 4న తిరిగి కోపెన్‌హాగెన్ చేరుకుంటారు.

స్విమ్మింగ్‌పూల్, రెస్టారెంట్, బార్..

నార్వేజియన్ గేట్‌వే నౌకలో మొత్తం 30 బాల్కనీలు ఉంటాయి. సువిశాలమైన సముద్రాన్ని వీక్షిస్తూ ప్రయాణం చేయవచ్చు. రెండు డైనింగ్ హాళ్లు, ఔట్‌డోర్ బఫెట్, స్విమ్మింగ్ పూల్, బార్, రెస్టారెంట్, కాఫీబార్, ఫిట్‌నెస్ సదుపాయం వంటివి ఉంటాయి. స్విమ్మింగ్ పూల్స్‌లో హాట్ టబ్స్ ఏర్పాటు చేస్తారు. ఇంటర్నెట్, వైఫై, స్పా, సెలూన్ సర్వీసులు, క్యాషినో, డైనింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ వంటి అన్ని సదుపాయాలు ఉంటాయి. నచ్చిన సినిమాలు చూసే సౌకర్యం కూడా ఉంది. నౌకలోంచి ఆయా దేశాల్లోకి ప్రవేశించినప్పుడు రోడ్డు మార్గాల్లో సిటీ టూర్ ఏర్పాటు చేస్తారు. తిరిగి రాత్రికి నార్వేజియన్ గేట్‌వేకు చేరుకొని బస చేసేవిధంగా ఈ పర్యటనను రూపొందించినట్లు ఐఆర్‌సీటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజీవయ్య తెలిపారు.



భర్త బతికున్నా.. వితంతు పింఛన్!

- బోగస్ డెత్ సర్టిఫికెట్ల సృష్టి
- అనంతపురం జిల్లాలో తారస్థాయికి చేరిన టీడీపీ నేతల అవినీతి వ్యవహారాలు



పింఛన్ల కోసం సృష్టించిన బోగస్ డెత్ సర్టిఫికెట్లు

ఉరవకొండ: భర్తలు బతికుండగానే బోగస్ డెత్ సర్టిఫికెట్లు పుట్టించి వితంతు పింఛన్లు మంజూరు చేయించిన టీడీపీ నేతల వ్యవహారం అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని చీకులగురిలో వెలుగులోకొచ్చింది. అర్హులు ఎంతో మంది పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితుల్లో టీడీపీ నేతలు అనర్హులకు పింఛన్లు మంజూరు చేయించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. విడపనకల్లు మండల పరిధిలోని చీకులగురికి గ్రామంలో శనివారం పాత పింఛన్లతో పాటు.. కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా బోగస్ వితంతు పింఛన్ల వ్యవహారం చర్చనీయాంశమైంది.

పింఛన్ ఐడీ నంబర్	లబ్ధిదారు పేరు	భర్త పేరు
112921505	కె.మీనాక్షి	నాగయ్య
112921348	కాజే పార్వతి	అంబన్న
112921351	కె.పార్వతి	దుర్గన్న
112921349	కె.పార్వతి	చిన్నరాయుడు
112921342	బండారు భీమక్క	కాడప్ప

ఈ ఐదుగురికీ టీడీపీ ఎంపీపీ చేతుల మీదుగా వితంతు పింఛన్లు అందించారు. ఈ పింఛన్ల పంపిణీలో ఏకంగా ఉరవకొండ పోస్టుమాస్టర్ నాగేశ్వరావు టీడీపీ కండువా వేసుకుని దగ్గరుండి వ్యవహారం నడిపించారు. గతంలో పలుమార్లు టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

● తెలంగాణ

చదువు జీవితాలను మారుస్తుంది

- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

మొయినాబాద్ (చేవెళ్ల): చదువే జీవితాలను మారుస్తుందని, పిల్లలకు డబ్బులు కంటే చదువు ఇవ్వడమే ప్రధానమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా హిమాయత్‌నగర్‌లో ఎన్‌టీఆర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఎన్‌టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ భువనేశ్వరి, మంత్రి లోకేష్‌తో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. బాబు మాట్లాడుతూ, ఎన్‌టీఆర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ నిర్వహిస్తున్న ఈ ప్రాంగణంలో గతంలో తాను ప్రిన్సిపల్‌గా ఉండి రాజకీయ తరగతులు నిర్వహించానన్నారు.

బాబు భజన సభల్లో..

పింఛన్‌దారులకు చుక్కలు



శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపడలో పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

- సభ జరుగుతున్న రోజే పింఛన్లు ఇస్తామంటూ ప్రచారం
- అప్పుడు తీసుకోకుంటే పింఛన్లు రద్దవుతాయని జన్మభూమి కమిటీల బెదిరింపులు

సాక్షి, అమరావతి/సంతబొమ్మాళి/సాక్షి ప్రతినిధి, ఏలూరు/సదుం : ఊళ్లో సభ జరుగుతున్న రోజే పింఛన్‌లిస్తాం.. అప్పుడు తీసుకోకుంటే పింఛనే రద్దవుతుంది.. అంటూ జన్మభూమి కమిటీ సభ్యులు ప్రచారం చేస్తుండటంతో కృష్ణా జిల్లా నిడమోలుకు చెందిన 70 ఏళ్ల వెంకటేశ్వర్లు రాజమండ్రిలో ఉంటున్న తన కుమారుడి ఇంటి నుంచి హడావుడిగా సొంతూరికి బయలుదేరాడు. కొడుకు ఇంట్లో పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నా.. పింఛన్ రద్దువుతుందని అన్ని పనులూ మానుకుని మరీ వచ్చాడు. అయితే ఊళ్లో సభ ఈ రోజు కాదు.. నాలుగో తేదీ.. ఆ రోజే పింఛన్ల డబ్బులిస్తారని చెప్పడంతో పనులన్నీ వదిలి మరో రెండు రోజులు అక్కడే ఉండాల్సి వచ్చింది. ప్రతి నెలా మాదిరి ఒకటి నుంచి ఐదో తేదీల మధ్య ఐదు రోజుల పాటు పింఛన్‌ల పంపిణీని ఆపేసి, ఈ సారి కేవలం ఒకే రోజు.. అదీ రెండు మూడు గంటలే పంపిణీ చేస్తున్నారు. ఆ సమయంలో తీసుకోకుంటే రద్దవుతాయని జన్మభూమి కమిటీ సభ్యులు బెదిరించడంతో వృద్ధులు పింఛన్‌ల కోసం అష్టకష్టాలు పడుతున్నారు.

సీఎం చంద్రబాబు పొగడ్తల సభల కోసం..

పింఛన్లు పంపిణీ చేసేందుకు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు భజన సభలు వృద్ధులకు చుక్కలు చూపుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ డబ్బులతో ఊరూరా ఈ సభలను నిర్వహిస్తున్న కొందరు ఉన్నతాధికారులు.. ఇందుకోసం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో వారికి చుక్కలు చూపుతున్నారు. ఒకటో తేదీ నుంచి ఐదో తేదీల మధ్య రోజూ ప్రతి గ్రామంలో జరగాల్సిన పింఛన్ల పంపిణీ నిబంధనలను.. బాబు పొగడ్తల సభల కోసం తాత్కాలికంగా మార్చేశారు. ప్రతి గ్రామం, పట్టణ వార్డుల్లోనూ శని, ఆది, సోమవారాల్లో ఏదో ఒక రోజు సభ నిర్వహించి.. ఆ రోజు మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. ఆ రోజు పింఛన్ తీసుకోకుంటే ఇక భవిష్యత్తులో పింఛన్ రాదని గ్రామాల్లో జన్మభూమి కమిటీలు బెదిరిస్తున్నాయి. అధికారులు మాత్రం.. ఆ రోజు తీసుకోకుంటే ఇంక ఆ నెలకు పింఛన్ పంపిణీ ఉండదని చెబుతున్నారు. సీఎం కార్యాలయ కార్యదర్శి గిరిజాశంకర్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో కృష్ణమోహన్ ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, ఎంపీడీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామంలో సభ జరిగే రోజే ఆ ఊరిలో పింఛనుదారులందరూ సభకు హాజరయ్యేలా చూసుకోవాలని సెర్ప్ సీఈవో జారీచేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో ఒక్కో మండలంలో దాదాపు పది గ్రామాల్లోని సభలకు అధికారులు హాజరు కావాల్సి ఉన్న నేపథ్యంలో ఒక్కో గ్రామంలో ఒకట్రెండు గంటలే సభ నిర్వహించి, ఆ సమయంలోనే పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. దీంతో వృద్ధులు సభల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

దాదాపు 11 వేల చోట్ల మొదలు కాని పంపిణీ

రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలు, 3,600కు పైగా పట్టణ వార్డుల్లో ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ మొదలు కావాల్సి ఉంది. రెండో తేదీ రాత్రి వరకు దాదాపు 11 వేల చోట్ల అసలు పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదని అధికార వర్గాల సమాచారం. ఐదో తేదీకల్లా పంపిణీ పూర్తి కావాల్సి ఉంది. ఫిబ్రవరి నెలకు 54.15 లక్షల మందికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయగా.. శనివారం రాత్రి వరకు కేవలం 11 లక్షల మందికే పింఛన్‌లు అందాయి. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పింఛన్‌దారుల నుంచి అధికారులు ఫోన్ నంబర్లతో పాటు ఓటు ఉందా లేదా తదితర వివరాలు సేకరిస్తున్నారు. పింఛన్ పంపిణీ చేసే అధికారి రిజిస్టర్‌లో లబ్ధిదారుడి ఫోన్ నంబర్‌ను నమోదు చేసుకోవాలని ఆదేశాలున్నాయి. ఇదిలా ఉండగా శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపడలో చేపట్టిన పసుపు–కుంకుమ చెక్కులు, వృద్ధులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసింది. పేరు పేరునా పిలిచి పింఛన్, పసుపు–కుంకుమ చెక్కులు ఇవ్వడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. టెంట్లు లేక మండుటెండలోనే భోజనాలు చేశారు. పసుపు–కుంకుమ చెక్కుల పంపిణీలో కొంతమంది సభ్యుల పేర్లు లేకపోవడంతో గందరగోళానికి దారితీసింది.

ముగ్గురి ఉసురు తీసిన బాబు ప్రచారార్భాటం

పశ్చిమగోదావరి జిల్లాలో ఇద్దరు, చిత్తూరు జిల్లాలో ఒకరి మృతి


పింఛన్ల పెంపు పేరుతో చంద్రబాబు ప్రభుత్వం చేసిన ప్రచారార్భాటం ముగ్గురు వృద్ధుల ఉసురు తీసింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇద్దరు, చిత్తూరు జిల్లాలో ఒకరు మృత్యువాతపడ్డారు. పసుపు–కుంకుమ, పింఛన్ల పంపిణీని వేడుకగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించిన సంగతి తెలిసిందే. డ్వాక్రా మహిళలు, పింఛన్‌దారులంతా పంచాయతీ కార్యాలయాల వద్దకు హాజరుకావాలంటూ అధికారులు టాంటాం వేశారు.

టెంట్‌లోనే కుప్పకూలి..



తణుకు నియోజకవర్గం అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన కర్రి **వెంకటరెడ్డి**(75) పింఛన్ కోసం ఉదయం ఏడు గంటలకే పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నాడు. పంచాయతీ సిబ్బంది వృద్ధులు, వికలాంగుల వేలిముద్రలను తీసుకున్నారు. చాలాసేపు వేచి ఉన్న తర్వాత సాయంత్రం ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్ సొమ్ము అందజేస్తాం.. అని చెప్పడంతో కొంతమంది వెళ్లిపోగా, మరికొందరు అక్కడే ఉండిపోయారు. ఈ క్రమంలో వెంకటరెడ్డి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లో కుర్చీలో కూర్చుండిపోయాడు. పదిగంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పంచాయతీ అధికారులు వెంకటరెడ్డి కుమారుడు సతీష్‌రెడ్డికి సమాచారం తెలపడంతో ఆయన వచ్చి వైద్యుని వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

రోడ్డుమీదే కూలబడ్డాడు..



తాడేపల్లిగూడెం మూడో వార్డుకు చెందిన **గొర్ల కొండయ్య** (80) పింఛన్ తీసుకునేందుకు ఉదయం తొమ్మిది గంటలకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల వరకు అక్కడే నిరీక్షించి, నీరసించి సొమ్మసిల్లి పడిపోయాడు. అక్కడి వారు లేపి మంచినీళ్లిచ్చారు. పింఛన్‌తో ఇంటికెళ్తూ రోడ్డుపై మరోసారి పడిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు.

తీవ్ర అస్వస్థతతో..



పింఛన్ కోసం వచ్చి వృద్ధురాలు మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా సదుం మండలం నడిగడ్డలో జరిగింది. **షరీఫాబీ** (75) నడిగడ్డలోని కుమార్తె మస్తానీ వద్ద కొద్ది రోజులు, సదుంలోని కుమారుల ఇంట కొద్ది రోజులు ఉంటోంది. శనివారం ఉదయం నడిగడ్డకు వచ్చిన షరీఫాబీ రేషన్ సరుకులు తీసుకుంది. అనంతరం పింఛన్ కోసం బయలుదేరింది. గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమానికి వచ్చింది. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురవడంతో స్థానికులు ఆమెను సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ప్రభుత్వం ప్రచారం కోసం పింఛన్లు పంపిణీ చేయకుండా వారిని గంటల తరబడి కూర్చోబెట్టడం వల్లే వృద్ధుల ప్రాణాలు పోయాయని పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఇదేంటి బాబు?



అప్పడాలపై ముద్రించిన చంద్రబాబు చిత్రం



లడ్డు కవర్‌పై సీఎం చిత్రం

చిత్తూరులోని దొడ్డిపల్లెలో జరిగిన రెట్టింపు పింఛన్లు.. పసుపు కుంకుమ నిధుల పంపిణీలో ప్రజలకు స్థానిక టీడీపీ నేతలు ఉచితంగా భోజనాలు పెట్టారు. భోజనంతో పాటు పెట్టిన అప్పడాలపై సీఎం చంద్రబాబు ఫొటోలు ముద్రించి పంచిపెట్టారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం తప్పుకాదు కానీ ఉచితంగా పెట్టే తిండిపై కూడా నేతల ఫొటోలు ముద్రించి పబ్లిసిటీకి ఉపయోగించుకోవడ మేంటని పలువురు మండిపడుతున్నారు. – చిత్తూరు అర్బన్

ధన్యవాదాలు చెప్పకుంటే దండనే

- ఆటోలపై 'థాంక్యూ సీఎం సార్' పోస్టర్లు పెట్టాల్సిందేనట!
- ఆటో డ్రైవర్లకు రవాణా శాఖ అధికారుల హుకుం

సాక్షి, అమరావతి: ఎన్నికలకు గడువు ముంచుకొస్తుండడంతో సీఎం చంద్రబాబులో ప్రచార పిచ్చి తారస్థాయికి చేరుతోంది. చివరకు ఆటోలపై కూడా తనకు ధన్యవాదాలు తెలిపేలా పోస్టర్లు వేయాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. ఈ బాధ్యతను రవాణా శాఖకు అప్పగించడంతో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రంగంలోకి దిగారు. సీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఆటోలపై పోస్టర్లు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. లేకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం ఆటో యూనియన్ నేతలను చంద్రబాబు శనివారం పిలిపించుకున్నారు. ఆటోలకు లైఫ్ ట్యాక్స్ రద్దు చేశామని, ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. 'థాంక్యూ సీఎం సార్' అని ముద్రించి ఉన్న పోస్టర్లు ప్రతి ఒక్క ఆటోపై ఉంచాల్సిందేనని రవాణా శాఖ ముఖ్య అధికారులకు అనధికారికంగా ఆదేశాలందాయి.

ఓట్ల కోసం ఎత్తులా?

మొన్నటివరకు ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే రోజుకు రూ.50 చొప్పున వసూలు చేసి ఆటోవాలాల నడ్డి విరిచిన ప్రభుత్వం లైఫ్ ట్యాక్స్ పేరిట గతేడాది మరో భారం మోపింది. ప్రతి ఆటోకు జీవిత కాల పన్ను (లైఫ్ ట్యాక్స్) 2 శాతం మేర విధించేందుకు ప్రభుత్వం గతేడాది జూన్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. జీవనోపాధి కోసం రూ.లక్షతో ఆటో కొనుగోలు చేసేవారు, ఆటో తిప్పుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న డ్రైవర్లు కచ్చితంగా రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు అదనంగా ప్రభుత్వానికి పన్ను రూపంలో చెల్లించాల్సి వచ్చింది. పాత ఆటోలకు సైతం లైఫ్ ట్యాక్స్ విధించేందుకు ప్రభుత్వం విధివిధానాలను రూపొందించింది. పన్నుల పేరిట తమను వేధింపులకు గురిచేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ పోస్టర్లు ఎలా పెడతామంటూ ఆటో డ్రైవర్లు మండిపడుతున్నారు. ఇన్నాళ్లూ కర్కశంగా వ్యవహరించి, ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో ప్రభుత్వం కొత్త ఎత్తులు వేస్తోందని ఆరోపిస్తున్నారు.

ఫిట్‌నెస్ పరీక్షల పేరిట రుసుముల బాదుడు

ఆటోలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకపోతే రోజుకు రూ.50 చొప్పున నెలకు రూ.1,500 అపరాధ రుసుమును రవాణా శాఖ అధికారులు వసూలు చేశారు. ఏడాదిపాటు పరీక్షలు చేయించకపోతే రూ.18 వేలు చెల్లించాలి. ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2016 డిసెంబరు నుంచి అమల్లోకి తెచ్చింది. పట్టణాలు, నగరాల్లో ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించే డ్రైవర్లకు ఇది పెనుభారంగా మారింది. ఈ అపరాధ రుసుమును తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు పలుమార్లు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం 4.82 లక్షల ఆటోలున్నాయి. వీటి ద్వారా ఐదు లక్షల మంది డ్రైవర్లు ఉపాధి పొందుతున్నారు. పది రోజులపాటు ఫిట్‌నెస్ పరీక్షలు ఆలస్యమైతే రవాణా అధికారులు రూ.500 వసూలు చేస్తున్నారని, దీంతోపాటు మరో రూ.500 ఫైన్ విధిస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు.

మీరు ఓడిపోతే ఎలాగంటున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

కార్యక్రమం జరిగింది. ఇందుకు ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రబాబు మాట్లాడుతూ.. గతంలో తాను వోక్స్ వ్యాగన్ పరిశ్రమను తీసుకురావడానికి ప్రయత్నించానని, అయితే.. 2004లో తాను ఓడిపోయిన తరువాత కాంగ్రెస్ నేతలు అక్కడ పనిచేసే అధికారులకు లంచాలు ఇచ్చి మొత్తం చెడగొట్టారన్నారు. ఇటువంటి నాయకులు అవసరమా? అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల వచ్చిన జాతీయ సర్వేలలో టీడీపీ ఓడిపోయే అవకాశం ఉందన్న అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు సర్వేలు చేయించి గెలుస్తామని పగటి కలలు కంటున్నారన్నారు. 'నేను మీ కోసం ఐదేళ్లు కష్టపడ్డా.. ఈ అన్న కోసం 75 రోజులు కష్టపడమని కోరుతున్నా'నని సభను ఉద్దేశించి చంద్రబాబు అన్నారు.

మోదీ నెలకు రూ.500 ముష్టి ఇస్తారట

తాను రైతులకు రూ.లక్షన్నర రుణమాఫీ చేస్తే.. ప్రధాని నరేంద్ర మోదీ నెలకు ముష్టి రూ.500 చొప్పున ఐదెకరాలలోపు రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.6వేలు ఇస్తామని చెప్పారని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలుచేయకుండా.. చివరకు ఓటాన్ బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించారని ఆరోపించారు. ఈ గడ్డ మీద పుట్టిన వారు ఎవ్వరైనా కేంద్రానికి సహకరించినా.. ప్రజానీకానికి వ్యతిరేకంగా పనిచేసినా ఖబడ్దార్ అని బీజేపీ నేతల్ని హెచ్చరించానని చంద్రబాబు తెలిపారు. అలాగే, కోడికత్తి డ్రామా ఆడుతున్నారని, సిట్ ఇచ్చిన రిపోర్టునే ఎన్ఐఏ కూడా ఇచ్చిందన్నారు. హోదా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వడంవల్లే కాంగ్రెస్‌తో పనిచేస్తున్నామని చెప్పారు.

ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు టీడీపీకి పనిచేయాలి

కాగా, డ్వాక్రా మహిళలకు చెల్లించనున్న రూ.10వేలు ఉచితమేనని చెప్పారు. వృద్ధులకు, వితంతువులకు ఇచ్చే పింఛన్‌ను పదిరెట్లు పెంచామని చెప్పారు. ఆటోలకు, ట్రాక్టర్లకు లైఫ్‌ట్యాక్స్ రద్దు చేసినందున ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు టీడీపీకీ అనుకూలంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ కొనకళ్ల నారాయణ, మంత్రి దేవినేని ఉమా, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, జెడ్పీ చైర్మన్ గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు చంద్రబాబుకు ఆయన నివాసం వద్ద సన్మానం చేశారు. ఆటో డ్రైవర్లంతా ఆటోలకు టీడీపీ పచ్చ జెండా కట్టుకుని తిరగాలన్నారు.

1919 ఫిబ్రవరి 3వ తేదీన నానాజాతి సమితిని ఏర్పాటు చేసేందుకు తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉడ్రోవిల్సన్ అధ్యక్షత వహించారు.



వహ్వారే.. వల్కిరే..!



సినిమా చూసేందుకు థియేటర్లు.. ఇష్టమైన భోజనం ఆరగించేందుకు రెస్టారెంట్లు.. ఆర్ట్ గ్యాలరీలు.. ఈత కొలనులు అబ్బో.. షాపింగ్‌మాల్స్.. ఇలా చెప్పాలంటే చాలానే ఉన్నాయి.. ఇవన్నీ ఉన్నవి ఏ మల్టీకాంప్లెక్స్‌లోనో లేదా ఫైవ్ స్టార్ హోటల్‌లోనో కాదు.. ఈ ఫొటోలోని బోటు.. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద బోటుగా చరిత్రలోకెక్కనుంది. దాదాపు రెండు ఫుట్‌బాల్ కోర్టుల వైశాల్యానికి సమానంగా ఉంటుంది. 229 మీటర్ల పొడవుండే ఈ బోటు ఒక కొన నుంచి మరో కొన వరకు దాదాపు 24 బస్సులను ఒకేసారి పార్కింగ్ చేయొచ్చు. వల్కిరే ప్రాజెక్టుగా పిలిచే ఈ బోటును రూపొందించేందుకు దాదాపు రూ.56 వేల కోట్లు ఖర్చు కానుంది. ఇందులో దాదాపు 52 మంది అతిథులు, 92 మంది సిబ్బంది ఉండొచ్చు. ఇది గంటకు దాదాపు 46 కిలోమీటర్ల వేగంతో వెళ్లగలదు. దక్షిణ కొరియాకు చెందిన చుల్‌హన్ పార్క్‌కు ఇలాంటి బోటును తయారుచేయించుకోవాలని చిన్నప్పటి కల. ఇందుకోసం దాదాపు 8 నెలల పాటు బోటు డిజైనర్లతో మాట్లాడి.. ఆఖరికి పామర్ జాన్సన్ అనే డిజైనర్‌తో తనకు ఇష్టం వచ్చినట్లుగా డిజైన్ చేయించుకున్నాడు. ఇప్పటివరకు ప్రపంచంలోని అతిపెద్ద బోటు అరబ్ రాజు ఖలీఫా బిన్ జయెద్ అల్ నయన్ వద్ద ఉంది. ఇది 180 మీటర్ల పొడవు ఉంది.



జయరాం హత్య కేసు..
మేనకోడలు పాత్రపై అనుమానాలు!

▶ మొదటి పేజీ తరువాయి

విచారించారు. హోటల్ వద్ద జయరామ్‌కు ఓ వ్యక్తి రూ. ఆరు లక్షలు ఇచ్చాడని, హోటల్ గది అప్పటికే ఓ యువతి పేరుమీద ఉన్నట్లు సమాచారం. హోటల్ నిర్వాహకులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు.

శిఖా చౌదరి పాత్రపై అనుమానాలు..

శిఖా చౌదరి.. జయరామ్‌కు మేనకోడలు, వ్యాపార భాగస్వామి. జయరామ్ ప్రారంభించిన ఏ వ్యాపారంలోనైనా ఈమె డైరెక్టర్‌గా వ్యవహరించారు. అతను నిర్వహించిన ఓ న్యూస్ చానల్‌లోనూ శిఖా చౌదరి కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తన భార్యా పిల్లల కంటే ఈమెకే జయరామ్ ప్రాముఖ్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల శిఖా సోదరి మనీషా చదువు కోసం రూ. కోటి వరకు జయరామ్ చెల్లించినట్లు సమాచారం. జయరామ్ ఎప్పుడు అమెరికా నుంచి వచ్చినా శిఖా ఇంటికి రాత్రిపూట వచ్చి వెళ్లేవాడని ఆమె నివసిస్తున్న అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ చెబుతున్నాడు. గత నెల 29న రాత్రి కూడా ఆమె ఇంటికి జయరాం వచ్చి వెళ్లినట్లుగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. జయరామ్ హత్యకు గురైన రోజున రాత్రి 11 గంటలకు ఇంటి నుంచి శిఖా చౌదరి ఒంటరిగా కారు తీసుకుని హడావుడిగా వెళ్లినట్లు విచారణలో తేలింది.

హైదరాబాద్‌లోనే హత్యకు స్కెచ్!

హత్య కేసులో నందిగామ పోలీసులకు పలు కీలక ఆధారాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా జయరామ్ హత్యకు కుట్ర జరిగినట్లుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన మేనకోడలు పాత్రపై ఆరా తీశారు. దస్పల్లా హోటల్‌లో జయరామ్ పేరిట 10 రోజులుగా ఓ రూమ్ బుక్ చేయడం, అదే హోటల్‌లో గురువారం ఫార్మా కంపెనీ ప్రతినిధులతో సమావేశం జరగడం, అక్కడి నుంచే జయరామ్ ఓ తెల్లచొక్కా ధరించిన వ్యక్తితో కలిసి కారులో వెళ్లినట్లు స్పష్టమైన ఆధారాలు లభ్యమయ్యాయి. తెల్లచొక్కా ధరించిన వ్యక్తి కారు నడిపినట్లు గుర్తించారు. కారులో లభ్యమైన మద్యం బాటిళ్లు తదితరాలను బట్టి ఈ హత్యకు హైదరాబాద్‌లోనే కుట్ర పన్నినటు అనుమానిస్తున్నారు.



జూబ్లీహిల్స్‌లోని జయరామ్ ఇల్లు

రాకేష్ ఎవరనే కోణంలో ఆరా..

జయరామ్ చెల్లెలు సుశీల, మేనకోడళ్లు శిఖా చౌదరి, మనీషాలతోపాటు డ్రైవర్ సతీష్‌తోపాటు గన్‌మెన్లను పోలీసులు విచారిస్తున్నారు. అదే సందర్భంలో శిఖా చౌదరి ప్రియుడుగా భావిస్తున్న రాకేష్ అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. శిఖా చౌదరికి రాకేష్ రూ. 4.5 కోట్లు అప్పు ఇచ్చినట్లు సమాచారం. ఈ డబ్బుల విషయంలో రెండేళ్లుగా రాకేష్–శిఖా మధ్య గొడవలు జరుగుతున్నాయని, తన మేనకోడలి అప్పును తీరుస్తానని జయరామ్ హామీ ఇచ్చారని, అయితే ఆ తర్వాత డబ్బు సర్దుబాబు చేయకపోవడంతోనే వీరి మధ్య వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. అదే హత్యకు దారితీసిందా? అన్న కోణంలో రాకేష్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. శ్రీకాంత్ అనే మరో యువకుడిపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఎంపీ తమ్ముడి కొడుకుతోనూ శిఖాకు పరిచయాలున్నాయని, బీర్ కంపెనీ పెడతానని అతని ద్వారా భారీగా పెట్టుబడి పెట్టించినట్లు విచారణలో తేలింది.

ఆ సమయంలో ఏం జరిగింది?

జయరాం స్వస్థలం విజయవాడ కాగా గత నెల 30న హైదరాబాద్ నుంచి బయల్దేరారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద గత నెల 31వ తేది రాత్రి 2గంటలకు ఆయన కారు సీసీ ఫుటేజీలో కనిపించింది. హైదరాబాద్ నుంచి విజయవాడ చేరుకోవడానికి 5 గంటల సమయం పడుతుంది. ఈ మిగతా సమయం ఎక్కడున్నాడన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

కీలకం కానున్న ఫోరెన్సిక్ నివేదిక

అనుమానస్పద స్థితిలో మృతి చెందిన జయరామ్ మృతదేహంపై పలు భాగాల్లో గట్టిగా దెబ్బలు తగిలిన దాఖలాలేమి కనిపించలేదు. ముక్కు, నోటి నుంచి రక్తం ధారగా కారింది. చేతులు నల్లగా ఉండడం, శరీరంలో నీలిరంగులోకి మారడంతో ఆయనపై ఏదైనా విషప్రయోగం చేశారా? కొట్టి హత్య చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం సందర్భంగా శరీర భాగాలను వైద్యులు సేకరించి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అక్కడి నుంచి నివేదిక అందాకే హత్య మిస్టరీ వీడే అవకాశం ఉందని పోలీసు భావిస్తున్నారు

కేన్సర్ ఆస్పత్రిలో మృతదేహం

జయరామ్ మృతదేహాన్ని శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 44లోని ఇంట్లో గత కొద్దిరోజులుగా జయరామ్ ఒక్కరే ఉంటున్నట్లు తెలుస్తోంది. అతడి భార్యా, పిల్లలు అమెరికాలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మృతదేహాన్ని బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఇదిలాఉండగా జయరామ్ భార్య పద్మశ్రీ, పిల్లలు అమెరికాలో ఉంటున్నారు. ఫ్లోరిడాలో మంచు తుపాను వల్ల హైదరాబాద్ రావడానికి తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నట్లు తెలుస్తున్నది.

తాళాలు ఇవ్వాలని దౌర్జన్యం చేసింది: వాచ్‌మెన్

జయరామ్ మృతిచెందిన మరుసటిరోజు శిఖా చౌదరి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 44లోని జయరామ్ ఇంటికి వచ్చి రూం తాళాలు ఇవ్వాలని దౌర్జన్యం చేసినట్లు జయరామ్ ఇంటి వాచ్‌మెన్ వెంకటేశ్ తెలిపాడు. ఆ రోజు రాత్రి డ్యూటీకి రాగానే జయరామ్ సార్‌కు ఫోన్ చేశానని, మీటింగ్‌లో ఉన్నాను తర్వాత ఫోన్ చేస్తానని చెప్పాడన్నాడు. ఆ తర్వాత గన్‌మెన్ ద్వారా విషయం తెలిసిందని, ఎవరు హత్య చేశారో అంతు చిక్కడంలేదన్నారు. రెండేళ్ల కిందట జయరామ్ తల్లి చనిపోయిన సమయంలో శిఖా చౌదరికి, జయరామ్ కుటుంబ సభ్యుల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయని చెప్పాడు. జయరామ్ వైన్ తప్ప మద్యం తాగడని ఆయన స్పష్టం చేశాడు.

ఎవరిని అదుపులోకి తీసుకోలేదు : ఎస్పీ

కంచికచెర్ల సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జయరామ్ హత్య కేసుకు సంబంధించి ఆయన కోడళ్లు, డ్రైవర్, గన్‌మెన్లతో పాటు మరో ముగ్గురు అనుమానితులను ఎస్పీ త్రిపాఠి విచారించారు. ఈ సందర్భంగా ఆయన సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ.. 'జయరామ్ హత్య కేసులో తాము ఎవరిని అదుపులోకి తీసుకోలేదు. కేవలం అనుమానితులను మాత్రమే విచారిస్తున్నాం. త్వరలోనే కేసుని ఛేదిస్తాం' అని తెలిపారు.

రేపు సీఈసీని కలవనున్న వైఎస్ జగన్

- ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఫిర్యాదు
- డీజీపీ వ్యవహారశైలిపై కూడా?

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా ఓట్ల తొలగింపు, ఇతర అవకతవకలపై కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్టీకి చెందిన మాజీ ఎంపీలు, ముఖ్య నేతలతో కలిసి ఆయన బయల్దేరుతున్నారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు వైఎస్ జగన్ పార్టీ నేతలను కలుపుకుని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ)ను కలుస్తారు. ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున చోటుచేసుకున్న అవకతవకలు, అక్రమంగా పేర్ల తొలగింపు అంశాలతోపాటు రాష్ట్ర డీజీపీ వ్యవహారశైలిపైనా సీఈసీకి ఫిర్యాదు చేస్తారని సమాచారం.

జీవితంలో డబ్బు కంటే ఆశయం ముఖ్యం
సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు

తణుకు టౌన్: జీవితంలో సంతోషం అనేది కేవలం డబ్బుతోనే రాదని, మనం సృష్టించుకునే ఆశయంలోనే నిజమైన సంతోషం ఉంటుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. డబ్బు కంటే ఆశయం ముఖ్యమని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన పట్టభద్రుల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం కళాశాల నుంచి పట్టాలను స్వీకరిస్తున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ నాగపద్మావతి ప్రతిజ్ఞ చేయించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బంగారు, రజత పతకాలను జస్టిస్ లావు నాగేశ్వరరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి చల్లా కోదండరామ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సెషన్స్ జడ్జి గంధం సునీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు

రాబోయే రోజుల్లో దేశంలో అనిశ్చితి

- దేశానికి అరిష్టం వాటిల్లే ప్రమాదం
- లోకకల్యాణార్థం ఈనెల 10 నుంచి అష్టబంధన కుంభాభిషేకం
- విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

పెందుర్తి: శని, రాహువు, కేతువు, కుజుడు శష్టాష్టాకాలలో ఉన్నా.. సమసప్తకాలలో ఉన్నా రాబోయే రోజుల్లో దేశంలో అనిశ్చితి నెలకొనే ప్రమాదం ఉందని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ హెచ్చరించారు. కొన్ని కారణాల వలన దేశానికి అరిష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. శనిత్రయోదశి సందర్భంగా శనివారం విశాఖ జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలోని శారదాపీఠంలో మేధాదక్షిణామూర్తి, కాలభైరవుని ఆలయాల్లో దేవతామూర్తులకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అనుగ్రహభాషణం చేస్తూ ఆయా పరిణామాలను ఎదురొడ్డేందుకు ప్రజలకు అమ్మవారి కృప ఉండేలా ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు పీఠంలో శారదాస్వరూప రాజశ్యామల దేవతకు అష్ట బంధన మహా కుంభాభిషేకం జరుపుతామని స్వామీజీ చెప్పారు. ప్రస్తుతకాలంలో జ్యోతిష శాస్త్రాన్ని విపరీతంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యోతిషం ఒక వ్యక్తికి, ఒక ఇంటికి మాత్రమే పరిమితం అవుతుందన్నారు. గ్రహదోషం ఉండడం మానవజీవితంలో అత్యంత సహజమన్నారు. గ్రహాలలో శని గ్రహానికి ఓ ప్రత్యేకత ఉందన్నారు. శనిగ్రహమంటే చాలామందికి భీతి కలుగుతుందని చెప్పారు. శనిదోషం ఉన్నవారు ఉచ్ఛస్థితి నుంచి అధోగతి పాలైనట్టే.. శని గ్రహబలం వలన సాధారణ జీవితంలో ఉన్నవారు సైతం అత్యుత్తమస్థాయికి ఎదుగుతారని వివరించారు. మార్చి 15 తరువాత 4 మాసాలపాటు విపరీత పరిణామాలు కలిగించే గ్రహసంచారం ఉండడం వలన దేశం, రాష్ట్రం సంక్షోభానికి గురవుతాయన్నారు. ముఖ్యంగా దేశ సరిహద్దులో అనిశ్చితి, రాజకీయంగా పెనుమార్పులు జరుగుతాయన్నారు. రాజకీయ సంక్షోభం జరిగినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, సరిహద్దులో ప్రశాంత వాతావరణం కలగాలని రాజశ్యామల యాగం, షణ్ముఖయాగం వంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.



మేధాదక్షిణామూర్తి, కాలభైరవుని సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న స్వామీజీ

అసలే అధికరేట్లు.. ఆపై ఎక్సెస్..
రాజధాని పనులంతే!

▶ మొదటి పేజీ తరువాయి

కిలోమీటర్‌కు రూ.కోటి చొప్పున రూ.36 కోట్లు లేదా రూ.37 కోట్లు అదనంగా వ్యయం అవుతుంది. అంటే మొత్తం వ్యయం సుమారు రూ.107 కోట్లకు మించదు. అయితే 2017–18 ఎస్ఎస్ఆర్ మేరకు రూ.272.23 కోట్లతో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌అంచనాలను రూపొందించడం గమనార్హం.

డీఈఏ, ఆర్థికశాఖ అభ్యంతరాలు తుంగలోకి..

శాఖమూరు రిజర్వాయర్, కొండవీటివాగు, పాలెంవాగుల విస్తరణ, పూడికతీత పనుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసిన తరువాత టెండర్లను ఆహ్వానించారు. రూ.299.61 కోట్లకు సంయుక్తంగా టెండర్లు దాఖలు చేసిన హెచ్ఇఎస్ ఇన్‌ఫ్రా–ఎంవిఆర్ ఇన్‌ఫ్రా సంస్థలే ఎల్–1గా నిలిచాయి. అంటే అంతర్గత అంచనా వ్యయంపై 10.06 శాతం ఎక్సెస్‌కు టెండర్లను దాఖలు చేశాయి. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో టెండర్లను ఆహ్వానించినందున అంతర్గత అంచనా కన్నా 5 శాతం ఎక్కువకు దాఖలైతే ఆ టెండర్లను రద్దు చేయాలి. అయితే అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లను రద్దు చేయకుండా వీటిని ఖరారు చేసేందుకు సాకులు వెతికింది. ఈ నేపథ్యంలో విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలో సామర్లకోట–రాజానగరం వరకు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు 32 శాతం ఎక్సెస్‌కు టెండర్లను ఖరారు చేశారనే వాదనను తెరపైకి తెచ్చింది. విదేశీ ఆర్థిక సాయంతో చేపట్టే ప్రాజెక్టులకు ఐదు శాతం కన్నా ఎక్సెస్‌కు ఇవ్వకూడదనే నిబంధన వర్తించదని పేర్కొంది. దీనిపై కేంద్ర ఎకనమిక్ ఎఫైర్స్(డీఈఏ) విభాగాన్ని సంప్రదించిన రాష్ట్ర ఆర్థిక శాఖ విదేశీ సాయంతో చేపట్టే ప్రాజెక్టులకు కూడా ఐదు శాతం కన్నా ఎక్సెస్‌కు టెండర్లను ఖరారు చేయకూడదని స్పష్టం చేసింది. అయినా సరే టెండర్లను రద్దు చేయకుండా ఈ పనులను 10.06 శాతానికి ఖరారు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలపడం గమనార్హం.

నీరుకొండలోనూ నిబంధనలకు నీళ్లు..


రాజధానిలో వరద నియంత్రణలో భాగంగా 0.43 టీఎంసీల సామర్థ్యంతో నీరుకొండ రిజర్వాయర్ నిర్మాణ పనులకు తొలుత అంచనా వ్యయం రూ.98.12 కోట్లుగా నిర్ధారించారు. అయితే కరకట్టల విస్తరణ పేరుతో ఈ పనుల అంతర్గత అంచనా వ్యయాన్ని రూ.366.97 కోట్లుగా నిర్ధారించి టెండర్లను ఆహ్వానించారు. ఎన్‌సీసీ–ఆర్వీఆర్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ పనులకు రూ.399.99 కోట్లకు టెండర్ దాఖలు చేసి ఎల్–1గా నిలిచాయి. నిబంధనలకు విరుద్ధంగా 9 శాతం ఎక్సెస్‌కు టెండర్ దాఖలు చేసినందున వీటిని రద్దు చేయాల్సి ఉండగా వరద నియంత్రణ పనులను త్వరగా చేపట్టాలనే నెపంతో ఆర్థికశాఖ, డీఈఏ అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ఈ పనులను ఎక్సెస్‌కు ఎన్‌సీసీ–ఆర్వీఆర్‌లకు అప్పగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ పనులను ఎన్‌సీసీ సక్రమంగా చేయడం లేదని ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేర్కొనడం గమనార్హం.

12న ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దు
రథసప్తమి నాడు ఏడు వాహనాలపై ఊరేగనున్న శ్రీవారు

తిరుమల: ఈనెల 12న రథసప్తమిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రత్యేక ప్రవేశ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. చంటిపిల్లల తల్లిదండ్రులు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దాతలకు సుపథం మార్గంలో కల్పించే ప్రత్యేక దర్శనాలను రద్దు చేసింది. సూర్యజయంతిని పురస్కరించుకుని శ్రీవారు ఒకే రోజు ఏడు వాహనాలపై ఊరేగే కారణంగా 'రథసప్తమి'ని ఒకరోజు బ్రహ్మోత్సవం అని పిలుస్తారు. ఆ రోజు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీవారి ఆలయంలో నిర్వహించే వివిధ సేవలను టీటీడీ రద్దు చేసింది. సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను టీటీడీ ఏకాంతంగా నిర్వహిస్తుంది. కాగా భక్తుల సౌకర్యార్థం 2019 మే నెల రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈనెల 5న టీటీడీ విడుదల చేయనుంది. ఆన్‌లైన్, ఈ–దర్శన కౌంటర్లు, పోస్టాఫీసుల్లో ఈ టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

సమయం	వాహనం
ఉదయం 5.30 – ఉదయం 08.00	సూర్యప్రభ వాహనం
(సూర్యోదయం ముహూర్తం ఉదయం 6.45 గంటలుగా నిర్దేశించడమైంది)	
ఉ.9.00 – ఉ.10.00	చిన్నశేష వాహనం
ఉ.11.00– మ. 12.00	గరుడ వాహనం
మధ్యాహ్నం 1.00 – మధ్యాహ్నం 2.00	హనుమంత వాహనం
మ.2.00 – మ.3.00	చక్రస్నానం
సాయంత్రం 4.00 –సాయంత్రం 5.00	కల్పవృక్ష వాహనం
సా.6.00 – సా.7.00	సర్వభూపాల వాహనం
రాత్రి.8.00 – రాత్రి.9.00	చంద్రప్రభ వాహనం

అన్యాయంపై ప్రశ్నించేందుకు అన్ని పార్టీలూ సిద్ధం
మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై నూతనంగా కొలువుదీరే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో ప్రశ్నించేందుకు అన్ని పార్టీలూ సానుకూలంగా ఉన్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 29వతేదీన విజయవాడలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ సమక్షంలో తాను ఏర్పాటు చేసిన సమావేశానికి బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, జనసేన, సీపీఎం, సీపీఐ ముఖ్య నాయకులు హాజరయ్యారన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు చెప్పారన్నారు. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతో విభజనపై శాసనసభలో తీర్మానం జరిగిన తరువాత మాత్రమే పార్లమెంట్‌లో చర్చించాలనే రాజ్యాంగ నిబంధనపై సమావేశంలో చర్చించామన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల తరువాత కొలువుదీరే పార్టీలు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రశ్నించాలని అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాజకీయం వ్యాపారమైపోయిందని తాను ఏ పార్టీ నుంచీ పోటీ చేయబోనని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరువాత తాను ప్రెస్‌మీట్లు కూడా పెట్టనని అన్నారు.

పచ్చ బంగారానికి గడ్డు కాలం!

- పసుపు పంటకు ధర లేక లబోదిబోమంటున్న రైతులు
- గత సీజన్‌లో పండిన పంటకే ధర కరువు
- త్వరలో రానున్న కొత్త పంట పరిస్థితి తలుచుకుని దిగాలు
- మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలంటున్న రైతు సంఘాలు
- క్వింటాలుకు కనీసం రూ.7 వేలు మద్దతు ధర కల్పించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పసుపు రైతుల గోడు ఎవ్వరికీ పట్టలేదు. నానాటికీ తగ్గుతున్న ధరలతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన పసుపునకే ధర లేకపోతే మరో నెలలో వచ్చే కొత్త సరకు ధర ఎలా ఉంటుందోనని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రాష్ట్రంలో పండించే ప్రధాన వాణిజ్య పంటల్లో ఒకటైన పసుపును పచ్చ బంగారంగా పిలుస్తుంటారు. ఎకరానికి లక్షా 25 వేల రూపాయల వరకు వ్యయం చేసి ఆరు గాలం కష్టపడి పంట పండిస్తే చివరకు దళారుల చేతుల్లో చిక్కి నష్టపోవాల్సి వస్తోంది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని నిజామాబాద్‌లో క్వింటాల్ పసుపు ధర రూ.6,700 నుంచి రూ.7,100 మధ్య ఉంటే రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన దుగ్గిరాల మార్కెట్ యార్డ్‌లో ఈ ధర రూ.5 వేల నుంచి రూ.5,200కు మించడం లేదు. ఆన్‌లైన్ వ్యాపారంలో నిజామాబాద్ ధరను ప్రామాణికంగా తీసుకుంటున్నా దుగ్గిరాల యార్డులో మాత్రం ధర లేకుండా చేస్తున్నారంటూ రైతులు వాపోతున్నారు. గిరాకీ లేదన్న సాకుతో వ్యాపారులు చెప్పిందే వేదమవుతోంది.

రాష్ట్రంలో పరిస్థితి దారుణం

రాష్ట్రంలో సుమారు 50 వేల ఎకరాలలో పసుపు సాగు చేయాలన్నది వ్యవసాయ శాఖ లక్ష్యం కాగా ఈ ఏడాది 46, 281 ఎకరాల్లో పసుపు సాగయింది. చిత్తూరు, అనంతపురం తప్ప మిగతా జిల్లాల్లో అంతో ఇంతో సాగవుతోంది. విశాఖ, గుంటూరు, వైఎస్సార్, కృష్ణా, కర్నూలు జిల్లాల్లో ఈ పంట ఎక్కువగా సాగవుతోంది. పసుపు సాగుకు కౌలు కూడా కలుపుకుంటే ఎకరానికి రూ.1.50 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకు ఖర్చవుతుంది. రాష్ట్రంలో కస్తూరి, దుగ్గిరాల, కడప, మైదుకూరు విత్తనాన్ని సాగు చేస్తుంటారు. పసుపు పంట కాలం 9 నెలలు కావడంతో ఇది సాగు చేసిన పొలంలో రెండో పంటకు అవకాశం తక్కువ. ఫలితంగా రైతులు ఎక్కువ ధరను ఆశిస్తున్నారు. సుదీర్ఘ కాలం కష్టపడి పంట పండిస్తే ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల (ఉడకబెట్టిన తర్వాత) దిగుబడి వస్తుంది.

ధరల మాయాజాలం

గత ఏడాది దుగ్గిరాల, కడప మార్కెట్ యార్డులో క్వింటాల్ పసుపు కొమ్ముల్ని రూ.6,500కు కొనుగోలు చేస్తే ఈ ఏడాది రూ.5 వేలు, రూ.5,300 మధ్య ఉంది. ఇదే సమయంలో నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు కొమ్ములు క్వింటాల్ రూ.6,700 నుంచి రూ.7 వేల మధ్య కొంటున్నారు. నాణ్యత పేరిట నిజామాబాద్ మార్కెట్‌కు రాష్ట్రంలోని ఇతర మార్కెట్ ధరలకు మధ్య నాలుగైదు వందల రూపాయల వ్యత్యాసం ఉంటుంది. కానీ ఈ ఏడాది నాణ్యమైన పసుపునకు సైతం ధర లేకపోవడం గమనార్హం. గతంలో ఇదే పరిస్థితి ఏర్పడినప్పుడు మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాల్ పసుపును రూ.6,300 వరకు కొనుగోలు చేయించిన ప్రభుత్వం ఈ ఏడాది పసుపు రైతుల్ని గాలికి వదిలేసింది. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో క్వింటాలు రూ.14 వేలు, రూ.15 వేలు పలికిన పసుపు కొమ్ములకు ఇప్పుడీ స్థితి రావడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత సరకునే రూ.5 వేలకు కొనే వారు లేకపోతే త్వరలో వచ్చే దిగుబడిని ఇంకెలా కొంటారోనని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్వింటాల్ పసుపునకు కనీసం 7 వేల రూపాయలైనా మద్దతు ధర ఇవ్వాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకుంటే గతంలో మాదిరి దుగ్గిరాల మార్కెట్ యార్డును ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి.



రాష్ట్రంలో సాగు వివరాలు ఇలా (హైక్టార్లలో)

జిల్లా	విస్తీర్ణం
శ్రీకాకుళం	210
విజయనగరం	58
విశాఖ	5,657
తూర్పుగోదావరి	132
పశ్చిమగోదావరి	222
కృష్ణా	2,126
గుంటూరు	4,643
ప్రకాశం	719
నెల్లూరు	106
వైఎస్సార్ కడప	3,211
కర్నూలు	1,653
మొత్తం	18,737

'సంస్కృతి' పేరిట గ్రామీణ పర్యాటకం
పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: సంస్కృతి పేరిట గ్రామీణ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విదేశీయుల నుంచి ఎక్కువగా స్పందన లభిస్తోందని చెప్పారు. తిరుపతి ప్రాజెక్టు కింద శ్రీకాళహస్తి, మాధవమాల, వెంకటగిరి గ్రామాలు, అనంతపురంలో ఈ ప్రాజెక్టు కింద లేపాక్షి, నిమ్మలకుంట, వీరాపురం గ్రామాలు, తూర్పుగోదావరిలో దిండి, నర్సాపూర్, ఉప్పాడ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి టూరిజం శాఖ ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద మొదటగా స్పెయిన్ దేశస్థులు శ్రీకాళహస్తిలో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకున్న అనంతరం పురాతన కట్టడాల ప్రాధాన్యతను తెలుసుకున్నారని చెప్పారు.

అమెరికాలోని తెలుగు విద్యార్థులకు న్యాయం చేయండి: సీపీఎం

సాక్షి, అమరావతి: ఉన్నత విద్య కోసం అమెరికాలోని పలు యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన తెలుగు విద్యార్థులను నకిలీ యూనివర్సిటీల్లో చేరారనే ఆరోపణలతో అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. సీపీఎం తరపున రాష్ట్ర కార్యదర్శి పి.మధు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమెరికాలో పోలీసు అధికారుల అదుపులో ఉన్న తెలుగు విద్యార్థులకు తక్షణమే న్యాయ సహాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఎం కోరింది. ఈ వివాదంలో మొత్తం 600 మంది భారత విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. కొందరు విద్యార్థులకు అక్కడి నిబంధనలు తెలియక చిక్కుల్లో పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. నకిలీ యూనివర్సిటీలపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులు నకిలీ వీసాలు పొంది తమ దేశంలో అక్రమంగా ఉంటున్నారని అమెరికా ఆరోపించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేసింది. కొంత మంది దళారుల చేతుల్లో భారత విద్యార్థులు మోసపోయారని, నేరానికి యూనివర్సిటీలే బాధ్యత వహించాలి తప్ప విద్యార్థులు కాదని సీపీఎం స్పష్టం చేసింది. ఈ విషయాన్ని విధానపరంగా పరిశీలించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విద్యార్థులకు న్యాయసాయం అందించాలని సీపీఎం ఆ ప్రకటనలో కోరింది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి బ.చతుర్దశి రా.11.25 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం ఉత్తరాషాఢ రా.2.43 వరకు తదుపరి శ్రవణం, వర్జ్యం ఉ.9.14 నుంచి 10.58 వరకు, దుర్ముహూర్తం సా.4.21 నుంచి 5.06 వరకు, అమృతఘడియలు... రా.7.43 నుంచి 9.26 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.52
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

పీయూష్ గోయల్ (ఆర్థిక మంత్రి) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

బడ్జెట్ సమర్పించి ఇంటికి వస్తున్నప్పుడు అనిపించింది. మరీ సమర్పించాల్సినంత బడ్జెట్టేమీ కాదని. ప్రెస్ మీట్ పెట్టి సమర్పించినా సరిపోయేదేమో!

పార్లమెంటు హాల్లోకి వెళుతున్నప్పుడు బయట బడ్జెట్ కాపీల బండిల్స్‌ని తనిఖీ చేస్తూ సెక్యూరిటీ సిబ్బంది కనిపించారు. బడ్జెట్‌లో ఏం ఉండబోతున్నదోనన్న ఆసక్తి ఏ మాత్రం లేకుండా, వాళ్లు ఆ బండిల్స్‌ని తనిఖీ చేస్తున్నారు. నవ్వొచ్చింది నాకు. నా చేతిలో ఉన్న బడ్జెట్ సూట్‌కేస్‌లో ఏముందోనన్న ఆసక్తి నాకే లేనప్పుడు.. వాళ్లు చెక్ చేస్తున్న బడ్జెట్ బండిల్స్‌లో ఏముందోనన్న ఆసక్తి వాళ్లకెందుకుండాలి? అయినా లోపల ఉండాల్సినవి ఉన్నాయా లేదా అని కాదు కదా వాళ్లు చెక్ చేయవలసింది. ఉండకూడనివి ఏమైనా ఉన్నాయా అని చెక్ చెయ్యాలి. వాళ్లు అదే పనిలో ఉన్నారు.

అన్నన్ని బండిల్స్ వేస్ట్ అనిపించింది ఆ బండిల్స్‌ని దాటుకుని లోపలికి వెళ్తుంటే. పేపర్ వేస్ట్. ప్రింటింగ్ వేస్ట్. టైమ్ వేస్ట్. మనీ వేస్ట్. ఇకనుంచీ మెంబర్స్ అందరికీ సాఫ్ట్ కాపీ ఫార్వార్డ్ చేస్తే సరిపోతుంది. నెక్స్ట్ బడ్జెట్‌ను నేను సమర్పించినా, జైట్లీజీ యు.ఎస్. నుంచి తిరిగొచ్చి సమర్పించినా పేపర్‌లెస్‌గానే సమర్పించాలి. బడ్జెట్ సూట్‌కేస్ కూడా మోత బరువు. లోపల మోతేమీ లేకున్నా బరువే. ఆ సూట్‌కేస్‌ను అలా చేత్తో పట్టుకుని నడుస్తున్నప్పుడు నడుస్తున్నట్లు ఉండదు. మోస్తున్నట్లు ఉంటుంది. ఫైనాన్స్ మినిస్టర్రే బడ్జెట్ సూట్‌కేస్‌లా కనిపించాలి కానీ, సూట్‌కేస్ చేతుల్లో ఉంది కాబట్టి ఫైనాన్స్ మినిస్టర్ అనిపించకూడదు.

బడ్జెట్ సమర్పణ చాలా ఈజీగా అయిపోయింది. ఫస్ట్ టైమ్ సమర్పణ ఎలా ఉంటుందోనని నేను ఆందోళన చెందినంతగా



ఏమీ లేదు! నమస్కార సమర్పణకైనా కాస్త నడుము వంచాల్సి వచ్చింది కానీ, బడ్జెట్ సమర్పణకు ఒక్క ఎక్సర్‌సైజ్‌తో కూడా పని పడలేదు. అసలది బడ్జెట్ సమర్పణలానే లేదు. పార్లమెంటులో ఎవరికో ఫేర్‌వెల్ పార్టీ ఇస్తున్నట్లుగా ఉంది.

"మంచి పని చేశావ్ గోయల్" అన్నారు మోదీజీ, నేను ఇంటికి చేరుకోగానే.

ఆల్రెడీ ఆయన సభలో ఒకసారి నా వెన్ను తట్టి అభినందించారు. ఇప్పుడు మళ్లీ ఫోన్‌లో వెన్ను తడుతున్నారేమిటి?!

"ఏం పని చేశాను మోదీజీ" అన్నాను. ఆయన 'మంచి పని చేశావు గోయల్' అని అన్నారని, 'ఏం మంచి పని చేశాను మోదీజీ' అని నేను అడగడం బాగుండదని.

"అదేనయ్యా.. బడ్జెట్‌కు ముందు పెద్దల పాదాలకు నమస్కారం చేశావు చూడూ.. అది నాకు నచ్చింది" అన్నారు మోదీజీ.

"కానీ మోదీజీ, నేను నా సమీపంలో ఉన్న పెద్దల పాదాలకు మాత్రమే నమస్కారం చేయగలిగాను. నా పక్క సీట్లో నితిన్ గడ్కరీ ఉన్నారు. ఆయన పాదాలకు నమస్కారం చేశాను. నా వెనుక సీట్లో శాంత కుమార్ ఉన్నారు. ఆయన పాదాలకు నమస్కారం చేశాను. పక్క వరుసలోని మొదటి సీట్లో ఉమా భారతి ఉన్నారు. ఆవిడ పాదాలకు నమస్కారం చేశాను. జైట్లీజీ పాదాలు అందుబాటులో లేవు కనుక ఆయనకు నమస్కారం చేయలేకపోయాను" అన్నాను.

పెద్దగా నవ్వారు మోదీజీ.

"నాకూ, జైట్లీకీ నమస్కారం చేయలేదేమిటని నేను అడగడం లేదు గోయల్. గడ్కరీ పాదాలకు నమస్కారం చేసి మంచి పని చేశావు అంటున్నాను" అన్నారు.

"జీ" అన్నాను. ఫోన్ పెట్టేశారు మోదీజీ.

'మోదీజీ అంటే గడ్కరీకి పడటం లేదు, నెక్స్ట్ ప్రైమ్ మినిస్టర్ గడ్కరీనే..' అని అంతా అనుకుంటున్నప్పుడు.. మోదీజీ చూస్తుండగానే గడ్కరీ పాదాలకు నమస్కరించాను కాబట్టి.. పడకపోవడం, ప్రైమ్ మినిస్టర్ కావడం ఏమీ లేదని నా చేత చెప్పించినట్లయిందని మోదీజీ అనుకుని ఉండాలి.

సాగు విడిచి సాము!

త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

ఎన్నికలకు మూడు మాసాల ముందు ప్రవేశపెట్టే తాత్కాలిక బడ్జెట్ లేదా ఓట్ ఆన్ అకౌంట్ (అనామతు పద్దు)పట్ల సాధారణంగా ఎవ్వరికీ ఆసక్తి ఉండదు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత వచ్చే ప్రభుత్వం ప్రాధామ్యాలను బట్టి వార్షిక బడ్జెట్ ఉంటుంది కనుక అంతవరకూ జమాఖర్చుల తబ్శీళ్ళను తెలియజేసి ఖర్చుకు ఆమోదం తీసుకోవడం ఆనవాయితీ. తాత్కాలిక బడ్జెట్‌లో తాత్కాలిక అంచనాలే ఉండాలి కానీ ఆర్థిక సంవత్సరం అంతటికీ వర్తించే ప్రతిపాదనలు చేయకూడదన్నది మొన్నటి దాకా ఆర్థికమంత్రులందరూ విధిగా పాటించిన నియమం. కానీ శుక్రవారంనాడు తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ చేసింది రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైనది. సంప్రదాయ ఉల్లంఘన. ఎన్‌డీఏ అధికారంలో కొనసాగితే ఎటువంటి ఆర్థికవిధానాలు అవలంబిస్తుందో సూచించడమే కాకుండా ఎన్నికలలో కొనసాగడానికి అవసరమైన తాయిలాలను ప్రజలకు విచ్చలవిడిగా పంచడానికి తాత్కాలిక బడ్జెట్‌ను ప్రధాని నరేంద్రమోదీ ఆదేశం మేరకు గోయల్ దుర్వినియోగం చేశారు. రాజ్యాంగధర్మానికి విరుద్ధంగా మోదీ సర్కార్ వ్యవహరించినప్పటికీ బడ్జెట్ ప్రతిపాదనలను పరిశీలించి విశ్లేషించడం అనివార్యం. అసంఘటిత రంగంలో పనిచేసిన కార్మికులకు పింఛన్లు ఇవ్వడానికీ, అంగన్‌వాడీ ఉద్యోగినుల ఆదాయం రెట్టింపు చేయడానికీ, ఆదాయంపన్ను లెక్కింపులో రిబేట్ స్థాయిని అయిదు లక్షల రూపాయలకు పెంచడానికీ, ఈఎస్ఐ వర్తించే ఉద్యోగుల జీతం పరిమితిని 15 నుంచి 21 వేలకు పెంచడానికీ, ఇటువంటివే అనేక ప్రయోజనాలు ఉద్యోగులకూ, ఇతర వర్గాలకూ కలిగించడానికీ చేసిన ప్రతిపాదనల విషయంలో ఎవ్వరికీ ఎటువంటి అభ్యంతరం ఉండదు. ఐదు ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న వ్యవసాయ కుటుంబానికి ఏటా ఆరు వేల రూపాయల చొప్పున నగదు సహాయం చేసే 'ప్రధాని కిసాన్ సమ్మాన్ యోజన'ను ఆర్థికమంత్రి ప్రకటించారు. వ్యవసాయ రుణం నేరుగా మాఫ్ చేయడం, రైతుకే నేరుగా నగదు బదిలీ చేసే కార్యక్రమం వంటివి పాలకులు చేస్తున్నారు. కానీ వ్యవసాయరంగాన్ని పట్టిపల్లార్చుతున్న, రైతులను కుంగదీస్తున్న మౌలికమైన సమస్యల పరిష్కారానికి చేయవలసింది చేయలేకపోతున్నారు. ఎన్నికలు సమీపించిన తరుణంలోనే రైతుల గురించి ఆలోచించడం, తాత్కాలిక ఉపశమనం కలిగించే ఉపాయాలను ఆశ్రయించడంతో బడుగు రైతుల బతుకులు తెల్లవారిపోతున్నాయి. ఆరువేల రూపాయలు సంవత్సరానికి సన్నకారు రైతుల ఖాతాలలో జమచేయడమే మహోపకారమంటూ మోదీని కీర్తించేవారికి చెప్పేది ఏమీ లేదు. ఏదో గట్టి మేలు చేసినట్టు 'అబ్‌కీ బార్ చార్‌సౌ పార్' (ఈ దెబ్బతో నాలుగు వందలకు మించి లోక్‌సభ స్థానాలు బీజేపీకి దక్కుతాయి) అంటూ సంబరం చేసుకునేవారికి నమస్కారం.

ఏకపక్ష నిర్ణయాలు నిష్ప్రయోజనం

నిజంగా వ్యవసాయం గిట్టుబాటు కావాలనీ, ఫలప్రదమైన, లాభదాయకమైన, గౌరవప్రదమైన వ్యాసంగం కావాలనీ కోరుకునేవారు రైతుల గోడు ఆలకించాలి. పాలకులకి తోచిన చర్యలు ఏకపక్షంగా ప్రకటించడం కాకుండా రైతులు ఏమి కోరుకుంటున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. దాదాపు రెండు దశాబ్దాలుగా నేను అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకొని ఒక విన్నపం చేస్తూ వచ్చాను. వ్యవసాయసంక్షోభం పరిష్కారానికి మార్గం కనుక్కోవడం ఒక్కటే ఎజెండాగా పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలనీ, పార్లమెంటు సభ్యులూ, మంత్రిమండలి సభ్యులతో పాటు రైతు సంఘాల ప్రతినిధులూ, డాక్టర్ స్వామినాథన్ వంటి వ్యవసాయశాస్త్రజ్ఞులూ, ప్రవీణులూ, రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వేతర సంస్థల సభ్యులూ చర్చలో పాల్గొనాలనీ నా సూచన. ఈ చర్చలో ఇప్పటికే ఈ దిశగా చొరవ ప్రదర్శించిన తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్ ముఖ్యమంత్రులు కూడా పాల్గొనాలి. రెండేళ్ళ కిందటే 'వైఎస్సార్ రైతు భరోసా'కింద ప్రతి రైతు కుటుంబానికి రూ. 12,500 ల వంతును ఆర్థిక సహాయం అందిస్తామంటూ ప్రకటించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి నాయకులను సైతం చర్చకు ఆహ్వానించి మాట్లాడించాలి. సంక్షోభానికి పరిష్కారం లభించేవరకూ, అది అందరికీ లేదా మెజారిటీ సభ్యులకు ఆమోదయోగ్యమని నిర్ధారించే వరకూ ఈ ప్రత్యేక సమావేశం ఎన్ని రోజులైనా కొనసాగాలి, శాశ్వత పరిష్కారం సాధించాలి. పార్టీల ప్రయోజనాలకూ, ఎన్నికలలో లాభనష్టాలకూ అతీతంగా వ్యవహరించి సమష్టిగా సమాలోచన జరిపితే కానీ దారి దొరకదు.



హరితవిప్లవం తర్వాత ఏదీ పూనిక?

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉండగా 1960లలో హరితవిప్లవ సాధనకోసం విశేషమైన ప్రయత్నం జరిగింది. ఆ తర్వాత వ్యవసాయరంగంలో అనేక మార్పులు వచ్చాయి. 1950లలో, 60లలో ఆహారధాన్యాలను దిగుమతి చేసుకునే దుస్థితి నుంచి ఇప్పుడు ఆహారధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి దేశం ఎదిగింది. ఆహారభద్రతపైన దృష్టి పెట్టామే కానీ రైతు సంక్షేమం పట్టించుకోలేదు. ప్రపంచవ్యాప్తంగా ఆహారధాన్యాల ఉత్పత్తి విపరీతంగా పెరిగింది. ధరలు తగ్గిపోయాయి. అదే సమయంలో వ్యవసాయానికి పెట్టుబడి వ్యయం హెచ్చింది. రైతు కుదేలైనాడు. కుప్పకూలిపోయాడు. ఇంతవరకూ కోలుకోలేదు. ఆహారధాన్యాల కొరత లేనేలేదు. ప్రకృతి సహకరించి, వానలు పడితే పంటలు పుష్కలంగా పండుతున్నాయి. రైతుల జీవన ప్రమాణాలు మాత్రం దిగజారుతున్నాయి. రైతు తెప్పరిల్లడానికి అనువైన పరిస్థితులు కల్పించడంలో ప్రభుత్వాలు వరుసగా విఫలమైనాయి. అరకొరగా అక్కడక్కడా కొన్ని ప్రయత్నాలు జరగకపోలేదు. వాజపేయి హయాం (2003)లో చేసిన అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ) యాక్ట్‌ను దృష్టిలో పెట్టుకొని అన్ని రాష్ట్రాలలో అదే పద్ధతిలో చట్టాలు చేసుకొని మార్కెటింగ్ వ్యవస్థను బలంగా నిర్మించి ఉంటే, జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలలోని కమిటీలనూ సమన్వయం చేసే వ్యవస్థను ఏర్పాటు చేసి ఉంటే ఆహారధాన్యాలకు గిట్టుబాటు ధర సాధించడానికి తగిన యంత్రాంగం ఉండేది. కేవలం 18 రాష్ట్రాలు మాత్రమే ఏపీఎంసీ చట్టాన్ని పురస్కరించుకొని చట్టాలు చేశాయి. తక్కిన రాష్ట్రాలు పట్టించుకోలేదు.

మోదీ సర్కార్ ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజనా వంటి పథకాలు అమలు చేస్తున్నది. నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ ఏర్పాటు చేసింది. కానీ ఆశించిన ప్రయోజనం సిద్ధించడం లేదు. ప్రభుత్వ చర్యలు కొన్ని సందర్భాలలో రైతుకు శాపంగా పరిణమించే ప్రమాదం ఉన్నది. ద్రవ్యోల్బణం హద్దు మీరకుండా చూసే క్రమంలో ఆహారధాన్యాల మద్దతు ధరను తగినంత పెంచకుండా కేంద్ర ప్రభుత్వం ఉపేక్షించింది. 1995 నుంచి 2016 వరకూ దేశ వ్యాప్తంగా 3,18,528 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తెలియజేసింది. 2016 నుంచి ఆ బ్యూరో తాజా వివరాలు నమోదు చేయకుండా, వెల్లడించకుండా ప్రభుత్వం కట్టడి చేసింది. ఈ కారణంగా దేశంలో రైతుల బలవన్మరణాల గురించి చర్చ జరగదు. సమస్య పరిష్కరించవలసింది పోయి సమస్య ప్రజల దృష్టికి రాకుండా చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? 2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతుందనీ, అప్పటికల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని సంకల్పించామనీ మోదీ చాలా సందర్భాలలో ప్రకటించారు. మొన్న పీయూష్ గోయల్ కూడా చెప్పారు. ఈ సంకల్పం నెరవేరాలంటే వ్యవసాయరంగం 2017 నుంచి 2022 వరకూ సంవత్సరానికి 14 శాతం చొప్పున వృద్ధి చెందాలని వ్యవసాయరంగ ప్రవీణుడు అశోక్‌గులాటీ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్–ఐసీఆర్ఐఇఆర్–సభ్యుడు) చెప్పారు. పీయూష్ గోయల్ ప్రతిపాదనలో కౌలురైతు ప్రస్తావన లేదు. వ్యవసాయకూలీల ఊసు లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కూడా ఈ రెండు వర్గాలనూ పట్టించుకోలేదు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వ్యవసాయ కుటుంబానికి లేదా కౌలు రైతు కుటుంబానికి సాలీనా రూ 10,000 నగదు సాయం చేస్తూ ఇల్లు లేని వ్యవసాయ కూలీలకు రూ.12,000 నగదు చెల్లించే 'కాలియా పథకం' అమలు చేస్తున్నారు. కౌలు రైతుకు నగదు బదిలీ చేస్తే భూమి యజమానికి అభద్రతాభావం ఏర్పడుతుందనీ, భూమిపైన హక్కు పోతుందనే భయం పీడిస్తుందనీ, అందువల్ల కౌలు రైతులకు ఆసరా ఇచ్చే అవకాశం లేదనీ తెలంగాణ ప్రభుత్వం వివరించింది. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్‌చంద్ నేతృత్వంలో భూమి కౌలును న్యాయబద్ధం చేయడానికి ఒక నమూనా శాసనాన్ని (మోడల్ ల్యాండ్ లీజింగ్ లా) రూపొందించింది. భూమి యజమానులకు భూమిపైన హక్కు పదిలంగా ఉంటూనే కౌలురైతుకు చట్టబద్ధంగా గుర్తింపు ఇవ్వడానికి ఉద్దేశించిన ఈ నమూనా అమలు చేసినట్లయితే కౌలు రైతుకు వ్యవస్థాగత రుణాలు అందుబాటులోకి వస్తాయి. సమాజంలో గుర్తింపు ఉంటుంది. భూమి సాగు చేసుకునే యజమానులూ, సాగు చేయకుండా కౌలుకు ఇచ్చే యజమానులూ (ఆబ్సెంటీ ల్యాండ్‌లార్డ్స్), కౌలు రైతులూ, వ్యవసాయకూలీలూ అంటూ నాలుగు రకాల వ్యక్తులు భూమిపైన ఆధారపడి ఉంటారు. భూమి యజమానులకు నగదు బదిలీ చేయడం కంటే కౌలు చెల్లిస్తూ, పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసేవారికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందడం న్యాయం. దున్నేవాడికే వెన్నుదన్నుగా ప్రభుత్వాలు నిలవాలి. ఈ ఉద్దేశంతోనే రమేశ్‌చంద్ నమూనా బిల్లును తయారు చేశారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఒక్కటే ఈ నమూనాను ఆధారం చేసుకొని కౌలు రైతులకు ఉపయోగపడే చట్టం చేసింది. బీజేపీ పాలనలో 19 రాష్ట్రాలు ఉన్నప్పటికీ మధ్యప్రదేశ్ మినహా తక్కిన రాష్ట్రాలు దీన్ని పట్టించుకోకపోవడం ఆశ్చర్యం. న్యాయభావన పాలకులలో అంతంతమాత్రమే ఉన్నదనడానికి ఇది నిదర్శనం. వ్యవసాయశాఖ ఎంత అస్తవ్యస్తంగా ఉన్నదో కూడా ఇది స్పష్టం చేస్తున్నది.

వ్యవసాయ సంస్కరణల అవశ్యకత

చిన్నచిన్న కమతాల వల్ల వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదనే అభిప్రాయం బలంగా ఉన్నది. సహకార వ్యవస్థలోకి సన్నకారు రైతులను తీసుకువచ్చే ప్రయత్నం చేయవచ్చు. భూసార కార్డులు ఇచ్చే కార్యక్రమాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆరంభించి, కొన్ని రాష్ట్రాలలో అమలు చేసి ఆనక వదిలేసింది. దాన్ని అన్ని రాష్ట్రాలకూ విస్తరించి ఏ నేల సారం ఏమిటో, ఏ పంట పండుతుందో, ఏ పంట పండిస్తే రైతులకు లాభాలు వస్తాయో వివరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వ్యవసాయ విస్తరణాధికారులు ఇది వరకూ ఈ పని చేసేవారు. మలేసియాకు చెందిన డాక్టర్ లిమ్‌సియోజిన్ పాతికేళ్ళుగా చేస్తున్న కృషిని గమనించాలి. అతడు డీఎక్స్ఎన్ అనే కంపెనీని నెలకొల్పి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించుకొని ఆహారపదార్థాలను తయారు చేసి 180 దేశాలలో విక్రయిస్తున్నాడు. ఇటీవలే తెలంగాణలో సిద్ధిపేట వ్యవసాయ క్షేత్రంలో సాగుకూ, వ్యవసాయ ఉత్పత్తులను ఉపయోగించి ఆహారపదార్థాలను తయారు చేసే యంత్రాల స్థాపనకూ ఆయన ఉపక్రమించాడు. మాజీ మంత్రి హరీష్‌రావు చొరవతో ఇది సాధ్యమైంది. తన కంపెనీకి ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తులు అవసరమో లిమ్ చెబుతారు. ఆ ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. వాటిని ఉపయోగించి ఆహారపదార్థాలు తయారు చేసే ప్రాసెసింగ్‌లో అదే రైతు కుటుంబంలోని సభ్యులకు ఉద్యోగావకాశం ఉంటుంది. ఆ విధంగా తయారైన పదార్థాలను విక్రయించడం (మార్కెటింగ్) లోనూ రైతు కుటుంబానికి చెందిన మరో సభ్యుడు లేదా సభ్యురాలు పని చేయవచ్చు. ఇటువంటి వ్యవసాయాధార పరిశ్రమలను ప్రభుత్వాలు ప్రోత్సహించడం ద్వారా రైతు కుటుంబాలకు ఆదాయం సమకూర్చవచ్చు. గ్రామస్థాయిలోనే వ్యవసాయ పరిశ్రమలు నెలకొల్పి కుటీర పరిశ్రమలను ప్రోత్సహించి వ్యవసాయ పేదరికాన్ని ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్న చైనా నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. పాలకులూ, సమాజం మనస్ఫూర్తిగా పట్టించుకోవలసిన సమస్య ఇది. గట్టిగా ప్రయత్నిస్తే పరిష్కరించడం అసాధ్యం కానేకాదు. సృజనాత్మకంగా ఆలోచించకుండా బడ్జెట్‌లలో అరకొర ప్రయోజనాలు విదిలించడం వల్ల పాలకులకు ఓట్లు వస్తాయేమో కానీ రైతుల బతుకులు బాగుపడవు.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మేల్కొనాలి



"కూలిన మిరేజ్–2000 నడిపి అమరులైన ఇద్దరు పైలట్లూ అసాధారణ నైపుణ్యం ఉన్నవారు. శిక్షణలో మంచి ప్రతిభ కనబరిచినవారు. దశాబ్దాలుగా నాసిరకం యంత్రాలతో పనికానిస్తున్న హెచ్ఏఎల్ యాజమాన్యం వల్ల నిపుణులైన ఇలాంటి యువ అధికారులు ప్రాణాలు కోల్పోతున్నారు. హెచ్ఏఎల్ ఇకనైనా నాయకత్వంపైనా, మెరుగైన డైరెక్టర్లపైనా దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది"

– అడ్మిరల్ అరుణ్ ప్రకాష్, నావికాదళ మాజీ చీఫ్

స్వేచ్ఛకు ముప్పు



"దేశంలో అతి ముఖ్యమైన మేధావుల్లో ఒకరైన ఆనంద్ తేల్తుంబ్డే అరెస్టుకు కారణమైన శక్తుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం. స్వేచ్ఛను కాపాడుకోవడానికి దళిత, వామపక్ష గళాలు ఏకం కావాలి"

– పా. రంజిత్, తమిళ సినీ దర్శకుడు

(ఆనంద్ విడుదలకు ముందు చేసిన ట్వీట్)

భయానకం



"ఎంత విషాదం? ఇన్ఫార్మర్ పేరిట ఒక కశ్మీరీ బాలికను ఉగ్రవాదులు పొట్టన బెట్టుకున్నారు. పైగా ఆమెను కాల్చి చంపుతున్న దృశ్యాన్ని సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. కశ్మీర్ లోయ ఎంతటి భయానక స్థితిలో కాలం వెళ్లదీస్తున్నదో చెప్పడానికి ఆ దృశ్యమే తార్కాణం"

– రాజ్‌దీప్ సర్దేశాయ్
సీనియర్ పాత్రికేయుడు

పరిణతికి పరీక్ష



"చరిత్రలో పార్టీ క్రమశిక్షణకూ, అంతరాత్మ ప్రబోధానికి మధ్య ఎప్పుడో ఒకప్పుడు ఘర్షణ ఏర్పడుతుంది. జాతీయ ప్రయోజనాలరీత్యా దాన్నెలా పరిష్కరించుకుంటామన్నది మన రాజకీయ పరిణతికి ఒక పరీక్ష"

– సుబ్రహ్మణ్య స్వామి
బీజేపీ సీనియర్ నాయకుడు

చిన్న డొటు



"కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖవారి ఎంసీఏ–21 డేటాబేస్ ద్వారా మన ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నుల్ని గణించగలిగినప్పుడు, దానిద్వారా సంఘటిత రంగంలో ఉద్యోగులెందరో అంచనా వేయలేమా? ఈపీఎఫ్ఓ గణాంకాలకంటే ఇవి తిరుగులేనివి కదా!"

– పూజా మెహ్రా, సీనియర్ జర్నలిస్టు

(కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగంలో ఈపీఎఫ్ఓ గణాంకాల ఆధారంగా ఉపాధికల్పన వివరాలివ్వడంపై)

'అగ్ర' జగడం

రష్యాతో ఉన్న మధ్యశ్రేణి అణు క్షిపణుల ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్టు అమెరికా ప్రకటించడంతో తలెత్తిన పరిస్థితిని చక్కదిద్దేందుకు జర్మనీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్ ప్రయత్నాలు ప్రారంభించారు. ఒప్పందంలోని క్లాజు ప్రకారం దాన్నుంచి తప్పుకోదల్చుకున్న పక్షం ఆర్నెల్ల ముందు నోటీసు ఇవ్వాలి. ఆ తర్వాత వివాదంపై ఇరుపక్షాలమధ్యా చర్చలు జరిగి వివాదం సుఖాంతమైతే ఒప్పందం ఉనికిలో ఉంటుంది. లేనట్టయితే రద్దవుతుంది. ఇరుపక్షాలనూ చర్చలకు ఒప్పించే బాధ్యతను మెర్కెల్ స్వీకరించారు. ఒప్పందాన్ని రష్యా పదే పదే ఉల్లంఘిస్తున్నదని అమెరికా ఆరోపిస్తోంది. అది వాస్తవమేనని జర్మనీ కూడా నమ్ముతోంది. కానీ వారి ఆరోపణలు అబద్ధమని రష్యా అభిప్రాయం. సమానత, పరస్పర ప్రయోజనాల పరిరక్షణ ప్రాతిపదికన అమెరికాతో, యూరోప్ యూనియన్‌లతో చర్చించడానికి తాము సిద్ధమని ఆ దేశం చెబుతోంది. 1987లో కుదిరిన ఈ ఒప్పందం రద్దయితే అంతర్జాతీయంగా ఆయుధ పోటీ ఉధృతమవుతుందని తాము కూడా ఆందోళనపడుతున్నామని చెప్పింది. నిరాయుధీకరణ దిశగా పడిన తొలి అడుగుగా అందరూ భావించే ఈ ఒప్పందం ఉనికిలోకి వచ్చినప్పటినుంచీ ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే ఉంది. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారంటూ రెండు దేశాలూ పరస్పరం ఆరోపించుకోవడం రివాజుగా మారింది. ఇప్పుడు జర్మనీ ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయో చూడాలి.

వైరుధ్యాలే శ్వాసగా ఫెర్నాండెజ్ ప్రస్థానం

సందర్భం




కుర్బాన్ అలీ

ఆధునిక భారత దేశం ఇన్ని వైరుధ్యాల నడుమన జీవించిన మరొక రాజకీయ నేతను చూసి ఉండదంటే అతిశయోక్తి కాదు. తన కాలంలోని ఫైర్ బ్రాండ్ సోషలిస్టు నేతల్లో జార్జి మాథ్యూ ఫెర్నాండెజ్ పేరెన్నిక గన్నవారు. స్వల్పకాల మతబోధకుడు, ట్రేడ్ యూనియన్ నేత, వ్యవసాయ నిపుణుడు, రాజకీయ కార్యకర్త, మానవ హక్కుల కార్యకర్త, పార్లమెంటేరియన్, జర్నలిస్టు, కేంద్రమంత్రి ఇలా జీవితం పొడవునా బహుముఖీన వ్యక్తిత్వంతో గడిపినవారు జార్జి. ఎమర్జెన్సీకి ముందురోజుల్లో అంటే 1974లో 15 లక్షలమంది కార్మికులను కూడగట్టి జార్జి నిర్వహించిన రైల్వే సమ్మె యావద్దేశాన్ని స్తంభింపచేసింది. భారతీయ సోషలిస్టు పార్టీ పూర్వ చైర్మన్‌గా, కేంద్ర కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, రైల్వే, రక్షణ శాఖల మాజీ మంత్రిగా జార్జి ఫెర్నాండెజ్ జీవితం పూర్తిగా సంచలనాలు, వైరుధ్యాలమయంగా సాగింది. దీనికి చిన్న ఉదాహరణ: మొరార్జీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ఉండిన జార్జి తన ప్రభుత్వంపై వచ్చిన అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా రెండున్నర గంటల పాటు వాదించిన తర్వాత అదే రోజు మంత్రి పదవికే రాజీనామా చేశారు. అలాగే అణుబాంబుకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పాటు పోరాడిన జార్జి.. అణుశక్తి సంపన్న భారత్ అతి గొప్ప సమర్థకులలో ఒకరిగా నిలిచారు.

1949లో ఉద్యోగం కోసం ముంబై వెళ్లిన జార్జి ప్రారంభంలో దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నాడు. ఒక వార్తాపత్రికలో ప్రూఫ్ రీడర్‌గా ఉద్యోగం సాధించేంతవరకు వీధుల్లో నిద్రపోవలసి వచ్చింది. ముంబైలోని చౌపట్టి శాండ్స్ ప్రాంత బీచ్‌లలో నిద్రపోతుండగా నడిరాత్రి పోలీసులు వచ్చి లేపి వెళ్లిపొమ్మని చెప్పేవారు. ఈ క్రమంలో ప్రముఖ సోషలిస్టు నేత డాక్టర్ రామ్ మనోహర్ లోహియాతో ఏర్పడిన పరిచయం జార్జిపై మహత్తర ప్రభావం కలిగించింది. తర్వాత ముంబైలో ప్రముఖ కార్మిక నేత ప్లేసిడ్ డిమెల్లో నేతృత్వంలోని సోషలిస్టు ట్రేడ్ యూనియన్‌లో చేరారు. అచిరకాలంలోనే కార్మికనేతగా ఎదిగి హోటళ్లు, రెస్టారెంట్లు వంటి చిన్న తరహా పరిశ్రమల్లోని కార్మికుల హక్కుల కోసం పోరాడారు.

1967 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్న జార్జి భారత జాతీయ కాంగ్రెస్‌లో అత్యంత ప్రజాకర్షణ కలిగిన, బలమైన నేత ఎస్.కె. పాటిల్‌ని ఓడించడం ద్వారా ప్రకంపనలు సృష్టించారు. ఇందిరా గాంధీ కేబినెట్‌లో శక్తివంతమైన మంత్రిగా, పార్టీకి విరాళాలు, నిధులను సమకూర్చిపెట్టే వ్యక్తిగా పేరొందిన పాటిల్‌పై 48.5 శాతం ఓట్లతో గెలుపొందిన జార్జికి... 'జార్జి, ది జెయింట్ కిల్లర్' అని మారుపేరు పెట్టారు.

బంగ్లాదేశ్ విమోచన తర్వాత 70ల మొదట్లో కనీవినీ ఎరుగని ప్రజాదరణ పొందిన నాటి ప్రధాని ఇందిరాగాంధీ అనతికాలంలోనే అవినీతి కేసుల్లో చిక్కుకున్నారు. గుజరాత్, బిహార్ రాష్ట్రాల్లో చెలరేగిన నవనిర్మాణ్ ఉద్యమ స్ఫూర్తి నేపథ్యంలో జార్జి 1974లో నిర్వహించిన రైల్వే సమ్మె దేశాన్ని స్తంభింపచేసింది. దీన్నుంచి జాతిని మళ్లించడానికే ఇందిరాగాంధీ పొఖారన్‌లో అణుపరీక్షలు నిర్వహించినట్లు విశ్లేషకుల నమ్మకం. జార్జి



నిర్వహించిన రైల్వే సమ్మె నేపథ్యంలో పోఖ్రాన్–1 అణు ప్రయోగం జరగగా, వాజ్‌పేయి ప్రభుత్వంలో రక్షణ శాఖ మంత్రి హోదాలో పోఖ్రాన్–2 ప్రయోగాన్ని జార్జి అమలు చేయడం చారిత్రక అపహాస్యం.

తొలినుంచి కార్మికుల ఫైర్‌బ్రాండ్‌గా పేరొందిన జార్జి ఫెర్నాండెజ్ అనంతర జీవితంలో రెండు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. 2002 నాటి గుజరాత్ మత మారణకాండను, ఒడిశాలో ఆస్ట్రేలియన్ మిషనరీ గ్రాహమ్ స్టెయిన్స్‌ని అతడి పిల్లలతో సహా సజీవ దహనం చేసిన ఘటనను జార్జి సమర్థించారు. ఆయన గత చరిత్రలో మరిన్ని మరకలు కూడా చోటు చేసుకున్నాయి. పాలస్తీనాకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ఏజెంటుగా రామ్ స్వరూప్ వంటి గూఢచారులను ఉపయోగించుకుని భారత్‌ను 'ఇజ్రాయిల్ మిత్రదేశం'గా మార్చడంలో జార్జి పాత్రను ఎవరూ సులభంగా మర్చిపోలేరు.

ఇలాంటి ఎన్నో వైరుధ్యాలు, వివాదాలు కలగలసిన అతి సంక్లిష్టమైన జీవితం జార్జిది. కుడి, ఎడమలు రెండింటివైపూ ఆయా సందర్భాల్లో మొగ్గు చూపి రాజకీయాల్లో మనగలిగిన జార్జి ఆధునిక భారత రాజకీయాల్లో విశిష్టవ్యక్తి. రాజకీయ జీవిత చరమాంకంలో ఒక అవినీతి కేసులో చిక్కుకున్న జార్జి అచిరకాలంలోనే ప్రజల దృష్టి నుంచి కనుమరుగవ్వాల్సి వచ్చింది. హిమాలయాల్లో భారత సైనికుల కడగండ్లను జాతి దృష్టికి తీసుకొచ్చిన జార్జి, మృతిచెందిన సైనికుల శవపేటికల కొనుగోళ్ల కుంభకోణంలో ఇరుక్కుని వాజ్‌పేయి ప్రభుత్వంలో రక్షణ మంత్రి పదవికే రాజీనామా చేయవలసి వచ్చింది. దాంట్లోంచి బయటపడి రాజకీయ జీవితంలోకి మళ్లీ వచ్చే అవకాశాలను అప్పటికే పొంచి ఉన్న అల్జీమర్స్, పార్కిన్సన్ వ్యాధులు అడ్డుకున్నాయి. పదేళ్లుగేళ్ల పాటు అస్వస్థతతో, అజ్ఞాతంలోనే ఉండిపోయిన జార్జి ఫెర్నాండెజ్, 88 ఏళ్ల వయసులో కన్నుమూశారు. వీడ్కోలు జార్జ్.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు
Qurban-100@ gmail.com

ఏపీ హైకోర్టు ఏర్పాటు సరైందే

రాష్ట్ర రాజధాని అమరావతిలో 3.2.2019 ఆదివారం నాడు నూతనంగా నిర్మించిన హైకోర్టు తాత్కాలిక భవన ప్రారంభోత్సవం జరుగనున్నది. అయితే ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఏర్పాటు చేసిన విధానం రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నదని చెబుతూ, పార్లమెంట్‌ను తోసిరాజని రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా హైకోర్టును ఏర్పాటు చేయడం ఘోరమైన రాజ్యాంగ ఉల్లంఘనగా సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొనడం సరికాదు. భారత రాష్ట్రపతి 26.12.2018న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా హైకోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతి 1.1.2019న ఆవిర్భవించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 214 ప్రకారం రాష్ట్రపతి ఆ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఇందులో రాజ్యాంగ ఉల్లంఘన ఏదీ లేదు. అలాగే, పార్లమెంట్‌ను బైపాస్ చేశారు అనేది కూడా వాస్తవం కాదు. ఎందుకంటే, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014ను పార్లమెంట్ 2014లో ఆమోదించింది. ఆ రీత్యానే రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఆ చట్టంలోని సెక్షన్‌లు 30(1), 31(1), (2)ల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు నూతనంగా ఏర్పాటు చెయ్యటానికి ఆమోదం తెలిపి ఉన్నది. సెక్షన్ 30(1)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు ఏర్పడే వరకు హైదరాబాద్ హైకోర్టు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టుగా ఉండాలని ఉన్నది. అలాగే, సెక్షన్ 31 (1)లో సెక్షన్ 30లోని అంశాలకు లోబడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హైకోర్టు ఉండాలనీ, అది హైకోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడాలనీ ఉన్నది. అదే చట్టం సెక్షన్ 31 (2)లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన స్థానం ఎక్కడ ఉండాలనేది రాష్ట్రపతి నోటిఫికేషన్‌లో పేర్కొనాలని ఉన్నది.

ఈ అంశాలన్నీ పార్లమెంట్ ఆమోదించిన 2014 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో స్పష్టంగా వున్నాయి. కనుక, రాజ్యాంగంలోని ఆర్టికల్ 214, మరియు పార్లమెంట్ ఆమోదించిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014లోని 30 (1), 31 (1), (2) సెక్షన్‌ల ప్రకారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా ఏర్పడింది. ఇక్కడ పార్లమెంట్‌ను బైపాస్ చేసింది కూడా ఏమీ లేదు. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాజ్యాంగబద్ధంగా, పార్లమెంట్ ఆమోదించిన చట్టబద్ధంగా సరైన ప్రొసీజర్ ప్రకారమే ఏర్పడింది. కనుక, ఈ విషయమై ప్రజలు నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పట్ల ఎలాంటి అనుమానాలకు తావు ఇవ్వకుండా, సంపూర్ణమైన విశ్వాసం, గౌరవభావాలతో వ్యవహరించాలని కోరుతున్నాను. గౌరవ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ తన అభిప్రాయాన్ని మరోసారి సరిచూసుకొనవలసిందిగా కోరుతున్నాను.

వై. కోటేశ్వరరావు, కన్వీనర్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ । 98498 56568



స్పైతో సై

- సినిమా పేజీలో -

అనుకున్నదొక్కటి..
అయినది ఒక్కటి!



సాక్షి ఎక్స్‌క్లూజివ్

రకుల్‌ప్రీత్‌సింగ్

బోల్డ్ & రకుల్

బోలెడు మాటలు చెప్పింది... అన్నీ బోల్డే.
ఎవరైనా నాతో తిక్క పని చేస్తే రక్కుతానంది.
చికుముకు రవ్వే.. రాంగ్ సైడ్‌లో రబ్బు చేస్తే ఫైరే.
ఎవరో డామ్ డిషుకు ఫెల్లో..
డామ్ డిషుకు కామెంట్ పెడితే.. రక్కేసింది.
అది మీడియా అంతా పాక్కేసింది.
మరి 'వాట్ డు యు థింక్' అని మేమడిగితే..
బోలెడు విషయాలు బోల్డుగా చెప్పింది.

■ **తెలుగు సినిమా షూటింగ్స్‌లో లేరు కానీ ఫుల్ బిజీగా ఉన్నట్లున్నారు?**

రకుల్: అవును. హిందీలో సిద్ధార్థ్ మల్హోత్రాతో 'మర్జావాన్' అనే సినిమా చేస్తున్నాను. అజయ్ దేవగన్‌తో 'దే దే ప్యార్ దే' పూర్తి చేశాను. ఈ సినిమాకి 80 రోజులు వర్కింగ్ డేస్ ఇచ్చాను. తమిళంలో కార్తీతో చేసిన 'దేవ్' వేలంటైన్స్ డేకు రిలీజ్ అవుతుంది. తెలుగులోనూ ఈ సినిమా విడుదలవుతుంది. అలాగే సూర్యగారితో 'ఎన్‌జీకే' పూర్తి చేశా. సమ్మర్‌లో ఈ సినిమా వస్తుంది. తెలుగులో కమిట్ అయిన 'వెంకీమామ' సినిమా షూటింగ్ త్వరలో ఆరంభం అవుతుంది. తమిళంలో శివకార్తికేయన్‌తో కూడా ఓ సినిమా ఉంది. ప్రస్తుతం చేతిలో మూడు సినిమాలున్నాయి. హిందీ, తమిళ సినిమాలు చేయడంవల్ల తెలుగు సినిమాలు ఒప్పుకునే వీల్లేకుండా పోయింది. అయితే ఈ ఇయర్ తెలుగు రిలీజ్‌లుంటాయి.

■ **తెలుగు ప్రేక్షకులకు లాస్ట్ ఇయర్ మిమ్మల్ని మిస్ అయిన ఫీలింగ్ ఉంది. మీక్కూడా ఉందా?**

కెరీర్ ఆరంభించిన ఈ ఐదారేళ్లలో వరుసగా నాలుగేళ్లు నావి 16 సినిమాలు రిలీజ్ అయ్యాయి. లాస్ట్ ఇయర్ రిలీజ్‌లు లేవు. ప్రతి ఏడాదీ నన్ను ఎక్కువ సినిమాల్లో చూసి ఒక్క ఏడాది లేకపోవడంతో మిస్సయిన ఫీలింగ్ కలగడం సహజం. తెలుగు సినిమాలు చేయకపోయినా నా మనసంతా హైదరాబాద్‌లోనే ఉంటుంది. ఎంత ప్రేముంటే ఇక్కడ ఇల్లు కొనుక్కున్నానో అర్థం చేసుకోవచ్చు. హీరోయిన్‌గా నాకో గుర్తింపు, గౌరవం అన్నీ తెలుగు ఇండస్ట్రీ నుంచే వచ్చాయి. తెలుగుని మాత్రం వదలను. ప్రేక్షకులు చూసినన్ని రోజులు చేస్తూనే ఉంటా.

■ **'బాహుబలి' లాంటి సినిమాలను వదిలేస్తే జనరల్‌గా ఒక రెగ్యులర్ సినిమాకి హీరోయిన్ ఇచ్చే డేట్స్ 40, 50 రోజుల్లోపే ఉంటాయి. 'దే దే ప్యార్..'కి 80 రోజులిచ్చారంటే ఆ సినిమా స్పెషాల్టీ ఏంటి?**

నా కెరీర్‌లో ఎక్కువ వర్కింగ్ డేస్ ఈ సినిమాకే ఇచ్చాను. ఆల్రెడీ పెళ్లయిన కథానాయకుడు తనకంటే చాలా చిన్న అమ్మాయిని ప్రేమించే లవ్‌స్టోరీ ఇది. డిఫరెంట్‌గా ఉంటుంది. పైగా ముంబైలో స్టైల్ వేరే ఉంటుంది. స్క్రిప్ట్ చదవడం, రిహార్సల్స్ చేయడం వంటి వాటికి ఎక్కువ టైమ్ తీసుకుంటారు. అందుకోసం వర్కింగ్ డేస్ పెరుగుతాయి. ప్లస్ ఇదొక డిఫరెంట్ మూవీ కాబట్టి ఎక్కువ రోజులు పట్టింది.

■ **బాలీవుడ్‌లో కొంచెం ఇన్‌సెక్యూర్‌గా అనిపిస్తుందని ఇక్కడ సినిమాలు చేసి అక్కడికెళ్లిన ఓ హీరోయిన్ అన్నారు. మీకేమైనా అభద్రతాభావం?**

కచ్చితంగా ప్రెషర్ అయితే ఉంటుంది. ఇన్‌సెక్యూరిటీ ఫీలింగ్ వచ్చే అవకాశం ఉంది. అయితే ఏదైనా మన మనస్తత్వం మీదే ఆధారపడి ఉంటుంది. నేను ఇక్కడి సినిమాలకు ఎంత కష్టపడతానో హిందీ సినిమాలకూ అంతే కష్టపడతాను. బాలీవుడ్ కదా.. ఇంకొంచెం ఎక్కువ కష్టపడాలి అనుకోను. ఎక్కడికెళ్లినా కాన్ఫిడెన్స్ ఉండాలి. నాకది ఎక్కువ. నా పని మీద నాకు నమ్మకం ఎక్కువ. అందుకే హిందీకి వెళ్లినప్పుడు ఏమీ అనిపించలేదు. ఆత్మవిశ్వాసం లేకపోతే సౌత్‌లోనూ అభద్రతాభావం అనిపించొచ్చు.

■ **ఐదారేళ్ల క్రితం మీరు మామూలు అమ్మాయి. ఇప్పుడు సెలబ్రిటీ. మీలో వచ్చిన మార్పు గురించి?**

అప్పటి రకుల్ ఇప్పటి రకుల్ ఒకటే. పెద్దగా ఏం మారలేదు. సెలబ్రిటీ అంటే ఇలా ఉండాలని కొత్తగా అలవాటు చేసుకున్నది ఏదీ లేదు. కాకపోతే స్క్రీన్ మీద బాగా కనపడాలి కాబట్టి అందం విషయంలో ఆరోగ్యం విషయంలో చాలా కేరింగ్‌గా ఉంటాం. ఫుడ్ హ్యాబిట్స్, లైఫ్ స్టైల్ మారాయి. మైండ్ సెట్ మాత్రం సేమ్. అందరూ 9–5 జాబ్ చేస్తారు. మాకు అలా టైమింగ్స్ ఉండవు. షూటింగ్‌కి ప్యాకప్ చెప్పాక నేను నార్మలే. నా ఫ్యామిలీ నన్ను నార్మల్‌గా ఉంచుతుంది. నా ఫ్రెండ్స్ కూడా. ఇంకా చెప్పాలంటే ఇంత మంచి లైఫ్ ఇచ్చినందుకు పొగరు పెరగకూడదు. దేవుడికి థ్యాంక్‌ఫుల్‌గా ఉండాలి. రుణపడి ఉండాలి. దేవుడు మనకు ఇంత ఇస్తుంటే గర్వం చూపించడం దేనికి? అందుకే అందరితో బాగుంటాను. ఎదిగే కొద్దీ ఒదిగి ఉంటాను అనుకోవాలి. అదే మంచిది.

■ **బాలీవుడ్‌లో ముఖ్యంగా 'ఫిజిక్'కి ప్రాధాన్యం ఇస్తారు. మీ ఫిజిక్ అటు నార్త్‌కు కూడా సూట్ అయ్యేలా ఉంటుంది కాబట్టి మీ కాన్ఫిడెన్స్‌కి అదొక కారణమా?**

ఫిజిక్‌తో ఏం సంబంధం లేదు. నేను సన్నగా ఉన్నాను.. అందుకే కాన్ఫిడెంట్‌గా ఉండగలుగుతున్నాను అనుకుంటే తప్పు. మన పని మనం సక్రమంగా చేయాలి. వర్క్‌లో బెస్ట్ అయితే ఆటోమేటిక్‌గా కాన్ఫిడెన్స్ వచ్చేస్తుంది. మన ఫిజిక్ ఎలా ఉండాలనేది మన చాయిస్. ఈ మధ్య వెయిట్ తగ్గాను. 'దే దే ప్యార్ దే' కోసం కొంచెం పెరిగాను. స్క్రిప్ట్ బావుండి వెయిట్ పెరగాలంటే పెరుగుతాను. తగ్గాలంటే తగ్గుతా. అదే కదా యాక్టర్ జాబ్.

■ **ఓ 20–30 కేజీలు పెరగమంటే పెరుగుతారా?**

30 అయితే వద్దు (నవ్వుతూ) అది ఆరోగ్యకరం కూడా కాదు. 20 కూడా సేఫ్ కాదు. అంత పెరిగి మళ్లీ నార్మల్‌కి రావాలంటే ఈజీగా సంవత్సరం పడుతుంది. 10 కేజీల వరకూ ఓకే. అంతకన్నా బరువు పెరగాలంటే ఎలాగూ ఇప్పుడు వీఎఫ్ఎక్స్ ఉండనే ఉంది. దాంతో లావుగా కనిపించేలా చేయొచ్చు. లేదా బట్టల ద్వారా కూడా మేనేజ్ చేయొచ్చు. అంతేకానీ 20, 30 కేజీలు బరువు పెరిగితే వేరే సినిమాల కోసం వెంటనే బరువు తగ్గాల్సి వస్తుంది. అప్పుడు ఏదేదో చేసేసి అర్జంటుగా తగ్గితే ఆరోగ్యానికి నష్టం.

■ **మీరిలా సన్నగా ఉండటంతో 'ఇది హెల్దీ కాదు.. కడుపు మాడ్చుకోవద్దు' అని కొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. దానికేమంటారు?**

నేనవి చదవను. సోషల్ మీడియాలో పాజిటివ్, నెగటివ్ రెండూ ఉంటాయి. నన్ను ఫాలో అవ్వాలి అనుకుంటే ఫాలో అవ్వండి. లేకపోతే ఫాలో అవ్వకండి అనుకుంటాను. నేను మీరేం తింటున్నారు? ఏం చేస్తున్నారు అని ఎవరినీ అడగడంలేదు. ఉచిత సలహాలు ఇవ్వడంలేదు. నా లైఫ్ నా ఇష్టం. నేనేం తినాలి? ఎలాంటి డ్రస్సులు వేసుకోవాలి? బరువు ఎంత ఉండాలి? అనేది నా ఇష్టం. అయితే నా వర్క్‌లో ఏదైనా ప్రాబ్లమ్ ఉంటే చెప్పండి. నా సినిమాల ఎంపిక విషయంలో సలహాలు ఇవ్వండి. తీసుకుని ఇంకా బెటర్‌గా వర్క్ చేస్తాను. మంచి పాత్రలు చేయడం లేదని, చేస్తుందని చెప్పండి. అవి చదువుతాను, పాటిస్తాను. కానీ ఎలాంటి బట్టలు వేసుకోవాలి? ఏం తినాలి? ఎలాంటి వర్కవుట్స్ చేయాలని సలహాలు ఇవ్వొద్దు. అవి చదవను. పొరపాటున చదివినా పాటించను.

■ **ఎలాంటి డ్రస్సులు వేసుకోవాలో నా ఇష్టం అన్నారు. ఈ మధ్య మీరు కారులోంచి దిగుతున్న ఓ ఫొటోను సోషల్‌మీడియాలో పెట్టి, 'రకుల్ ప్యాంట్ వేసుకోవడం మరచిపోయింది' అని కామెంట్ చేశారు. ఏమంటారు?**

ఇప్పటివరకూ వచ్చిన నెగటివ్ ట్వీట్స్‌ని ఎప్పుడూ పట్టించుకోలేదు. కానీ ఈసారి పట్టించుకున్నాను. ఈ ప్యాంట్ కామెంట్ వచ్చిన ముందు రోజు నేనో ఈవెంట్‌కి వెళ్లాను. స్త్రీ సమానత్వం గురించిన కార్యక్రమం అది. ఆడవాళ్లు ఎలా ఉండాలి? ఎలా ఉంటే బాగుంటుంది? అనేదాని గురించి అక్కడ మాట్లాడటం జరిగింది. ఆ మర్నాడు కారులోంచి దిగినప్పుడు ఎవరో ఫొటో తీశారు. యాక్చువల్‌గా నేను వేసుకున్న జాకెట్ నా షార్ట్స్‌ని కవర్ చేసింది. అందుకని ఆ జాకెట్ మాత్రమే వేసుకున్నానని అనుకున్నారు. షార్ట్ కనిపించేలా ఉన్న ఫొటోలన్నీ బాగానే ఉన్నాయి. ఆ ఫొటోలను వదిలేసి వేరేవి పెట్టి, చెత్త కామెంట్ రాశారు. ఒళ్లు మండిపోయింది.

■ **మీ డ్రెస్ గురించి మాత్రమే కాకుండా 'కారులో ఎవరితో.... (రాయకూడని పదం), సిగ్గు లేదా? ప్యాంటు కూడా లేకుండా బయటకు వచ్చావు? అని సోషల్ మీడియాలో ఓ వ్యక్తి అసభ్యంగా కామెంట్ చేస్తే, అతని తల్లిని ప్రస్తావిస్తూ మీరు స్పందించడాన్ని కొందరు విమర్శించడం గురించి?**

'మీ తల్లి కార్లో అలాంటి పనులు ఎక్కువ చేస్తారనుకుంటా. అందుకే నువ్వు ఎక్స్‌పర్ట్ అయ్యావు. ఆ తల్లి నీకు కొంచెం బుద్ధి ఇచ్చుంటే బావుండేది. నీలాంటి వాళ్లు ఉన్నంత వరకూ మహిళలకు రక్షణ లేదు. ఊరికే సమానత్వం గురించి, రక్షణ గురించి డిబేట్లు పెట్టడం వల్ల ఏ మంచీ జరగదు' అనే విధంగా సమాధానం ఇచ్చాను. అతగాడి కామెంట్‌కి నేను ఓ నటిగా సమాధానం ఇవ్వలేదు.. ఓ అమ్మాయిలా స్పందించాను. యాక్టర్ రకుల్‌గా రిప్లై ఇచ్చి ఉంటే పొలిటికల్‌గా కరెక్ట్‌గా మాట్లాడాలి అనుకునే దాన్ని. కానీ అక్కడ ఓ అమ్మాయిలా నా కోపాన్ని వ్యక్తపరిచాను. తమ కుటుంబంలో ఉన్న ఆడవాళ్ల గురించి ఎవరైనా ఎలా పడితే అలా కామెంట్ చేస్తే వాళ్లకు ఎలా ఉంటుంది? అప్పుడు వాళ్లు కూల్‌గా రియాక్ట్ అవుతారా? లేకపోతే వాళ్ల భాషలోనే చెబుతారా? అప్పటికప్పుడు ఏమనిపించిందో అది అనేస్తారు కదా. నేను కూడా అంతే. అయితే కొంచెం బెటర్‌గా చెప్పి ఉండొచ్చు కానీ అప్పుడు బాగా అప్‌సెట్ అయ్యాను. ఆ మూమెంట్‌లో అలా అనిపించింది. వాళ్లింటి ఆడవాళ్లను కామెంట్ చేస్తే ఎంత బాధగా ఉంటుందో వేరే ఆడవాళ్లకూ అంత బాధ ఉంటుందని తెలియాలి కదా. వాళ్లకూ ఓ ఫ్యామిలీ ఉంటుందని గుర్తు చేయడానికే అలా అన్నాను. నా కామెంట్‌ని విమర్శించేవాళ్లు నా గురించి ఘోరంగా కామెంట్ చేసినప్పుడు ఎందుకు సపోర్ట్ చేయలేదు?

■ **బట్టలను బట్టి 'ఈ అమ్మాయి ఈ టైప్' అని జడ్జ్ చేయడం కరెక్టేనంటారా?**

అస్సలు కాదు. ఎవరికి ఎలా సౌకర్యంగా అనిపిస్తే అలా బట్టలు వేసుకుంటారు. చిన్న బట్టలు వేసుకున్నవాళ్లు అదో టైప్ అనలేం. అయినా మన సమాజంలో చిన్న బట్టలు వేసుకున్న అమ్మాయిలను మాత్రమే కామెంట్ చేస్తున్నారా? చీర కట్టుకున్నవాళ్లనూ వదిలి పెట్టడంలేదు కదా. మారుమూల గ్రామాల్లో ఒంటి నిండా చీర కట్టుకుంటారు. అక్కడ కూడా అత్యాచారాలు జరుగుతున్నాయి. సమస్య బట్టలది కాదు. ఆలోచనలది. ఆలోచనలో మార్పు రావాలి. నేను స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యేసరికి అతను అకౌంట్‌ని డిలీట్ చేశాడు. ఇలాంటి ఆకతాయిలను శిక్షించాలి. రేపు వీళ్లే రేపిస్టులు అవుతారు. అమ్మాయిలకు గౌరవం ఇవ్వాలి అనేది ఇంట్లో నేర్పించాలి. అమ్మాయి, అబ్బాయి ఒకటే అని నేర్పించాలి. అప్పుడే అమ్మాయిలపై వేధింపులు తగ్గుతాయి.

■ **డల్ మూమెంట్‌ని ఎవరితో షేర్ చేసుకుంటారు?**

నాతోనే. డల్‌గా అనిపిస్తే నాకు నేనే ఎనర్జీ ఇచ్చుకుంటాను. నా సొంత ప్రాబ్లమ్స్‌ను వేరే వాళ్ల దగ్గరకు తీసుకెళ్లను. ఫ్యామిలీని టెన్షన్ పెట్టను. నా సమస్యలను నేనే పరిష్కరించుకుంటా. సమస్యలు అందరికీ వస్తాయి. అయితే పరిష్కారం లేని సమస్య ఉండదు. డల్ మూమెంట్స్ లేకపోతే గ్రోత్ ఉండదు. కింద పడితేనే పైకి వెళ్లొచ్చు. సినిమా ఫ్లాప్ అయినప్పుడు బాధ అనిపిస్తుంది. కానీ ఒక్క రోజు మాత్రమే. జరిగింది జరిగిపోయింది. ఒకటి బాధపడటం. రెండోది నెక్స్ట్ ఏం చేయాలి? ఎలా చేయాలి? అనుకుని వెళ్లిపోవడం. అంతే.

■ **హీరోయిన్స్ అంటే కొందరు చిన్న చూపు చూస్తుంటారు. అదేమైనా బాధగా ఉంటుందా?**

ఎందుకు చూడాలి? మాది కూడా జాబే కదా. మా పర్శనల్ లైఫ్ అనేది పర్శనల్‌గా ఉండదు. మా జీవితంలో ఏం జరుగుతుందో పబ్లిక్‌కి కావాలి. జరుగుతున్నవాటి గురించి మాట్లాడుకుంటారు. జరగనివాటి గురించి చెప్పుకుంటారు. మేం ఏమీ చేయలేం.



రోజుకి 18, 20 గంటలు వర్క్ చేస్తాం. నిద్ర ఉండదు. అయినా కూడా సినిమాని ఇష్టపడి వచ్చాం కాబట్టి ఏమీ అనిపించదు. ఇప్పుడు నాక్కూడా చాలామంది యాక్టర్స్ నచ్చరు. కొందరు బాగా నచ్చుతారు. అలాగే నేను అందరికీ నచ్చాలని లేదు. 'నువ్వు నచ్చలేదు' అనండి. ఓకే. బాగా నటించలేదు అంటే ఓకే. కానీ వల్గర్‌గా కామెంట్ చేయకూడదు కదా.

■ **ఇండస్ట్రీలో మీకెలాంటి అనుభవాలెదురయ్యాయి?**

అది ఇండస్ట్రీ గురించి కాదు. ప్రపంచం గురించి. ఒక ఇండస్ట్రీని తప్పుబట్టడం కరెక్ట్ కాదు. అన్ని రంగాల్లో ఉంటుంది. 5–10 పర్సెంట్ మగాళ్ల ఆలోచనలు తప్పుగా ఉంటే మన కెరీర్ చాయిస్ తప్పు ఎందుకు అవుతుంది? ఇండస్ట్రీలో చాలామందికి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. నేను ఫేస్ చేయలేదు. అయితే వాళ్లు ధైర్యంగా బయటికి వచ్చి చెప్పినప్పుడు మనం వినాలి. వాళ్లకు ధైర్యం ఇవ్వాలి. అంతేకానీ తప్పు పట్టకూడదు. (కొంచెం ఆవేశంగా).

■ **ఓకే కూల్ రకుల్.. లవ్ లైఫ్‌కి వద్దాం. ఎన్ని లవ్ లెటర్స్ వచ్చాయి?**

ఫ్యాన్స్‌వి చాలా వస్తుంటాయి. నేను ప్రేమలో పడకూడదని అనుకుంటున్నాను. ఇప్పటివరకైతే ప్రేమలో పడలేదు. మా అమ్మ కూడా జోక్ చేస్తుంది. 'సరే ఇప్పుడంటే బిజీగా ఉన్నావు. కానీ నీకోసం కూడా ఆలోచించుకో. మంచి లైఫ్ పార్టనర్ అవుతాడనిపించే అబ్బాయి ఉంటే చెప్పు. ఇంకో మూడు నాలుగేళ్లల్లో పెళ్లి చేయాలంటే నువ్వు ఎవరో ఒకర్ని ప్రేమించాలి' అంటుంది. చిన్నప్పుడేమో ప్రేమించొద్దు అంటారు, కానీ ఇప్పుడు ప్రేమించమంటున్నారు? అని సరదాగా అంటుంటాను. సరైన మనిషి దొరకాలి. మీనింగ్‌ఫుల్ రిలేషన్‌షిప్ కావాలి అనుకుంటున్నాను. 80 లలో పుట్టి ఉండాలి అనిపిస్తుంది.

■ **అంటే ప్రస్తుతం ప్రేమలో నిజాయితీ ఉండటం లేదంటారా?**

అలా అని కాదు. నిజాయితీగా ప్రేమించేవాళ్లూ ఉన్నారు. అయితే ఇప్పుడు ఒక్క సెకన్‌లో 'ఐ లవ్ యు' ఎలా చెబుతున్నారో 'ఐ హేట్ యు' అని అలాగే ఒక్క సెకన్‌లో చెబుతున్నారు. ప్రేమని కొందరు జోక్ చేసేశారు.

■ **బ్రేకప్‌కి చాలామంది చెప్పే కారణం ఎవరి 'స్పేస్' వారికి దక్కడం లేదు అని. కలిసి బతకాలనుకున్న తర్వాత ఎవరి స్పేస్ వారికి అంటే?**

ఇద్దరూ కరెక్ట్ అయితే ఎవరి ప్రైవసీని వాళ్లు గౌరవించుకుంటారు. ఎవరి స్పేస్ వారు కోరుకోవడంలో తప్పులేదు. ఒకవేళ నేను రిలేషన్‌షిప్‌లో ఉంటే వంద ప్రశ్నలు వేయను. ప్రేమించడమంటే వేరే వ్యక్తిని కంట్రోల్ చేయడం కాదు. మనకు నచ్చిన వ్యక్తిని తనకు నచ్చినట్టు ఉండనివ్వటం. దాన్నే 'స్పేస్' ఇవ్వడం అంటారు. అంత వరకూ ఓకే. కానీ జీవిత భాగస్వామికి చెప్పుకోలేనన్ని రహస్యాలు ఉంటేనే ప్రాబ్లమ్. ఒకే గదిలో కూర్చుని మాట్లాడుకోకుండా ఉండి కూడా కంఫర్ట్‌బుల్‌గా ఉండటమే లవ్. మంచి అనుబంధం అంటే ఎవరి డ్రీమ్‌ను వాళ్లు ఫాలో అవుతూ, వాళ్ల జీవితాలని అందంగా తయారు చేసుకోవడమే.

■ **ఫైనల్లీ మీకు డ్రీమ్ ఏదైనా?**

ప్రస్తుతం నా డ్రీమ్‌లోనే ఉన్నాను. యాక్టర్ అవ్వాలన్నది నా కల. అదే కంటిన్యూ చేస్తున్నాను.

– డి.జి. భవాని

నో మటన్.. నో చికెన్ ప్లీజ్ : అమన్ రిక్వెస్ట్

ఆడపెళ్లివారమండీ

ఒక వధువు, ఒక వరుడు ఏకమై దంపతులుగా జీవనం గడపాలంటే వాస్తవంగా కొన్ని వందల రూపాయలు మాత్రమే ఖర్చవుతాయి, అవసరం అవుతాయి. కానీ ఏళ్ల తరబడి కొనసాగుతున్న 'సాంప్రదాయ ఖర్చులు' పెళ్లీడుకు వచ్చిన యువతుల పాలిట ముళ్ల కంచెలు అవుతున్నాయి. వాళ్ల తల్లి దండ్రులకు మోయలేనంత భారంగా పరిణమిస్తున్నాయి. ఈ పరిస్థితి నుంచి ముస్లిం మైనారిటీ మహిళలకు, వాళ్ల తల్లిదండ్రులకు విముక్తి కల్పించేందుకు ఆవిర్భవించిన సంస్థే 'అమన్'.

ముస్లిం కుటుంబాలలో నికాహ్ సందర్భంగా.. కట్న కానుకలతో పాటు ఏర్పాటు చేసే విందు భోజనాల ఖర్చులు వధువు తల్లిదండ్రులకు తలకు మించిన భారం అవుతాయి. అమన్ సంస్థ ఈ విందు భోజనాలకు సంబంధించి ముస్లిం కుటుంబాలతో ఒక అవగాహన కల్పించాలని ప్రయత్నం చేసి ఆ దిశగా ఆచరణలోకి తీసుకొచ్చింది. లక్షల రూపాయలు ఖర్చయ్యే మాంసాహార భోజనానికి తెరదించాలని ప్రచారం చేస్తోంది. దశాబ్ద కాలంగా ఈ సంస్థ చేస్తున్న కృషి వల్ల వేలాది కుటుంబాలు లబ్ధిపొందాయి. 'అవాయిడ్ మటన్ ఆఫ్టర్ నికాహ్' (అమన్) అనే నినాదంతో బయలుదేరిన ఈ సంస్థ తన లక్ష్య సిద్ధి కోసం చిత్తశుద్ధితో నిర్విరామంగా కృషి చేస్తోంది. నికాహ్ ఖర్చులను తగ్గించేందుకు పనిచేస్తూ ఇప్పటి వరకు కర్నూలు నగర ముస్లింలకు నలభై ఎనిమిది కోట్ల రూపాయలు ఆదా చేసినట్లు అమన్ నిర్వాహకులు చెబుతున్నారు. నికాహ్ వేడుకల్లో మాంసాహార నిషేధం కోసం తమ కమిటీ సభ్యులు నిరంతరం శ్రమిస్తూ, తద్వారా ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థికపరమైన ఊరటను చేకూర్చుతున్నారని సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. హమీద్, సహాయ కార్యదర్శి ఎండి అన్వర్ బాషా తెలిపారు.

అమన్ ఆవిర్భావం వెనుక

''2005లో అనంతపురం జిల్లా గుంతకల్లులో ఓ ముస్లిం ఇంట పెళ్లి జరిగింది. అందులో నికాహ్ తరువాత పెళ్లి కొడుకు బంధువులకు విందు భోజనాల్లో మాంసాహారం సంతృప్తికరంగా వడ్డించలేదని వరుని తరుపున వచ్చిన బంధువులు గొడవ పెట్టుకున్నారు. ఆ ఘర్షణ చివరకు సాయంత్రానికే పెళ్లి తెగతెంపులకు దారి తీసింది. ఈ ఘటన పేపరులో చదివి చాలా బాధపడ్డాం. ఆ తరువాత చికెన్ తింటే 'చికున్ గున్యా' వస్తుందనే ప్రచారం సంచలనం రేపింది. అప్పటివరకు కర్నూలు పెళ్లిళ్లలో తక్కువ ఖర్చు అని చికెన్‌తో భోజనాలు పెట్టే వారు. అయితే చికెన్ తింటే చికున్ గున్యా వస్తుందన్న భ్రమతో నికాహ్ భోజనాలు పొట్టేలు మాంసంతోనే పెట్టాలని అబ్బాయిల తల్లిదండ్రులు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. ఈ సంఘటనలు ఆందోళన కలిగించాయి. కర్నూలు నగరంలో 80 శాతం మంది ముస్లింలు పేద, సామాన్య కుటుంబాలే. బీడి కార్మికులు, రిక్షా, తాపీ కార్మికులు, హమాలీలు ఖరీదైన పొట్టేలు మాంసం వండి వచ్చిన బంధువులందరికీ భోజనాలు ఏర్పాటు చేయాలంటే ఖర్చు లక్షలకు చేరుతుంది. ఈ సమస్య పరిష్కారానికి ఉద్యమం తీసుకురావాలని యునైటెడ్ మైనారిటీ సొసైటీ అధ్యక్షుడు మౌలానా జుబేర్ అహ్మద్ ఖాన్ రషాదీతో 2006 జనవరిలో మలిగియా మసీదులో కూర్చొని చర్చించాం. అయన సానుకూల స్పందనతో 'అమన్' కమిటీని ఏర్పాటు చేసి నికాహ్ వేడుకల్లో మాంసాహారం నిషేధం కోసం అభిప్రాయ సేకరణకు సిద్ధమయ్యాం. ఉద్యోగులు, లాయర్లు, ఇంజనీర్లు, డాక్టర్లను వ్యక్తిగతంగా కలిసి అమన్ కమిటీ ఆశయాలు వివరించాం. అబ్బాయి తల్లిదండ్రులు నిర్వహించే వలిమా విందుకు ఎలాంటి అభ్యంతరాలు ఉండబోవని చెప్పాం. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి 11గంటల వరకు వివిధ కుటుంబాలను కలిసి ప్రచారం చేపట్టాం. ఐదు నెలలకు పైబడిన మా శ్రమకు అల్లాహ్ కరుణ తోడవడంతో ముస్లిం ప్రజల్లో చైతన్యం వచ్చేసింది. 80వేల సంతకాలు సేకరించాం. వాటిలో ప్రభుత్వ ఖాజీలు హాఫీజ్ సయ్యద్ సలీం బాషా (హనఫీ), యూసుఫ్ జానీ (అహెలే హదీస్)లు సంతకాలు చేశారు. 'అవాయిడ్ మటన్ ఆఫ్టర్ నికాహ్' అనే నినాదంతో ఆ ఆంగ్లపదాల్లోని మొదటి అక్షరాలతో అమన్ కమిటీ అని పేరు పెట్టాం. ముందుగా మటన్‌ను మాత్రమే నిషేధించాలనుకున్నాం. కానీ ప్రజల నుంచి వచ్చిన విన్నపాల మేరకు మటన్, చికెన్‌తో పాటు ఇతర ఏ మాంసాహారాన్నీ నికాహ్‌లో పెట్టరాదనే నిర్ణయానికి వచ్చాం. అయితే అప్పటికే ప్రజల్లో 'అమన్' కమిటీ పేరు బాగా పాపులర్ అవడంతో ఆ పేరును అలాగే కొనసాగిస్తున్నాం'' అని వివరించారు హమీద్, అన్వర్ బాషా.



పెళ్లిలో అతిథులకు మాంసాహారానికి బదులు వెజిటేబుల్ కలర్ రైస్ వడ్డన. (ఫైల్ ఫోటో)



అమన్ ఏర్పాటు, లక్ష్యం, అడపిల్లల తల్లిదండ్రులకు చేకూరే ప్రయోజనాలపై మాట్లాడుతున్న సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. హమీద్, కుడివైపున సహాయ కార్యదర్శి ఎండి అన్వర్ బాషా.

భవిష్యత్తులో వరకట్న కానుకలు, అదనపు కట్నాలపై సైతం ఇదే తరహాలో పోరాటాలు నిర్వహించి, ఆ భారం నుంచి కూడా అమ్మాయిల తల్లిదండ్రులను తప్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది 'అమన్'. అందుకోసం 'ఆమని' (ఆడపిల్లల మరణాల నివారణ) అనే సంస్థను ఏర్పాటు చేయబోతోంది.

– ఎస్.పి. యూసుఫ్, సాక్షి, కర్నూలు

ఫోటోలు: డి. హుసేన్


● ప్రియాంకా చోప్రా ● కత్రినా కైఫ్ ● శ్రద్ధాకపూర్ ● అనన్యా పాండే ● కియారా అద్వానీ

అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి!

అనుకున్నామని జరగవు అన్నీ అనుకోలేదని ఆగవు కొన్ని అన్నారు ఆత్రేయ. ప్రస్తుతం హిందీ చిత్రపరిశ్రమలో నటీనటుల ఎంపికకు ఈ సామెత సరిగ్గా సరిపోతుంది. సినిమాకు కొబ్బరికాయ కొట్టేప్పుడు ఉన్న స్టార్లు పూర్తయ్యాక గుమ్మడికాయ కొడతారన్న గ్యారంటీ లేకుండా పోయింది. 'ఈ సినిమా మనదే' అని అనుకున్న తారల స్థానంలో అనుకోకుండా వేరే తారలు రావడం జరుగుతోంది. యాహూ అంటూ సినిమాను స్టార్ట్ చేసిన తారలు తూచ్ అంటూ మధ్యలోనే తారుమారు అవుతున్నారు. ఇటీవల అలా ఒకరి ప్లేస్‌లోకి మరొకరు రీప్లేస్ అయిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.

ప్రియాంకా పెళ్లి... సల్మాన్ లొల్లి

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు ప్రియాంకా పెళ్లి సల్మాన్‌కు తలనొప్పి పుట్టించింది. 'రేస్ 3' సినిమాతో ఫ్లాప్‌ను ఖాతాలో వేసుకున్న తర్వాత సల్మాన్‌ఖాన్ 'భారత్' అనే సినిమాను స్టార్ట్ చేశారు. ఇందులో ప్రియాంకా చోప్రాను కథానాయికగా తీసుకున్నారు. రెండేళ్ల తర్వాత 'భారత్' సినిమా కోసం ప్రియాంకా బాలీవుడ్‌కు తిరిగొచ్చారు. కానీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. 'భారత్' సినిమా నుంచి ప్రియాంకా తప్పుకున్నట్లు ఈ చిత్ర దర్శకుడు అలీ అబ్బాస్ జాఫర్ ప్రకటించారు. కారణం ఏంటి? అంటే.. ప్రియాంకా పెళ్లి అన్నారు. నా సినిమానే వదులుకుంటుందా? అని సల్మాన్ ఫీలయ్యారనే వార్తలు వచ్చాయి. ప్రియాంక, సల్మాన్ మధ్య వాదన కూడా జరిగిందట. ఆ తర్వాత ప్రియాంకా పెళ్లి బాజాలకు ఈ వివాదం వినిపించకుండాపోయింది. ఇక 'భారత్'లో ప్రియాంకా స్థానాన్ని కత్రినా కైఫ్‌తో భర్తీ చేశారు. కొరియన్ చిత్రం 'ఓడ్ టు మై ఫాదర్'కి హిందీ రీమేక్ అయిన 'భారత్' చిత్రం రంజాన్‌కు విడుదల కానుంది.

ఏబీసీడీ.. కత్రినా నాట్ రెడీ


'భారత్' సినిమాకు తొందరగా గుమ్మడికాయ కొట్టి 'ఏబీసీడీ 3' (వర్కింగ్ టైటిల్) చిత్రానికి వరుణ్ ధావన్‌తో కలిసి స్టెప్పులేద్దామనుకున్నారు కత్రినా కైఫ్. కానీ కత్రినా ఊహ నిజం కాలేదు. ఫలితంగా 'ఏబీసీడీ 3' చిత్రం నుంచి ఆమె తప్పుకోవాల్సి వచ్చింది. కారణం ఏంటంటే.. హఠాత్తుగా 'భారత్' సినిమాకి డేట్స్ ఇవ్వడంతో ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం 'ఏబీసీడీ'కి అడ్జస్ట్ చేయలేకపోయారు. దాంతో కత్రినా ప్లేస్‌లో శ్రద్ధా కపూర్‌ను తీసుకున్నారు. దర్శకుడు రెమో డిసౌజా 'ఏబీసీడీ' ఫ్రాంచైజీలో వస్తోన్న థర్డ్ పార్ట్ ఇది. రెండో పార్ట్‌లో కూడా వరుణ్‌ధావన్, శ్రద్ధాకపూర్‌నే నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.

కియారాకి కుదిరింది

'అర్జున్‌రెడ్డి' సినిమాను బాలీవుడ్‌లో రీమేక్ చేయబోతున్నారు అనే వార్త రాగానే హీరోగా ఎవరు నటించబోతున్నారు? అని చర్చలు మొదలయ్యాయి. ఫైనల్‌గా 'కబీర్‌సింగ్' (హిందీ టైటిల్)గా షాహిద్‌కపూర్ ఫిక్స్ అయ్యారు. హీరోగా షాహిద్ ఓకే కాగానే హీరోయిన్ ఎవరు? అనే టాపిక్ ఊపందుకుంది. అనన్యా పాండే అనే ఓ కొత్తమ్మాయి పేరు స్ట్రాంగ్‌గా వినిపించింది. ఇంతలో ఆమె హిందీలో తొలిసారి సైన్ చేసిన టైగర్‌ష్రాఫ్ 'స్టూడెంట్ ఆఫ్ దిఇయర్ 2' సినిమా రిలీజ్ వాయిదా పడింది. దీంతో 'కబీర్ సింగ్' చేయి పట్టుకునే అవకాశం అనన్యకు కుదర్లేదు. కియారా అద్వానీకి కుదిరింది. సెట్‌లో షాహిద్‌కు జోడి కట్టింది. తెలుగు 'అర్జున్ రెడ్డి' డైరెక్టర్ సందీప్ వంగానే 'కబీర్ సింగ్'కి కూడా దర్శకత్వం వహిస్తుండటం విశేషం. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు.

హౌస్‌లోకి ఎంట్రీ

హౌస్‌ఫుల్ ఫ్రాంచైజీలో రాబోతున్న ఫోర్త్ పార్ట్ 'హౌస్‌ఫుల్ 4'. సాజిద్ ఖాన్ దర్శకునిగా ఈ సినిమా మొదలైంది. ఆ తర్వాత సాజిద్‌పై 'మీటూ' ఆరోపణలు రావడంతో


● రానా

ఈ సినిమా డైరెక్షన్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఫర్హాద్–సామ్జీ ద్వయం మిగిలిన పార్ట్‌ను కంప్లీట్ చేశారు. కానీ సాజిద్ ఎదుర్కొన్నట్లే సినిమాలో ఓ కీలక పాత్రకు ఎంపికైన నానా పటేకర్‌పై ఆరోపణలు వచ్చాయి. దాంతో ఆయన హౌస్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. కట్ చేస్తే హౌస్‌లోకి రానా ఎంటర్ అయ్యారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.


● తాప్సీ

ఊరించి.. ఉసూరుమనిపించి

బాలీవుడ్‌లో తాప్సీ హవా బాగానే కొనసాగుతోంది. ఆమె నటించిన 'తడ్కా, బద్లా' అనే హిందీ చిత్రాలు రిలీజ్‌కు రెడీగా ఉన్నాయి. ఇటీవల 'పతీ పత్నీ ఔర్ ఓ'(1978) అనే సినిమా రీమేక్‌లో నటించే అవకాశం ఆమెకు చేజారిపోయింది. ఈ సినిమాలో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తున్నారు. అనన్యా పాండే, భూమి ఫడ్నేకర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ముందుగా ఈ సినిమాలో అనన్య పాత్రను తాప్సీకే ఆఫర్ చేశారు చిత్రబృందం. తీరా సినిమా సెట్స్‌పైకి వెళ్లే సమయానికి లిస్ట్‌లో తాప్సీ పేరు లేదు. దీంతో తాప్సీ తన అవేదనను వ్యక్తం చేశారు. టీ సిరీస్–బీఆర్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇంతకీ తాప్సీని లిస్ట్‌లోంచి ఎందుకు తీసేసినట్లు అంటే.. ఈ నిర్మాతలతో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటించిన 'సోను కే టిట్టు కీ స్వీటీ' చిత్రం వంద కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్, అనన్య లవ్‌లో ఉన్నారని, కార్తీక్ కోరిన మీదటే తాప్సీ ప్లేస్‌లో అనన్య వచ్చిందని బాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

మార్పులు.. చేర్పులు!


● కంగనా రనౌత్


● క్రిష్

గత నెల 25న 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రం విడుదలైంది. టైటిల్ పాత్రలో కంగనా రనౌత్ నటించారు. తొలుత ఈ సినిమాకు క్రిష్ దర్శకత్వ బాధ్యతలు స్వీకరించారు. షూట్ ఆల్మోస్ట్ కంప్లీట్ అయిపోయిందన్న టైమ్‌లో డైరెక్షన్ చైర్‌లో కంగనా కూర్చున్నారు. క్రిష్ 'యన్.టీ.ఆర్' బయోపిక్ సినిమాతో బిజీగా ఉండటం వల్ల కంగనా మెగాఫోన్ పట్టారని చెప్పుకొచ్చారు టీమ్. అంతలోనే ఈ సినిమా నుంచి సోనూ సూద్ తప్పుకున్నారు. ఈ ప్లేస్‌లో మహ్మద్ అయూబ్‌ను తీసుకున్నారు. వెంటనే స్వాతి సెమ్‌వాల్ తప్పుకున్నారు. సోనూ, స్వాతి కంటే ముందు ఈ సినిమా ఎడిటర్ తప్పుకున్నారని తెలిసింది. ఇలా పలు రీప్లేస్‌మెంట్లతో 'మణికర్ణిక' షూటింగ్ పూర్తయింది. కానీ డైరెక్షన్ క్రెడిట్‌నే కంగానా కూడా షేర్ చేసుకున్నారు. 'యన్.టీ.ఆర్: కథానాయకుడు' సినిమా రిలీజ్ వరకు ఈ విషయం గురించి మాట్లాడని క్రిష్, ఆ తర్వాత కంగనాపై విమర్శలవర్షం కురిపించారు. డైరెక్షన్ క్రెడిట్‌కు ఆమెకు అర్హత లేదని పరోక్షంగా చెప్పకనే చెప్పారు. ఈ సినిమాలోని మేజర్ టీమ్ అంతా క్రిష్‌కు మద్దతు తెలిపారు. నిర్మాత కమల్‌జైన్ మాత్రం కంగనా వైపు ఉన్నట్లు తెలుస్తోంది. ''క్రిష్ చెప్పిన మాటలను నిరూపించుకోవాలి. 'మణికర్ణిక' సినిమాకు చెందిన ముఖ్య నిర్ణయాలను నేనే తీసుకున్నా. ఈ చిత్రానికి నేనే దర్శకురాలిని'' అని కంగనా అన్నారని బాలీవుడ్‌లో తాజాగా కథనాలు వస్తున్నాయి. మరి... ఈ వివాదం ఎప్పుడు ఎక్కడ ముగుస్తుందో చూడాలి.

సౌత్‌లో...

ముందు ఇద్దరు.. చివరికి ఒకరు

ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా తమిళం, హిందీ భాషల్లో రూపొందుతున్న సినిమా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'. ఆనంత్ మహదేవన్, ఆర్. మాధవన్ దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తారని అధికారికంగా చిత్రబృందం పేర్కొంది. కట్ చేస్తే ఈ చిత్రానికి మాధవన్ ఒక్కరే దర్శకునిగా ఉంటారని ఇటీవల అధికారిక ప్రకటన వచ్చింది. ఇక అనంత్ మహదేవన్ తప్పుకున్నట్లే కదా. ఈ సినిమాను సమ్మర్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు.


● మాధవన్

నో డైరెక్టర్

డైరెక్టర్ లేకుండా సినిమా సంపూర్తి కాదు. కానీ డైరెక్షన్ క్రెడిట్ లేకుండా మాత్రం సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'దటీజ్ మహాలక్ష్మి'. బాలీవుడ్ హిట్ 'క్వీన్'కు తెలుగు రీమేక్ ఇది. ఈ సినిమాకు తొలుత నీలకంఠ దర్శకుడు. ఆ తర్వాత 'అ!' ఫేమ్ ప్రశాంత్‌వర్మ ఇదే సినిమాకు డైరెక్షన్ చైర్‌లో కూర్చొన్నారు. కారణం ఏమిటంటే.. 'క్రియేటివ్ డిఫరెన్సెస్' వల్ల నీలకంఠ తప్పుకున్నారట. ఇక్కడ విశేషం ఏంటంటే.. ఈ సినిమా టీజర్‌లో దర్శకుడి పేరు లేదు. ఇదే సీన్ గతేడాది శ్రీకాంత్ హీరోగా నటించిన 'రారా' సినిమా విషయంలో జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది.

సెట్స్‌పైకి వెళ్లక ముందే!

చిరంజీవి 'సైరా' సినిమాకు ముందు మ్యూజిక్ డైరెక్టర్‌గా ఏ ఆర్ రెహమాన్‌ని తీసుకున్నారు. ప్రస్తుతం అమిత్ త్రివేది సంగీతం ఇస్తున్నారు. అన్నీ కుదిరితే రామ్ హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో ఓ సినిమా సెట్స్ పైకి వెళ్లాల్సింది. కానీ ఏవో కారణాల వల్ల ఈ సినిమా ఆగిపోయింది. 'యన్.టి.ఆర్' బయోపిక్ తేజ డైరెక్షన్ నుంచి క్రిష్ డైరెక్షన్‌లోకి మారిన విషయం తెలిసిందే. 'సంఘమిత్ర' కోసం శ్రుతీహాసన్ ప్లేస్‌లో దిశా పాట్నీ వచ్చారు. 'కాప్పాన్'లో అల్లు శిరీష్ చేయాల్సిన పాత్రను ఆర్య చేస్తున్నారు. ఈ పాత సంగతులన్నీ ప్రేక్షకులకు గుర్తుండే ఉంటాయి.

డేట్స్ కుదరకో, పారితోషికం విషయంలో లెక్క కుదరకో, ముందు ఒప్పుకున్న కమిట్‌మెంట్స్ కారణంగానో ఇలా ఒకరి స్థానంలోకి మరొకరు రావడం జరుగుతుంది. అంతేకదా.. అనుకున్నవన్నీ జరిగితే డ్రామా ఏం ఉంటుంది? సినిమాలో అయినా జీవితంలో అయినా డ్రామా కామన్.

– ముసిమి శివాంజనేయులు


● జయప్రద

ఆత్మహత్య చేసుకోవాలనిపించింది

''లైంగిక వేధింపులను ఎదుర్కొన్న బాధితులకు మాత్రమే ఆ బాధ తెలుసు. ఎందుకంటే వాళ్లు భరించారు కాబట్టి. వాళ్లందరికీ నా సానుభూతి ఉంటుంది. ధైర్యంగా బయటకు వచ్చి ఆ విషయాన్ని చెప్పడం అభినందనీయం. అదే విధంగా చాలా చోట్ల 'మీటూ'ను తప్పుగా ఉపయోగిస్తున్నారు'' అని జయప్రద పేర్కొన్నారు. ఇటీవల ఓ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన జయప్రద తన లైఫ్‌లో జరిగిన కొన్ని సంఘటనలను పంచుకున్నారు.

● ''మీటూ' ఆరోపణల నిర్ధారణకు త్రీ బెంచ్ (ముగ్గురి కంటే ఎక్కువ న్యాయ నిర్ణేతలు న్యాయ విచారాన్ని జరిపించడం) విధానాన్ని పాటించాలి. ఆ విధానం ద్వారా తప్పొప్పులను, నిజానిజాలను కనుక్కోవచ్చు. అలా చేస్తే బావుంటుందని అభిప్రాయపడుతున్నాను.

● మన పురుషాధిక్య సమాజంలో రాజకీయ నాయకురాలిగా నిలబడటమంటే యుద్ధం చేయడమన్నట్టే. యంపీగా ఉన్నప్పటికీ నామీద యాసిడ్ అటాక్ చేస్తామంటూ రాజకీయ నాయకులు ఆజమ్ ఖాన్ బెదిరించేవారు. బయటకు వెళ్తే మళ్లీ ఇంటికి తిరిగొస్తానో లేదో తెలియదు. మరుసటిరోజు బతికుంటానో లేదో కూడా డౌట్‌గానే ఉండేది.

● ఆ మధ్య నావి మార్ఫింగ్ చేసిన కొన్ని ఫొటోలు ఆన్‌లైన్‌లో లీక్ అయ్యాయి. ఆ సమయంలో నాకు ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు కుడా వచ్చాయి. నాకు బ్రతకాలని అనిపించలేదు. అలాంటి కఠినమైన సందర్భాల్లో కూడా నాకెవ్వరూ సపోర్ట్ చేయలేదు. కేవలం అమర్ సింగ్ జీ మాత్రమే నాతో నిలబడ్డారు. ఆయన్ను నా గాడ్ ఫాదర్‌లా భావిస్తాను. అలాంటి సమయంలో సహాయంగా నిలబడ్డవాళ్లను అలానే భావిస్తాం కదా. మా గురించి ఏదేదో మాట్లాడుకునేవాళ్లు ఒకవేళ ఆయనకు నేను రాఖీ కట్టినప్పటికీ ఊరుకుంటారని నేననుకోను.

● ఆటోబయోగ్రఫీ రాసేంత ధైర్యం లేదనుకుంటున్నాను. ఇప్పటికీ ఇంకా ఏదో నేర్చుకుంటూనే ఉన్నానని భావిస్తాను. ఆటోబయోగ్రఫీ రాయాలంటే ఇంకా చాలా సాధించాలి. నా అచీవ్‌మెంట్స్ నాకు గుర్తు లేవు. నా లైఫ్‌లో అన్ని అడ్డంకులు తొలగిపోయాయని భావించిన రోజు రాస్తాను.

వైఎస్సార్ అనే దేవుడు మా బాధ విన్నాడు


● రవికుమార్

''మా ఇంటి గడప దగ్గర చెప్పులు వదిలేసి లోపలికి వెళ్తే వైఎస్సార్‌గారివి మూడు ఫోటోలు ఉంటాయి. పదేళ్ల క్రితం ఆగిపోవాల్సిన మా అమ్మ గుండె ఇప్పటికీ వినబడుతుందంటే దానికి కారణం వైయస్సార్‌గారు'' అంటూ ఎమోషనల్ అయ్యారు రవి కుమార్. శుక్రవారం 'యాత్ర' ప్రీ–రిలీజ్ వేడుకలో మహానేత వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాల ద్వారా లబ్ధి పొందిన పలువురు మాట్లాడారు. వారిలో 'యాత్ర'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన రవి కుమార్ తన మనోభావాలను పంచుకున్నారిలా.

2008లో నేను డిగ్రీ చదువుతున్నాను. మా అమ్మకు ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్‌కి తీసుకెళితే హార్ట్‌లో హోల్ ఉందని, ఆరు నెలల కంటే బతకదని చెప్పారు. మా అమ్మ దండం పెట్టి 'అరే, నాకు బతకాలని ఉందిరా. ఏమైనా చేసి ఓ మూడు లక్షలు అప్పు చేసి నాకు ఆపరేషన్ చేయించు' అన్న మాటలు నాకింకా గుర్తు. అమ్మ కంటే ఏదీ ఎక్కువ కాదనిపించి చదువు మానేసి హైదరాబాద్ వచ్చాను. ఓ హోటల్‌లో ఎంగిలి ప్లేట్లు, గ్లాసులు కడుగుతూ పనిచేశాను. నాలుగు నెలలు కష్టపడి పనిచేస్తే నేను సంపాదించింది 20 వేలు. అవి మా అమ్మ మందులకు, బస్సు చార్జీలకు కరిగిపోయాయి. మా అమ్మకు రోజులు దగ్గర పడ్డాయని తెలిసి నన్ను పిలిచి చెల్లిని బాగా చూసుకోమని చెప్పింది. చర్చి, గుడి, మసీదు ఏ దేవుడినీ వదలకుండా దండం పెట్టుకునేది. ఏ దేవుడూ ఆమె ఏడుపు వినలేదు. కానీ, వైఎస్సార్ అనే దేవుడు 'నేను విన్నాను, నేను ఉన్నాను' అని ఆరోగ్యశ్రీ పథకం పెట్టారు. కామినేని హాస్పిటల్‌లో రూపాయి ఖర్చు లేకుండా అమ్మకు వైద్యం చేశారు. వైద్యం కోసం ఎవరినైనా అప్పు అడిగితే ష్యూరిటీగా ఏం పెడతారు? అని అడిగేవారు. మాకు ఉన్నదల్లా రెండు గదుల ఇందిరమ్మ ఇల్లు మాత్రమే. అది కూడా ఆ దేవుడి (వైఎస్సార్) దయే. ఈ ఫంక్షన్‌కు మా అమ్మను తీసుకొచ్చేవాణ్ని. కానీ తీసుకురాలేదు. కారణం మా అమ్మకి నేను ఇప్పటికీ ఏం పని చేస్తున్నానో తెలియదు. నేను సినిమాలకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నానని మా అమ్మకి చెప్పాలంటే భయం వేసి చెప్పలేదు. ఎందుకంటే సినిమాలంటే ఒప్పుకోరని. కానీ అమ్మా... ఇప్పుడు చెబుతున్నాను, ఫిబ్రవరి 8న విడుదలయ్యే 'యాత్ర' సినిమాను మా అమ్మ, చెల్లెలితో మా ఊరు డిచ్‌పల్లిలో చూస్తాను. నేనీ సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి వైఎస్సార్‌గారి రుణం కొంచెమన్నా తీర్చుకున్నాను అనుకుంటున్నాను. నాకీ చాన్స్ ఇచ్చిన దర్శకుడు మహి.వి.రాఘవ్ గారికి నిర్మాతలు విజయ్ చిల్లా గారికి, శశి దేవిరెడ్డి, శివ గార్లకు జీవితాంతం రుణపడి ఉంటాను'' అని రవికుమార్ ఎమోషనల్ కావడం వీక్షకులను కదిలించింది.

ఈ సందర్భంగా 'సాక్షి' మాట్లాడినప్పుడు రవి కుమార్ మరిన్ని విశేషాలు పంచుకున్నారు.

● 'యాత్ర' మీ మొదటి సినిమానా?

దర్శకుడు మహీ వి. రాఘవ్‌గారు తీసిన 'పాఠశాల' నా మొదటి సినిమా. ఆ సినిమాకు ఆఫీస్ బాయ్‌గా పనిచేశాను. నేను కాఫీ షాప్‌లో చేసే రోజుల్లో మహీ అక్కడికి వస్తుండేవారు. అలా ఆయన సినిమాలతో అసోసియేట్ అయ్యే అవకాశం ఏర్పడింది. మహీగారు చేసిన 'ఆనందోబ్రహ్మ'కు రైటర్‌గా, 'యాత్ర'కు రచనా సహకారం అందించాను.

● వైయస్సార్‌గారికి మొదటినుంచే అభిమానిగా ఉండేవారా?

మొదట్లో రాజశేఖర్ రెడ్డిగారంటే రాజకీయనాయకులు, మన ముఖ్యమంత్రి అని తెలుసు. కానీ మా అమ్మకు తిరిగి ప్రాణం పోశాక ఆయన మీద అభిమానం పెరిగిపోయింది.

● మొన్న జరిగిన వేడుకలో మాట్లాడాలని ముందే అనుకున్నారా?

లేదు. పది నిమిషాల ముందు చెప్పారు. టైముంది. నువ్వు కూడా లబ్ధి పొందావు కదా. నీకు అనిపించింది మాట్లాడితే మాట్లాడు అన్నారు. సడెన్‌గా దర్శకులు స్టేజ్ మీద మాట్లాడమంటే ఎమోషనల్ అయిపోయాను.

● ఇలా వైయస్‌గారి బయోపిక్ ఐడియా ఉందని మహీ మీతో చెప్పినప్పుడు మీ రియాక్షన్ ఏంటి?

మహీసార్, నేను, రాజశేఖర్ అని ఓ రైటర్. మేం ముగ్గురం ట్రావెల్ అవుతుంటాం. ఫస్ట్ మాతోనే చెప్పారు. చాలా ఎగ్జైట్ అయ్యాను. రైతు ఆత్మహత్య చేసుకునే సీన్ ఒకటి, నారాయణరెడ్డిగారు ఎప్పుడొచ్చినా వైయస్‌గారు ఆయనకు సీట్ ఇచ్చి కూర్చోమనేవారట. అలాగే హై కమాండ్ ఏదో విషయం మాట్లాడటానికి వైయస్‌గారిని ఒక్కరే రావాలని చెప్పారట. నాతో కేవీపి కూడా వస్తారని సమాధానం పంపారట. దానికి వాళ్లు 'సీటు కావాలంటే ఒక్కరే రావాలి' అని చెప్పారట. 'పదవులు చాలా చూస్తాం. నాతో ఉండే మనుషులే ఎక్కువ' అనుకునేవారట. ఇలా కొన్ని సీన్స్ చెప్పడంతో మేం ముందుకు వెళ్లాం.


● మీ అమ్మగారు ఇప్పుడు ఎలా ఉన్నారు?

బాగున్నారు. చలికాలం అప్పుడు కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. మొన్న ఫంక్షన్‌లో నేను మాట్లాడినది విని, ఫోన్ చేసి ఏడ్చారు. 'యాత్ర' సినిమాకి పని చేశానన్న ఆనందం అది.

సాక్షి
ఫ్యామిలీ
సన్నిధి
విజయవాడ | ఆదివారం
3-2-2019

సత్ గ్రంథం


అందమైన కృష్ణ కథ



అద్భుతమైన కృష్ణకథ హరివంశం. ఎందరో మహామహులు హరివంశాన్ని రచించినప్పటికీ, ఎ.ఎస్. జగన్నాథశర్మ రచన మాత్రం భిన్నమైన శైలి. తాను సంపాదకత్వం వహిస్తున్న ఒక వార పత్రికలో ధారావాహికగా రాయడం వల్ల సాధారణ పాఠకులు, గృహిణుల కోసం సులభ శైలిలో అందించవలసి రావడమే ఇందుకు కారణం. రచయిత నవలాకారుడు, పాత్రికేయుడు కూడా కావడం వల్ల ఆసక్తికరంగా మలచడంలో కృతకృత్యులయ్యారు. విజయవాడ శ్రీ రాఘవేంద్ర పబ్లిషర్స్ దీనిని పుస్తకరూపమిచ్చి అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

హరివంశము
పుటలు:448; వెల రూ. 324
ప్రతులకు: ఎస్.ఆర్. బుక్ లింక్స్, డి.ఆర్. ఆర్. వీధి, ఇన్నర్ రింగ్ రోడ్(అంబాపురం), విజయవాడ రూరల్–520012. ఫోన్:94938 75959

ఆధ్యాత్మికం.. అక్షయం.. అమృతం



ఆలయాలు కేవలం ఆధ్యాత్మికతకు మాత్రమే పరిమితం కావని, సాటిమానవుడికి చేసే అనేకమైన సేవల ద్వారా కూడా భగవంతుడికి చేరువ కావచ్చునని నిరూపిస్తోంది హరేకృష్ణ ఉద్యమం. అందుకు నిదర్శనంగా నిలుస్తుంది తెలుగు రాష్ట్రాల్లోని మొట్టమొదటి స్వర్ణదేవాలయం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం. రోడ్డు నెంబర్ 12లో గల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. ఇక్కడ లక్ష్మీనరసింహస్వామి విగ్రహం స్వయంభువుగా వెలసిందని ప్రతీతి. నిజాం కాలంలో అక్కన్న, మాదన్నలు ఇక్కడ వచ్చి పూజలు చేసేవారని స్థానికులు చెబుతారు. శివుడు ఇక్కడ క్షేత్రపాలకుడిగా ఉన్నాడు. అందుకే లక్ష్మీనరసింహుడి విగ్రహానికి ఎదురుగా శివుడి విగ్రహం ఉంటుంది. శివుడు తపస్సు చేయగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి శివుడి శిరస్సుపై శంఖం ఉంచి దర్శనమిచ్చారు. అందుకే ఇక్కడి శివలింగంపై శంఖం ఉంటుంది కనుక పాంచజన్యేశ్వరుడిగా పేరు వచ్చింది. స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి వెలిసిన ప్రదేశంలో అనేక అద్భుతాలు.

ఆలయ విశిష్టత

స్వయంభువుగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, పాంచజన్యేశ్వర స్వామి(క్షేత్ర పాలకుడు), రాధా గోవింద, జప ఆంజనేయస్వామి, గరుడ, పురాతన నాగ శిల [illegible] ఈ క్షేత్రంలో కొలువుదీరారు. మొత్తం 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ దేవాలయ ప్రాంగణంలో శ్రీవారి నందనవనం, జలపాతం, ఇక్కడికి వచ్చే భక్తులకు కనువిందు చేస్తూ, సందర్శకులకు భూతల వైకుంఠంలో ఉన్నామా అన్నంత అనుభూతి కలిగిస్తుంది అని ఆలయ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస తెలిపారు.



నేపాల్ దేశంలోని ముక్తినాథ్ ఆలయ సమీపంలో గండకీ నదిలో లభించిన సాలగ్రామ శిల శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి గర్భాలయంలోనే ఉంది. 'జలగ్రామ నారాయణ సాలగ్రామ శిల'గా భక్తులకు దర్శన భాగ్యం కలిగిస్తుంది. ప్రపంచంలోగల అతిపెద్ద సాలగ్రామ శిలల్లో ఒకటిగా చెప్పవచ్చు. ఇక్కడ హనుమంతుడి విగ్రహానికి నాలుగు చేతులు ఉంటాయి. రెండు చేతుల్లో శంఖచక్రాలు, మూడో చేతిలో జపమాల ఉంటుంది. నాల్గవ చేతిలో అభయముద్ర ఉంటుంది. ఇక్కడ శ్రీ లక్ష్మీనరసింహుడిని చూసుకుంటూ హనుమంతుడు అభయహస్తంగా కనిపిస్తాడు. శ్రీచతుర్భుజ జప ఆంజనేయస్వామిని భక్తులు ముందు దర్శించుకుంటారు. ఇక్కడ భక్తులు మంత్ర పీఠంలో జపం చేసి ఆలయంలోని శ్రీ రాధా గోవిందుల అర్చామూర్తుల సుందరాకృతులను మనస్సు నిండా నింపుకుని హరేకృష్ణ మహామంత్రాన్ని జపిస్తూ తన్మయత్వం పొందుతారు. తర్వాత అనంత శేషుడిపై నిల్చుని ఉన్న లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. అనంతరం క్షేత్రపాలకుడిగా ఉన్న పాంచజన్యేశ్వరుడిని దర్శించుకుంటారు.

హరేకృష్ణ ఉద్యమం చేస్తున్న ఆధ్యాత్మిక, సమాజ సేవ కార్యక్రమాలలో కొన్ని...

దేవాలయానికి 10 మైళ్ల లోపు ఎవరూ ఆకలితో ఉండకూడదన్న హరేకృష్ణ ఉద్యమం వ్యవస్థాపకాచార్యులు శ్రీ శ్రీ ప్రభుపాదులవారి ఆశయానికి అనుగుణంగా సంస్థ తమ ప్రణాళికలను రూపొందించింది. విద్యార్థులు ఆకలి వల్ల చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో సంస్థ ఏర్పాటు చేసిన అక్షయపాత్ర తెలంగాణలో అంకురార్పణకు ఈ ఆలయమే కేంద్రస్థానం. మరిన్ని వివరాలకు 9396956984ను సంప్రదించవచ్చునని హరేకృష్ణ ఉద్యమం తెలంగాణ అధ్యక్షులు శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస తెలిపారు.




హరేకృష్ణ ఉద్యమం హైదరాబాద్ ఆధ్వర్యంలో యువతకి ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించి, ప్రతి ఆదివారం భగవద్గీత ద్వారా సమాజ విలువలతోపాటు వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమం యువతకి ప్రస్తుత ప్రపంచ వాస్తవికతకు వేద జ్ఞానాన్ని ఎలా అన్వయించాలో బోధిస్తుంది. అలాగే రోజువారీ జీవితంలో అనుభవించే కఠినమైన సమస్యలకు పరిష్కారాలు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, చెడు అలవాట్లను ఎలా వదిలించుకోవాలి, జీవితంలో కుంగుబాటులను అధిగమించి, ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి, ఇంకా సమాజంలో ఎలా కొనసాగించాలో, ఎలా పర్యవేక్షించాలనే ఎన్నో విషయాలకు వేదికగా మారడం మొదలైనవి.

లౌకిక విద్యాసంస్థలు ఈ ప్రకృతిని మన ఇంద్రియ భోగాల కోసం ఎలా ఉపయోగించుకోగలమో నేర్పుతాయి. కాని మనిషి ఎదుర్కొనే ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు, ఆవేదనలు, జయాపజయాలు, కీర్తి, అపకీర్తులు మొదలైన ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొనేగుణాన్ని బోధించేవి మాత్రం ఆధ్యాత్మిక కేంద్రాలే. మంచి సమాజం ఏర్పడాలంటే ఆధ్యాత్మిక బోధనలు అత్యంత ఆవశ్యకమని హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులు శ్రీల ప్రభుపాదుల వారి నమ్మకం. మన దేవాలయాలు ఆధ్యాత్మిక విజ్ఞాన కేంద్రాలు కావాలన్నది ఆయన ఆశయం. మనిషికి భగవంతుడికి మధ్య ఉన్న దూరాన్ని తీర్చి, కలియుగ కల్మషాలన్నిటిని పారద్రోలడానికి దేవాలయాలు దోహదం చేస్తాయి. ఇందుకోసమే భక్తుల ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందడానికి ఈ స్వర్ణదేవాలయ నిర్మాణం జరిగింది. ఈ దేవాలయం నుండే అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అందులో భాగంగా చిన్నారులకు సంస్కృతి వారసత్వ పండుగ, యువతకు జాగృతి, గృహస్థులకు 'గిఫ్ట్', గ్రామాల్లో ఆధ్యాత్మిక బోధన, దేవాలయంలో ఏడాది మొత్తం జరిపించే పండుగలతోపాటు ప్రముఖ తీర్థయాత్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అంతేకాకుండా సమాజ సేవలో భాగంగా అక్షయపాత్ర, అన్నపూర్ణ 5 రూ. భోజనం, భోజనామృతం, సద్దిమూట, అక్షయ అల్పాహారం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– శ్రీమాన్ సత్యగౌరచంద్రదాస ప్రభుజీ
M.Tech (IIT&M)

సంగీత సాహిత్యం

ఆపాత మధురం



మనకు వాగ్గేయకారులున్నారు. అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు, శ్యామశాస్త్రి ...వీళ్లందరూ సంగీతాన్ని నాదోపాసనగా స్వీకరించిన వాగ్గేయకారులైనారు. ఒకచోట స్థిరంగా కూర్చుని, కాగితం, కలం పట్టుకుని కృతులు రాసినవారు కాదు, వారికి ఎప్పుడెప్పుడు ఏ సందర్భాలలో ఏది చెప్పుకోవాల్సి వచ్చినా పరమాత్మకు చెప్పుకున్నారు. బాధకలిగితే, సంతోషం కలిగితే, దుఃఖం పొంగుకొస్తే... ఇంట్లో పెళ్లి ప్రస్తావన వస్తే... అలా మనసు పొరల్లో ఏ మాత్రం అలికిడి అయినా వారి నివేదన పరమాత్మతోనే. ఆ కృతులలో భావాల్లాంటి కూడిన గంభీరమైన వరుసలు ఎన్నో ఉంటాయి. కానీ ఆర్తితో పరమాత్మను గొంతెత్తి పిలిచారు. అది విన్నవారు పరవశించిపోయారు. ఆ తరువాత ఎంత మంది గురువులు, శిష్యులొచ్చినా పరంపరగా గతంగా ఆ కీర్తనలు చెప్పుకున్నారు. పాడుకున్నారు. అవి కాలానికి అలా నిలబడిపోయాయి. ఈనాటికీ వాటికి శిరస్సువంచి నమస్కారం చేస్తున్నాం.

ఒక్కొక్కరిది ఒక్కొక్క రకమైన జీవితం. వీరిలో కొంతమంది సంసారంలో ఉండి సన్యాసులుగా జీవించారు. మరికొందరు అపారమైన ఐశ్వర్యం ఉండి దానితో సంబంధం లేకుండా జీవించారు. మరికొందరు సంసారంలో ఉండి జ్ఞానంలో జీవించారు. ఏ స్థితిలో ఉన్నా నిరంతరం లోపల ఉండే నాదాన్ని ఉపాసనచేసి దాని ద్వారా పునరావృత్తిరహిత శాశ్వత కైవల్యస్థితిని పొందడానికి వారు సోపానాలు నిర్మించుకున్నారు.

వారు చేసిన ఒక్కొక్క కీర్తనను... చివరకు ఆ పరమేశ్వరుడు కూడా చెవి ఒగ్గి వింటాడట. ''శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః''. పాముని కూడా పడగవిప్పి ఆడేటట్లు చేయగల శక్తి సంగీతానికి ఉంది. ''సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం, ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతం''. అంటే... సంగీతం, సాహిత్యం రెండూ సరస్వతీదేవి రెండు స్తనాలు. ఒకటి ఆపాత మధురం. ఒకదానిలో క్షీరాన్ని గ్రోలడానికి ఏ విధమైన అర్హతా అక్కర్లేదు. ఆ పాలు తాగితే చాలు. రెండవ స్తన్యంలో ఉన్న పాలని స్వీకరించడానికి మాత్రం కొంత అర్హత కావాలి. దానికి వివేచన కావాలి. ఆలోచించగలిగిన సమర్థత ఉండాలి. దాన్ని అర్థం చేసుకునే శక్తి భగవద్దత్తంగా లభించాలి.

అటువంటి అర్హతాలోచనతో ఆయా వాగ్గేయకారులు చేసిన కృతులలో కొన్నింటిని ఎంచుకుని వాటిని గురించి తెలుసుకుందాం. ఆ కీర్తనలలోని ఆర్తిని, అర్థాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నాను. చెప్పగలిగినవాడు సమర్థుడా కాదా అని చూడకుండా భగవత్ శబ్దం ప్రతిపాదింపబడితే చాలునని, పాఠకులు పరవశించే హృదయం కలవారు కనుక సాహసం చేస్తున్నా. ఇందులో తప్పొప్పులుండవచ్చు. కానీ వెనక ఉన్న ఉద్దేశాన్ని మాత్రం గ్రహించండి. అమ్మ ఆర్తితో పెట్టే అన్నంలో ఒక రోజు పప్పులో ఉప్పు మరిచిపోవచ్చు. అంత మాత్రం చేత ఉప్పులేని పప్పు పెట్టాలన్నది అమ్మ ఉద్దేశం అనలేం కదా. పిల్లాడికి కడుపునిండా పెట్టి ఆకలి తీర్చాలన్నదే అమ్మ ఉద్దేశం... అలా నమ్రత ఉందా లేదా అన్నది చూడకుండా ఆ మహానుభావుల కీర్తనలకు భావం చెప్పడంలోని ఉద్దేశాన్ని సహృదయంతో స్వీకరించండి. మొట్టమొదటగా త్యాగరాజ కృతి 'నగుమోము గనలేని నాదు జాలి తెలిసి...' వ్యాఖ్యానం వచ్చే వారం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

'సంగీత సాహిత్యం' వాగ్గేయకారుల కీర్తనలకు వ్యాఖ్యానాలు, వారి జీవితచిత్రాల ఆవిష్కరణలతో కొత్తసీరీస్ ప్రారంభం.

మీకు తెలుసా?



భగవంతుడికి నివేదించేప్పుడు ఎటువంటి పొరపాట్లు చేయరాదు. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే కనుక... దేవునికి నైవేద్యంగా పెట్టదలచిన వంటకాలలో నుంచి కొంత విడిగా తీయరాదు. పాత్ర మొత్తాన్ని దేవుని ఎదుట పెట్టాలి. పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు నివేదించరాదు. చల్లారాకనే నివేదించాలి. నివేదనలో మంచినీటిని కూడా తప్పనిసరిగా పెట్టాలి. నివేదించే వంటకాలలో పంచదారకు బదులు బెల్లం వాడాలి.

ఇస్లాం వెలుగు

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

ముళ్ళతీగకు మల్లెలు పూస్తాయా?



ఊహకు సైతం అందని ఈ విశాల విశ్వం, అందులోని అణువణువూ దేవుని ఏకత్వాన్ని, ఆయన ఘనతను, ఆయన పాలనా, పోషణ గుణాలను సూచిస్తున్నాయి. ఈ అండపిండ బ్రహ్మాండాన్ని సృష్టించిన వాడు ఆ ప్రభువే కనుక అన్నిటిపై అధికారం, ఆధిపత్యం కూడా ఆయనదే. ఈ విశ్వంలోని అసంఖ్యాక సృష్టితాల్లో మానవ రాశి కూడా ఒకటి. మరే ప్రాణికీ లేనటువంటి అత్యద్భుత ప్రతిభా పాటవాలను దైవం ఒక్క మానవ రాశికే అనుగ్రహించాడు. తన ప్రత్యేకతను నిరూపించుకోవాలని నిర్దేశించాడు. నిజానికి ఈ సృష్టి సమస్తమూ ఒక్క మానవుడి కోసమేనంటే అతిశయోక్తి కాదు. మానవ మనుగడకోసం, మానవుల ప్రయోజనం కోసం దైవం అనేకానేక ఏర్పాట్లు చేశాడు. గాలిని, నీటిని, వెలుగును, వేడిని, పగటిని, రేయిని ఆయన సృష్టించాడు. మానవుల ఉపాధి మార్గాలు, సౌభాగ్య ద్వారాలు ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. జీవనస్థరణాలు కూడా ఆయన గుప్పెట్లోనే ఉన్నాయి. ఆయన వివేకాన్ని, అవసరాలు తీర్చేవాడు అన్నీ ఆయనే. అందించేవాడు, ఆదుకునేవాడూ ఆయనే. మానవులు ఇహలోక జీవితం గడపడానికి, పరలోక జీవితంలో సాఫల్యం పొందడానికి కావలసిన సకల ఏర్పాట్లూ చేశాడు, సాధనాలను సమకూర్చాడు.

అయితే, దురదృష్టవశాత్తూ మానవులు సృష్టికర్తను మరిచి ఇష్టారాజ్యంగా జీవించడం వల్ల రెండు విధాలుగా నష్టపోతున్నారు. ఈ ప్రాపంచిక జీవితంలో సుఖశాంతులు లేకుండా, మానసిక ప్రశాంతత లేకుండా బాధాకరమైన జీవితం వెళ్లదీస్తున్నారు. అన్ని జీవరాశులకన్నా శ్రేష్ఠస్థానంలో ఉండి, బుద్ధి కుశలతకు అజ్ఞానపు పరదా కప్పి హీనస్థాయికి దిగజారిపోతున్నారు. ఇంతకన్నా భయంకరమైన నష్టం మరొకటి ఉంది. అదే పరలోక వైఫల్యం. ఏదో ఒక విధంగా ఇహలోక జీవితం గడిచినా, శాశ్వతమైన పరలోక జీవితంలో చేదు అనుభవమే ఎదురు కానుంది. ఇహలోక జీవితంలో బుద్ధిని ఉపయోగించి, మంచిమార్గంలో నడిస్తే, రేపటి పరలోక జీవితం సఫలమవుతుంది. అంతేతప్ప ముళ్ళ విత్తనాన్ని నాటి మల్లెపూలు కోస్తామంటే సాధ్యమయ్యే పని కాదు. ఇక్కడి ఆచరణ, నడవడిని బట్టే, అక్కడ ప్రతిఫలం నిర్ణయమవుతుంది. కనుక బుద్ధిజీవి అయిన మానవుడు దైవం తనకు ప్రసాదించిన జ్ఞానాన్ని, వివేకాన్ని సద్వినియోగం చేసుకుంటే ఇహ, పరలోకాల్లో సంపూర్ణ సాఫల్యాన్ని సొంతం చేసుకోవచ్చు. దైవం మనందరికీ సన్మార్గపథాన నడిచే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్


ధర్మ జిజ్ఞాస

దిష్టి ఎందుకు తీస్తారు?

పిల్లలు, పెద్దలు ఘనవిజయాలు సాధించినప్పుడు, బాగా ప్రశంసలు పొందినప్పుడు అతిగా నీరసించి డీలాపడినప్పుడు దిష్టి తీస్తారు. అలాగే పిల్లలకి పసుపు, సున్నం కలిపిన ఎర్రనీళ్లతో కూడా దిష్టి తీస్తుంటారు. బయటజనుల దృష్టి దోషం తగులకుండా ఉండాలని దిష్టితీస్తే చిన్న పిల్లవాడు కలవరింతలు లేకుండా నిద్రపోవటమూ, నిద్రలో ఉలిక్కిపడుతూ లేవటం వంటి అవలక్షణాలు లేకుండా ఉంటాడు.

చిన్నపిల్లలు కావచ్చు, పెద్దలు కావచ్చు అనేక వేడుకల్లో పాల్గొనటం వల్ల చుట్టూ జనం చేరటంవల్ల చిన్నపిల్లలు లేదా పెద్దలు కొంత అస్వస్థతకు గురి అవుతారు. అందుకే వివాహ వేడుకలలోను, పుట్టిన రోజు వేడుకలలోను విధిగా హారతి ఇచ్చి చివరలో ఎర్ర నీళ్లతో దిష్టి తీస్తారు. ఎర్రరంగు పదేపదే చూడటం వల్ల అనేక రోగాలు నశిస్తాయి. మనసుకి ప్రశాంతతతోపాటు ధైర్య గుణం వస్తుంది.

ప్రశ్నోత్తర భారతం




94. శృంగికి శమీకుడు ఏమని బదులిచ్చాడు?
95. వివరాలు తెలుసుకున్న పరీక్షిత్తు ఏం చేశాడు?
96. వ్యాసుడు ఏమని హెచ్చరించాడు?
97. శృంగి ఇచ్చిన శాపం విన్న తక్షకుడు ఏం చేశాడు?
98. శృంగి శాపం గురించి విన్న కశ్యపుడు ఏం చేశాడు?
99. మార్గంలో కలుసుకున్న తక్షకుడికి కశ్యపుడు తన శక్తిని ఏ విధంగా చూపాడు?
100. కశ్యపుడి శక్తి చూసి తక్షకుడు ఏం ఆలోచించాడు?
101. తక్షకుడి మాటలకు కశ్యపుడు ఏం చేశాడు?
102. తక్షకుడు ఏం చేశాడు?
103. పరీక్షిత్తు ఎక్కడ ఎలా ఉన్నాడు?
104. ఏడవ రోజు ఏం జరిగింది?

–నిర్వహణ: డా. పురాణపండ వైజయంతి

జవాబులు: 94) కోపం తపస్సును చెరుస్తుంది అన్నాడు 95) ఒంటి స్తంభపు మేడ కట్టించి, మేడ మీదే కాపురం పెట్టాడు 96) కోపం సర్వనాశనానికి హేతువు అవుతుంది అని హెచ్చరించాడు 97) పరీక్షిత్తు వద్దకు బయలుదేరాడు 98) పాము కరచి మరణించిన వారిని కశ్యపుడు బతికించగలడు. పరీక్షిత్తుని రక్షించదలచి పరీక్షిత్తు దగ్గరకు బయలుదేరాడు 99) సమీపంలో ఉన్న మర్రిచెట్టుని తక్షకుడు కాటువేశాడు. క్షణంలో అది కాలి, కూలి, బూడిదరాశి అయ్యింది. కశ్యపుడు తన శక్తితో బూడిద కుప్పను చేర్చి, మంత్రతంత్రాలు ప్రయోగించి, మర్రిచెట్టుని మునుపటిలా చేశాడు 100) తక్షకుడు భయపడ్డాడు. తన కార్యం నెరవేరదనుకుని, కశ్యపుడికి ధనం ఆశ చూపాడు 101) తన కర్తవ్యం మరచిపోయాడు, ధనం తీసుకుని, తన దోవన తాను వెళ్లిపోయాడు. పరీక్షిత్తు గురించి మరచిపోయాడు 102) నాగకుమారులను బ్రాహ్మణ కుమారులుగా చేశాడు. వారికి ఫలాలు ఇచ్చి, పరీక్షిత్తు దగ్గరకు పంపాడు 103) ఒంటి స్తంభపు మేడ మీద ఉన్నాడు, చుట్టూ వేదాధ్యయనం చేసేవారు, చర్చలు జరిపే పండితులు, విద్వాంసులు ఉన్నారు 104) సూర్యాస్తమయం దగ్గర పడుతుండగా బ్రాహ్మణ బాలులు వచ్చి, పరీక్షిత్తుకు పండ్లు ఇచ్చారు. ఆ ఫలాలను అందరికీ పంచి, తనకు ఒక్క ఫలం మాత్రమే ఉంచుకున్నాడు పరీక్షిత్తు.

సువార్త

పాపుల పరమ వైద్యుడాయన...



పన్నువసూలు చేసే వృత్తిలో ఉన్న మత్తయిని చూసి యేసుప్రభువు 'నన్ను వెంబడించు' అని పలకగానే అతను వచ్చి ఆయన శిష్య బృందంలో చేరాడు. ప్రభువు పలికిన ఆ ఒక్కమాట అతని జీవిత గమ్యాన్ని సమూలంగా మార్చేసింది. మత్తయి జీవితంలోకి ప్రభువు ఆహ్వానం ఎంతటి ఆనందాన్ని నింపిందంటే, అది వెల్లడించడానికి ఒక గొప్ప విందు చేసి ప్రభువును కూడా ఆహ్వానించాడు. నాటి రోమా ప్రభుత్వానికి తొత్తులైన పన్నులు వసూలు చేసే మత్తయి లాంటి సుంకరులను సాధారణ ప్రజలు ఏవగించుకునేవారు. శాస్త్రులు పరిసయ్యుల వంటి యూదు మత ప్రముఖులు ఎలాగూ రోమా ప్రభుత్వానికి మద్దతుదారులు కాబట్టి వారు సుంకరులకు కూడా స్నేహితులు. అందువల్ల ఆ విందుకు పాపులుగా ప్రజలు ముద్రవేసిన ఎంతోమంది సుంకరులు, పరిసయ్యులు కూడా హాజరయ్యారు. యేసుప్రభువు ఎంతో ఆనందంగా వారందరితో కలిసి విందారగించడం యూదుమత ప్రముఖులైన పరిసయ్యులకు నచ్చలేదు. 'మీ బోధకుడు సుంకరులతో, పాపులతో కలిసి భోజనం ఎందుకు చేస్తున్నాడు' అని పరిసయ్యులు ఆయన శిష్యులను ప్రశ్నించారు. పరిసయ్యులు తమకు తాము చాలా నీతిమంతులమని భావిస్తారు. యూదు మత సంబంధమైన దాదాపు 615 నియమాలను ఎంతో నిష్టగా పాటిస్తారు. అవి పాటించని యూదులు, అన్యులతో కలిసి భోజనం చేయకూడదన్నది వాటిలో ఒకటి. అందువల్ల ఆ విందులో పరిసయ్యుల కోసం ఏర్పాట్లు ప్రత్యేకంగా చేసి ఉంటారు కానీ తమతో కలిసి భోంచేస్తాడనుకున్న యేసుప్రభువు సుంకరులతో కలిసి వారి విభాగంలో కూర్చోవడంతో వాళ్ళు ఈ వివాదానికి తెర లేపారు. 'వైద్యుని అవసరం రోగులకే గాని ఆరోగ్యవంతులకు కాదుకదా. నేను నీతిమంతులను కాదు, పాపులనే పిలవవచ్చాను. బలిని కాదు, కనికరాన్నే కోరుతున్నాను. ఆ వాక్యభావమేమిటో ముందు నేర్చుకోండి' అంటూ ఒక్కమాటతో ప్రభువు వారి నోళ్లు మూసివేశాడు (మత్త 9:9–13).

నిజానికి ఆ రాత్రి విందులో సుంకరులను చూసీ చూడగానే 'మీరెప్పుడు మారుతారు?' అని ప్రభువు వారిని నిలదీస్తూ ప్రశ్నించాలి. అక్కడికక్కడే ఎడాపెడా 'మారుమనస్సు' అనే అంశంపై ప్రసంగం చేసి వారినందరిని గద్దించాలి. నిజానికి తన శిష్యుడిగా చేర్చుకున్న మత్తయికే ప్రభువు ఆ ప్రశ్న వెయ్యలేదు. అది ఎవరో తనను అతిథిగా ఆహ్వానించిన ఒక విందు స్థలం. అందువల్ల అక్కడి వాతావరణాన్ని పాడుచెయ్యకుండా, విందు సాంప్రదాయాన్ని గౌరవించి తన పద్ధతి చొప్పున ఆయన అందరితో కలిసిపోయాడు. అదే ఆయన సంస్కారం, గొప్పదనం. అందరినీ తిట్టి దూరం పెట్టగలిగిన స్థాయి తనకున్నా వాళ్ళందరినీ అక్కున చేర్చుకున్న ఎంతో విశాల హృదయమున్న గొప్ప రక్షకుడాయన. అయితే కొన్ని నియమాలను నిష్టగా పాటిస్తున్నారన్న మాటే గాని దేవుని హృదయాన్ని ఏమాత్రం ఎరుగని పరిసయ్యులు మాత్రం యేసుప్రభువు పాపులతో ప్రభువు కలవడమేమిటన్న వివాదాన్ని విందులో లేపి తమ కుసంస్కారాన్ని చాటుకున్నారు. ఈనాడు విశ్వాసులది కూడా అదే పద్ధతి. చర్చిల్లో తమకన్నా ఆత్మీయంగా తక్కువ స్థాయి గలవారొస్తే వారితో కలవరు, మాట్లాడరు సరికదా సూటిపోటిమాటలంటారు. చర్చిలు పాపుల వైద్యశాలలుగా ఉండాలని ప్రభువు నిర్దేశిస్తే, 'నీతిమంతుల' విశ్రామ స్థలాలు, సోషల్ క్లబ్బులుగా మారాయి. పాపిగా ముద్రపడ్డ వ్యక్తి చర్చికి పరుగెత్తుకెళ్లి అక్కడి విశ్వాసుల ప్రేమతో తడిసి పరివర్తన చెంది సమాజామోదం పొందే పరిస్థితి లేదు సరికదా, చర్చి దరిదాపుల్లోకి కూడా వెళ్లలేని పరిస్థితిని ఈనాటి పరిసయ్యుల్లాంటి విశ్వాసులు కల్పించారు. ఇదే ఈనాటి అతి పెద్ద విషాదం. ప్రభువు హృదయాన్ని తెలుసుకోకుండా ప్రభువు అనుచరులమని చెప్పుకునే 'నకిలీ క్రైస్తవం' బాగా ప్రబలుతోంది. చర్చిల్లో దేవుని మాటలు వినబడతాయి, కానీ దేవుని హృదయం, ఆయన ప్రేమ, కనికరం మాత్రం కనిపించడం లేదు. పాటలు, ప్రసంగాలు, ప్రార్థన చేసే కొద్ది సమయం వదిలేస్తే మిగతా సమయమంతా 'గెట్ టుగెదర్'లు, సోషల్ క్లబ్బుల కార్యకలాపాలే! అన్యులతో కాదు కదా, కనీసం ఇతర చర్చిలవారితో కూడా చాలామంది విశ్వాసులు కలవరు, ఇతరులను తమతో కలవనివ్వరు. ఇలా తమను తాము గొప్పగా, ఎంతో ప్రత్యేకమైన వారుగా భావించుకునే సంస్కృతిని యేసుప్రభువు ఏవగించుకుంటాడు, అలాంటి జీవనశైలికి తన ఆమోదాన్ని అసలే ఇవ్వడు.

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

అపురూపం

స్వర్ణముఖి శిల



పంచాయతన పూజలో కీలకంగా ఉపయోగించే స్వర్ణముఖి శిల చాలా అరుదైన వస్తువు. దక్షిణభారత దేశంలో చిత్తూరు జిల్లా మీదుగా ప్రవహించే స్వర్ణముఖి నది ఒడ్డున స్వర్ణముఖి శిలలు అక్కడక్కడా దొరుకుతాయి. సాక్షాత్తు లక్ష్మీదేవి స్వరూపంగా తలచే స్వర్ణముఖి శిలకు బంగారాన్ని ఆకర్షించే శక్తి ఉందని నమ్ముతారు. ముఖ్యంగా అక్షయతృతీయ నాడు స్వర్ణముఖి శిలను శాస్త్రోక్తంగా పూజించిన ఇంట సంపద దినదిన ప్రవర్ధమానంగా వృద్ధిచెందుతుందని పురాణాలు చెబుతున్నాయి.


స్వర్ణముఖి శిలలు మామూలు రాళ్లమాదిరిగానే ఉన్నా, వాటిలో బంగారు వెండి కలగలసిన ఛాయ కనిపిస్తుంది. స్వర్ణముఖి శిలను ఇళ్లలోను, కార్యాలయాల్లోను, వ్యాపార ప్రదేశాల్లోనూ ఎక్కడైనా సరే, పూజమందిరం ఏర్పాటు చేసిన చోట ఉంచి పూజించుకోవచ్చు. స్వర్ణముఖి శిలకు నిత్య ధూపదీప నైవేద్యాలు సమర్పించే చోట సంతోషానికి, సంపదకు లోటు ఉండదు. స్వర్ణముఖి శిలను ఏదైనా సుముహూర్తంలో తీసుకువచ్చి, పూజమందిరంలో పసుపు వస్త్రంపై ఉంచి ధూప దీప నైవేద్యాలను సమర్పించి, పూజించాలి. దీనిని పూజించడం వల్ల ఆర్థిక పరిస్థితి వేగంగా మెరుగుపడుతుంది. తలపెట్టిన పనుల్లో ఆటంకాలు తొలగిపోతాయి. అనాయాసంగా కార్యసిద్ధి కలుగుతుంది.

– పన్యాల జగన్నాథదాసు

కథా శిల్పం

జయ జయ శ్రీ సుదర్శన





సర్వధర్మ సముద్ధరణకై ఉద్భవించింది సుదర్శనచక్రం. అది ఆయుధమే అయినా పురుష మూర్తి రూపంలో పూజించబడుతూ విష్ణుసామ్యాన్ని పొందింది. ఈ స్వామిని చక్రమూర్తి, చక్రత్తాళ్వార్ అని పిలుస్తారు. వైష్ణవాలయాలలో చక్రమూర్తి తప్పక ఉంటుంది. ప్రతి ఉత్సవం చివరిలో చక్రస్నానం చేస్తారు. ఈ సుదర్శనచక్రం లోహంతో తయారు చేయబడి ఉంటుంది. కానీ సుదర్శనమూర్తి పూర్తి సాకార రూపంలో, ప్రత్యేకసన్నిధిలో కొలువు దీరిన క్షేత్రం ఒకటుంది. అదే 108 వైష్ణవ దివ్యదేశాలలో 46వదైన తిరుమోగూర్. ఇక్కడి స్వామి కాలమేఘపెరుమాళ్. నాలుగుప్రాకారాలతో కూడిన అతి పెద్ద ఆలయం ఇది. చక్రత్తాళ్వార్ తొలి దేవాలయం ఇదే. ఒక చతురస్రమైన శిలపై మధ్యలో సుదర్శన మూర్తి కుడివైపు ఎనిమిది చేతులు, ఎడమవైపు ఎనిమిది చేతులు కలిగి పదహారు చేతులలో శంఖం, చక్రం, పాశం, గొడ్డలి, కత్తి, బాణం, శూలం, విల్లు, అంకుశం, అగ్ని, వజ్రాయుధం, డాలు, నాగలి, రోకలి, గద, ఈటె మొదలైన ఆయుధాలు ధరించి షోడశాయుధ సుదర్శనమూర్తిగా, భయంకరమైన కోరమీసాలతో అగ్నిజ్వాలలతో కూడిన కిరీటంతో హారం, భుజకీర్తులు, హస్తాభరణాలతో షట్కోణం మధ్యలో దర్శనమిస్తాడు. ఆయన చుట్టూ ఆరు వలయాలు ఉన్నాయి. ఆ ఆరు వృత్తాలలో 154 దివ్య బీజాక్షరాలు లిఖించబడి ఉన్నాయి. ఈ మూర్తి చుట్టూ నలభై ఎనిమిది మంది దేవతల విగ్రహాలు చెక్కబడి ఉన్నాయి. విశేషించి ఈ స్వామి మూడు కన్నులతో ఉంటాడు. ఈ మూర్తికి వెనుకవైపు యోగనరసింహస్వామివారు చతుర్భుజాలతో ఆసీనుడై ఉంటాడు.

ఇక్కడి చక్రత్తాళ్వార్ స్వామి చాలా ప్రభావవంతమైన దేవుడు. ఈ స్వామిని దర్శించడానికి దేశం నలుమూలల నుంచి అనేకమంది భక్తులు ఇక్కడికి వస్తుంటారు.

సుదర్శనమూర్తిని నాలుగు, ఆరు, ఎనిమిది, పది, పన్నెండు, పదహారు చేతులతో నిర్మించవచ్చనీ, ఆయుధాలసంఖ్య పెరిగిన కొద్దీ ఆ స్వామి శక్తి పెరుగుతుందనీ విశ్వకర్మీయం అనే ప్రాచీన శిల్పశాస్త్రం చెప్పింది. సకల శత్రుసంహారం సుదర్శనమూర్తి దర్శనఫలం అని వైష్ణవాగమాల అభిప్రాయం. వ్యాపార, వ్యవహారాలలో విజయం, సకలదృష్టిదోషనివారణ, కార్యసిద్ధి కలుగుతుందని భక్తుల నమ్మకం.

– డాక్టర్ ఛాయా కామాక్షీదేవి

తత్త్వ రేఖలు

సూర్యుడే జీవుడు... జీవుడే ఆత్మ!

ఆత్మ సర్వాంతర్యామి అనే అద్వైత సూత్రాన్ని శక్తి నిత్యత్వ నియమం నిరూపిస్తోంది. సైన్స్ ఆత్మను అనంతశక్తిగా, విశ్వశక్తిగా పేర్కొంటుంది. ఈ ఆత్మ ఒక అద్భుత పరిణామశీలి. పుట్టేది గిట్టేది కాదు కాబట్టి, నిత్యయవ్వనంతో ఆత్మ కళకళలాడుతూ ఉంటుంది.

తన నిత్యత్వాన్ని నిలుపుకోవడం కోసం పరిణామమనే ప్రక్రియను సాధనంగా చేసుకుని, తనకు తానుగా పదార్థంగా పరిణామం చెందుతూ వస్తోంది. మళ్ళీ ఆ పదార్థాలు విఘటనం చెందుతూ, నీటి ఆవిరి గాలిలో లయమైపోయినట్టుగా ఆత్మలో లయమైపోతున్నాయి.

ఆత్మలాగే, పదార్థమూ అనాదిగా వస్తున్నదే. అయితే, ఆత్మ స్వీయ స్పందనల నుండి ఈ పదార్థం పుడుతూ, విచ్ఛిన్నమవుతూ వస్తోంది. ఈ ఖగోళ పదార్థాల సంఖ్య నిశ్చల, నిరంతర క్రియ కాదు. ఈ ఖగోళ పదార్థాల ప్రవర్తనకు సౌరకుటుంబమే నిదర్శనం. ఆత్మకు,



జీవనిర్జీవ ప్రపంచానికి అనుసంధానకర్త అయిన సూర్యుని ద్వారానే ఆత్మస్వరూపాన్ని అర్థం చేసుకోవచ్చని 'ఈశావాస్యోపనిషత్తు' ఉద్ఘాటిస్తోంది.

తరచి చూస్తే సూర్యుడు కూడా జనన, బాల్య, కౌమార, ప్రౌఢ, వార్ధక్య దశలను దాటి నశించేవాడే. సూర్యుని నుండే గ్రహాలు ఉద్భవించాయని ప్రాచీన భారతీయ ఖగోళ శాస్త్రవేత్తలు, నవీన ఖగోళ శాస్త్రవేత్తలూ నిర్ధారించారు. గ్రహాలలో భూమి ఒక్కటే జీవావరణ అనుకూలం. అందునా మానవుడు మేధోపరుడు. ఆలోచిస్తే సౌరశక్తే జీవాలుగా మారినట్లు తెలుస్తుంది. సూర్యుని నుంచి విడిపడి ఏర్పడ్డ భూమిపై సూర్యరశ్మి పడడం, అందులోని శక్తిని తీసుకుని జీవరాశి తయారవడం కనిపిస్తుంది. అంటే ఆ సూర్యుడే అటు గ్రహాల రూపంలో, ఇటు జీవాల రూపంలో భాసిల్లుతున్నాడు.

ఇదే విషయాన్ని 'ఈశావాస్యోపనిషత్తు' 'సత్యధర్ము'డైన సాధకుడే సూర్యునిలో నెలకొన్నాడని తీర్మానిస్తోంది. ఆ ఆత్మతత్వాన్ని తెలుసుకోవడానికి ఈ ఆత్మరూపుడు సూర్యుని ద్వారా ప్రయత్నించడం ఆ ఉపనిషత్తులో కనిపిస్తుంది. ఇదే కోవలో మరింత లోతుగా ఆలోచిస్తే ఈ గ్యాలక్సీలలో ఉన్న కోటానుకోట్ల సూర్యులలో భాసిల్లేది ఆ ఆత్మనే. అంటే, అనంతమైన ఆత్మే నక్షత్రాలుగాను, గ్రహాలుగాను, పంచభూతాలుగాను, ప్రాణులుగానూ మారి కనిపిస్తోంది. ఇదే విషయాన్ని గణిత సూత్రంలో పోలిస్తే ఒక విలువ రెండో విలువకు, రెండో విలువ మూడో విలువకు సమానమైనపుడు ఒకటో విలువ మూడో విలువకు సమానమౌతుంది. ఇదీ అంతే. ఆత్మే సూర్యుడు, సూర్యుడే జీవుడు, జీవుడే ఆత్మ. దీన్ని అర్థం చేసుకోవడమే ఆత్మసందర్శన. అదే భగవద్దర్శనం. ఆ సాధనే సత్యస్వరూపం

–గిరిధర్ రావుల

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం
3-2-2019



● విజయ్ సేతుపతి

బైక్ నంబర్ 96

హీరోలకు కెరీర్‌లో మరచిపోలేని హిట్స్ అందించినప్పుడు హీరోలు ఆ దర్శకులకు ఏదో గిఫ్ట్ ఇవ్వడం చాలా సందర్భాల్లో చూశాం. తాజాగా దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్‌కు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను గిఫ్ట్‌గా అందించారు విజయ్ సేతుపతి. వీళ్లిద్దరి కాంబినేషన్‌లో '96' చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా పెద్ద హిట్‌గా నిలిచింది. విజయ్ సేతుపతికి బైక్స్ అంటే ఇష్టమట. అందుకే తన దర్శకుడికి బైక్‌ను గిఫ్ట్‌గా ఇస్తే బావుంటుందని భావించి ఎన్‌ఫీల్డ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు. సుమారు 3 లక్షలు ఖరీదైన ఈ బైక్ స్పెషాలిటీ ఏంటంటే ఈ బైక్ రిజిస్ట్రేషన్ నంబర్ '0096'. సినిమా టైటిల్ కూడా కలిసేలా ప్లాన్ చేసి, ఇలా ప్రెజెంట్ చేయడంతో ప్రేమ్‌కుమార్ ఆశ్చర్యపోయింటారు. ఈ సినిమా తెలుగులో ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలోనే శర్వానంద్, సమంత జంటగా రూపొందనున్న సంగతి తెలిసిందే.



● ఇళయరాజా

సంగీత జ్ఞానికి ఘన సత్కారం

సంగీతజ్ఞాని ఇళయరాజాకు శనివారం సాయంత్రం చెన్నైలో ఘనసత్కారం జరిగింది. 1000కి పైగా చిత్రాలకు సంగీతాన్ని అందించి రికార్డుకెక్కిన ఇళయరాజా 75 వసంతాలను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈ సంగీత రాజాకు తమిళ నిర్మాతల మండలి చెన్నైలో అభినందన సభ నిర్వహించింది. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు, చెన్నై నందనంలోని వైఎంసీఏ మైదానంలో బ్రహ్మాండమైన సంగీత విభావరిని తలపెట్టారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం జరిగిన ఈ సంగీత కార్యక్రమానికి తమిళనాడు గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – ''1996లో 'అన్నక్కిళి' చిత్రంతో తన సంగీత పయనాన్ని ప్రారంభించిన ఇళయరాజా గ్రామీణ, తమిళ సంప్రదాయ పాటలకు ప్రాణప్రతిష్ఠ చేశారు. 13 రోజుల్లో సింఫోనికి బాణీలు కట్టి ప్రపంచ రికార్డు సాధించిన ఘనత ఇళయరాజాది. ప్రపంచస్థాయిలో అభిమాన గణం కలిగిన ఇళయరాజా ఇంకా పదికాలాల పాటు సంగీత దర్శకుడిగా కొనసాగాలి'' అన్నారు. సంగీత సామ్రాజ్యానికి ఏకైక రారాజు ఇళయరాజానే అని తమిళ నిర్మాతల మండలి అధ్యక్షుడు, నటుడు విశాల్ సంగీతజ్ఞానిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఆర్ రెహమాన్ తన మార్గదర్శి ఇళయరాజానే అని పేర్కొన్నారు. కాగా ఈ వేదికపై సినీ పరిశ్రమ తరపున ఇళయరాజాకు బంగారంతో చేసిన వయొలిన్‌ను బహూకరించి ఘనంగా సత్కరించారు.

స్పైతో సై



● తమన్నా

గోపీచంద్ గూఢచారిగా మారి భారతదేశం బోర్డర్‌లో సాహసాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ గూఢచారికి జోడీ ఫిక్స్ అయ్యారని సమాచారం. తిరు దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా స్పై థ్రిల్లర్ జానర్‌లో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఇండియా, పాకిస్థాన్ బోర్డర్‌లో జరుగుతోంది. ఇందులో గోపీచంద్ సరసన హీరోయిన్‌గా తమన్నా పేరుని పరిశీలిస్తున్నారట చిత్రబృందం. గోపీచంద్‌తో తమన్నా హీరోయిన్‌గా యాక్ట్ చేయడం ఇదే ఫస్ట్ టైమ్. ఆల్రెడీ ఈ సినిమాలో మరో కథనాయికగా బాలీవుడ్ భామ జరైన్ ఖాన్‌ను ఎంపిక చేశారు. సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్ కానున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్నారు.



● గోపీచంద్



● ప్రియా ప్రకాశ్

ప్రేమికుల రోజు

జస్ట్ అలా అలవోకగా కన్ను కొట్టి కుర్రకారు హృదయాలను దోచేసుకున్నారు ప్రియా ప్రకాశ్ వారియర్. మలయాళ చిత్రం 'ఒరు ఆధార్ లవ్' టీజర్‌లో ప్రియా కన్ను కొట్టడం, ఆ టీజర్ వైరల్ అవ్వడం తెలిసిందే. రోషన్, ప్రియా ప్రకాశ్ వారియర్ నటించిన మలయాళ చిత్రం 'ఒరు ఆధార్ లవ్'. ఈ చిత్రానికి ఒమర్ లులు దర్శకత్వం వహించారు. సుఖీభవ సినిమాస్ పతాకంపై ఎ.గురురాజ్, సి.హెచ్. వినోద్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. తెలుగులో 'లవర్స్ డే' పేరుతో ఈ నెల 14న ప్రేమికుల దినోత్సవం రోజున విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''ఈ చిత్రానికి బన్నీ (అల్లు అర్జున్) అందించిన సహకారాన్ని మర్చిపోలేం. తెలుగులో ప్రియా వారియర్ పాత్రకు సింగర్ లిప్సిక డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రంలో ఎనిమిది పాటలు ఉన్నాయి. ఇందులో ఓ పాట ఆడియన్స్‌కు థియేటర్‌లో సర్‌ప్రైజ్‌గా ఉంటుంది. మంచి బిజినెస్ జరిగింది'' అని అన్నారు. ఈ సినిమాకు షాన్ రెహమాన్ స్వరకర్త.



● నాగశౌర్య

కాంబినేషన్ షురూ

కొత్త చిత్రాన్ని స్టార్ట్ చేయడానికి రంగం సిద్ధం చేశారు నాగశౌర్య. కాశీ విశాల్ అనే నూతన దర్శకుడి చిత్రంలో నాగశౌర్య హీరోగా నటించనున్నారు. ప్రముఖ దర్శకులు సుకుమార్ దగ్గర దర్శకత్వ శాఖలో చేశారు కాశీ విశాల్. సుకుమార్ రైటింగ్స్ పతాకంపై సుకుమార్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్మెంట్ అధినేత శరత్ మరార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. త్వరలో మరిన్ని విషయాలను తెలియజేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ సంగతి ఇలా ఉంచితే... హీరో నాగశౌర్య కెరీర్‌లో వన్నాఫ్ ది బిగ్గెస్ట్ హిట్స్‌గా నిలిచిన 'ఛలో' సినిమా విడుదలైన (ఫిబ్రవరి 2) తేదీనే ఆయన కొత్త సినిమా అనౌన్స్‌మెంట్ రావడం విశేషం.



● సుకుమార్



● రమేష్, శ్రుతి

ఒకటే జీవితం


ప్రముఖ నిర్మాత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఒకటే లైఫ్'. ఎం.వెంకట్ దర్శకుడు. శ్రుతియుగల్ కథానాయిక. లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మించిన ఈ సినిమా యు/ఎ సర్టిఫికెట్ అందుకుంది. వెంకట్ మాట్లాడుతూ– ''నేటితరం టెక్నాలజీ పేరుతో పరుగులెడుతోంది. హ్యూమన్ రిలేషన్స్‌కు, ఎమోషన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రమిది. అమ్రీష్ పాటలు, రీ–రికార్డింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఈ నెలలోనే సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''ఈ సినిమాను వెంకట్ తెరకెక్కించిన విధానం హైలెట్‌గా నిలుస్తుంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుగారు మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది'' అని నారాయణ్ రామ్ అన్నారు.

ట్వంటీ ట్వంటీ లవ్



● మోహిని, అరవింద్

అరవింద్, మోహిని జంటగా సెంథిల్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకి 'లవ్ 20–20' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మోహన్ వడ్లపట్ల, మహేందర్ వడ్లపట్ల, జో శర్మ నిర్మిస్తున్నారు. మెక్విన్ గ్రూప్ (యూఎస్ఏ) సహనిర్మాత. ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ ముంబైలో జరుగుతోంది. కొంత ప్యాచ్ వర్క్‌తో సహా, ఫైనల్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ఈ నెల 6 వరకు జరుగుతుంది. ''మంచి కథ కుదిరింది. హీరోహీరోయిన్ల క్యారెక్టర్లు కొత్తగా ఉంటాయి. యూత్‌కి కనెక్ట్ అయ్యేలా తెరకెక్కిస్తున్నాం. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సత్యన్.



● సునీల్‌కుమార్

నిజమైన యోధుడు

మన్యంలో జరుగుతున్న తెల్లదొరల అకృత్యాలకు నిరసనగా విప్లవ బావుటా ఎగరవేసిన అల్లూరి సీతారామరాజు పోరాట గాథ 'సీతారామరాజు' పేరుతో తెరకెక్కనుంది. ఉపశీర్షిక 'ఎ ట్రూ వారియర్'. 'సొంత ఊరు, గంగపుత్రులు, గల్ఫ్, రొమాంటిక్ క్రైమ్ కథ, క్రిమినల్ ప్రేమ కథ' వంటి చిత్రాలను తెరకెక్కించిన పి. సునీల్ కుమార్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. డా. శ్రీనివాస్ నిర్మించనున్న ఈ సినిమా మార్చిలో స్టార్ట్ కానుంది. ''యువతకి స్ఫూర్తి నింపేలా, అల్లూరిత్యాగం, కీర్తిని మరింత ఇనుమడింపజేసేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: యెక్కలి రవీంద్రబాబు, డా.ఎల్.ఎన్.రావు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: బాపిరాజు.



● పృథ్వీరాజ్

డీ గ్లామర్ లుక్‌లో...

మలయాళం యాక్టర్ పృథ్వీరాజ్ కొత్త లుక్‌లోకి మారిపోయారు. డ్రీమ్‌బాయ్ లుక్‌లో కనిపించే ఆయన డీ గ్లామర్ రోల్‌లోకి చేంజ్ అయ్యారు. ఇదంతా ఆయన తాజా చిత్రం 'ఆడు జీవితం' కోసమే. మలయాళ ఇండస్ట్రీలో రాబోతున్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'ఆడు జీవితం' ఒకటి. మలయాళంలోని ఓ ప్రముఖ నవల ఆధారంగా ఈ సినిమాను దర్శకుడు బ్లెస్సీ తెరకెక్కిస్తున్నారు. ఇందులో పృథ్వీరాజ్ విభిన్న గెటప్స్‌లో కనిపిస్తారట. ఆ గెటప్స్‌లో ఇదొకటి. ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. 25 సంవత్సరాల తర్వాత మలయాళ చిత్రానికి రెహమాన్ సంగీతం అందించనుండటం విశేషం. 2020లో రిలీజ్ కానున్న ఈ చిత్రంలో అమలా పాల్ కథానాయిక.

అవసరమైతే కోర్టుకి వెళతాను

– నిర్మాత వెంకట్



● వెంకట్, కేటీ నాయక్

బెనర్జీ, వెంకట్, ముమైత్‌ఖాన్, సంజీవ్ కుమార్, సుమన్ రంగనాథన్ ప్రధాన పాత్రధారులుగా కేటీ నాయక్ దర్శకత్వం వహించిన చిత్రం 'దండుపాళ్యం 4'. వెంకట్ నిర్మించారు. ఈ సినిమాను మార్చిలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ– ''మా దండుపాళ్యం 4' చిత్రానికి ఇంతకుముందు వచ్చిన దండుపాళ్యం ట్రయాలజీకి ఎలాంటి సంబంధం లేదు. జైలులో ఉన్న తమ సహచరులను తప్పించడానికి ఓ దండు ఎలాంటి వ్యూహాలు రచించింది? పోలీసులు ఎలాంటి ఎత్తుగడలు వేశారు? అనే అంశాలతో మా 'దండుపాళ్యం 4' రూపొందింది. ఇందులో ఏడుగురు ఉన్న గ్యాంగ్‌కు నాయకురాలిగా సుమా రంగనాథన్ నటించారు'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''షూటింగ్ పూర్తయిన మా సినిమాను సెన్సార్‌కు అప్లై చేశాను. కంటెంట్ పరంగా సినిమాలో ఏదైనా సమస్య ఉంటే ఫలానా సన్నివేశాన్ని, ఫలానా డైలాగ్‌ని తొలగించడం జరుగుతుంది. నా సినిమాను చూసిన సెన్సార్ బోర్డ్ ఆఫీసర్ సినిమాలో కొన్ని సీన్లు తొలగించాలి, లేకుంటే రిజెక్ట్ చేస్తానని అన్నారు. సినిమాలో ఉన్న సమస్య ఏంటో చెప్పకుండా రిజెక్ట్ చేస్తాననడం మొదటిసారి చూశా. ఆ తర్వాత ఆయన ఈ సినిమాను సెన్సార్ చేయను. రివైజింగ్ కమిటీకి వెళ్లండన్నారు. ప్రస్తుతం నేను అదే పని మీద ఉన్నాను. రివైజింగ్ కమిటీనే కాదు... ట్రిబ్యునల్.. అదీ కాకపోతే కోర్టుకి వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చిలో మా సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ''మా సినిమాతో సెన్సార్ బోర్డుకి ఇబ్బంది ఏంటో అర్థం కావడం లేదు. సినిమా బాగా వచ్చింది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సినిమాను మార్చిలో విడుదల చేస్తాం'' అన్నారు దర్శకుడు. ముత్యాల రాందాసు, బెనర్జీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆ కష్టాలనుంచి పుట్టిన కథ



● ఉదయ్‌కుమార్, రఘురాజ్

''ఓ రోజు నేను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి వస్తున్నప్పుడు క్యాబ్‌లో రాసున్న ఓ కొటేషన్ గురించి క్యాబ్ డ్రైవర్‌ని అడిగా. 'నేను బీటెక్ చదివాను. ఉద్యోగం దొరక్క నెలకి రూ.10 వేలకి క్యాబ్ డ్రైవర్‌గా చేస్తున్నా. నాలాంటి వాళ్లు చాలామంది చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు.. ఇంజినీరింగ్‌కి విలువ లేదు' అని చెప్పగానే ఆశ్చర్యపోయా'' అని డైరెక్టర్ రఘురాజ్ అన్నారు. ఈశ్వర్ హీరోగా, అంకిత, టువ హీరోయిన్లుగా ఆర్. రఘురాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే..' అన్నది ఉపశీర్షిక. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా రఘురాజ్ మాట్లాడుతూ– ''నాతో పైవిధంగా అన్న క్యాబ్ డ్రైవర్‌తో కొన్నిరోజులు ట్రావెల్ చేసి, ఇంజినీరింగ్ చేసిన వారి కష్టాలు తెలుసుకున్నాను. అలా ఈ స్టోరీ పుట్టింది. ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌కి మా సినిమాలో ఒక మెసేజ్ కూడా ఉంటుంది. 'లవ్ అట్ ఫస్ట్ సైట్' అంటుంటారు. కానీ, అవన్నీ బ్రేకప్ అవుతున్నాయి. 'లవ్ అట్ సెకండ్ లుక్' అనే కొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాం. మా సినిమా యూత్‌కే కాదు.. పెద్దవాళ్లకు కూడా నచ్చుతుంది. వంద సంవత్సరాల సినిమా చరిత్రలో ఎవరూ చేయని సాహసం మా సినిమాలో చేశాం. అది ఏంటన్నది సినిమా చూస్తేనే అర్థమవుతుంది. థాయిల్యాండ్‌లోని ప్రత్యేకమైన ప్రదేశాల్లో పాటలు షూట్ చేశాం. నేను ఏదడిగినా కాదనకుండా అన్నీ సమకూర్చుతూ మమ్మల్ని ముందుకు నడిపించిన మా నిర్మాతలు ఉదయకుమార్, హేమలత గార్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు'' అన్నారు. నిర్మాత ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



● రాహుల్ రామకృష్ణ

హాలీవుడ్‌కు హాయ్

'అర్జున్ రెడ్డి'లో విజయ్ దేవరకొండ దోస్త్‌గా కనిపించి హీరో బెస్ట్ ఫ్రెండ్‌గా గుర్తింపు సంపాదించుకున్నారు రాహుల్ రామకృష్ణ. ఆ తర్వాత 'భరత్ అనే నేను' 'గీత గోవిందం' 'హుషారు' సినిమాల్లో మంచి మార్కులు వేయించుకున్నారు. ప్రస్తుతం రాజమౌళి 'ఆర్ఆర్ఆర్'లో కీలక పాత్రను పోషిస్తున్నారు. ఇప్పుడు హాలీవుడ్‌కు హాయ్ చెప్పడానికి రెడీ అయ్యారు. 'సిల్క్ రోడ్' అనే చిత్రం ద్వారా హాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నారు రాహుల్. ''ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. ఈ సినిమాతో హాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడం సంతోషంగా ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న ప్రదీప్ తెలుగు వాడు కావడం విశేషం.



వైజాగ్ టి20 ఫిబ్రవరి 24కు మార్పు

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరగాల్సిన రెండు టి20 మ్యాచ్‌ల తేదీలను బీసీసీఐ అటు ఇటు మార్చింది. ఈ నెల 27న బెంగళూరులో జరగాల్సిన తొలి టి20 మ్యాచ్ ఫిబ్రవరి 24న విశాఖపట్నానికి మారగా... 24న వైజాగ్‌కు కేటాయించిన రెండో టి20 మ్యాచ్ 27న బెంగళూరులో జరుగుతుంది. బెంగళూరులో 24న ఎయిర్ షో, ప్రధాని మోదీ పర్యటన కూడా ఉండటంతో భద్రత కల్పించలేమని పోలీసులు తేల్చి చెప్పారు. దాంతో మ్యాచ్ తేదీలు మార్చాలని కర్ణాటక క్రికెట్ సంఘం విజ్ఞప్తి చేసింది. వైజాగ్ మ్యాచ్ కోసం టికెట్లు ఫిబ్రవరి 4నుంచి ఆన్‌లైన్ (www.eventsnow.com)లో, 15నుంచి నగరంలోని వేర్వేరు కౌంటర్లలో నేరుగా కొనేందుకు అందుబాటులో ఉంటాయి.

విజయంతో ముగిస్తారా..!

కఠినంగా సాగుతుందని భావించిన వన్డే సిరీస్‌ను వరుసగా మూడు విజయాలతో సునాయాసంగా కైవసం చేసుకుంది టీమిండియా. హామిల్టన్‌లో జరిగిన నాలుగో మ్యాచ్‌లో మాత్రం అచ్చమైన న్యూజిలాండ్ పిచ్ ఎదురయ్యే సరికి ట్రెంట్ బౌల్ట్ స్వింగ్ ధాటికి బోల్తాకొట్టింది. తాత్కాలిక కెప్టెన్ రోహిత్ శర్మ సహా బ్యాట్స్‌మెన్ కలసికట్టుగా విఫలమవడంతో బౌలర్లకూ చేసేందుకు ఏమీ లేకపోయింది. జట్టులో ఎవరున్నారు? ఎవరు లేరు? అని కాకుండా... స్వింగ్‌కు పేరుగాంచిన ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచ కప్ ముందు ఓ మేల్కొలుపు లాంటి ఓటమి ఇది. ఇక చివరి వన్డే వేదికైన వెల్లింగ్టన్‌లోనూ పిచ్ దాదాపు హామిల్టన్ తరహాలోనే ఉండనున్నట్లు కనిపిస్తోంది. ఈ సవాల్‌ను అధిగమించి భారత్ తమ ఆధిక్యాన్ని 4–1కు పెంచుకుంటుందా? లేక తలొంచి 3–2తో సంతృప్తిపడుతుందా?

నేడు వెల్లింగ్టన్‌లో చివరి వన్డే ● బరిలోకి దిగనున్న ధోని ● గాయంతో కివీస్ ఓపెనర్ గప్టిల్ దూరం



రోహిత్ శర్మ

వెల్లింగ్టన్

‘ఇలాంటి ఫలితం మాకు హెచ్చరికలాంటిది. దీన్నుంచి మేం పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది...’ నాలుగో వన్డేలో ప్రతిఘటనే లేకుండా ఓడటంతో టీమిండియా పేసర్ భువనేశ్వర్ చేసిన వ్యాఖ్యలివి. ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్ ముందు, విదేశీ గడ్డపై చివరి వన్డే ఆడబోతున్న భారత్ విషయంలో ఈ అభిప్రాయం వంద శాతం నిజమైనదే. దీన్నుంచి మన జట్టు ఎలాంటి పాఠం నేర్చుకుంది అనేది న్యూజిలాండ్‌తో ఆదివారం ఇక్కడి బేసిన్ రిజర్వ్ మైదానంలో జరిగే చివరిదైన ఐదో వన్డేలో తెలియనుంది. మరోవైపు గాయంతో గత రెండు వన్డేలకు దూరమైన వెటరన్ మహేంద్ర సింగ్ ధోని ఈ మ్యాచ్‌లో ఆడనుండటం టీమిండియాకు సానుకూలాంశం. కాగా, ఓపెనర్ మార్టిన్ గప్టిల్ వెన్నునొప్పితో దూరం కావడం కివీస్‌కు ప్రతికూలం కానుంది.

ఉదయం 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ 1లో ప్రత్యక్ష ప్రసారం

మహి వచ్చాడు...

సిరీస్ గణాంకాలను 4–1తో ముగిస్తే భారత్ తనదైన ఆధిపత్యం చాటినట్లవుతుంది. నాలుగో వన్డేలో ఊహించని పిచ్‌పై దెబ్బతిన్నందున ఈ మ్యాచ్‌లో కొంచెం జాగ్రత్తగా ఆడే అవకాశం కనిపిస్తోంది. హామిల్టన్‌లో బౌల్ట్ స్పెల్‌ను కాచుకుని ఉంటే...



ధోని

తర్వాత పరుగులు వచ్చేవి. మరోసారి అతడి ప్రభావానికి లొంగకుండా చూసుకోవాలి. కోహ్లి లేని నేపథ్యంలో ఆ బాధ్యత ఓపెనర్లు రోహిత్, ధావన్‌లదే. యువ శుబ్‌మన్ గిల్‌ను పరీక్షించి చూడాలనుకుంటే... దినేశ్ కార్తీక్ బెంచ్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. గిల్‌ను తప్పిస్తే రాయుడు మూడో



విలియమ్సన్

స్థానంలో వస్తాడు. 4, 5 స్థానాల్లో కార్తీక్, ధోని ఆడతారు. షమీకి విశ్రాంతితో రెండో పేసర్‌గా ఖలీల్‌నే ఎంచుకోవచ్చు. హైదరాబాదీ సిరాజ్ పేరు వినిపిస్తున్నా అది ఖాయం కాదు. భువనేశ్వర్‌కు స్వింగ్ అనుకూలిస్తే ఫలిస్తే ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు కష్టాలు తప్పవు.

కివీకి కేన్ బెంగ

ఆతిథ్య జట్టును కెప్టెన్ విలియమ్సన్ ఫామ్ కంగారు పెడుతోంది. తొలి మ్యాచ్‌లో అర్ధసెంచరీ చేసిన తర్వాత అతడు మళ్లీ రాణించలేదు. బ్యాటింగ్ భారాన్ని రాస్ టేలర్ ఒక్కడే మోస్తున్నాడు. గప్టిల్ లేనందున నికోల్స్‌తో మున్రో ఇన్నింగ్స్ ప్రారంభించవచ్చు. వీరితోపాటు లాథమ్‌ను త్వరగా ఔట్ చేస్తే టీమిండియా పని సులువవుతుంది. ఇక పేసర్ హెన్రీ బదులుగా టిమ్ సౌథీని బరిలో దింపే ఆలోచనలో న్యూజిలాండ్ ఉంది. అనుకూల పరిస్థితుల్లో బౌల్ట్‌కు సౌథీ తోడైతే భారత్ శ్రమించక తప్పదు.

పిచ్, వాతావరణం

పిచ్ స్వింగ్‌కు అనుకూలించవచ్చు. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు. గాలులతో కూడిన వేడి వాతావరణం ఉండనుంది. గత మూడేళ్లలో ఈ మైదానంలో న్యూజిలాండ్ సగటు స్కోరు 207 మాత్రమే కావడం గమనార్హం.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధావన్, రాయుడు, గిల్/దినేశ్ కార్తీక్, ధోని, జాదవ్, పాండ్యా, భువనేశ్వర్, చహల్, కుల్దీప్, ఖలీల్

న్యూజిలాండ్: నికోల్స్, మున్రో, విలియమ్సన్ (కెప్టెన్), రాస్ టేలర్, లాథమ్, గ్రాండ్‌హోమ్, నీషమ్, బ్రేస్‌వెల్/సాన్‌ట్నర్, ఆస్టల్, హెన్రీ/సౌథీ, బౌల్ట్.




డబుల్స్ మ్యాచ్‌లో బోపన్న-దివిజ్ జంట

భారత్ ఆటకట్టు

3-1తో గెలిచిన ఇటలీ ● డేవిస్ కప్ టెన్నిస్ టోర్నీ

సాధారణంగా డేవిస్ కప్ మ్యాచ్‌లు హార్డ్ కోర్టులో జరుగుతాయి. ఇటలీకి ఆ కోర్టుల్లో పట్టుంది. వారిని ఓడించే వ్యూహంతో భారత్... కోల్‌కతాలో గ్రాస్ కోర్టులపై ఆడించింది. కానీ, ఈ ఎత్తుగడలేమీ పారలేదు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవడంలో భారత్ విఫలమైన వేళ... చెలరేగిన ఇటలీ తొలిసారి డేవిస్ కప్ వరల్డ్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

కోల్‌కతా: తొలిరోజు రెండు మ్యాచ్‌ల్లోనూ చేదు ఫలితాలే ఎదురైనా... శనివారం డబుల్స్ మ్యాచ్ ఊపిరిపోసింది. కానీ రివర్స్ సింగిల్స్‌తో కథ మళ్లీ మొదటికొచ్చింది. చివరకు ఇటలీతో జరిగిన డేవిస్ కప్ పోరులో భారత్ 1–3తో పరాజయం చవిచూసింది. ప్రత్యర్థికి అంతగా పట్టులేని గ్రాస్ కోర్టులోనూ చక్కని విజయాలతో ఇటలీ డేవిస్‌కప్ వరల్డ్ ఫైనల్స్ క్వాలిఫయర్స్ టోర్నీకి అర్హత సంపాదించింది. మొదటి రోజే 0–2తో వెనుకబడిన భారత శిబిరంలో రోహన్ బోపన్న–దివిజ్ శరణ్ జోడీ ఆశలు రేపింది. కలకత్తా సౌత్‌క్లబ్‌లో శనివారం జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో భారత జోడీ 4–6, 6–3, 6–4తో సిమోన్ బొయెలీ–మాటియో బెరెటిని జంటపై విజయం సాధించింది. తొలి సెట్ ఓటమి తర్వాత ఒక్కసారిగా భారత ద్వయం పుంజుకుంది. రెండు, మూడు సెట్లలో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. చివరకు గంటా 43 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో బోపన్న–దివిజ్ జంట 2–1 సెట్లతో జయభేరి మోగించింది. దీంతో భారత్ 1–2తో టచ్‌లోకి వచ్చినట్లే కనిపించింది. కానీ రివర్స్ సింగిల్స్ ఫలితం భారత్‌ను ముంచింది. ప్రపంచ 37వ ర్యాంకర్ ఆండ్రియా సెప్పి 6–1, 6–4తో భారత టాప్ ర్యాంకర్, ప్రపంచ 102వ ర్యాంకు ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్‌ను ఓడించడంతో పరాజయం ఖాయమైంది. తొలి సెట్‌లో సెప్పి ధాటికి భారత ఆటగాడు నిలువలేకపోయాడు. శరవేగంతో సెట్‌ను ముగించిన ఇటలీ ఆటగాడికి రెండో సెట్‌లో కాస్త పోటీ ఎదురైంది. చివరకు 62 నిమిషాల్లో సెట్‌తో పాటు మ్యాచ్‌ను ముగించాడు. ఫలితం తేలిపోవడంతో రెండో రివర్స్ సింగిల్స్‌ను ఆడించలేదు. ఈ విజయంతో ముఖాముఖీ పోటీల్లో ఇటలీ ఆధిపత్యం 5–1కు పెరిగింది. భారత్ ఇదే కలకత్తా సౌత్‌క్లబ్ కోర్టులో 1985లో జరిగిన డేవిస్ పోరులో గెలిచింది. కానీ ఈ పరాజయంతో ప్రపంచ 19వ ర్యాంకరైన భారత్ జోన్ గ్రూప్‌కు పడిపోయింది. మాడ్రిడ్ (స్పెయిన్)లో నవంబర్‌లో జరిగే 12 జట్ల ఫైనల్స్ క్వాలిఫయర్స్ టోర్నీలో ఇటలీ పాల్గొంటుంది.



> సింగిల్స్‌లో కనీసం ఒక మ్యాచ్ గెలిచి ఉంటే ఫలితం మరోలా ఉండేది. కానీ తొలిరోజు (శుక్రవారం) రెండు సింగిల్స్‌ల్లోనూ ఓడటం ప్రతికూలించింది. 0–2తో వెనుకబడి పుంజుకోవడమనేది మానసికంగా కష్టసాధ్యమైంది. ఇప్పుడిప్పుడే భారత టెన్నిస్ మెరుగుపడుతోంది. నిజానికి బాక్సర్లు, రెజ్లర్లకు ఇస్తున్నట్లుగా ప్రభుత్వం టెన్నిస్ ప్లేయర్లకు ఆర్థిక సహకారం ఇవ్వడం లేదు. టెన్నిస్‌లో సింగిల్స్ ఆటగాళ్లకు టార్గెట్ ఒలింపిక్ పోడియం (టాప్) పథకం ద్వారా చేయూతనివ్వాలి. ఎందుకంటే సింగిల్స్ ఆటగాళ్లకు సరైన అండదండలు లేవు. ‘ఐటా’ దగ్గరేమో నిధులుండవు. ప్రభుత్వం ప్రజ్నేశ్, రామ్‌కుమార్‌లకూ సాయమందిస్తే ఫలితాలు మరోలా ఉంటాయి.
>
> – మహేశ్ భూపతి, భారత నాన్‌ప్లేయింగ్ కెప్టెన్

కొచ్చి శుభారంభం



ప్రొ వాలీబాల్ లీగ్



టోర్నీ ప్రారంభోత్సవం సందర్భంగా పీవీ సింధు

కొచ్చి: తొలిసారి నిర్వహిస్తున్న ప్రొ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో కొచ్చి బ్లూ స్పైకర్స్ ఘనవిజయంతో శుభారంభం చేసింది. శనివారం ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో కొచ్చి జట్టు 15–11, 15–13, 15–8, 15–10, 5–15తో యూ ముంబా వాలీ జట్టుపై జయభేరి మోగించింది. మ్యాచ్ మొదలైన కాసేపటికే సొంతగడ్డపై కొచ్చి జోరు కూడా మొదలైంది. చూస్తుండగానే వరుస సెట్లతో మ్యాచ్‌ను గెలిచింది. 5–0తో వైట్‌వాష్ చేస్తుందనిపించింది. కానీ చివరి సెట్ చేజారడంతో 4–1 సెట్లతో గెలిచింది. దీంతో ‘వైట్‌వాష్’తో లభించే బోనస్ పాయింట్లను కోల్పోయింది. కొచ్చి జట్టులో మను జోసెఫ్ (15 పాయింట్లు) చెలరేగాడు. 14 స్పైక్ పాయింట్లతో పాటు ఒక బ్లాక్ పాయింట్ తెచ్చిపెట్టాడు. మిగతావారిలో డేవిడ్ లీ (10), రోహిత్ (8), ప్రభాకరన్ (8), అంద్రెజ్ పాటుక్ (7) రాణించారు. యూ ముంబా వాలీ జట్టులో నికోలస్ డెల్ బియాంతో 9 స్పైక్, ఒక బ్లాక్ పాయింట్‌తో మొత్తం 10 పాయింట్లు సాధించగా, సహచరుల్లో శుభమ్ చౌదరి, ప్రిన్స్ చెరో 7 పాయింట్లు చేశారు. అంతకుముందు హడావుడిగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆరు జట్ల కెప్టెన్లతో పాటు భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మైదానంలో మెరిసింది. నేడు (ఆదివారం) ఇక్కడే జరిగే లీగ్ మ్యాచ్‌లో కాలికట్ హీరోస్‌తో చెన్నై స్పార్టన్స్ తలపడుతుంది.

స్మృతి... వన్డే నంబర్ వన్



న్యూఢిల్లీ: తాజాగా ముగిసిన న్యూజిలాండ్ సిరీస్‌లో 196 పరుగులతో అదరగొట్టిన భారత డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన... ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్‌గా నిలిచింది. శనివారం విడుదల చేసిన జాబితాలో ఆమె మూడు స్థానాలు ఎగబాకి 751 పాయింట్లతో అగ్రస్థానం కైవసం చేసుకుంది. ఆస్ట్రేలియా బ్యాటర్లు ఎలీస్ పెర్రీ (681 పాయింట్లు), మెగ్ లానింగ్ (675 పాయింట్లు) వరుసగా తర్వాతి ర్యాంకుల్లో ఉన్నారు. భారత వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్ (669 పాయింట్లు) ఐదో స్థానానికి పడిపోయింది. కాగా, పురుషుల విభాగం బ్యాట్స్‌మన్ ర్యాకింగ్స్‌లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే.

శ్రీలంక 123/3

ఆస్ట్రేలియాతో రెండో టెస్టు



ప్యాటర్సన్

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక కష్టాల్లో పడింది. మ్యాచ్ రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి శ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. ఆ జట్టు మరో 411 పరుగులు వెనుకబడి ఉంది. తిరిమన్నె (41), కెప్టెన్ చండిమాల్ (15), కుశాల్ మెండిస్ (6) ఔట్ కాగా... కుశాల్ పెరీరా (11 బ్యాటింగ్), ధనంజయ డి సిల్వా (1 బ్యాటింగ్) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. నిలకడగా ఆడుతున్న సమయంలో గాయంతో ఓపెనర్ దిముత్ కరుణరత్నే (46) రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. కమిన్స్, స్టార్క్, లయన్‌లకు తలా ఒక వికెట్ దక్కింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 384/4తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌ను 5 వికెట్ల నష్టానికి 534 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కర్టిస్ ప్యాటర్సన్ (192 బంతుల్లో 114 నాటౌట్; 14 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేయగా, టిమ్ పైన్ (45 నాటౌట్) రాణించాడు.

కరుణరత్నే క్షేమం...



మైదానంలో గాయపడిన లంక బ్యాట్స్‌మన్ కరుణరత్నే ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడ్డాడు. లంక ఇన్నింగ్స్ 31వ ఓవర్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆసీస్ పేసర్ కమిన్స్ వేసిన బౌన్సర్‌ను తప్పించుకునే ప్రయత్నంలో కరుణరత్నే తలను కుడి వైపుకు తిప్పడంతో బంతి కరుణరత్నే మెడ వెనుక భాగంలో బలంగా తాకింది. ఆ దెబ్బకు అతను మైదానంలో కుప్పకూలిపోయాడు. దాంతో ఇరు జట్ల ఆటగాళ్లు ఆందోళనకు లోనయ్యారు. అయితే స్పృహలోనే ఉండి మెల్లగా మాట్లాడుతుండటంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే అతనికి ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు స్ట్రెచర్‌పై బయటకు తీసుకుపోయారు. ఆస్పత్రిలో సాయంత్రం వరకు పరిశీలనలో ఉంచిన అనంతరం కరుణరత్నేకు ప్రమాదం తప్పిందని తేలింది. దాంతో అతడిని డిశ్చార్జ్ చేశారు. మూడో రోజు అతను బ్యాటింగ్‌కు దిగుతాడా లేదని అనేదానిపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని లంక బోర్డు ప్రకటించింది.



పుజారా

వసీం జాఫర్

తొలి టైటిల్ వేటలో సౌరాష్ట్ర

- ట్రోఫీని నిలబెట్టుకునేందుకు విదర్భ
- జోరు మీదున్న పుజారా
- నేటి నుంచి రంజీ ట్రోఫీ ఫైనల్

నాగ్‌పూర్: భారత స్టార్లు చతేశ్వర్ పుజారా, ఉమేశ్ యాదవ్‌ల మధ్య ఆసక్తికర పోరుకు రంజీ ఫైనల్ వేదిక కానుంది. నేటి నుంచి సౌరాష్ట్ర, డిఫెండింగ్ చాంపియన్ విదర్భ జట్ల మధ్య టైటిల్ పోరు జరగనుంది. విదర్భ జట్టు వసీమ్ జాఫర్ అండతో వరుసగా రెండో టైటిల్ సాధించాలని భావిస్తుండగా... పుజారా అందుబాటులో ఉన్న సౌరాష్ట్ర ఈ సారైన విజేతగా నిలవాలని ఆశిస్తోంది. గతంలో ఈ జట్టు 2012–13, 2015–16 సీజన్లలో ఫైనల్ చేరినా... ఈ రెండు సార్లు ముంబై ధాటికి రన్నరప్‌గా సంతృప్తి పడింది. ఈ సారి ముంబై ‘ఫోబియా’ లేదు. దీంతో ముచ్చటగా మూడో ప్రయత్నంలోనైనా రంజీ కలను నెరవేర్చుకోవాలనే పట్టుదలతో సౌరాష్ట్ర ఉంది. ఈ జట్టు ఆశలన్నీ పుజారాపైనే పెట్టుకుంది. ఆస్ట్రేలియా పర్యటన మొదలు ఇప్పటివరకు అతని జోరు అద్భుతంగా కొనసాగుతోంది. కర్ణాటకతో జరిగిన సెమీస్‌లో క్లిష్ట పరిస్థితిలో బ్యాటింగ్‌కు దిగిన పుజారా విలువైన శతకంతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఈ జట్టుకు 9వ నంబర్ ఆటగాడి వరకు బ్యాటింగ్ చేసే సత్తా ఉంది. మరోవైపు వెటరన్ వసీం జాఫర్ ఫామ్‌తో విదర్భ పటిష్టంగా ఉంది. దేశవాళీ క్రికెట్‌లో నిలకడకు మారుపేరైన జాఫర్ ఇప్పటికే 1003 పరుగులు చేశాడు. ఇందులో డబుల్ సెంచరీ సహా నాలుగు శతకాలున్నాయి. జట్టుకు అతనే బలం. అతను క్రీజులో నిలబడితే ప్రత్యర్థులకు కష్టాలు తప్పవు. ఈ జట్టులోనూ టెయిలెండర్లు సైతం పరుగులు జతచేయగలరు. గత 10 మ్యాచ్‌ల్లో తుది జట్టులో ఎనిమిది మంది బ్యాట్స్‌మెన్ 30 పైచిలుకు సగటును నమోదు చేశారు. జాఫర్‌తో పాటు కెప్టెన్ ఫైజ్ ఫజల్ (786 పరుగులు), యువ బ్యాట్స్‌మన్ అక్షయ్ వాడ్కర్ (680) చక్కని ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో ఉమేశ్ యాదవ్ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తిస్తున్నాడు. గత రెండు మ్యాచ్‌ల్లోనే 21 వికెట్లు పడగొట్టాడు. ఈ నేపథ్యంలో రెండు దీటైన జట్ల మధ్య హోరాహోరీ సమరం జరిగే అవకాశముంది.

ఉ.గం.9.30నుంచి స్టార్ స్పోర్ట్స్ 2లో ప్రత్యక్ష ప్రసారం

మిల్లర్ మెరుపు ఫీల్డింగ్

తొలి టి20లో దక్షిణాఫ్రికా విజయం

కేప్‌టౌన్: మైదానంలో నాలుగు క్యాచ్‌లు...రెండు రనౌట్‌లు... తొలి టి20లో దక్షిణాఫ్రికా క్రికెటర్ డేవిడ్ మిల్లర్ ప్రదర్శన ఇది. ఆరుగురు పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన మిల్లర్ ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచాడు. అతని ఫీల్డింగ్ నైపుణ్యంతో శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ (45 బంతుల్లో 78; 6 ఫోర్లు, 4 సిక్సర్లు), రీజా హెన్‌డ్రిక్స్ (41 బంతుల్లో 74; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీలతో సత్తా చాటారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 73 బంతుల్లోనే 131 పరుగులు జోడించడం విశేషం. ఉస్మాన్ షిన్వారికి 3 వికెట్లు దక్కాయి. అనంతరం పాకిస్తాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 186 పరుగులు చేయగలిగింది. కెప్టెన్ షోయబ్ మాలిక్ (31 బంతుల్లో 49; 5 ఫోర్లు, 1 సిక్స్), హుస్సేన్ తలత్ (32 బంతుల్లో 40; 5 ఫోర్లు), బాబర్ ఆజమ్ (27 బంతుల్లో 38; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.



మిల్లర్‌ను అభినందిస్తున్న క్లాసెన్

ఐర్లాండ్- భారత్ హాకీ మ్యాచ్ డ్రా

మర్సియా (స్పెయిన్): రెండో భాగంలో దక్కిన ఆధిక్యాన్ని చేజార్చుకున్న భారత హాకీ మహిళల జట్టు... ఐర్లాండ్‌తో శనివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌ను 1–1తో డ్రాగా ముగించి సంతృప్తిపడింది. భారత్ తరఫున 18వ నిమిషంలో డ్రాగ్ ఫ్లికర్ గుర్జీత్ కౌర్ గోల్ కొట్టింది. సమష్టిగా కదులుతూ ఈ ఆధిక్యాన్ని మన జట్టు చాలాసేపు కాపాడుకుని గెలిచేలా కనిపించింది. అయితే, 45వ నిమిషంలో ఐర్లాండ్ క్రీడాకారిణి సరా హక్‌షా గోల్ కొట్టి స్కోరును సమం చేసింది. ఇక్కడినుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆఖర్లో భారత గోల్ కీపర్ సవిత అద్భుతంగా స్పందించి పెనాల్టీ కార్నర్‌ను అడ్డుకుని ప్రత్యర్థిది పైచేయి కాకుండా చూసింది. సిరీస్‌లో చివరిదైన రెండో మ్యాచ్ నేడు జరుగనుంది.

విండీస్‌కు ఆధిక్యం

నార్త్‌సౌండ్: మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ డారెన్ బ్రేవో (216 బంతుల్లో 50; 2 ఫోర్లు, 1 సిక్స్) అపరిమిత సహనంతో నిలిచి ఇంగ్లండ్‌తో ఇక్కడ జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందించాడు. అతడికి... డౌరిచ్ (31), కెప్టెన్ హోల్డర్ (22) సహకరించడంతో మూడో రోజు లంచ్‌కు ముందు విండీస్ 306 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు బ్రాత్‌వైట్ (49), కాంప్‌బెల్ (47), షైహోప్ (44) రాణించారు. దీంతో ఆతిథ్య జట్టుకు 119 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ కడపటి వార్తలు అందేసరికి 3 వికెట్లు నష్టపోయి 59 పరుగులు చేసింది. మరో 60 పరుగులు వెనుకబడి ఉంది. శనివారం తల్లి చనిపోయిన బాధను దిగమింగి విండీస్ పేసర్ అల్జారీ జోసెఫ్ బ్యాటింగ్‌కు దిగడం అందరినీ కదిలించింది.

జనసేన పార్టీ స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: శాసనసభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికకు జనసేన పార్టీ ఐదుగురు సభ్యులతో స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన తరపున పోటీచేయాలని ముందుకు వస్తున్న ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని కూలంకషంగా పరిశీలించి ఆ వివరాలను పార్టీ జనరల్ బాడీ ముందు ఉంచడం స్క్రీనింగ్ కమిటీ ప్రధాన లక్ష్యం. కమిటీలో సభ్యులుగా మాదాసు గంగాధరం, అరహం ఖాన్, హరిప్రసాద్, మహేందర్‌రెడ్డి, శివశంకర్ నియమితులయ్యారు.


నచ్చిన వారికి మెచ్చినంత!

ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థలో ఉన్నతాధికారి ఇష్టారాజ్యం

- ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండా అడ్డగోలుగా నియామకాలు
- నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు సిబ్బందికి కీలక బాధ్యతలు
- రెగ్యులర్ పోస్టుల భర్తీకి చర్యలు శూన్యం
- ఏపీఎండీసీలో సాగుతున్న తంతుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

సాక్షి, అమరావతి: పేరుకు అదో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ. కానీ పారదర్శకతకు, ప్రభుత్వ నిబంధనలకు అక్కడ చోటే లేదు. మేనేజింగ్ డైరెక్టర్ మాటే వేదం. ఆయన ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండా తనకు కావాల్సిన వారికి ముఖ్యమైన కాంట్రాక్టు పోస్టులిచ్చేస్తుంటాడు. అందులో తనకు నచ్చిన వారికి మెచ్చినంత వేతనం కూడా.. ఇదీ ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)లో సాగుతున్న తంతు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ముసుగులో ఒకే సామాజికవర్గం వారికి భారీగా పోస్టులు కట్టబెట్టారు. అత్యధిక పారితోషికమిచ్చే కాంట్రాక్టు పోస్టుల్లో దాదాపు ఒకే సామాజిక వర్గం వారే ఉన్నారని.. తమపై పెత్తనం చెలాయిస్తున్నారని మరోవైపు రెగ్యులర్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు పాతర..
ముఖ్యమైన పోస్టుల్లో కాంట్రాక్టు సిబ్బందిని పెట్టకూడదంటూ ప్రభుత్వ నిబంధనలున్నాయి. దీన్ని కాలరాస్తూ ఏపీఎండీసీలో పలు కీలక(కోర్) పోస్టుల్లో కాంట్రాక్టు సిబ్బందిని పెట్టారు. రెగ్యులర్ సిబ్బందిపై ఈ కాంట్రాక్టు సిబ్బంది పెత్తనం చెలాయిస్తున్నారు. మేనేజింగ్ డైరెక్టర్ అండదండలుండటంతో రెగ్యులర్ సిబ్బంది ఏమీ మాట్లాడలేక మౌనంగా భరిస్తున్నారు. ఏ సంస్థలో అయినా మానవ వనరుల అభివృద్ధి విభాగం చాలా ముఖ్యమైనది. ఉద్యోగుల పనితీరుపై రికార్డులు రూపొందించడం, నిర్వహించడం ఈ విభాగం బాధ్యతల్లో ముఖ్యమైనవి. ఉద్యోగుల పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, బదిలీల సమయంలో కూడా ఈ విభాగం నివేదికలకు ప్రాధాన్యముంటుంది. ఇంతటి కీలక విభాగం జనరల్ మేనేజరు(జీఎం, హెచ్‌ఆర్‌డీ) బాధ్యతలను రెండేళ్లుగా ఎ.వెంకటేశ్వరరావు అనే కాంట్రాక్టు ఉద్యోగికి అప్పగించారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా నియమించిన ఈ ఉద్యోగికి నెలకు రూ.లక్ష పారితోషికం చెల్లిస్తుండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



ఏ సంస్థలో లేనివిధంగా..
రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థలో కూడా ఇంత అడ్డగోలుగా అధిక పారితోషికంతో కాంట్రాక్టు సిబ్బందిని నియమించిన దాఖలాల్లేవు. ఏ సంస్థలోనైనా పెద్ద పోస్టుల్లో పనిచేసే సిబ్బంది కొరత ఉంటే.. ప్రభుత్వం నుంచి డిప్యుటేషన్‌పై తెచ్చుకోవాలి. ఖాళీల గురించి ప్రభుత్వానికి సిఫారసు చేసి భర్తీ చేయించుకోవాలి. ఏపీఎండీసీలో భారీగా పోస్టులు ఖాళీగా ఉన్నా.. వీటిని భర్తీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా డిప్యుటేషన్‌పై కూడా తెచ్చుకోవడం లేదు. నిబంధనలను గాలికొదిలేసి అత్యధిక పారితోషికంతో నచ్చిన వారిని నియమించుకున్నారు. సంస్థ ఉన్నతాధికారి సామాజిక వర్గం వారే వీరిలో ఎక్కువగా ఉన్నారు. పైగా కీలక పోస్టుల్లో వీరిని పెట్టారు. కోల్(బొగ్గు)కు సంబంధించిన జనరల్ మేనేజర్ (జీఎం) పోస్టు అత్యంత కీలకమైనది. రూ.వేల కోట్ల లావాదేవీలకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించే జీఎం పోస్టులో కాంట్రాక్టు ఉద్యోగి అనంతనేని లక్ష్మణరావును నియమించారు. నెలకు రూ.లక్ష పారితోషికంతో రెండేళ్లుగా ఆయన ఈ స్థానంలో ఉన్నారు. ఎన్.వెంకటేశ్వరరావు అనే మరో కాంట్రాక్టు ఉద్యోగిని బొగ్గు విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా రెండేళ్లుగా కొనసాగిస్తునే ఉన్నారు. ఇలాంటి కీలక పోస్టులన్నీ ఇష్టారీతిన అప్పగించేశారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

భారీ పారితోషికంతో నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులు

పేరు	హోదా	నెలసరి పారితోషికం (రూపాయల్లో)
ఎ.వెంకటేశ్వరరావు	జీఎం (హెచ్ఆర్డీ)	1,00,000
అనంతనేని లక్ష్మణరావు	జీఎం (కోల్)	1,00,000
ఎం.గాయత్రి	స్కూల్ (కన్సల్టెంట్)	75,000
ఎన్.వెంకటేశ్వరరావు	డిప్యూటీ జీఎం (కోల్)	70,000
పి.శివరామకృష్ణ	మేనేజర్ (జియాలజీ)	50,000

ఖాళీల భర్తీకి చర్యలేవీ?

ఏపీఎండీసీలో 481 మంది ఉద్యోగులుండాలి. కానీ ప్రస్తుతం 128 మందే ఉన్నారు. మరో 353 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 'బాబు వస్తేనే జాబు' అంటూ 2014 ఎన్నికల ముందు భారీగా ప్రచారం చేసుకొని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఆ తర్వాత ఆయన కార్యాలయంలో పనిచేసే వెంకయ్య చౌదరినే ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పంపించారు. ఈ నాలుగున్నరేళ్లలో ఆ ఒక్క పోస్టును కూడా శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయలేదు. ఈ సంస్థలో ఏకంగా 643 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పనిచేయిస్తుండటం గమనార్హం. మరోవైపు పారదర్శకంగా వ్యవహారాలు సాగుతున్నాయని ఏపీఎండీసీ ఉన్నతాధికారులు చెబుతుండగా.. వాస్తవం పూర్తి భిన్నంగా ఉంది. అధిక పారితోషికమిచ్చే పోస్టుల భర్తీకి ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయకపోవడమే పారదర్శకతకు పాతరేశారనేందుకు నిదర్శనమని పలువురు సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాహుల్‌కు ఊడిగం చేస్తున్న బాబు

- నాడు సోనియా దెయ్యం.. ఇప్పుడు దేవత అయ్యిందా?
- సీఎంపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆగ్రహం
- చంద్రబాబు మతిస్థిమితం కోల్పోతున్నారని ఎద్దేవా



దేవీచౌక్ (రాజమహేంద్రవరం): 'అసెంబ్లీలో ఒక ఎమ్మెల్యేను పట్టుకుని 'నీకు రోషం లేదా? కేంద్రానికి మీరు ఊడిగం చేస్తుంటే నా రక్తం పొంగిపోతోందని గగ్గోలు పెడుతున్న ఈ పెద్ద మనిషి.. రాహుల్‌గాంధీకి ఊడిగం చేస్తున్నారు.' అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్యమంత్రి చంద్రబాబుపై మండిపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు సోనియాను దెయ్యం అని వర్ణించిన నోటితోనే నేడు ఆమెను దేవత అంటున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబుకు మూలాధార చక్రం సరిగా పని చేయడం లేదేమో! ఆయన మతిస్థిమితం కోల్పోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రత్యేక ప్యాకేజీకి ధన్యవాదాలు తెలుపుతూ అసెంబ్లీలో తీర్మానాలు చేసి, ఇప్పుడు ప్రత్యేక హోదా కావాలని తీర్మానాలు చేయడం విడ్డూరమన్నారు. అసెంబ్లీలో ఇచ్చిన నోట్ ప్రకారం కేంద్ర నిధులు సరిగా ఖర్చు చేసినందుకు కేంద్రం 671 బహుమతులు ఇచ్చిందంటున్నారని, ఇక ఏ మొహంపెట్టుకొని కేంద్రం ఆదుకోవడం లేదంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలో 4 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం రూ.3 లక్షల కోట్లు ఇచ్చినట్టు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారన్నారు. ఆయన ప్రకటనలో అవాస్తవాలుంటే, ఏ స్వతంత్ర సంస్థతోనైనా దర్యాప్తు చేయించుకోవచ్చునని సవాల్ విసిరితే ముఖ్యమంత్రి స్పందించలేదన్నారు.

రాష్ట్రాన్ని మోదీయే నడిపిస్తున్నారు..
రాష్ట్రంలో చెరువులు తవ్వడానికి కేంద్రం రూ.16 వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకానికి చంద్రన్న చికిత్సాలయాలని చంద్రబాబు పేరు పెట్టుకున్నారని, ఈ రాష్ట్రాన్ని మోదీయే నడిపిస్తున్నారని చెప్పారు. ''అసెంబ్లీలో మా పార్టీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును బెదిరించడం, కాకినాడలో మా కార్యకర్తను 'నాతో పెట్టుకుంటే ఫినిష్ అయిపోతావు' అని బెదిరించడం జాతీయ చానెళ్లలో దేశమంతా చూసిందన్నారు. తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకూ మేలు చేస్తుందని, ముఖ్యంగా ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులకు ఆదాయపు పన్ను భారం తగ్గుతుందని సోము వీర్రాజు అభిప్రాయపడ్డారు. రైతుల ఖాతాల్లో నేరుగా సొమ్ము జమ చేయడం వలన వ్యవసాయ రంగం పుంజుకుంటుందన్నారు. బడ్జెట్ వలన రాష్ట్రంలో 50 లక్షల మంది ఉద్యోగులకు, 40 లక్షల మంది రైతులకు ఊరట కలుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గరిమెళ్ల చిట్టిబాబు, బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలపై బాబుది కపట ప్రేమ'

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలపై చూపుతున్నది కపటప్రేమేనని బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ విమర్శించారు. చంద్రబాబు తన పాలనలో బీసీలను దారుణంగా వంచించారని మండిపడ్డారు. విజయవాడలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జయహో బీసీ పేరుతో మరోసారి మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బీసీల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న చంద్రబాబు ఐదు రాజ్యసభ సీట్లలో ఒక్కటీ ఆ వర్గాలకు కేటాయించలేదన్నారు. శాసనసభ స్థానాల విషయంలోనూ జనాభా ప్రకారం కేటాయిస్తానని చెప్పి మొండిచెయ్యి చూపారన్నారు. న్యాయమూర్తులుగా బీసీలు పనికి రారని చెప్పిన చంద్రబాబును తాము నమ్మలేమన్నారు. సామాజిక వివక్షను బట్టి కులాలను బీసీల్లో చేర్చాలని రాజ్యాంగం చెబుతుంటే అందుకు భిన్నంగా ఆర్థిక వెనుకబాటు ఆధారంగా టీడీపీ కొందరిని బీసీ జాబితాలోకి చేర్చటం దుర్మార్గమన్నారు. 2014 ఎన్నికల్లో ఆరు వందల హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. బీసీలను అణిచివేసిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

బీజేపీ ఎన్నికల కమిటీ నియామకం

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీని 11 మంది సభ్యు లతో పార్టీ అధ్యక్షుడు కన్నా ఏర్పాటు చేశారు. సోము వీర్రాజు చైర్మనుగా, జీవీఎల్ నరసింహారావు, షేక్ మస్తాన్, పీవీఎన్ మాధవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, షేక్ బాజీ, విల్సన్, శివనాగేంద్ర, వెంకట చైతన్య, సాంబశివరావు, రఘునాథబాబు లను సభ్యులుగా నియమించారు.

ఇచ్చినట్టే ఇచ్చి ఆపేశారు!

కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్స్ పదోన్నతులకు బ్రేక్

- ఒక వైపు సన్మానాలు చేయించుకుని.. మరోవైపు సీనియారిటీ చిక్కుముడి
- 2,585 మందికి ప్రమోషన్లు ఆపాలని పోలీస్ ప్రధాన కార్యాలయం ఆదేశాలు
- 2018 డిసెంబర్ 28న పదోన్నతుల జీవో
- సీనియారిటీ ప్రకటించే వరకు ఆపాలంటూ మళ్లీ ఉత్తర్వులు
- పదోన్నతులు ఇచ్చినట్టే ఇచ్చి అడ్డంకులు కల్పించడంపై కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్ల ఆగ్రహం

సాక్షి, అమరావతి: పోలీస్ పదోన్నతులకు బ్రేక్ పడింది. పదోన్నతులు ఇచ్చినట్టే ఇచ్చి ఆపడం దుర్మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఖాకీలు మండిపడుతున్నారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు పోలీసు పదోన్నతులు ఆపాలంటూ పోలీస్ ప్రధాన కార్యాలయం ఇచ్చిన ఉత్తర్వులు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పదోన్నతులపై చంద్రబాబు సర్కారు తీరు నోటితో చెప్పి నొసటితో వెక్కిరించినట్టు ఉందని పోలీసులు వాపోతున్నారు. పదోన్నతులు ఇచ్చి సన్మానాలు చేయించుకున్న చంద్రబాబు వాటిని ఆపాలని అధికారులతో ఆదేశాలిప్పించడం కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లకు పిడుగుపాటుగా మారింది. దీంతో చంద్రబాబును సన్మానించి కీర్తించిన 2,585 మంది పోలీసులే ఇప్పుడు కారాలు, మిరియాలు నూరుతున్నారు.

సన్మానాలు.. పొగడ్తలు: రాష్ట్రంలో 2019 మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగాను, 566 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతులిస్తూ గతేడాది డిసెంబర్ 28న ప్రభుత్వం జీవో 202 ఇచ్చింది. దశాబ్దాలుగా నిరాశలో ఉన్న పోలీసులకు పదోన్నతుల కబురు ఆనందోత్సాహాలను నింపింది. దీన్ని అవకాశంగా తీసుకుని ఇంటెలిజెన్స్ డైరెక్షన్‌లో పదోన్నతి పొందిన పోలీసుల ఆధ్వర్యంలో అని చెప్పి విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో డిసెంబర్ 31న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన సన్మానం చేశారు. ఇందులో ప్రకర్షల నుంచి వక్తల వరకు అన్నీ ఇంటెలిజెన్స్ డైరెక్షన్‌లో 'థాంక్యూ సీఎం సార్' అంటూ పొగడ్తలతో పోలీస్ శాఖ వైఖరికి భిన్నంగా వ్యవహరించారు. పోస్టింగ్‌లు ఇచ్చే కార్యక్రమం దాదాపు అన్ని జిల్లాల్లో మొదలైంది. ఇదే తరుణంలో పదోన్నతుల ప్రక్రియ నిలుపుదల చేయాలంటూ డీజీపీ కార్యాలయంలోని ట్రైనింగ్ అండ్ పోస్టింగ్స్ ఏడీజీ శ్రీధర్ ఉత్తర్వులిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ మాన్యువల్ (ఏపీపీఎం) ప్రకారం ఏటా జనవరి 1వ తేదీకి పోలీస్ కానిస్టేబుల్స్ సీనియారిటీ జాబితాను ప్రకటించాలని ఆయన సూచించాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ పోలీస్ కానిస్టేబుల్స్ సీనియారిటీ జాబితాను ఖరారు చేయకపోవడంతో పదోన్నతులు ఆపాలని ఆయన ఆదేశాల్లో పేర్కొనడం గమనార్హం. జనవరి 1న కొత్తగా సీనియారిటీ జాబితా సిద్ధం చేశాకే పదోన్నతులు అమలు చేయాల్సి ఉందని చంద్రబాబు సర్కారుకు తెలియదా? అని కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల తరబడి పోరాటంతో తాము సాధించుకున్న పదోన్నతులు జనవరి 1 సీనియారిటీ జాబితా ప్రకారం సజావుగా సాగితే బాగానే ఉంటుందని, ఏదైనా అవాంతరం ఏర్పడితే తమ పరిస్థితి ఏమిటని వాపోతున్నారు. పదోన్నతుల్లో తమకు నష్టం కలిగితే చంద్రబాబు ఎన్నికల జిమ్మిక్కుల్లో చిక్కుకుని తాము కూడా నష్టపోతామని పోలీసులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని సజావుగా అమలు చేసేలా సీనియారిటీ మెలిక పెట్టకుండా పదోన్నతులను అమలు చేయాలని కోరుతున్నారు.

టిక్కెట్ల కోసం 7 నుంచి దరఖాస్తుల స్వీకరణ

పీసీసీ చీఫ్ రఘువీరా వెల్లడి

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న వారి నుంచి ఈనెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి వెల్లడించారు. విజయవాడలో మూడు రోజుల పాటు పీసీసీ కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను రఘువీరారెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు. ఆశావహులు దరఖాస్తులను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇవ్వాలన్నారు. ఈ నెలాఖరులోగా కేంద్ర ఎన్నికల కమిటీ అభ్యర్థులను ప్రకటిస్తుందన్నారు. కాగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా భరోసా పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల రెండవ వారం నుంచి బస్సు యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతపురం నుండి శ్రీకాకుళం వరకు అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 3-2-2019

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



ఏ బాదరాబంధీ లేని 34, Ltd కంపెనీలో 45,000 P/Month, OC, ఆస్థి, కుల పట్టింపులు లేని వరుడికి వధువు కావలెను. డైరెక్ట్ పర్సన్స్ సంప్ర : 81063 84975. [V- 13659]

ఆర్యవైశ్య/డైవర్సీ/39/ 5'6"/ B.Com /బిజినెస్/ నెలసరి ఆదాయం 1 లక్ష/ ఫిట్‌నెస్ గల వరునికి Any Forward Caste / దైవగుణాలు కలిగిన శ్రీ గురుదత్తా భక్తురాలు కావలెను. (Direct) 9440919030 [HA-661800]

గౌడ/28 /5'6" /B.Tech / MS Mining Canada * 35/ 5'3"/B.Tech Green Card / London * 29/5'5"/ B.Tech / MBA / Working Permit / Australia అబ్బాయిలకు అమ్మాయిలు కావలెను. సం॥ శుభమస్తు, 8790690309 [HA-21935]

కుల పట్టింపులేదు/36 /5'7" /డిప్లోమా/ బిజినెస్/5 L (PA)/ 50 L Property వరునికి అందమైన 1st/2nd వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్ర. 9885445759 / 6301548446 [HA-21935]

క్రిస్టియన్ మాదిగ / B.Tech / C. Govt. Sr. టెక్నికల్ ఇంజనీర్/ DRDL / 50,000/- PM /5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9908222406 [HA-21938]

CNB కమ్మ / 28/MCA/ 55K / 35K / 3 Cr ప్రాపర్టీ/ 5'9" / ఇద్దరి అబ్బాయిలకి కుల ప్రసక్తి లేకుండా OC /BC అమ్మాయిలు కావలెను. ఫోన్: 9014373917/8801156729 [HA-21938]

హిందు మాల/ M.Tech / IIT/ C. Govt. JTO / BSNL / 60,000/- PM / 6' ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 9966760501 [HA-21938]

FREE GOLD 50 GRAMS (or) KWID CAR FC / LATE MARRIAGE / 36 Y / 5.8" NO BAD HABITS / BA / FAIR & SLIM / WELL SETTLED - OC, BC, CNB / NO DOWRY / BRIDE WANTED VERY BEAUTIFUL/ TRADITIONAL / VERY URGENT/ DIRECT/ PHOTOS & DETAILS Mail: drmgl01@ gmail.com, Whatsapp: 7036551071. [Z-676898]

★★

సున్నీ ముస్లిం, 70Y, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, పెన్షన్ 35వేలు, ఒంటరి వరునకు సున్నీ ముస్లిం వధువు జాబ్, ఆస్తి ఉన్న వారు కావాలి. ఏజ్ నో బార్. ✆ 70135 92689. [B-0673656]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015 Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/MBBS (OSM)MD/ Gen-Med/V. Smart Boy/ Rich / 29/5'10" * Cont: K.C. Reddy Mar Bureu, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech / MS/ Industrialist / Hyd/ 31/5'8"/100 Cr + * Cont: K.C. Reddy Mar Bureu, B. Hills, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech / MS/ USA / 30/5'8"/ 100 Cr * Cont: K.C. Reddy Mar Bureu, Banjara Hills, Road No. 3, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBA / Good Business / 27/5'11"/ V. Smart / 350 Cr * MS / 28/6'/200 Cr/ Hyd * 29/6'/300 Cr * 30/6'/200 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech / MS/29/5'10"/100 Cr * MS/30/ 5'8"/100 Cr *MBA / 31/5'11"/350 Cr / Hyd * 25/5'10"/100 Cr * 29/6'/50 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech /H1/USA/230K/ Microsoft / 29/5'8"/ * MS/28/5'11"/20 Cr * 30/ 5'11"/ 200K * 28/5'10"/ I 140/140K * Cont: K.C. Reddy, Ph: 9849321309

Reddy/MBA/ Very Good Business / 26/5'11"/ 350 Cr / Hyd * MS /27/6'/200 Cr * 28/6'/300 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech IIT/ M.Tech/ IIT/ 29/5'11" * 30/5'7"/35L/ Yr * NIT / 30/5'9"/26 l / Yr/ Hyd * 28/5'10"/40L /Yr/ 15 Cr * Cont: K.C. Reddy Ph: 9849321309/9347807015

Reddy/B.Tech / MS /H1/USA/28/ 5'9"/ GC/ 140/90K /10 Cr *25/6'/120K/ 30 Cr * 30/5'11"/200K * Cont: K.C. Reddy, Hyd- Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG * 29/5'7"/50 Cr * 29/ 6'/75 Cr * 28/6'/20 Cr*28/5'10"/10 Cr* 28/ 5'9"/25 Cr * Cont: K.C. Reddy B. Hills, Hyd- Ph: 9849321309/9347807015 [D-014]

వరుడు కావలెను

Reddy/MBA/Very Smart / 31/5'2 1/2"/ 150 Cr (her Share) * Cont: K.C. Reddy-Mar-Bureu, B. Hills, Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / MS/H1/Beautiful/ 27/5'5"/ 20 Cr her Share * Cont: K.C. Reddy-Mar-Bureu, B. Hills, Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/USA Citizen/ MBBS/ Res-Doc * 31/5'6" (Surgery) * 28/5'5" * 27/5'7"/ 50Cr * 27/5'4"/50 Cr * Cont: K.C. Reddy, Hyd, Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/ MBA/ 29/5'3"/ Father Very Big (Famous) Builder / Hyd/ Richest * Cont: K.C. Reddy, Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/MBA / 26/5'4"/300 Cr * 27/5'6"/100 Cr * 24/5'6"/150 Cr * 23/5'6"/ 60 Cr * 28 / 5'3" / 50 Cr *28/5'5"/50 Cr * 30/5'21/2"/ 100 Cr*Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/MBBS / 22/5'3"/40 Cr * 22/ 5'5"/ 30 Cr* MS/ 31/5'4"/50 Cr * MD / 30/ 5'8"/500 Cr* Cont: K.C. Reddy - Mar-Bureau, Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / SWE / INDIA * 24/5'5"/30 Cr* 28/5'5"/50 Cr * 26/5' 3 1/2"/40 Cr *27/5'5"/20 Cr * 28/5'3"/20 Cr * 28/5'3"/40 Cr * Cont: K.C. Reddy - Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/28/5'3'/20 Cr * 28/5'3"/10 Cr * 25/5'6"/50 Cr * 27/5'8"/50 Cr * 26/5'5"/50 Cr * 23/5'3"/CA/ 20 Cr * 26/5'4"/10 Cr * Cont: K.C. Reddy - Hyd Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / MS/ H1/USA * 24/5'3"/10 Cr * 26/5'7"/30 Cr* 28/5'4"/30 Cr *25/5'4"/ 25 cr * 26/'5'5"/10 cr * 26/5'3 1/2"/40 Cr * Cont: K.C. Reddy, Hyd Ph: 9849321309

Reddy/BTech / M.Tech/ 25/5'6"/60 Cr * 25/5'4"/20 Cr * 31/5'4"/70 Cr * 28/5'3"/10 Cr * 29/5'3"/50 Cr * 26/5'5"/10 Cr *Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309, 9347807015

B.Sc., B.Ed., 35 సం॥ల వరునికి కుల ప్రసక్తి లేని స్థిరపడిన వధువు కావ లెను. వయస్సు ప్రసక్తి లేదు. 1st & 2nd అయినా OK. డైరెక్ట్: 7702284427. [C-666270]

వైశ్య: OC, 50Y, ఎత్తు: 5'11", MBA, విడోయర్, గుడ్ లుకింగ్, పిల్లలు లేని వరునికి ఉన్నతస్థాయి రిచ్ వధువు మాత్రమే సంప్రదించండి. కులపట్టింపు లేదు. డైరెక్ట్ ✆ 99481 55372, 9396990103. [B-673588]

SC-48Y; 5.6 H, సొంత బిజినెస్ కలిగిన వరుడుకి మంచి నడవడిక కలిగిన ఏ బాదరబందిలేని చదువుతో నిమిత్తం లేని విడో/డైవర్స్, పెళ్ళి/తోడుకై వధువు కావలెను. డైరెక్ట్ కాల్ ✆ 91334 22494 [R-883063]

క్రిస్టియన్ / మాదిగ /Govt. N.V.D.C. Employee / 55,000/- PM / వెల్ సెటిల్డ్ గల వరుడుకి వధువు కావలెను. ఫోన్: 6302280758 [HA-661400]

క్రిస్టియన్ మాల /32 Yrs / 5'6" / BSc / Govt. Employee / 52,000/- PM / వెల్ సెటిల్డ్ గల వరుడికి వధువు కావలెను. ఫోన్: 7661940891 [HA-661400]

క్రిస్టియన్ / మాల/ 32 Yrs / 5'6"/ B.Tech/ Govt. Employee / 50,000/- PM / గల వరుడుకి వధువు కావలెను. ఫోన్: 6309297243 [HA-661400]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Canada, PG, 28, 5'7", Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 32, 5'10" USA, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE(IIT), MBA, 26, 5'10", 150 K, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5'11", Doctor, 10 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MBA, 26, 5'5 Hyderabad, Fair & slim, Avinash, Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5'3", 9 Crores, SWE, USA, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5'4", Rich, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5'5", H1, SWE, 10 Crores, USA, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 26, 5'11", 90 K, 2 Crores, SWE, USA, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Rayalseema, BE, MS, 26, 5'10", USA, 120 K, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5'11", H1, 100 K, USA, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA 27, 5'9", Manager, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5'3", Hyderabad, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 25, 5'8", Sr Analyst, 12 L P/A, Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి CA, 27, 5'6", 5 Crores, Hyderabad, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 26, 5'6", Doctor, Hyderabad Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

వరుడు కావలెను



ముదిరాజ్/లేట్ మ్యారేజ్/30 Y /5'4"/ Govt. నర్స్/9 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9908000566 [HA-661227]

SC మాల/28 Y /5'5"/ M.Tech / ECE/ గల అందమైన వధువుకు సాంప్రదాయ కుటుంబానికి చెందిన తగిన వరుడు కావలెను. Ph: 9618411387/9121030017 [HA-661227]

కుల పట్టింపులేదు రెడ్డి/40 Yrs /5'5"/ 2nd మ్యారేజ్/ MA BEd/ Govt. టీచర్ (HM) / 75K (PM) (తండ్రి & తల్లి Late) పిల్లలు లేని అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (ఇల్లరికంOk) Ph: 7893688483 [HA-661227]

కాపు విడో/కుల, మత, ఆస్తి పట్టింపు లేదు/ 10 కోట్ల ఆస్తి /H:5'2"/ Q: Inter / A: 29/ C: V. Fair / నెలకు 5 లక్షల సంపాదన కల్గిన వధువుకి మంచి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) Ph: 9581690158 [HA-661227]

క్రిస్టియన్ మాల/Govt. Asst. Manager (ఆంధ్రా బ్యాంక్) /40,000/- PM / B.Tech / 24 సం॥ అమ్మాయికి తగిన అబ్బాయి కావలెను. 9642728299 [HA-21935]

రెడ్డి/విడో/30/5'5"/MBA, BEd / Govt. టీచర్ / 60,000/- PM / 7 Cr ప్రాపర్టీ/ ఈమధ్యనే ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు కుల/ఆస్తి ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు కావలెను. 6309069291 [HA-21935]

రెడ్డి/విడో/42/5'4"/BSc / రియల్ ఎస్టేట్ బిజినెస్/ 50,000/- PM (రెంట్లు) 4 Cr ప్రాపర్టీ/ సాంప్రదాయక వధువుకు కుల,ఆస్తి ప్రసక్తిలేని బిజినెస్/ వ్యాపారం వరుడు కూడా (Ok) Ph: 8106273164 [HA-21935]

SC మాల /23/5'5"/Fair / B.Tech (NIT) AEE / Irrigation Department /40,000/- PM అందమైన సాంప్రదాయ కుటుంబపు వధువుకు అందమైన వరుడు కావలెను. 7207041141 [HA-21935]

కుల పట్టింపులేదు /(2nd మ్యారేజ్) 42 / 5'3"/ డిగ్రీ/BEd / స్కూల్ అసిస్టెంట్/Govt. జాబ్ / 30 వేలు PM / ఓన్ హౌస్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9573736895/8978894043 [HA-21938]

లంబాడి /B.Tech / C. Govt. సైంటిస్ట్ /ISRO / 50,000/- PM /5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9966760501 [HA-21938]

గౌడ /B.Tech / C. Govt. Asst. మేనేజర్/ సిండికేట్ బ్యాంక్/ 55,000/- PM /5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8008939651 [HA-21938]

Mala Christian 36, 5'4" fair MBA. well settled family seaks Any government / private engineer, doctors, PG. Contact : 98490 72372, 94901 32276 [V- 1166]

★★

కమ్మ: విడో, 24Y, B.Tech, 22 కోట్ల స్థిరాస్తి కలిగి పేరెంట్స్ లేని వధువుకు వరుడు కావలెను. (ఆస్థి, కులప్రసక్తి లేదు) Send Photos. Whatsapp. 90304 58459 [B-0943762]

29 సం॥లు / B.Tech చదివిన ప్రభుత్వ ఉద్యోగినికి Govt./Pvt. / B.Tech / M.Tech/లెక్చరర్ / ప్రొఫెసర్/బ్యాంక్ ఎంప్లాయ్-ముస్లిం షేక్/5.7 వరుడు కావలెను. 91601 93211 [L- 701505]

ఆర్యవైశ్య 28, 38, 42, 45 చక్కటి అమ్మాయిలకు వరులు కావలెను. ఆర్యవైశ్య మ్యారేజ్‌బ్యూరో, 189, సాయిరాం వీధి, తిరుపతి, ఆదివారం 10 నుండి 5 వరకు. 09449970296, 8985322317. [T-0903774]

కాపు: 23Y, B.Tech, 18 కోట్ల స్థిరాస్తి కలిగి, పేరెంట్స్ లేని అందమైన ఏకైక కుమార్తెకు వరుడు కావలెను (ఆస్థి, కుల పట్టింపు లేదు) Send Photos. Whatsapp. 90309 16399 [B-0943761]

కాపు/లేట్ మ్యారేజ్ 28/5'5" డిగ్రీ, విడో (పిల్లలు లేరు) 35/5'4" అందమైన ఒంటరి వధువుకు కుల, ధన ప్రసక్తి లేని వరుడు కావలెను. Whatsapp : 70956 29265. [V- 957463]

గొల్ల/28/5'2"/ ఫెయిర్/ అనంతపూర్, డిగ్రీ Discontinue, ప్రస్తుతం Hyd. వధువుకి కట్నం లేకుండా ఉద్యోగం/ వ్యాపారం స్థిరపడిన వరుడు కావలెను. (SC/ డైవర్స్ Not Apply) డైరెక్ట్ 9701253055 [HA-661227]

క్రిస్టియన్ మాల /29 Yrs / 5'2" / B.Tech/ గవర్నమెంట్ బ్యాంక్ ఎంప్లాయ్/ 50,000/- PM / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7661940891 [HA-661400]

క్రిస్టియన్ /33 Yrs / 5'5" / Bed / MBA / Govt. లెక్చరర్/40,000/- PM / వెల్ సెటిల్డ్ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 6309297243 [HA-661400]

క్రిస్టియన్ / మాదిగ /30 Yrs / 5'4" / B.Tech /సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/USA / Employee / 50,000/- PM / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7893463873 [HA-661400]

వేదికలు



మీరు మెచ్చే సంబంధాలను సకాలంలో కుదర్చబడును. అన్ని కులాలకు 1,2, లేటు, NRI మ్యారేజ్, మీ ఇంట్లో పెళ్ళి మా బాధ్యత. నమ్మకంతో అడుగు వేయండి. శుభ వివాహానికి కాల్: 6304826162/ sservices.in [HA-21638]

కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో : 1వ, 2వ, లేట్ మ్యారేజస్, డైవర్స్, విడో, విడోయర్స్, పెన్షనర్లకు 20-70 సం॥ అన్ని కులాల వారికి సంబంధాలు కుదుర్చబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. 7286931144 [HA-661052]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులముల వారికి AP, తెలంగాణలో Govt SWE, 1వ, 2వ, లేట్, దేశ, విదేశ, సంబంధాలకై సంప్ర॥ నో కమిషన్/ వాట్సాప్ 7095940444 [HA-2195]

డాక్టర్స్, ఇంజనీర్స్, Group 1, 2 బలిజ, కమ్మ, రెడ్డి వారికి వ్యక్తిగత శ్రద్ధతో పెళ్ళి సంబంధాలు కుదర్చబడును. పూర్ణ మ్యారేజ్ బ్యూరో,తిరుపతి, 6304830554. [T-445]

15రో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com, ✆ 94920 33897, 9441829644, 9440785888 వాట్సప్ [B-544]

రూ.500లకు 25 సంబంధాలు Online / WhatsApp / ఫోన్ కాల్‌తో బయోడేటా ఫ్రీ రిజిస్ట్రేషన్. ఫోన్: 97016 59125. www.jeelakarrabellam.com [G-786]

మరాఠా, ఆరె క్షత్రియ, వివాహ పరిచయ వేదిక: తేది: 24 ఫిబ్రవరి2019, 10గం॥, ప్రకాశం హాల్, గాంధీభవన్, నాంపల్లి, HYD. Dr. Bussari Pratapji, 9959858885. [W-660322]

రజక వివాహ వేదిక (1994) Abroad, ఇంజనీర్స్, డాక్టర్స్, Govt. Job, Business /BEd సంబంధాలకై సంప్ర॥ Ph: 8106303155, 9391265304 [HA-661227]

దూదేకుల ముస్లిం డాక్టర్స్, MBBS, MD, M.S., PG మరియు BDS, MDS & ఇంజనీర్స్, SWE, బ్యాంకింగ్ లెక్చరర్స్, Pvt, Govt. C. Govt., దేశ విదేశాల్లో జాబ్ చేయు వధూవరుల సంబంధాలకై సంప్ర॥ 9948820402, 9640999003 [HA-661227]

బాబురావు మ్యారేజిబ్యూరో: మాల, మాదిగ స్పెషల్: IAS, IPS, IRS, IRTS, MBBS, M.S, MD, GOVT JOBS, SWE, USA, Group-I, II. Cell: 7893013265. [W-925868]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల వధూ-వరులకై సంప్రదించండి. bhavanimatrimony, ECIL, Hyd. 9704656103, 9533608887 Whatsapp. [HA-20458]

★★

ICM క్రైస్తవ వివాహ వేదిక హైదరాబాద్, వైజాగ్, విజయవాడ, గుంటూర్, వెబ్‌సైట్, 16,000 ప్రొఫైల్స్ పుస్తకం. సంప్ర॥ 8885073555/ 8885473555 [HA-661642]

సెకండ్ మ్యారేజీలకు మాత్రమే. శ్రీ బాలాజీ మ్యారేజ్ బ్యూరో. అన్ని కులాల వారికి, వయస్సులతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. 8328388014/ 8555980066 [HA-3331]

మాల (క్రైస్తవ, హిందూ), M.Tech, MCA, MBA, MS, MBBS చదువులతో దేశ విదేశాలలో మంచి ఉద్యోగములు చేయుచున్న వధూవరుల కొరకు సంప్ర kalyanamala.org, ✆ : 94405 45049, 94412 41468 [B-673568]

విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయవేదిక బ్రహ్మముడి గుంటూరు. కమీషన్ డిమాండ్ లేదు. Cont: 0863 -2261898, 9491125725 [G-663582]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1430/- for 4 Lines 385/- Extra Line | Andhra Pradesh: 990/- for 4 Lines (Incl. Hyd) 275/- Extra Line

Telangana : 880/- for 4 Lines (Incl. Hyd) 240/- Extra Line | * Color 25% Extra

గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.

3+3 3 ప్రకటనలకు చెల్లించండి 3 ప్రకటనలు ఉచితంగా పొందండి

నిజామాబాద్	: 99122 20764	తిరుపతి	: 99122 20584	తాడేపల్లి గూడెం	: 99122 20558
కరీంనగర్	: 9705933396	కడప	: 99516 02932	రాజమండ్రి	: 99122 20358
వరంగల్	: 99516 02868	అనంతపూర్	: 99122 20718	విజయవాడ	: 9912225442
నల్గొండ	: 95055 08382	కర్నూల్	: 99122 20575	గుంటూరు	: 99122 20349
మహబూబ్‌నగర్	: 99516 02829	శ్రీకాకుళం	: 99122 20343	ఒంగోలు	: 99122 25431
ఖమ్మం	: 99122 20596	విశాఖపట్నం	: 99122 20550	నెల్లూరు	: 99516 02861

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912377533.

ప్రేమికుల రోజున పెళ్లి చేసుకోబోతున్న ఐఏఎస్ ప్రేమ జంట



అశ్వథి, బగాది గౌతమ్

యశవంతపుర (బెంగళూరు): ఇద్దరు ఐఏఎస్ అధికారులు ప్రేమికుల రోజైన ఫిబ్రవరి 14న ప్రేమ వివాహం చేసుకోబోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు చెందిన గౌతం 2008లో జాతీయ స్థాయిలో సివిల్స్‌లో 23వ ర్యాంక్‌ను సాధించి 2009లో కర్ణాటక బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా వచ్చారు. ప్రస్తుతం ఆయన కర్ణాటకలోని దావణగెరె జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అదే జిల్లాకు పంచాయతీ సీఈవోగా పనిచేస్తోన్న కేరళకి చెందిన అశ్వథితో కలిసి వివిధ కార్యక్రమాల్లో పనిచేస్తున్న సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. మరో ఐఏఎస్ అధికారి మధ్యవర్తిత్వంతో ఇరు కుటుంబాల పెద్దలు అంగీకారం తెలిపారు. ఈ నెల 14న కేరళలోని క్యాలికట్‌లో వీరి వివాహం జరగనుంది. 17న గౌతం స్వగ్రామంలో రిసెప్షన్ నిర్వహిస్తారు.

హవ్వ.. మరీ ఇంత కక్కుర్తా!

- నరసరావుపేట, సత్తెనపల్లిలో పేదవాడి నోటి దగ్గర కూడు లాగేసుకుంటున్న టీడీపీ నేతలు
- అన్న క్యాంటీన్ల నుంచి రోజుకు 300 భోజనాల తరలింపు
- ముఖ్యనేత కుమార్తె కంపెనీలో కార్మికులకు భోజనాలు అమ్ముకుంటున్న వైనం
- కార్మికుల నుంచి ఒక్కో భోజనానికి రూ.25 వసూలు
- నెలకు రూ.2.25 లక్షల మేర జేబుల్లోకి.. విస్తుపోతున్న జనం

సాక్షి, గుంటూరు : 'హవ్వ.. మరీ ఇంత కక్కుర్తా.. డబ్బు కోసం ఇంతకు దిగజారాలా.. పేదవాడి నోటి కాడ కూడును కూడా లాగేసుకుంటారా.. అన్న క్యాంటీన్‌లలోని భోజనం తరలించి సొమ్ము చేసుకుంటారా..' అంటూ టీడీపీ నేతల వైఖరి చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేట, సత్తెనపల్లిలో ముఖ్య నేత తనయుడు, తనయ.. అన్న క్యాంటీన్‌లో భోజనాలను కూడా అమ్ముకుంటున్న దిగజారుడుతనాన్ని చూసి ఆ రెండు నియోజకవర్గాల ప్రజలు విస్తుపోతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో టీడీపీ నేతల దౌర్జన్యాలు, అరాచకాలు తార స్థాయికి చేరాయి. మరీ ముఖ్యంగా నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో అయితే ముఖ్య నేత కుమారుడు, కుమార్తెల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. వీరి కన్ను ఇప్పుడు అన్న క్యాంటీన్‌లపైనా పడింది. అన్న క్యాంటీన్‌లలో రూ.5కే భోజనం పెడుతున్న విషయం తెలిసిందే. అయితే వీటిని ముఖ్యనేత కుమార్తెకు చెందిన ఓ వ్యాపార సంస్థకు మధ్యాహ్నం 150, సాయంత్రం 150 చొప్పున రోజుకు 300 భోజనాలను చేరవేస్తున్నారు. అన్న క్యాంటీన్‌లకు ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదు. పోనీ తమ కంపెనీలో పనిచేసే కార్మికులకైనా ఉచితంగా భోజనాలు పెడుతున్నారా అంటే అదీ లేదు.. ఒక్కో భోజనానికి కార్మికుల వద్ద నుంచి రూ.25 వసూలు చేస్తున్నట్టు సమాచారం. దీన్ని బట్టి రోజుకు భోజనాల ద్వారా కార్మికుల నుంచి రూ.7,500 చొప్పున నెలకు రూ.2.25 లక్షలు.. దోచేస్తున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేదలకు పెట్టే అన్నంలోనూ అంత కక్కుర్తి అవసరమా అంటూ ముఖ్యనేత కుటుంబ సభ్యులపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.



సత్తెనపల్లిలోని అన్న క్యాంటీన్

కే ట్యాక్స్ కట్టాల్సిందే..

సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం, వ్యాపార సముదాయాల విస్తరణ పూర్తిగా నిలిచిపోయిందంటే వీరు ఏ స్థాయిలో 'కే' (వారి ఇంటి పేరు) ట్యాక్స్ వసూలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్‌టీపై విమర్శలు చేస్తున్న అధికార పార్టీ నేతలు.. రాజ్యాంగ బద్ధమైన పదవిలో కొనసాగుతున్న ముఖ్యనేత కొడుకు, కూతురు ప్రజలపై విధిస్తున్న కే ట్యాక్స్‌పై నోరు మెదపలేకపోతున్నారు. ఇవేకాకుండా పేకాట, క్రికెట్ బెట్టింగ్, మట్కా, గుట్కా, ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న వారి నుంచి కూడా మామూళ్లు వసులుచేస్తున్నారు. చివరికి వారు తమ పార్టీ వారైనా సరే వదిలిపెట్టడం లేదు. ఈ విషయమై ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో బాధితులు మిన్నకుండిపోతున్నారు. రేషన్ మాఫియా దగ్గర నుంచి భూ కబ్జాల వరకూ దేన్నీ వదలడం లేదు. చివరకు కోటప్ప కొండ పండుగను సైతం తమ ధన దాహానికి వాడుకుని త్రికోటేశ్వరుని పవిత్రతకు భంగం కలిగించారు. తమ అనుచరుల ద్వారా కోడి పందాలు, గ్యాంబ్లింగ్, కోత ముక్కాటలను నిర్వహించి జనం వ్యసనాన్ని ఆసరాగా చేసుకుని వారి జేబులు నింపుకొన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే నాలుగున్నరేళ్లలో వీరు చేసిన అవినీతి దందా వెయ్యి పేజీల పుస్తకమవుతుందని స్థానికులు వాపోతున్నారు.

నాగేశ్వరరావుకు 'నారంశెట్టి' పురస్కారం

నేడు విశాఖలో ప్రదానం



కొరుక్కుపేట(చెన్నై): చెన్నైకి చెందిన ప్రముఖ రచయిత బొందల నాగేశ్వరరావును నారంశెట్టి బాల సాహిత్య గౌరవ పురస్కారం వరించింది. ఈనెల 3న ఆదివారం విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయం వేదికగా నారంశెట్టి బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో బాల సాహిత్య పురస్కార ప్రధానోత్సవం జరుగునుంది. పీఠం అధ్యక్షుడు నారంశెట్టి ఉమామహేశ్వర రావు సభాధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ పొట్లూరి హరికృష్ణతోపాటు పలువురు అతిథులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో రచయిత బొందల నాగేశ్వరరావుకు నారంశెట్టి బాల సాహిత్య గౌరవ పురస్కారాన్ని అందజేయనున్నారు.

శ్రీగోవింద రాజస్వామి ఆలయంలో..

మూడు బంగారు కిరీటాలు మాయం

- 1.300 కిలోల బరువు ఉంటాయన్న అధికారులు
- విచారణ ప్రారంభించిన టీటీడీ, పోలీసు అధికారులు

సాక్షి, తిరుపతి : తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు అలంకరించే మూడు బంగారు కిరీటాలు మాయం అయ్యాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై శనివారం రాత్రి టీటీడీ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. శ్రీవేంకటేశ్వరస్వామి అన్నగారైన శ్రీగోవిందరాజస్వామి ఆలయాన్ని 12వ శతాబ్దంలో శ్రీరామానుజాచార్యులు నిర్మించారు. తిరుమల కొండకు వచ్చిన ప్రతి భక్తుడు తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామిని దర్శించుకుంటారు. శ్రీవారికి సమర్పించినట్టే గోవిందరాజస్వామికి కూడా రాజులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బంగారు, వజ్రాలతో పొదిగిన ఆభరణాలు, వజ్రవైఢూర్యాలతో పొదిగిన కిరీటాలు కానుకలుగా సమర్పించారు.



గోవిందరాజు స్వామి ఆలయం వద్ద పోలీసు వాహనం

కాగా శ్రీగోవిందరాజస్వామికి ప్రధానంగా ఐదు బంగారు కిరీటాలు ఉన్నట్లు సమాచారం. అయితే నిత్యం స్వామి వారికి అలంకరించి ఉండే మూడు కిరీటాలు మాయమయ్యాయి. మాయమైన మూడు కిరీటాలను 'సదా సమర్పణ' కిరీటాలు అని అంటారు. వజ్రాలతో తయారు చేయించిన ఈ కిరీటాలు మూడు 1.300 కిలోలు బరువు ఉంటాయని వెల్లడించారు. నిత్యం రద్దీగా ఉండే ఆలయంలో ఉత్సవ మూర్తులకు అలంకరించే మూడు విలువైన బంగారు కిరీటాలు మాయమైన విషయం శనివారం సుప్రభాత సేవ సమయంలోనే తెలిసినట్లు సమాచారం. ఆ వెంటనే టీటీడీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ కిరీటాలు ఆలయంలో పనిచేసే వారికి తెలియకుండా మాయమయ్యే అవకాశం లేదని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎవరు? ఎలా మాయం చేశారనే విషయంపై తిరుపతి అర్బన్ ఎస్పీ అన్బురాజన్, టీటీడీ విజిలెన్స్ అధికారులు, క్లూస్ టీం విచారణ చేపట్టారు. ఆలయంలోని సీసీ ఫుటేజిలను పరిశీలిస్తున్నారు. ఆలయ సిబ్బంది, అర్చకులను విచారిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో పనిచేసే అధికారి ఒకరు విలువైన ఆభరణాలను మాయం చేసి తాకట్టుపెట్టిన విషయం తెలిసిందే. ఈ కేసు ఇంకా విచారణ జరుగుతుండగానే... తాజాగా శ్రీగోవింద రాజస్వామి ఆలయంలో బంగారు కిరీటాలు మాయం కావడం సంచలనంగా మారింది.

చంద్రన్న పెళ్లికానుకకు గ్రహణం!


- ఒక్కరికీ అందని పెళ్లికానుక
- ఫ్యాషన్ షోలుగా మారిన మెగా గ్రౌండింగ్ రుణ మేళాలు
- సీఎఫ్‌ఎంఎస్‌లో రూ.1,400 కోట్లు సబ్సిడీ నిధులు పెండింగ్
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- సాయం కోసం 1,12,000 మంది ఎదురుచూపులు


సాక్షి, అమరావతి:పథకాలను ప్రకటించడమే తప్ప వాటిని అమలుచేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతోంది. ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన చంద్రన్న పెళ్లికానుక పథకానికి గ్రహణం పట్టింది. దీంతోపాటు వివిధ సామాజికవర్గాలకు ఇచ్చే రుణాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. పెళ్లికానుక పథకం కింద పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల్లో నూతన వధూవరులకు ప్రభుత్వం సాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 50,568 మంది పెళ్లికానుక కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 17,014 మందికి మాత్రమే ప్రభుత్వం కానుక ప్రకటించింది. అయితే ఈ మొత్తం ఇంతవరకు నూతన వధువుల ఖాతాలకు చేరకపోవడం గమనార్హం. వీరితోపాటు పెళ్లికానుకను ప్రవేశపెట్టినప్పటి నుంచి (గతేడాది ఏప్రిల్) అక్టోబర్ వరకు పథకానికి దరఖాస్తు చేసుకోకుండా పెళ్లి చేసుకున్నవారికి కూడా తర్వాత ప్రత్యేక రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. ఇలా వివాహం చేసుకున్న 29,848 జంటలకు ఇవ్వాల్సిన కానుక కూడా ఇప్పటివరకు ఇవ్వలేదు. పెళ్లికానుక పేరుకే తప్ప ఆచరణలో అమలు కావడం లేదని తేటతెల్లమైంది.

రుణాల మంజూరులోనూ ఇదే పరిస్థితి

ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ తదితరులకు మెగా గ్రౌండింగ్ మేళాలు నిర్వహించి వారికి రుణాలు కుప్పలుతెప్పలుగా ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం వాస్తవంగా ఒక్కరికీ కూడా ఇవ్వలేదు. తాము సబ్సిడీ నిధులు విడుదల చేసినా సెంట్రల్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (సీఎఫ్‌ఎంఎస్)లో పెండింగ్ పెట్టారని, వెంటనే వాటిని విడుదల చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్.. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని రాతపూర్వకంగా కోరినా ఎటువంటి స్పందనా లేదు. ప్రభుత్వం సీఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్ పెట్టిన నిధులు రూ.1,400 కోట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,12,000 మంది లబ్ధిదారులకు సాయం అందించాల్సి ఉంది. మెగా గ్రౌండింగ్ మేళాలు ఫ్యాషన్ షోలను తలపిస్తున్నాయని, అధికారులు ఇలా వచ్చి అలా వెళుతున్నారని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఒకరిద్దరికి సాయం చేసి మిగిలిన వారికి ఆయా జిల్లాల్లో ఇస్తారని చెబుతున్నారని, అయితే ఇప్పటివరకు ఒక్కరికీ పైసా కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలో తొలిసారిగా నానాజాతి సమితి పదాన్ని కనుగొన్న బ్రిటన్‌కు చెందిన రాజకీయ శాస్త్రవేత్త లూయిస్ డికిన్సన్.. 1914లో ఈ సంస్థ ఏర్పాటుకు లార్డ్ బ్రైస్‌తో కలసి కృషి చేశారు.





నీళ్లు చల్లి చూడండి!



గాల్లోకి వేడి నీళ్లు చల్లి చూడండి.. ఏం జరుగుతుంది. ఎక్కడైనా అయితే అవే నీళ్లు కింద పడతాయి. కానీ అమెరికాలో అదీ గడ్డకట్టుకుపోయే మంచుగాలుల్లో వేడి నీళ్లు చల్లితే గాల్లోనే గడ్డకట్టి వేడినీళ్ల స్ఫటికాలుగా మారి కుప్పలా నేల రాలుతున్నాయి. అదెలాగో చూడండి..

అమెరికాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచుకు అక్కడి సాధారణ పౌరుల జీవనం అస్తవ్యస్తంగా తయారయ్యింది. పాఠశాలలు మూతపడ్డాయి. ఆఫీసులకు సెలవులు ప్రకటించేశారు. తపాలా కార్యాలయాలు సైతం పనిచేయని స్థితికి చేరింది. రైళ్ల రాకపోకలు సైతం నిలిచిపోయాయి. విమానాలు గాల్లోకి ఎగిరే పరిస్థితి లేక నేలమీదే చతికిలపడ్డాయి. మంచు తప్ప వీధుల్లో మనుషుల అలికిడే లేకుండా పోయింది. ఈ పరిస్థితులతో విసిగిపోయిన ప్రజలు మంచు వాన నుంచి కాస్త ఊరట పొందేందుకు వినోదం కోసం వేడి నీళ్లను గాలిలోకి చల్లుతున్నారు. అయితే చల్లిన వేడి నీళ్లు సైతం భూమ్మీద రాలకుండానే క్షణాల్లో గడ్డకట్టుకుపోయి వేడి నీటి బిందువులుగా నేల రాలుతున్నాయి. ఈ విచిత్రమైన పరిస్థితిని వీడియోల్లో షూట్ చేసి విసుగు పుట్టించే అవిశ్రాంత మంచువాన నుంచి వినోదం పొందుతున్నారు. ఇంట్లో కప్పులు, మగ్గులతో వేడినీళ్లు గాల్లోకి చల్లి గడ్డకట్టే సీన్‌ను వీడియోల్లో బంధించి, ఈ వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. అవి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతున్నాయి.

చెప్పకుండా ఎందుకు కన్నారు?



తల్లిదండ్రుల పెళ్లి ఫొటోలు చూస్తూ.. చిన్న పిల్లలు అందులో తాను ఎందుకు లేను అని ఎంతో అమాయకంగా అడుగుతుంటారు.. కొందరేమో ఏడుస్తుంటారు.. అప్పుడు చాలా సంబరంగా ఉంటుంది. పెద్దయ్యక కూడా 'నువ్వు ఇలా అడిగేదానివి'అంటూ ఆ జ్ఞాపకాలను గుర్తు చేస్తుంటారు. అయితే చిన్నప్పుడు అడిగితే బాగానే ఉంటుంది.. కానీ పెద్ద పెరిగాక కూడా అలా అడగగలుగుతామా..? లేదు కదా.. అయితే ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి మాత్రం ఏకంగా తన తల్లిదండ్రులపై దావా వేయనున్నాడు. ఎందుకంటే తన పర్మిషన్ అడగకుండా తనను కన్నందుకు కేసు వేయాలని చూస్తున్నాడట. అతడి పేరు రఫేల్ సామ్యూయేల్. వయసు 27 సంవత్సరాలు. జనాభా పెరుగుదలను తీవ్రంగా వ్యతిరేకిస్తుంటాడు. ఇంతవరకు బాగానే ఉంది. తన లాంటి తెలివైన వారిని అనుమతి లేకుండా జన్మనివ్వడం నైతికతకు విరుద్ధమని వాదిస్తుంటాడు. రఫేల్‌కు పిల్లలపై, జీవితంపై ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ పిల్లల అనుమతి తీసుకోకుండా వారిని కనడమే పాపం అంటుంటాడు. ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చి వారిని ఈ కష్టాల సాగరంలో ఈదేలా చేస్తున్నారని, అది కూడా వారి అనుమతి తీసుకోకుండా చేస్తున్నారని, వారిని బాధితులుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తుంటాడు. తన తల్లిదండ్రులు అంటే తనకు చాలా ఇష్టమని, తమ మధ్య మంచి బంధం ఉందని చెబుతూనే.. తన అనుమతి తీసుకోకుండా ఎలా ఈ ప్రపంచంలోకి తీసుకొస్తారంటూ వారిని కోర్టుకు ఈడుస్తాడట. మరి చూద్దాం కోర్టు ఏం చెబుతుందో.

చర్మకారుల దిక్కులేని బతుకు!



విజయవాడ పశువుల ఆస్పత్రి సెంటర్‌లో చర్మకారుడు తాళ్లూరి ప్రసాద్

నాలుగున్నర ఏళ్లుగా పింఛన్లు, ఆర్థికసాయం అంటూ ప్రభుత్వం ఊరింపు

రుణాలు ఇస్తున్నారన్న విషయమే వారికి తెలియదు

పింఛన్లు ఎవరికిస్తున్నారో కూడా తెలియదంటున్న చర్మకారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చర్మకారులది దిక్కులేని బతుకైంది. నాలుగున్నర ఏళ్ల నుంచి పింఛన్, చెప్పులు కుట్టే వస్తువులు, మెటీరియల్ కొనుగోలుకు సాయం అందిస్తామని ప్రభుత్వం చర్మకారులను ఊరిస్తూనే ఉంది. ఈ నెలలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో చర్మకారుల పరిస్థితి ఆశాజనకంగా ఉండేట్టు కనిపించడంలేదు. రాష్ట్రంలో చెప్పులు కుట్టేవారు సుమారు లక్షన్నర వరకు ఉన్నారని చర్మకారుల సంఘాలు చెబుతున్నాయి. ప్రభుత్వం మాత్రం 24,168 మందిని మాత్రమే గుర్తించి వీరికే సాయం అందిస్తామంటోంది. అది కూడా ఎప్పుడు ఇస్తారో చెప్పటం లేదు. ఎంతోమంది పట్టణాల్లో ఫుట్‌పాత్‌లపై ఇప్పుడు కూడా చెప్పులు కుట్టుకుంటూ జీవిస్తున్నారు. గతంలో ఎక్కువమంది తెగిన చెప్పులు కుట్టించుకునే వారు. ఇప్పుడు తెగిపోయిన చెప్పులు చెత్త కుప్పలో పడేసి కొత్తవి కొనుగోలు చేస్తున్నారు. మరో పదేళ్లలో చెప్పులు కుట్టేవారి సంఖ్య కనిపించకుండా పోతుందని వారు చెబుతున్నారు. తమ పిల్లలు మట్టి పనికైనా వెళతామంటున్నారు కానీ చెప్పులు కుట్టి బతకలేమని అంటున్నారని చర్మకారులు చెబుతున్నారు. విజయవాడ నగరంలో సుమారు 150 మంది ఫుట్‌పాత్‌లపై చెప్పులు కుట్టేవారు ఉన్నట్టు చర్మకారుల యూనియన్ నాయకులు తెలిపారు.

సాయం కోసం ఎదురుచూపు

చెప్పులు కుట్టే వారు ప్రభుత్వసాయం కోసం ఎదురుచూస్తున్నారు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లు పైబడిన వారికి పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 18 నుంచి 70 ఏళ్లు పైబడిన వారు మొత్తం 24,168 మంది ఉన్నట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఈ లెక్కలు తప్పని చెప్పులు కుట్టే అరుంధతీయులు చెబుతున్నారు. సుమారు లక్షన్నర మంది చెప్పులు కుట్టేవారు ఉన్నట్టు చర్మకార సంఘాల నాయకులు చెబుతున్నారు.

పింఛన్ ఎప్పుడిస్తారో?

చెప్పులు కుట్టుకునే ఎస్సీ వృత్తిదారుల్లో 40 ఏళ్లు నిండిన వారికి పింఛన్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారు మొత్తం 19,750 మంది ఉన్నట్టు ప్రభుత్వం చెబుతోంది. వీరికి ఎప్పటి నుంచి పింఛన్ ఇస్తారో చెప్పటం లేదు. 40–50 ఏళ్ల మధ్యవారు 12,953 మంది, 51–55 మధ్య వారు 3,111 మంది, 56–60 మధ్య వారు 2,036 మంది, 61–65 మధ్య వారు 1,074 మంది, 66–70 మధ్య వారు 429 మంది, 70 ఏళ్లు పైబడిన వారు 147 మంది ఉన్నారని ప్రభుత్వం చెబుతోంది. పింఛన్‌కు అర్హులైన వారు రాష్ట్రంలో సుమారు లక్ష మంది వరకు ఉన్నారని చర్మకార సంఘాల వారు చెబుతున్నారు.

నాకు ఏమీ ఇవ్వలేదు

నాకు 47 ఏళ్లు. చెప్పులు కుట్టుకుంటూ బతుకుతున్నా. రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు వస్తాయి. ఒక్కోరోజు అవీ రావు. ముగ్గురు పిల్లలూ ఈ వృత్తిలోకి రామంటున్నారు. చదువుకుంటున్నారు. వారికి పెళ్లిళ్లు చేయాలి. ప్రభుత్వం ఏమి ఇస్తుందో మాకు తెలియదు. మాకు ఎవ్వరూ చెప్పేవారు లేరు. నేను అంతగా చదువుకోలేదు. మాదిగ దండోరా వారు వచ్చి పింఛన్‌లు ఇస్తారని చెప్పి ఫొటోలు తీసుకున్నారు. మళ్లీ వారు కనిపించలేదు. మాలాంటోళ్లం విజయవాడలో 150 మంది వరకు ఉన్నాం. ఫుట్‌పాత్‌లపై చెప్పులు కుట్టుకుని బతుకుతున్నాం. ఇన్నేళ్ల తర్వాత మా గురించి మీరు అడుగుతున్నారు. ఎందుకో భయంగా ఉంది.

–తాళ్లూరి ప్రసాద్, చర్మకారుడు, విజయవాడ

మాకసలు తెలీదు



ప్రభుత్వం పింఛన్లు ఇస్తామన్న విషయం కానీ, చెప్పులు కుట్టుకునేందుకు వస్తువులు, ముడి సరుకు కొనుగోలు చేసేందుకు సాయం చేస్తారని కానీ ఇంతవరకు మాకు తెలీదు. ఈ ప్రభుత్వం ఎవరికి సాయం చేస్తుందయ్యా. మా బతుకులు ఇంతే.. మాకు సాయం చేసేవారు ఎవ్వరూ లేరు. వీధికి పదిమంది వరకు విజయవాడలో చెప్పులు కుట్టుకుంటూ బతుకుతున్నాం. ఇటీవల చెప్పులు కుట్టించుకునే వారు తగ్గారు. మా పిల్లలు ఈ వృత్తిలోకి రారు. ఇక చెప్పులు తెగిపోతే పారెయ్యాల్సిందే. కుట్టేవారు ఉండరు. **–కువ్వారపు సామ్యుల్ (57), చర్మకారుడు, విజయవాడ**

జేఈఈ మెయిన్స్‌లో డా.కె.కె.ఆర్స్ స్కూల్ విజయభేరి

సాక్షి, హైదరాబాద్: 2019 జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్‌లో కృష్ణా జిల్లా, ఆగిరిపల్లిలోని హ్యాపీవ్యాలీ స్కూల్ విజయభేరి మోగించింది. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.యస్ లక్ష్మీనారాయణ 100 పర్సంటైల్‌తో ఆలిండియా టాపర్‌గా నిలిచాడని డా.కె.కె.ఆర్స్ గౌతమ్ విద్యాసంస్థల అధినేత కొసరాజు కోటేశ్వరరావు వెల్లడించారు. విద్యార్థులు విజయం సాధించడంలో తాము అందించే ఐఐటీ కోచింగ్, శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ వారి సహకారం బాగా తోడ్పడినట్లు వెల్లడించారు. టాపర్‌గా నిలిచిన లక్ష్మీనారాయణను కోటేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్లు అవినాష్, శ్రీతేజ, అధ్యాపక బృందం అభినందించారు.

నీలకంఠ్రావుపేట దర్గా పీఠాధిపతి శ్రీ సద్గురు దర్గాస్వామిజీ శివైక్యం



దర్గాస్వామిజీ (ఫైల్)

రామాపురం: వైఎస్సార్ జిల్లా రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలోని అనంత ఆశ్రమంలో శ్రీ దర్గా పీఠాధిపతి శ్రీ సద్గురు దర్గా స్వామీజీ (87) శనివారం శివైక్యం చెందారు. శ్రీ దర్గా స్వామిజీ దువ్వూరు మండలం పెద్దశెట్టిపల్లెకు చెందిన గంగిశెట్టి చలమయ్య, సుబ్బమ్మ దంపతులకు మొదటి సంతానం. స్వామిజీ 1931లో జన్మించారు. స్వామిజీ బాల్యం, ప్రాథమిక విద్య గోపాయపల్లెలో సాగింది. మద్రాసులో డిగ్రీ వరకు విద్యనభ్యసించారు. నీటి పారుదల శాఖలో ఉద్యోగం చేశారు. రామాపురం మండలం నీలకంఠ్రావుపేటకు చెందిన కొణిజేటి అనంతయ్య , సుబ్బమ్మ ఏకైక పుత్రిక రంగనాయకమ్మను 1952 జనవరి 31న వివాహం చేసుకున్నారు. 1958న గురువు సూచనల మేరకు స్వామిజీ నీలకంఠ్రావుపేట దర్గా పీఠానికి అధిపతిగా ఉండిపోయారు. ఏటా ఫాల్గుణ మాసంలో దర్గాలో ఉరుసు ఉత్సవాలు నిర్వహించేవారు. శివైక్యం పొందిన స్వామిజీ పార్థివ దేహానికి రాయచోటి, కమాలపురం ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, సుగవాశి ప్రసాద్‌బాబు, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ చైర్మన్ రమేష్‌రెడ్డి, పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.

శ్రీకాకుళంలో అంతర్ జిల్లా ఉపాధ్యాయుల ఆందోళన

విద్యాశాఖాధికారుల తీరుపై మండిపాటు



డీఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంతర్ జిల్లాల ఉపాధ్యాయులు

శ్రీకాకుళం: రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి బదిలీపై శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులు శనివారం డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర్ జిల్లా బదిలీలకు ఇటీవలే అనుమతివ్వడంతో 31 మంది ఉపాధ్యాయులు శ్రీకాకుళం జిల్లాకు వచ్చారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఫిబ్రవరి 1న బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఆ రోజున విశాఖలో ఆర్జేడీ కార్యాలయం ప్రారంభోత్సవానికి డీఈవో అక్కడకు వెళ్లిపోయారు. తిరిగి వచ్చేసరికి ఆలస్యం కావడంతో శనివారం కౌన్సెలింగ్ జరుపుతామని హామీ ఇచ్చారు. వీరంతా శనివారం డీఈవో కార్యాలయం వద్దకు రాగా, ముందుగా డీఈవో పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఆ తరువాత అంతర్ జిల్లా బదిలీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పడంతో వీరంతా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. రాష్ట్రంలోని మిగిలిన 12 జిల్లాల్లో శుక్రవారమే కౌన్సెలింగ్ పూర్తయిందని శ్రీకాకుళంలో జాప్యం చేయడమే కాకుండా, ముందుగా తమకు కాకుండా డీఈవో పూల్‌లో ఉన్నవారికి కౌన్సెలింగ్ చేయడం సరికాదని మండిపడ్డారు. వాస్తవానికి డీఈవో పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ జరపాలని గతేడాది జూన్ 29న ఉత్తర్వులిచ్చినా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంతో అది కార్యరూపం దాల్చలేదు. వారు కూడా విద్యాశాఖ అధికారులతో వాదిస్తూ తొలుత తమకే కౌన్సెలింగ్ జరపాలని పట్టుబట్టారు. ఎటూ తేల్చుకోలేని విద్యాశాఖ అధికారి విజయభాస్కర్ రాష్ట్రాధికారులకు సమస్యను నివేదించారు. రాత్రి 8 గంటల వరకు అక్కడి నుంచి సమాధానం రాకపోవడంతో ఇరువర్గాల ఉపాధ్యాయులు వేచి చూస్తున్నారు. రాష్ట్రాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అందుకు అనుగుణంగా రాత్రి సమయంలోనైనా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈవో 'సాక్షి'కి తెలిపారు.

అగ్రిగోల్డ్ ఆస్తులు కాజేసేందుకు టీడీపీ కుట్ర

- బాధితులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ
- బాసట కమిటీ ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి భరోసా



మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ సమన్వయకర్త లేళ్ల అప్పిరెడ్డి

కాకినాడ: అగ్రిగోల్డ్ ఆస్తులను కైంకర్యం చేయాలన్న టీడీపీ నేతల దుర్బుద్ధి వల్లే లక్షలాది మంది బాధితులు రోడ్డున పడ్డారని, అందులో పలువురు ప్రాణాలు కోల్పోయారని అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ సమన్వయకర్త లేళ్ల అప్పిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ దేశంలోనే పెద్ద కుంభకోణమన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో శనివారం అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరత్నాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అప్పిరెడ్డి మాట్లాడుతూ రోజు కూలి చేసుకుంటూ రెక్కల కష్టంతో డబ్బు మదుపు చేసుకున్న బాధితులను అగ్రిగోల్డ్ సంస్థ నిలువునా ముంచిందన్నారు. న్యాయం చేయాల్సిన ప్రభుత్వం వేల కోట్ల విలువైన ఆస్తులను టీడీపీ నేతలకు, చంద్రబాబు బంధువులకు దోచిపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నం వల్లే రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బాధితులకు న్యాయం చేస్తామని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ అనేక వర్గాలకు ఎన్నికల ముందు రాయితీలు ప్రకటిస్తున్న చంద్రబాబు అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. సమావేశానికి విచ్చేసిన పలువురు బాధితులు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో తమకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసం లేదని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే పూర్తి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంద్రకీలాద్రిపై టికెట్ల స్కాం!

- ఒకే ఐడీ నంబర్‌తో దర్శన టికెట్ల విక్రయాలు
- గుర్తించిన ఆలయ అధికారులు
- చేతి వాటం ప్రదర్శిస్తున్న ప్రైవేటు సంస్థ సిబ్బంది
- అమ్మవారి ఆదాయానికి భారీ గండి



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనం టికెట్ల స్కాం శనివారం బట్టబయలైంది. అమ్మవారి ఆదాయానికి భారీగా గండి కొడుతున్న ప్రైవేటు సంస్థ సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన దేవస్థానం.. సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేయడం మరింత విమర్శలకు దారితీస్తోంది. వివరాల్లోకి వెళితే.. భక్తులకు సర్వ దర్శనంతోపాటు రూ. 100, రూ. 300 టికెట్లను భక్తులకు విక్రయించేందుకు త్రిలోక్ అనే సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. ఈ సంస్థ విక్రయించే టికెట్లలో అవకతవకలు జరుగుతున్నాయని గతంలోనూ పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా శనివారం మధ్యాహ్నం దర్శనానికి వచ్చిన ఓ కుటుంబం రూ. 300 టికెట్లను కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా కౌంటర్‌లోని సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. యాక్సిస్ కార్డుపై ఒకే ఐడీ నంబర్‌తో సుమారు 8 టికెట్లను విక్రయించారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఈ టికెట్లను గుర్తించారు. ఈ విషయాన్ని వెంటనే ఈవో వీ కోటేశ్వరమ్మ దృష్టికి తీసుకెళ్లారు. అయితే కౌంటర్లలో టికెట్లను విక్రయించిన సిబ్బందిని ప్రశ్నించకుండా, దేవస్థానం తరుపున విధులు నిర్వహించే సూపర్‌వైజర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం కొసమెరుపు.

టికెట్ల గుర్తింపు ఎలా....!

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రైవేటు సంస్థ సిబ్బంది యాక్సిస్ కార్డులు జారీ చేస్తుంటారు. దీనిపై ఒక ఐడీ నంబర్‌తో బార్‌కోడ్‌తో ఉన్న సిప్‌ను జత చేస్తుంటారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 1 గంట, రాత్రి 10 గంటలకు టికెట్లు ఏ మేరకు విక్రయించారనే దానిపై కంప్యూటర్ ద్వారా లిస్టు తీసి దేవస్థానానికి అందజేసి సదరు సంస్థ డబ్బులు చెల్లిస్తుంది. ఇక్కడే సంస్థ తమ తెలివిని ప్రదర్శిస్తోంది. కనీసం కంటికి కూడా కనిపించనంత సైజులో సీరియల్ నంబర్‌ను ముద్రిస్తోంది. తద్వారా ఒకే నంబర్‌ను అనేక టికెట్లపై ముద్రించి అమ్మకాలు చేసి.. కొన్ని టికెట్లకు మాత్రమే దేవస్థానానికి డబ్బులు చెల్లిస్తోంది. గతంలో ఇదే విషయమై సాక్షి కథనాలను ప్రచురించి.. దేవస్థానానికి నష్టం జరుగుతుందనే విషయాన్ని వెల్లడించింది.

అక్రమార్కుల జేబుల్లోకి అమ్మవారి ఆదాయం

శుక్రవారం, ఆదివారం, పండుగ రోజులలో సుమారు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. వీరిలో కనీసం 5 నుంచి 8 వేల మంది భక్తులు రూ. 300 టికెట్లను కొనుగోలు చేసి దర్శనానికి వెళుతుంటారు. వీటిలో రోజుకు వెయ్యి టికెట్లు పక్కదారి పట్టినా.. అమ్మవారి ఆదాయం నెలకు లక్షల్లో అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లే అవకాశం ఉందని ఆలయ సిబ్బంది బహిరంగంగానే పేర్కొంటుండడం గమనార్హం.

రెండు నెలల్లో ముగ్గురు సీఈవోలు

- నిజాయితీపరులను సాగనంపుతున్న వక్ఫ్ బోర్డులోని కీలక నేత
- తమ అవినీతికి అడ్డుపడుతుండటమే కారణం
- రూ.200 కోట్ల విలువైన బోర్డు ఆస్తులపై ఆ కీలక నేత కన్ను
- దర్గా హుండీల నుంచి ముడుపుల కోసం ఒత్తిడి
- బోర్డు నిర్ణయాలపై స్టేలు ఇస్తున్న న్యాయస్థానాలు



సాక్షి, విజయవాడ: వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి నైతిక విలువలకు తిలోదకాలిచ్చి అధికార టీడీపీలో చేరిన నేతకు రాష్ట్ర ప్రభుత్వం బహుమతిగా వక్ఫ్ బోర్డును అప్పగించింది. గతేడాది ఏప్రిల్లో కొత్త వక్ఫ్ బోర్డు ఏర్పడింది. కేవలం కోట్లు దండుకోవాలనే యావతో ఈ బోర్డులోని కొంతమంది నేతలు తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. నీతి, నిజాయితీతో పనిచేసే సీఈవోలుంటే తమకు అడ్డమని భావించిన వక్ఫ్ బోర్డులోని కీలక నేత.. ప్రభుత్వ సహకారంతో వారిని సాగనంపుతున్నారు. దీంతో రెండు నెలల్లో ముగ్గురు సీఈవోలు మారారు. గతేడాది సెప్టెంబర్ 27 వరకు అబ్దుల్‌ఖాదర్ సీఈవోగా ఉన్నారు. బోర్డు అవినీతిని ఆయన ప్రశ్నించడంతో బోర్డు ముఖ్యులతో ఆయనకు విభేదాలొచ్చాయి. దీంతో ఆయన సెలవుపై వెళ్లిపోయారు. బోర్డులో డిప్యూటీ సెక్రటరీగా ఉన్న సుభానీకి సీఈవో బాధ్యతలను బోర్డే అప్పగించింది. అయితే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తప్పుబట్టి ఆయన్ను తొలగించి మైనార్టీ కార్పొరేషన్ ఎండీ అలీఅక్బర్‌ను సీఈవో (ఎఫ్ఏసీ)గా నియమించింది. అయితే నిజాయితీపరుడైన ఆయనకు బాధ్యతలు అప్పగించడానికి వక్ఫ్ బోర్డు పెద్దలు అంగీకరించలేదు. దీంతో బోర్డు ఒత్తిడి మేరకు బోర్డు డెప్యూటీ సెక్రటరీ కేడర్‌కు చెందిన షేక్ అహ్మద్‌ను సీఈవోగా ప్రభుత్వం నియమించింది. డిప్యూటీ సెక్రటరీ స్థాయి అధికారిని నియమించాల్సి ఉండగా.. బోర్డు డిప్యూటీ సెక్రటరీని నియమించడమేంటని ముస్లిం హక్కుల పోరాట సమితి కార్యదర్శి షారూఖ్ షబ్లీ కోర్టుకెళ్లడంతో విచారణ కొనసాగుతోంది.

రూ.200 కోట్ల ఆస్తులపై కన్ను?

విజయవాడలోని జమ్మా మసీదు వక్ఫ్‌కు చెందిన సుమారు రూ.100 కోట్ల స్థలాన్ని లీజుకివ్వడంతో పాటు రాష్ట్రంలోని కర్నూలు, కడప, అనంతపురం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో సుమారు రూ.100 కోట్ల ఆస్తుల్ని తమ బినామీలకు దీర్ఘకాలం లీజుకిప్పించేందుకు పథకాన్ని సిద్ధం చేశారు. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా ఈ తతంగాన్ని పూర్తిచేయాలని భావిస్తున్నారు. అందుకోసమే తమకు అనుకూలంగా ఉండే సీఈవోను నియమించుకునేందుకు తహతహలాడుతున్నట్లు తెలిసింది. వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడమే తమ లక్ష్యమని ముస్లిం నేతలు చెబుతున్నారు. ఇక కర్నూలు, పెదకాకానిలోని దర్గాలతో పాటు మరికొన్ని దర్గాల హుండీల్లో ప్రతి నెలా వేలాది రూపాయల విరాళాలు వస్తుంటాయి. వాటిలో నెల నెలా తమకు వాటాలు ఇవ్వాల్సిందేనని వక్ఫ్ బోర్డు సభ్యులు ఒత్తిడి చేస్తుండటంతో అక్కడి ముత్తవలీలు తలలు పట్టుకుంటున్నారు. ముత్తవలీల ఎంపిక, వక్ఫ్‌భూముల లీజులు, ఉద్యోగుల పదోన్నతులు.. తదితర అంశాల్లో వక్ఫ్ బోర్డు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ నిర్ణయాల వల్ల ఇబ్బందిపడే వారు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఈ నిర్ణయాలపై సుమారు 40 వరకు స్టేలొచ్చాయని ఉద్యోగులే చెబుతున్నారు. గతంలో ఏ వక్ఫ్‌బోర్డు నిర్ణయాలు ఇంత వివాదాస్పదం కాలేదని వ్యాఖ్యానిస్తున్నారు.

అందినకాడికి దండుకునే యత్నం

వక్ఫ్‌బోర్డులో ఓ కీలక నేత అందినకాడికి దండుకునేందుకు యత్నిస్తున్నారు. మరో రెండు రోజుల్లో బోర్డు సమావేశం జరగనుంది. అజెండాలో కేవలం నాలుగు అంశాలే పెట్టారు. అయితే టేబుల్ ఐటమ్‌గా సుమారు 20 అంశాలు అప్పటికప్పుడు చర్చకు తెస్తున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి పారూఖ్, మైనార్టీశాఖ అధికారులు సిఫార్సులంటూ అవినీతికి ఆస్కారం ఉన్న అంశాలను ఆమోదింపచేసుకుంటున్నారు. అదేమని ఇతర సభ్యులు ప్రశ్నిస్తే వారిపై సీఎంకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరిస్తున్నారు. కాగా ఓ కీలక నేత అనుచరుడికి వక్ఫ్‌బోర్డులో ఉద్యోగం ఇస్తూ రెండో బోర్డులో తీర్మానం ఆమోదించారు. మూడో బోర్డు సమావేశంలో అతనికి ఇంక్రిమెంట్ ఇవ్వడాన్ని వక్ఫ్ బోర్డు సిబ్బందే తప్పుబడుతున్నారు.

ప్రజల కోసం వేస్తున్న బోరును అడ్డుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డిపై దౌర్జన్యం
- ఇరువర్గాల తోపులాటతో ఉద్రిక్తత
- చిత్తూరు జిల్లా మదనపల్లెలో ఘటన



ఎమ్మెల్యే డాక్టర్ తిప్పారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్

మదనపల్లె సిటీ: ప్రజల దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ అధికారుల అనుమతితో వేస్తున్న బోరును టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, అతని అనుచరులు అడ్డుకున్నారు. ఇక్కడ బోరు వేస్తే తాను లీజుకిచ్చిన ప్రైవేట్ పాఠశాలలో బోరు ఎక్కడ ఎండిపోతుందేమోనన్న అనుమానంతో ఆయన నానాయాగీ చేశారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో చోటుచేసుకున్న ఈ ఉదంతం వివరాలిలా ఉన్నాయి.. ప్రజల దాహార్తి తీర్చేందుకు పట్టణంలో మున్సిపల్ అధికారుల అనుమతితో శనివారం ఉదయం నుంచి బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే రమేష్ ఆ పనులను అడ్డుకున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి ప్రజల కోసం బోరు వేయాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో రమేష్.. రాజకీయాలు చేస్తున్నారా అంటూ తిప్పారెడ్డి, ఇతర వైఎస్సార్‌సీపీ నేతలపై రుసురుసలాడారు. ఇక్కడ బోరువేస్తే తాను లీజుకు ఇచ్చిన ప్రైవేటు స్కూల్‌లోని బోరు ఎండిపోతుందని మీకు అనుమతి ఎవరిచ్చారంటూ నానాయాగీ చేశారు. అయినా.. ఎమ్మెల్యే తిప్పారెడ్డి, కౌన్సిలర్లు మస్తాన్‌రెడ్డి, బీఏ ఖాజా, ఎమ్మెల్యే సోదరుడు దేశాయ్ జయదేవరెడ్డి, పట్టణ కన్వీనర్ సురేంద్ర తదితర పార్టీ నేతలు ప్రజల అవసరార్థం బోరు వేయాలని పట్టుబట్టారు. ఒకానొక దశలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బోరు వేయవద్దని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని రమేష్ అనుచరులు డ్రిల్లింగ్ పనివారిని బెదిరించారు. దీంతో టు టౌన్ సీఐ, ఎస్ఐలు సురేష్‌కుమార్, సుబ్బారెడ్డి, పూరేనాయక్‌లు ఇరువర్గాలతో చర్చించారు. మున్సిపల్ డీఈ మహేష్, ఏఈ గోపిలను పిలిపించారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం బోరు వేస్తున్నట్లు డీఈ మహేష్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సైతం వచ్చి ఆదివారం ఈ విషయమై చర్చించి తగిన న్యాయం చేస్తానని ఇరువర్గాలకూ హామీ ఇచ్చారు. ఇది అన్యాయమని ఎమ్మెల్యే తిప్పారెడ్డి అసంతృప్తి వ్యక్తంచేశారు.

మధ్యతరగతి ఆశలు ఛిద్రం

- మమత ప్రభుత్వంపై ప్రధాని మోదీ ధ్వజం
- ఆమె పాదాల కింద మట్టి కదుల్తోందని వ్యాఖ్య





మోదీని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు. గందరగోళం సమయంలో బారికేడ్లు దూకేందుకు ప్రయత్నిస్తున్న కార్యకర్తలు

దుర్గాపూర్/ఠాకూర్‌నగర్: రాబోయే లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ ప్రచారం ప్రారంభించారు. బీజేపీ కార్యకర్తల హత్యాకాండకు పాల్పడుతున్న అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మధ్యతరగతి ప్రజల ఆశల్ని చిదిమేస్తోందని ఆరోపించారు. బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుండటంతో సీఎం మమతా బెనర్జీకి గుబులు మొదలైందని అన్నారు. ఆమె పాదాల కింద నేల క్రమంగా కదిలిపోతోందని చురకలంటించారు. దుర్గాపూర్, ఠాకూర్‌పూర్‌లలో శనివారం జరిగిన రెండు వేర్వేరు కార్యక్రమాల్లో మమతా ప్రభుత్వంపై మోదీ నిప్పులు చెరిగారు. తృణమూల్ కాంగ్రెస్ అంటే తృణమూల్ తోలాబ్జి టాక్స్(ట్రిపుల్ టీ)గా నిలిచి పోయిందని ఎద్దేవా చేశారు. బెంగాలీలో తోలాబ్జి అంటే వ్యవస్థీకృత బలవంతపు వసూళ్లు అని అర్థం. ఇతర దేశాల్లో మతపర వేధింపులు ఎదుర్కొని మన దేశంలో శరణు కోరేవారికి న్యాయం, గౌరవం కల్పించాలంటే పౌరసత్వ బిల్లుకు చట్ట రూపం తేవాల్సిందేనని పునరుద్ఘాటించారు.

కమ్యూనిస్టుల బాటలోనే మమత..

ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కేందుకు మమత గతంలో పాలించిన కమ్యూనిస్టుల బాటలోనే నడుస్తున్నారని దుర్గాపూర్‌లో జరిగిన ర్యాలీలో మోదీ విమర్శించారు. బెంగాల్‌లో రూ.90 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చిందని, వాటిని అమలుచేయాలనే ఆసక్తి తృణమూల్ సర్కార్‌కు కొరవడిందని, వారు ఆ పనుల్లో వాటా కోరుకుంటున్నారన్నారు. బెంగాల్‌కు వలసొచ్చిన మతువా అనే ఎస్సీ వర్గం ఠాకూర్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మోదీ..పౌరసత్వ బిల్లుకు చట్టరూపం కల్పించాల్సిన ఆవశ్యకత తను నొక్కి చెప్పారు. తూర్పు పాకిస్తాన్‌కు చెందిన మతువాలు 1950లలో బెంగాల్‌కు వలసొచ్చారు. సుమారు 30 లక్షల జనాభా ఉండే ఈ వర్గం కనీసం ఐదు లోక్‌సభ స్థానాల్లో ప్రభావం చూపగలదు. అయితే, వారిలో ఇంకా చాలా మందికి భారత పౌరసత్వం దక్కలేదు. ఈ నేపథ్యంలో మతువాలను బీజేపీకి ఓటు బ్యాంకుగా మలిచేలా మోదీ పౌరసత్వ బిల్లుకు మద్దతుగా ప్రసంగించారు.

సభలో గందరగోళం

ఠాకూర్‌నగర్ సభకు ప్రజలు భారీ ఎత్తున హాజరుకావడంతో తొక్కిసలాట జరిగినంత పనైంది. ఈ ఘటనలో పలువురు మహిళలు, పిల్లలు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వేదికకు దూరంగా ఉన్న వందలాది మంది మద్దతుదారులు బారికేడ్లు బద్దలుకొట్టి మరింత లోనికి చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించడంతో కొంత గందరగోళం నెలకొంది. ఉన్న చోటే ఉండాలని, ముందుకు రావొద్దని ప్రధాని మోదీ వారించినా కొందరు కార్యకర్తలు సభలోని కుర్చీలు విసిరేస్తూ నానా హైరానా సృష్టించారు. దీంతో మోదీ 14 నిమిషాల ముందే తన ప్రసంగాన్ని ముగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, కేంద్రం ప్రతిపాదించిన పౌరసత్వ(సవరణ) బిల్లును వ్యతిరేకిస్తున్నామని మమత చెప్పారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బిల్లు చట్టరూపం దాల్చకుండా మోదీని నిలువరిస్తానని ఆమె వ్యాఖ్యానించారు.

బెంగాల్‌లో బల ప్రదర్శన!

పోటాపోటీ ర్యాలీలకు తృణమూల్, బీజేపీ రెడీ

మమతా బెనర్జీ గత నెలలో బీజేపీయేతర పార్టీలతో భారీ ర్యాలీ నిర్వహించిన సంగతి తెలిసిందే. దానికి పోటీగా రాష్ట్ర వ్యాప్తంగా మోదీ, అమిత్ షాలతో బహిరంగ సభలు నిర్వహించేందుకు బీజేపీ సిద్ధమైంది. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు తమ అగ్ర నాయకులతో ర్యాలీలు నిర్వహించాలని కమలనాథులు ప్రణాళికలు రచించారు. అయితే ఈ ప్రయత్నాల్ని అడ్డుకోవడానికి తృణమూల్ తన వంతు ప్రయత్నాల్ని చేస్తోంది. ఒకవైపు మోదీకి, బీజేపీకి వ్యతిరేకంగా వివిధ పార్టీలను కూడగడుతున్న మమతా బెనర్జీ ఇతర పార్టీల నేతలను తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. బీజేపీ ప్రతిపాదించిన ర్యాలీలు, సభలకు అనుమతులను నిరాకరిస్తున్నారు.

బీజేపీ సభలకు తృణమూల్ అడ్డుపుల్లలు..

విపక్షాల మహాగట్‌బంధన్ ర్యాలీకి ఏమాత్రం తీసిపోకుండా బెంగాల్ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికల నాటికి రాష్ట్రంలోని 32 లోక్‌సభ నియోజకవర్గాల్లో 300 ర్యాలీలు చేపట్టాలని ప్రణాళికలు వేసింది. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లాంటి హేమాహేమీలు ఈ ర్యాలీల్లో పాల్గొంటారు. జనవరి 23న జర్‌గ్రామ్, సురి ర్యాలీల్లో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పాల్గొనాల్సి ఉండగా, ఆమె హెలికాప్టర్ ప్రభుత్వ హెలిప్యాడ్‌లో దిగేందుకు అనుమతించడంలో జాప్యం జరిగింది. దీంతో స్మృతి పర్యటన రద్దయింది. ఈస్ట్ మిడ్నపూర్‌లోని కాంతి దగ్గర బీజేపీ మద్దతుదారుడి పొలంలో అమిత్‌షా ర్యాలీకి ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం పక్కనున్న భూస్వాములతో ర్యాలీకి వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదు చేయించింది. 'బెంగాల్ నుంచి తృణమూల్‌ను తరిమికొట్టడానికి అనుక్షణం పోరాడతా. నా హెలికాప్టర్ దిగేందుకు ప్రభుత్వం అనుమతించకపోతే హెలికాప్టర్ నుంచే ప్రసంగిస్తా. మా రథ యాత్రను అడ్డుకుంటే కాలినడకనే ఊరేగుతాం'అని అమిత్ అన్నారు.

దళిత ప్రొఫెసర్ ఆనంద్ అరెస్టు అక్రమం

వెంటనే విడుదల చేయాలని పోలీసులకు పుణే కోర్టు ఆదేశం



పుణే: దళిత ప్రొఫెసర్ ఆనంద్ తెల్తుంబ్డే అరెస్ట్‌పై పుణే కోర్టు పోలీసులను తప్పుబట్టింది. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఆనంద్ తెల్తుంబ్డే శనివారం తెల్లవారు జామున కేరళ నుంచి విమానంలో ముంబై ఎయిర్‌పోర్టుకు చేరుకోగానే పుణే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2017లో ఎల్గార్ పరిషత్‌లో జరిగిన సమావేశానికి మావోయిస్టులు మద్దతు తెలిపారనీ, ఆ సమావేశంలో వివిధ నేతల రెచ్చగొట్టే ప్రసంగాల కారణంగానే కోరేగావ్–భీమా యుద్ధం స్మారకం వద్ద హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయనేది పోలీసుల ఆరోపణ. తెల్తుంబ్డే మావోయిస్టుల మధ్య సాగిన ఉత్తరప్రత్యుత్తరాల వివరాలు కూడా తమ వద్ద ఉన్నాయంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ కేసు అక్రమమంటూ తెల్తుంబ్డే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసు కొట్టివేసేందుకు నిరాకరించిన న్యాయస్థానం.. ఈ నెల 11వ తేదీ వరకు ఆయన్ను అరెస్టు చేయరాదంటూ పోలీసులను ఆదేశించింది. ఆలోగా న్యాయస్థానం నుంచి బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అయితే, పుణే పోలీసులు ఈలోగానే అరెస్టు చేయడం అక్రమమని అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి కిశోర్ వదానే పేర్కొన్నారు.

అధునాతన రైఫిళ్ల కొనుగోలుకు ఓకే



న్యూఢిల్లీ: దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న అధునాతన రైఫిళ్ల కొనుగోలుకు సిద్ధమైంది. ఈ మేరకు అమెరికా నుంచి 73 వేల రైఫిళ్లను ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో కొనుగోలుకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపారని అధికారులు వెల్లడించారు. సిగ్ సూయేర్ అని పిలవబడే ఈ రైఫిళ్లను 3,600 కిలోమీటర్లు ఉన్న చైనా సరిహద్దు ప్రాంతంలోని భద్రతా బలగాలకు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. రైఫిళ్ల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందం వారంలో పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఒప్పందం పూర్తయిన సంవత్సరంలో రైఫిళ్లను డెలివరీ చేస్తారని సంబంధిత అధికారులు వివరించారు. వీటిని ఇన్సాస్ రైఫిళ్ల స్థానంలో ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఈ రైఫిళ్లను అమెరికా దళాలతో పాటు యూరప్ దేశాలు కూడా ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలోనే కొనుగోలు చేశాయని వెల్లడించారు.

కోల్‌కతా పోలీస్ బాస్ అదృశ్యం



న్యూఢిల్లీ: కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ కనిపించకుండా పోయారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రోజ్ వ్యాలీ, శ్రద్ధా పోంజి భారీ కుంభకోణాలపై దర్యాప్తునకు గతంలో రాజీవ్‌కుమార్ నేతృత్వం వహించారు. అనంతరం 2014లో సుప్రీంకోర్టు ఆదేశాలతో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. ఆ కుంభకోణాలకు సంబంధించిన పలు కీలక పత్రాలు కనిపించకుండా పోయినట్లు గుర్తించింది. వాటి కోసం పలుమార్లు ఆయనకు నోటీసులు జారీ చేసినా స్పందించ లేదు. రాజీవ్ సెల్‌ఫోన్‌సహా ఏ ఇతర నంబర్ పనిచేయట్లేదు. ఈ పరిస్థితుల్లో ఆయన్ను అరెస్టు చేయడం తప్ప తమకు మరో మార్గం లేదని సీబీఐ వర్గాలు అంటున్నాయి.

'ఎయిర్‌సెల్' శివశంకరన్ ఆస్తులు అటాచ్

సాక్షి, చెన్నై: 'ఎయిర్‌సెల్' సంస్థ వ్యవస్థాపకుడు శివశంకరన్‌కు చెందిన చెన్నైలోని రూ.224 కోట్ల ఆస్తులను ఈడీ శనివారం అటాచ్ చేసింది. శివశంకరన్ కొంతకాలం క్రితం ఐడీబీఐ బ్యాంక్ నుంచి వ్యాపార నిమిత్తం రూ.600 కోట్ల అప్పు తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని సొంత అప్పుల్ని తీర్చేందుకు వాడుకున్నాడు. వడ్డీ చెల్లించకపోవడంతో ఐడీబీఐ పలుమార్లు నోటీసులిచ్చింది. అసలు చెల్లించాలని ఒత్తిడి చేయగా శివశంకరన్ చేతులు ఎత్తేశాడు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన ఈడీ చెన్నైలో శివశంకరన్‌కు చెందిన రూ.224 కోట్ల విలువైన స్థిర, రూ.35 లక్షల చరాస్తులను అటాచ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా అళగిరి

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌లో ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పలు నియామకాలు చేపట్టారు. కేఎస్ అళగిరిని తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా, హెచ్ వసంత కుమార్, కె జయకుమార్, ఎంకే విష్ణు ప్రసాద్, మౌర్య జయకుమార్‌లను కార్యనిర్వాహక అధ్యక్షులుగా నియమించారు. ప్రస్తుత తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు తిరునావక్కరసర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ, ఇన్నాళ్లూ ఆ పదవిలో ఉన్నందుకు ఆయనను రాహుల్ అభినందించారు. మరియం బీబీ, మియాని దాల్బోత్‌లను వరుసగా అండమాన్, నికోబార్ దీవులు, మేఘాలయ మహిళా కాంగ్రెస్‌లకు కార్యనిర్వాహక అధ్యక్షురాళ్లుగా రాహుల్ నియమించారు. లక్షద్వీప్‌కు ఎన్నికల కమిటీని ఏర్పాటు చేశారు. ఢిల్లీ, గుజరాత్, త్రిపుర, పశ్చిమ బెంగాల్, చండీగఢ్‌ల ఏఐసీసీ ఎస్సీ విభాగంలోనూ కొందరిని రాహుల్ గాంధీ నియమించారు.



రోడ్లపై పాదచారులకు సాయం చేసే దేశంలోని తొలి రోడ్డు భద్రతా రోబో ఇది. దీని పేరు రోడియో. శనివారం థానేలో దీన్ని ప్రదర్శించారు.

సీబీఐ కొత్త చీఫ్‌గా శుక్లా

- మధ్యప్రదేశ్ మాజీ డీజీపీని ఎంపిక చేసిన కేంద్రం
- ఆయన నియామకం నిబంధనల ఉల్లంఘనే: ఖర్గే

న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) కొత్త చీఫ్‌గా మధ్యప్రదేశ్ మాజీ డీజీపీ రిషి కుమార్ శుక్లా(58)ను కేంద్రం ఎంపిక చేసింది. ఆయన సీబీఐ డైరెక్టర్‌గా రెండేళ్లపాటు కొనసాగుతారని తెలిపింది. ఈ మేరకు సిబ్బంది వ్యవహారాల శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎంతో కీలకమైన సీబీఐ డైరెక్టర్ పదవిని భర్తీ చేయకుండా ఇంకా ఎంతకాలం ఖాళీగా ఉంచుతారని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రాన్ని ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే, సీబీఐ డైరెక్టర్ ఎంపిక కోసం ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేలతో కూడిన అత్యున్నత ఎంపిక కమిటీ జనవరి 24వ తేదీన భేటీ అయినా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. తిరిగి ఈ నెల ఒకటో తేదీన సమావేశమై అర్హులైన కొందరు అధికారుల పేర్లను పరిశీలించింది. వీరందరిలోనూ ఏకాభిప్రాయంతో ఎంపిక చేసిన అన్ని విధాలుగా అర్హుడైన ఆర్‌కే శుక్లాను సీబీఐ చీఫ్‌గా నియమిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

1983 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శుక్లా 2016 నుంచి ఈ ఏడాది జనవరి వరకు మధ్యప్రదేశ్ డీజీపీగా పనిచేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన్ను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బదిలీ చేసింది. కాగా, శుక్లా ఈనెల 4వ తేదీన సీబీఐ చీఫ్‌గా కొత్త బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయని తెలుస్తోంది. సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మ,, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాలు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకోవడంతో కేంద్రం ఇద్దరినీ సెలవుపై పంపిన విషయం తెలిసిందే. అనంతరం జరిగిన వివిధ పరిణామాల నేపథ్యంలో ఎం.నాగేశ్వరరావును సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించింది.



ఖర్గే అసంతృప్తి

సీబీఐ చీఫ్‌గా రిషి కుమార్ శుక్లాను కేంద్రం ఎంపిక చేయడంపై కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేశారు. అవినీతి కేసుల విచారణలో ఏమాత్రం అనుభవం లేని శుక్లాను నియమించడం ఎంపిక ప్రక్రియను, సుప్రీం కోర్టు తీర్పులను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. శుక్లా నియామకంపై అసంతృప్తి తెలుపుతూ అత్యున్నత ఎంపిక కమిటీ సభ్యుడు అయిన ఖర్గే శనివారం ప్రభుత్వానికి లేఖ రాశారు. 'అవినీతి వ్యతిరేక కేసుల విచారణలో అనుభవం లేని అధికారిని నియమించడం ద్వారా అత్యున్నత ఎంపిక కమిటీ నిబంధనలను అతిక్రమించడంతో పాటు సీబీఐ డైరెక్టర్ ఎంపికలో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను పట్టించుకోలేదు. కీలకమైన పోస్టులకు అనుభవాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం సరిరాదు. అవినీతి కేసుల దర్యాప్తులో అనుభవంతోపాటు సీబీఐలో పనిచేసిన అనుభవాన్ని పరిశీలించాలి' అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

తప్పుదోవ పట్టించేందుకు ఖర్గే యత్నం

సీబీఐ చీఫ్ ఎంపిక ప్రక్రియను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ నేత, అత్యున్నత స్థాయి ఎంపిక కమిటీ సభ్యుడైన మల్లికార్జున ఖర్గే ప్రయత్నించారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఆరోపించారు. తను సూచించిన వ్యక్తులకు సీబీఐలో స్థానం కల్పించేందుకు, అత్యున్నత స్థాయి సమావేశాల్లో జరిగిన పరిణామాలపై మీడియాకు తన సొంత భాష్యం చెప్పారని విమర్శించారు.

మధ్యప్రదేశ్ కేడర్ నుంచి తొలి అధికారి

మధ్యప్రదేశ్ కేడర్ నుంచి సీబీఐ డైరెక్టర్ పదవికి ఎంపికైన మొదటి వ్యక్తిగా ఆర్‌కే శుక్లా చరిత్ర సృష్టించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన ఆర్‌కే శుక్లా ఫిలాసఫీలో పీజీ చేశారు. జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ అనంతరం రాయ్‌పూర్, దామోహ్, శివ్‌పురి, మంద్‌సౌర్ జిల్లాల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. మధ్యప్రదేశ్ డీజీపీగా ఆయన దాదాపు రెండున్నరేళ్లు పనిచేశారు. డీజీపీగా.. లైంగిక దాడి కేసులపై త్వరితంగా విచారణ చేపట్టి, శిక్షలు పడేలా చేయడం ద్వారా రాష్ట్రంలో అటువంటి ఘటనల సంఖ్యను గణనీయంగా తగ్గించ గలిగారు. ఆయనకు సీబీఐలో పనిచేయకున్నా ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో పలు సున్నితమైన కేసులను పరిష్కరించిన అనుభవం ఉంది. బందీలపై సంప్రదింపుల ప్రక్రియ, సంక్షోభ నిర్వహణ వంటి వివిధ అంశాలపై అమెరికా, బ్రిటన్‌లలో శిక్షణ పొందారు. సీబీఐ పలు వివాదాలతో రచ్చకెక్కిన సమయంలో శుక్లా బాధ్యతలు చేపట్టనుండటంతో అందరి దృష్టీ ఆయన పైనే పడింది.



చెన్నైకి చిరుత.. వయా థాయిలాండ్

సాక్షి, చెన్నై: చిరుతపులి కూనను దొంగచాటుగా తెచ్చిన ఓ వ్యక్తిని చెన్నై విమానాశ్రయం అధికారులు అరెస్ట్‌చేశారు. చెన్నైకి చెందిన మొహిద్దీన్(28) శనివారం వేకువజామున బ్యాంకాక్ నుంచి థాయ్ ఎయిర్‌లైన్స్ విమానంలో చెన్నైకి చేరుకున్నాడు. చేతిలో చిన్న వెదురుబుట్టతో విమానాశ్రయంలో సంచరిస్తున్న మొహిద్దీన్‌ను కస్టమ్స్ అధికారులు అనుమానించారు. వెదురుబుట్టలో ఏముందని ప్రశ్నించగా కుక్కపిల్ల ఉందని బదులిచ్చాడు. పొంతనలేని సమాధానాలివ్వడంతో జంతు సంరక్షణ విభాగం వారిని అధికారులు పిలిపించారు. అది చిరుత కూన అని ఆ అధికారులు తేల్చారు. కూనను తిరిగి బ్యాంకాక్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిని ఇక్కడి ఓ సర్కస్ కంపెనీ కోసం తీసుకొచ్చినట్లు మొహిద్దీన్ చెప్పాడు.

రాబర్ట్ వాద్రాకు మధ్యంతర బెయిల్

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ బావ రాబర్ట్ వాద్రాకు ఢిల్లీలోని ఓ కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఈ నెల 6వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట హాజరై విచారణకు సహకరించాలని సూచించింది. లండన్‌లోని రూ.17.77 కోట్ల విలువ చేసే ఆస్తులను మనీలాండరింగ్ ద్వారానే వాద్రా సమకూర్చున్నారంటూ ఈడీ ఆరోపిస్తోంది. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న వాద్రా తన న్యాయవాది ద్వారా మధ్యంతర బెయిల్ కోసం కోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. 'వాద్రా తన తల్లికి చికిత్స చేయించేందుకు లండన్ వెళ్లారు. 6న ఇక్కడికి వచ్చిన తర్వాత ఈడీ ఎదుట హాజరవుతారు' అని వాద్రా తరపు లాయర్ చెప్పారు. దీంతో కోర్టు వాద్రాకు బెయిలు మంజూరు చేసింది. ఇందుకోసం, రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుతోపాటు అంతే సమానమైన జామీను సమర్పించాలని ఆదేశించింది.

రాహుల్‌తో మన మాట

- కొత్త కార్యక్రమం ప్రారంభించిన కాంగ్రెస్ అధ్యక్షుడు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాహుల్

న్యూఢిల్లీ: 'అప్నీ బాత్ రాహుల్ కే సాథ్' (రాహుల్‌తో మన మాట) పేరుతో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారిని కలుసుకుని మాట్లాడి, దేశ భవిష్యత్తు, ప్రభుత్వాల పని, సమాజంలో రావాల్సిన మార్పులు తదితర విషయాలపై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. తొలిదశలో భాగంగా ఢిల్లీ, అస్సాం, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్‌ల నుంచి వచ్చిన ఏడుగురు విద్యార్థులు శుక్రవారం రాత్రి ఢిల్లీలోని ఓ చైనీస్ రెస్టారెంట్‌లో రాహుల్‌ను కలిశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను బ్రెయిలీ లిపిలోనూ విడుదల చేయడం, ఎల్జీబీటీ క్యూలపై వివక్షను రూపుమాపేందుకు లింగ–తటస్థ మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం, విద్యావ్యవస్థలో అసమానతలను దూరం చేయడం, సమాజంలో కుల వివక్షను నిర్మూలించడం తదితర విషయాలపై విద్యార్థులు సలహాలిచ్చారు. కాంగ్రెస్ పార్టీతో సమావేశమని చెప్పి తమను తీసుకొచ్చారనీ, పార్టీ అధ్యక్షుడే రావడంతో తామంతా అవాక్కయ్యామని ఈ భేటీలో పాల్గొన్న ఓ విద్యార్థి చెప్పాడు. రాహుల్ సామాన్యులతో బాగా కలిసిపోయే వ్యక్తి అనీ, తాము చెప్పినవన్నీ ఆయన సావధానంగా వినడమేగాక, మేనిఫెస్టోలో చేర్చేందుకు కూడా ప్రయత్నిస్తామన్నారని విద్యార్థులు వెల్లడించారు.

'పీఎం–కిసాన్' లబ్ధిదారుల్ని గుర్తించండి

- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు
- గ్రామ పంచాయతీ నోటీసు బోర్డుల్లో లబ్ధిదారుల వివరాలు



న్యూఢిల్లీ: పీఎం–కిసాన్ పథకం కింద తొలి విడతలో రూ.2 వేలు పొందే చిన్న, సన్నకారు రైతులను గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఈ పథకానికి ఇప్పటికే రూ.20 వేల కోట్లు కేటాయించారు. దేశవ్యాప్తంగా మొత్తం 12 కోట్ల మంది రైతులు ఈ పథకం కింద ప్రయోజనం పొందుతారని అంచనా. ఈశాన్య రాష్ట్రాల్లో మినహా ఈ రైతు ప్యాకేజీ అమలులో పెద్దగా ఇబ్బందులేమీ రావని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ చెప్పారు. సాగుకు పెట్టుబడి సాయంపై వ్యవసాయ శాఖ చాలా రోజులుగా కసరత్తు చేస్తోందని, అదే ఉత్సాహంతో ఈ పథకాన్ని అమలుచేస్తామని తెలిపారు. రూపకల్పన కన్నా అమలుపరచడమే ఇందులో ప్రధానమని, చిన్న, సన్నకారు రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధను తాజా బడ్జెట్ ప్రతిబింబిస్తోందని అన్నారు. లబ్ధిదారుల్ని గుర్తించే ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, వ్యవసాయ కార్యదర్శులకు ఈ నెల 1న లేఖలు పంపారని వెల్లడించారు. లబ్ధిదారుల పేరు, కులం తదితర వివరాల్ని సేకరించి స్థానిక గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో ఉంచాలని లేఖలో సూచించారు. చాలా రాష్ట్రాల్లో భూ దస్త్రాల డిజిటలీకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఫిబ్రవరి ఒకటి నాటికి భూ రికార్డుల్లో పేర్లు నమోదైన యజమానులే పీఎం–కిసాన్ పథకానికి అర్హులని రాజీవ్ కుమార్ తెలిపారు. ఏడాదికి రూ.6 వేలు అంటే చిన్న మొత్తమేమీ కాదని, ఆ డబ్బుతో పేద రైతులు ఎన్నో ఖర్చులు వెళ్లదీసుకోవచ్చని అన్నారు.

చిక్కులు తప్పవు: నిపుణులు

పథకం అమలులో న్యాయపర చిక్కులు తప్పవని వ్యవసాయ నిపుణుల విశ్లేషణ. యాజమాన్య హక్కులపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ పథకానికి కొన్ని సవాళ్లు ఎదురవుతాయని సీనియర్ న్యాయవాది ఎస్‌కే పొద్దార్ పేర్కొన్నారు. ఒకే సాగు భూమికి ఒకరి కన్నా ఎక్కువ మంది యజమానులు ఉండి, వారందరికీ రూ.6 వేల చొప్పున సాయం అందితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ పథకం కింద వెచ్చించే కోట్లాది రూపాయలు అనుత్పాదక వినియోగంలోకి వెళ్తాయని ఆర్థిక నిపుణుడు శశికాంత్ సిన్హా అన్నారు.

విద్యార్థుల వివరాలకు హాట్‌లైన్

- అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో ఏర్పాటు
- అరెస్టయిన విద్యార్థుల వివరాల కోసం సంప్రదించొచ్చని వెల్లడి
- కొందరు విద్యార్థుల కాళ్లకు ట్రాకింగ్ పరికరాలు
- అందరినీ విడుదల చేయాలని కోరిన భారత్




వాషింగ్టన్/న్యూఢిల్లీ: అమెరికాలో వీసా మోసం కేసులో అరెస్టయిన 129 మంది భారతీయ విద్యార్థులను విడిపించేందుకు భారత విదేశాంగ శాఖ, అమెరికాలోని భారత దౌత్య కార్యాలయాలు కృషి చేస్తున్నాయి. అరెస్టయిన విద్యార్థులకు సంబంధించిన వివరాలు అందించేందుకు వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయంలో హాట్‌లైన్లను ఏర్పాటు చేశారు. +12023221190, +12023402590 నంబర్లకు ఫోన్ చేయడం ద్వారా అరెస్టయిన విద్యార్థులకు సంబంధించిన వివరాలను వారి బంధువులు, స్నేహితులు తెలుసుకోవచ్చని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ నంబర్లు 24x7 పనిచేస్తాయనీ, cons3.washington@mea.gov.inకు ఈ–మెయిల్ పంపడం ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. విద్యార్థి వీసాలను దుర్వినియోగం చేస్తున్న విదేశీయులను పట్టుకునేందుకు అమెరికా అధికారులే ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీ పేరుతో నకిలీ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి వల పన్నడం తెలిసిందే. ఈ యూనివర్సిటీలో 600 మంది విద్యార్థులుగా చేరారు. వారిని చేర్పించిన 8 మంది మధ్యవర్తులను కూడా పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ యూనివర్సిటీలో తరగతులుండవు, నిబంధనల ప్రకారం ఈ విశ్వవిద్యాలయం పనిచేయదని తెలిసినా కేవలం అమెరికాలో ఉండి, ఇతర ఉద్యోగాలు చేసుకోవడం కోసమే ఆ 600 మంది ఇక్కడ చేరారని అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ విషయం వారికి తెలియదనీ, చాలా యూనివర్సిటీ కోర్సుల్లో చదువుతున్న సమయంలోనే ఉద్యోగాలు చేసుకునే వీలు కూడా ఉంది కాబట్టి ఇది కూడా అసలైనదేనని విద్యార్థులు భావించారని అరెస్టయిన వారి తరపు న్యాయవాదులు అంటున్నారు.

రాజకీయ చర్య తీసుకున్న భారత్

విద్యార్థులు అరెస్టవ్వడంపై భారత్ శనివారం రాజకీయపరమైన చర్య తీసుకుంది. అరెస్టయిన విద్యార్థులను కలిసేందుకు భారత దౌత్యాధికారులను తక్షణం అనుమతించాలని ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయాన్ని కోరింది. ప్రస్తుత పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామనీ, చర్యలు తీసుకుంటున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. ఇప్పటికే కొందరు దౌత్యాధికారులు అరెస్టయిన విద్యార్థులను కలుసుకున్నారని చెప్పింది. అరెస్టయిన వారందరినీ విడుదల చేయాలనీ, వారికి ఇష్టం లేకుండానే అమెరికా నుంచి పంపించి వేయద్దని భారత్ కోరింది.

ఎక్కడికీ వెళ్లకుండా ప్రత్యేక పరికరాలు



ఈ యూనివర్సిటీలో చేరిన 130 మందిని (వారిలో 129 మంది భారతీయులు) ఇప్పటికే అరెస్టు చేసిన అధికారులు, మరింత మందిని త్వరలో పట్టుకునే చాన్సుంది. కాగా, కొంతమంది విద్యార్థులు వారు నివసిస్తున్న ప్రదేశం నుంచి ఎక్కువ దూరం బయటకు వెళ్లడానికి వీలు లేకుండా వారి కాలి చీలమండ దగ్గర ట్రాకింగ్ పరికరాలను అమర్చారు.

ప్రపంచ దేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు ఉడ్రోవిల్సన్.. 1920 జనవరి 10 నానాజాతి సమితిని స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఏర్పాటు చేశారు.



ఫేస్‌బుక్ వదిలేస్తే...!

పొద్దున్న లేస్తూనే అద్దంలో మన ఫేస్ చూస్తామో లేదో కానీ ఫేస్‌బుక్ మాత్రం ఓపెన్ చేసి చూస్తాం.. అప్‌డేట్స్ అన్నీ ఆత్రుతగా చదివేస్తాం. అది లేకపోతే మనకి జీవితమే లేదని భ్రమల్లో బతికేస్తాం. అంతలా ఫేస్‌బుక్‌కి మనం బానిసలైపోయాం. నిజంగానే ఫేస్‌బుక్ అలవాటుని ప్రజలు మానుకోలేరా ? అది లేకుండా వాళ్లకు నిద్ర కూడా పట్టదా ? ఇలాంటి విషయాలన్నీ తెలుసుకోవడానికి అమెరికాకు చెందిన స్టాన్‌ఫర్డ్, న్యూయార్క్ యూనివర్సిటీ (ఎన్‌వైయూ)లు ఇటీవల ఒక అధ్యయనం నిర్వహించాయి. గత ఏడాది అమెరికాలో మధ్యంతర ఎన్నికలకు ముందు ఫేస్‌బుక్‌కి ఏడాది పాటు దూరంగా ఉంటే వెయ్యి నుంచి రెండు వేల డాలర్లు ఇస్తామంటూ ఎఫ్‌బీ వినియోగదారులకు సవాల్ విసిరాయి. డబ్బులకి ఆశపడో, సోషల్ మీడియాకు దూరంగా ఉండడమే మంచిదని భావించారో, కారణం ఏదైనా ఎందరో ఔత్సాహికులు ఈ సవాల్ స్వీకరించారు. మొత్తం 2,844 మంది ప్రయోగాత్మకంగా తమ ఫేస్‌బుక్ అకౌంట్లను నాలుగు వారాల పాటు డీ యాక్టివేట్ చేశారు. ఆ సమయంలో వారి నిత్య జీవితంలో ఎలాంటి అనూహ్య మార్పులు వచ్చాయో ఆ అధ్యయనం వెల్లడించింది. ఆ అధ్యయనం వివరాలను సోషల్ సైన్స్ రీసెర్చ్ నెట్‌వర్క్ ప్రచురించింది.



ఫేస్‌బుక్‌కి దూరంగా ఉంటే ఏం జరిగిందంటే ..

- బంధు మిత్రులతో హాయిగా నవ్వుతూ తుళ్లుతూ సమయాన్ని గడిపారు.
- ఆన్‌లైన్‌లో ఇతర ఉపయోగకరమైన వెబ్‌సైట్లు చదివి పరిజ్ఞానాన్ని పెంచుకున్నారు.
- రోజుకి ఒక గంట సేపు ఖాళీ సమయం మిగిలింది
- రాజకీయపరమైన భావోద్వేగాలను నియంత్రించుకోగలిగారు
- నకిలీ వార్తలకు బదులుగా బయట ప్రపంచంలో జరుగుతున్న నిజాలు తెలుసుకొని నిష్పక్షపాతంగా ఆలోచించే నేర్పు వచ్చింది.
- మానసిక ఒత్తిడికి దూరమై జీవితం పట్ల ఓ రకమైన సంతృప్తి కలిగింది.
- పుస్తకాలు చదవడం, సంగీతం వినడం, టీవీ చూడడం వంటి పాత అభిరుచుల వైపు మళ్లీ ఆసక్తి కలిగింది.
- నెలరోజుల పాటు దిగ్విజయంగా ఫేస్‌బుక్‌కి దూరంగా ఉన్నవారు, ఇక మీదట తాము ఫేస్‌బుక్ వినియోగాన్ని బాగా తగ్గిస్తామని చెప్పారు. ఆ సమయంలో ఇతర ఉపయోగకరమైన పనులు చేసుకుంటామని వెల్లడించారు.

25–40 శాతం అలవాటు మానుకోలేకపోయారు

సర్వేలో పాల్గొన్నవారిలో 25–40 శాతం మంది ఫేస్‌బుక్ అలవాటు మానుకోలేక మొదటి వారంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారు. దీంతో అధ్యయనకారులు వారికి కౌన్సెలింగ్ ఇవ్వాల్సి వచ్చింది. అలా ఒత్తిడికి లోనైనవారందరినీ ఒకేచోటకి చేర్చి దేనికైనా బానిసలుగా మారడం మంచిది కాదంటూ పాఠాలు చెప్పాల్సి వచ్చింది. దీనిని బట్టి ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలు ప్రతీ మనిషి మెదడుపై ఎంతటి తీవ్రమైన వ్యతిరేక ప్రభావాన్ని చూపిస్తున్నాయో అర్థమవుతోందని అధ్యయనకారులు అంటున్నారు. ఫేస్‌బుక్ వినియోగం డ్రగ్స్‌తో సమానమంటూ ఆందోళన వ్యక్తం చేశారు. నెలరోజుల పాటు ఫేస్‌బుక్ వైపు కూడా ముఖం చూడని వారిని మరో నెలరోజులు ఎఫ్‌బీకి దూరంగా ఉంటే మీకు ఎంత డబ్బులివ్వాలి అని అడిగితే వందలోపు డాలర్లు ఇచ్చినా సరే హాయిగా ఫేస్‌బుక్‌ని వదిలేస్తామంటూ సమాధానం ఇవ్వడం విశేషం. ఈ అధ్యయనంపై ఫేస్‌బుక్ అధికారి ఒకరు స్పందిస్తూ సర్వేల్లో రకరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతాయని అవే సరైనవని అనుకోవాల్సిన పనిలేదన్నారు. ఫేస్‌బుక్ వల్ల వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతోందని, పలు అంశాలపై చర్చలు జరుగుతాయని, ఏది మంచో, ఏది చెడో గ్రహించే నేర్పు ఫేస్‌బుక్ వినియోగదారులకే ఉండాలని పేర్కొన్నారు.

రేవూరికి ప్రసాదరాయ కులపతి పురస్కారం

గుంటూరులో ప్రదానం చేసిన సిద్ధేశ్వరానంద భారతీ స్వామి



డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు దంపతులకు పురస్కారం అందజేస్తున్న ప్రొఫెసర్ పి.ఎల్.నరసింహం, శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామి

గుంటూరు ఈస్ట్: హైదరాబాద్ దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావుకు డాక్టర్ ప్రసాదరాయ కులపతి పురస్కారాన్ని శనివారం ప్రదానం చేశారు. గుంటూరులోని హిందూ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనంత పద్మనాభరావు దంపతులను ఘనంగా సత్కరించారు. పురస్కార గ్రహీత రేవూరి ప్రసంగిస్తూ..కుర్తాళం స్వామివారి సమక్షంలో ఈ పురస్కారం తీసుకోవడం తన అదృష్టమన్నారు. పురస్కార ప్రదాత కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ స్వామి (పూర్వాశ్రమంలో డాక్టర్ ప్రసాదరాయ కులపతి) అనుగ్రహ భాషణం చేస్తూ.. కవి, అవధాన శేఖరుడు, రచయిత, వక్త, పరిపాలనాదక్షుడైన అనంతపద్మనాభరావుకు పురస్కారం ఇవ్వడం సముచితమన్నారు. ఏపీ ప్రభుత్వ ఎక్సైజ్ కమిషనర్ ప్రొఫెసర్ పీఎల్.నరసింహం ప్రసంగిస్తూ..సమాజంలోని రుగ్మతలను అంతమొందించడానికి ఆధ్యాత్మిక సంస్థలు, పీఠాధిపతులు తమవంతు కృషి చేయాలన్నారు. డాక్టర్ ప్రసాదరాయ కులపతి విద్యా పురస్కారాలను కళాశాల కామర్స్ విభాగం ఉపన్యాసకుడు సి.హెచ్.ఆంజనేయులుకు, పరిపాలనా విభాగం సిబ్బంది సీహెచ్‌వీడి.ప్రసాద్‌కు ప్రదానం చేశారు. పింగళి సూరన్న రచించిన రాఘవీయ పాండవీయాన్ని రేవూరి వ్యాఖ్యానంతో రచించిన మొదటి ప్రతిని శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామికి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పాలక మండలి అధ్యక్షుడు ఎస్‌వీఎస్.సోమయాజులు, పాలకమండలి ఉపాధ్యక్షుడు జీవైఎన్.బాబు, కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ డీఎన్.దీక్షిత్, విశ్రాంత ఉపన్యాసకుడు వై.గౌరీశంకర్, ప్రిన్సిపాల్ జి.మధు, పీఎస్‌ఆర్.ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

వందేళ్ల వైభవం ఏది?

సాక్షి ప్రతినిధి, విజయనగరం : రాష్ట్రంలోనే ఏకైక సంగీత, నృత్య కళాశాలగా ఖ్యాతి గడించిన విజయనగరం మహారాజా సంగీత, నృత్య కళాశాల వందేళ్లు పూర్తిచేసుకుంటోంది. ఘంటసాల, పి. సుశీల వంటి గాయకులు సంగీత సాధన చేసిన కళాశాల శత వసంత వేడుకలను ఈ నెల 3, 4, 5 తేదీల్లో నిర్వహించాలని తలపెట్టారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం సైతం రూ.2 కోట్లు కేటాయించింది. కళాశాల ఆధునికీకరణకు రూ.1.38 కోట్లు ఇచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో వేడుకలు జరుపుతామని, జాతీయ, అంతర్జాతీయ కళాకారులను రప్పించి ప్రదర్శనలు ఏర్పాటుచేస్తామని ప్రభుత్వం గొప్పగా చెప్పింది. కానీ, ఇక్కడ జరుగుతున్నది వేరు.

‘కోటి’కి అవమానం

కళాశాల శతవసంతాల మూడు రోజుల ఉత్సవాల బాధ్యతను ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు కోటికి అప్పగించారు. ఇటీవల విజయనగరం, సాలూరులో ఆయనకు జరిగిన సన్మాన కార్యక్రమంలో మంత్రి గంటా కోటితో చర్చించారు. ఒక మెగా ప్రొడ్యూసర్‌తో పాటు సాక్షాత్తూ సీఎం చంద్రబాబునాయుడు కూడా ఈ బాధ్యతలను కోటి నిర్వహించాల్సిందిగా సూచించారు. ఆ నిర్మాత స్వయంగా కోటితో మాట్లాడారు. దీంతో దాదాపు పదిహేను రోజుల సమయాన్ని కేటాయించి కళాతపస్వి కె. విశ్వనాథ్, గాయని పి.సుశీలకు సన్మానంతో పాటు తాను, హరిహరన్, శోభన వంటి వారి కళా ప్రదర్శనలతో మూడు రోజుల కార్యాచరణను కోటి రూపొందించారు. కళాకారులందరి నుంచీ డేట్స్ కూడా తీసుకున్నారు. కానీ, చివరి నిమిషంలో మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖం చాటేశారు. కనీసం ఫోన్‌కి అందుబాటులో కూడా లేరు. దీంతో డేట్స్ అడ్జస్ట్ చేసుకున్న కళాకారులంతా అకస్మాత్తుగా కార్యక్రమం లేదనడంతో ఖంగుతిన్నారట. కోటి మాటను తీసేయలేక, అడ్వాన్సు కూడా తీసుకోకుండా ప్రోగ్రాంకు రావడానికి ఒప్పుకున్నందుకు ఇలా జరిగిందేమిటని వారంతా రాష్ట్ర ప్రభుత్వ తీరును ఆక్షేపిస్తున్నట్లు సమాచారం.



విజయనగరంలోని సంగీత, నృత్య కళాశాల భవనం

విజయనగరం సంగీత, నృత్య కళాశాలలో సర్కారు నిర్లక్ష్యం

- సంగీత దర్శకుడు ‘కోటి’కి బాధ్యతలు అప్పగించి పరాభవం
- ఇందుకు పదిహేను రోజులుగా శ్రమించిన ఆయన..
- కళాకారులందరినీ ఒప్పించిన తర్వాత సర్కారు అవమానం

లెజెండరీల ఊసేది

ఇదిలా ఉంటే.. ఉత్సవాలకు ఉపరాష్ట్రపతిని పిలుస్తున్నామని, సీఎం చంద్రబాబు తప్పనిసరిగా హాజరవుతారని, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కేజే ఏసుదాసు వంటి ఉద్దండ గాయకులను రప్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు చెప్పారు. కానీ, ఇప్పుడు వీటిలో ఏ ఒక్కటీ జరగడంలేదు. ఉపరాష్ట్రపతిని పిలవాలంటే కనీసం నెల ముందైనా అనుమతి తీసుకోవాలి. అదీ జరగలేదు. ఇక ముఖ్యమంత్రి కూడా ‘బడ్జెట్’ నేపథ్యంలో రావడంలేదు. అలాగే, ప్రముఖ గాయకులెవరూ తమ ప్రదర్శనలిచ్చే అవకాశంలేదు. ఆఖరి రోజు శంకరాభరణం ఫేమ్ మంజుభార్గవి బృందం నృత్య ప్రదర్శన ఉంటుందని, గాయని పి.సుశీల ఆరోగ్యం సహకరిస్తే వచ్చే అవకాశం ఉందని మాత్రమే ఇప్పటివరకూ ఉన్న సమాచారంగా నిర్వాహకులు చెబుతున్నారు. పోనీ విద్వాంసులనైనా రప్పిద్దామంటే వారికి అడ్వాన్సుగా ఎంతోకొంత నగదు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.2 కోట్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఉత్సవాలకు ఒకరోజు ముందు ముద్రించి తీసుకువచ్చిన మూడువేల ఆహ్వాన పత్రికలను ఎంతమందికి పంచుతారనే దానికి నిర్వాహకుల వద్ద సమాధానంలేదు. వందేళ్ల వైభవం వేళ ఈ పరిణామాలు కళాశాల ప్రతిష్టను మంటగలుపుతున్నాయి.

స్త్రీ, పురుష సమానత్వం కోసం పాటుపడాలి

ప్రజాస్వామిక రచయిత్రుల సదస్సులో పిలుపు



సదస్సులో బోల్షివిక్ విప్లవం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: స్త్రీ, పురుష సమానత్వం, స్త్రీల అభివ్యక్తీకరణకు పాటుపడాలని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) పిలుపునిచ్చింది. ప్రరవే పదో వార్షిక సదస్సు శనివారం విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగంలో ప్రారంభమైంది. సదస్సుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణల నుంచి పలువురు రచయిత్రులు హాజరయ్యారు. తొలిరోజు స్త్రీల అస్తిత్వ చైతన్యం–సాంస్కృతిక సవాళ్లు అనే అంశంపై మాట్లాడారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం రచనల ద్వారా ఉద్యమించాలని ప్రరవే జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత సూచించారు. జాతీయ కార్యదర్శి కేఎన్ మల్లీశ్వరి మాట్లాడుతూ.. విశాఖ వేదికగా ఉద్భవించిన వేదిక గత పదేళ్లలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని చెప్పారు. పితృస్వామ్యాన్ని కూకటివేళ్లతో పెకలించాలని, మహిళలపై హింస, వివక్ష నశించాలని పీవోడబ్ల్యూ నాయకురాలు ఎం.లక్ష్మి ఆకాంక్షించారు. సతీసహగమనం, బాల్య వివాహాలు, కన్యాశుల్కం, ఇలా అన్నిటా మహిళలే సమిధలవుతున్నారని రచయిత సతీష్‌చందర్ ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో బోల్షివిక్ విప్లవం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సులో మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రచయిత్రులు కృష్ణాబాయి, దేవకీదేవి, కొండవీటి సత్యవతి, సుజయ, ఇలా బందగీ తదితరులు పాల్గొన్నారు.

బాత్రూంలో జారిపడ్డ దేవెగౌడ

సాక్షి, బెంగళూరు: జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ శనివారం ఉదయం బెంగళూరులోని ఆయన నివాసంలో బాత్రూంలో జారి పడ్డారు. దీంతో ఆయన కుడి కాలికి గాయమైంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగానే ఉన్నట్లు జేడీఎస్ నేతలు తెలిపారు. ఆస్పత్రికి వెళ్లే సమయంలో హెచ్‌డీ దేవెగౌడ మీడియాతో మాట్లాడుతూ తన కాలికి స్వల్ప గాయమైందని, కాస్త నొప్పి ఉందని, అంతకుమించి ఏమీ కాలేదని స్పష్టం చేశారు. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, కార్యకర్తలు, అభిమానులు గందరగోళానికి గురికావొద్దని చెప్పారు. దేవెగౌడకు జయదేవ ఆస్పత్రిలో చికిత్స చేసిన వైద్యులు మాట్లాడుతూ ఆయన కాలికి ఎక్స్‌రే తీశామని, ఏ సమస్యా లేదని పేర్కొన్నారు. నాలుగు రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందన్నారు.

గౌతమ్ ఖేతన్‌కు ఈడీ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: వీవీఐపీల కోసం ఉపయోగించే అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో నిందితుడిగా ఉన్న న్యాయవాది గౌతమ్ ఖేతన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీని ఢిల్లీ కోర్టు పొడిగించింది. నల్లధనం, మనీల్యాండరింగ్ కేసుల్లో ఖేతన్‌కు సంబంధాలున్నాయన్న తాజా ఆరోపణల నేపథ్యంలో విచారణ నిమిత్తం ఆరు రోజుల పాటు ఈడీ కస్టడీకీ అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అరవింద్ కుమార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. అక్రమ నగదు రవాణా నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద గతనెల 25న గౌతమ్ ఖేతన్‌ను ఈడీ అరెస్టు చేసింది. అయితే అప్పటికే అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణం కేసు విచారణలో భాగంగా ఖేతన్ బెయిల్ పొందారు. అయితే తనకు సరిగ్గా నిద్రపట్టడం లేదంటూ ఖేతన్ ఫిర్యాదు చేయగా దానిని పరిశీలించిన కోర్టు అందుకు సరైన వైద్యం అందించాల్సిందిగా ఈడీని ఆదేశించింది. మనీ ల్యాండరింగ్‌కు పాల్పడ్డారనడానికి తగిన సాక్ష్యాధారాలున్నాయని, ఆయన తన నేరాన్ని ఒప్పుకున్నారని ఈడీ కోర్టుకు నివేదించింది. ఆయన కస్టడీని పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

కోడి కత్తో... నారా వారి కత్తో తేలుతుంది

- ఎన్ఐఏ దర్యాప్తును జరగనిస్తే నిజాలు బయటకు వస్తాయి
- మీ చేతులకు రక్తం అంటక పోతే విచారణకు ఆటంకాలెందుకు?
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఇక్బాల్



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హత్యాయత్నం కేసులో నిజంగా టీడీపీ నేతల చేతులకు రక్తం అంటక పోతే ఎన్ఐఏ విచారణకు ఆటంకాలెందుకు సృష్టిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పార్లమెంటు పార్టీ కోఆర్డినేటర్, మాజీ ఐపీఎస్ అధికారి మహ్మద్ ఇక్బాల్ సూటిగా ప్రశ్నించారు. ఎన్ఐఏ విచారణతో డొంకంతా కదులుతోందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌పై హత్యాయత్నం జరిగితే... ‘తమ్ముళ్లూ... అది కోడికత్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎగతాళి చేసి మాట్లాడారని, అది కోడి కత్తో... నారా కత్తో త్వరలో తేలుతుందని ఇక్బాల్ హెచ్చరిక చేశారు. ఎన్ఐఏ విచారణకు సహకరించకుండా అడ్డుకోవడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చంద్రబాబు, డీజీపీ ఇద్దరూ కేసును తప్పు దోవ పట్టించేయత్నం చేశారని ఇక్బాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజీపీ ప్రకటనతో గరుడ ఫ్లెక్సీ, మడతలు లేని లేఖను సృష్టించారు కాబట్టే రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేస్తే నిజాలు నిగ్గు తేలవని హైకోర్టును ఆశ్రయించామని, ఇది కేంద్రం పరిధిలో ఉందని పౌర, విమానయాన చట్టం ప్రకారం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం ఎన్ఐఏకి అప్పగించాలని తెలిసినా చంద్రబాబు ఎన్నో అడ్డంకులు సృష్టించారన్నారు. చివరికి హైకోర్టు ఆదేశాలతో ఎన్ఐఏకి కేసును అప్పగించక తప్పలేదన్నారు. జగన్‌పై జరిగిన హత్యాయత్నం వెనుక కుట్ర కోణం ఉందని, నిందితుడు శ్రీనివాసరావును ఎవరెవరు ప్రోత్సహించారో తేలాల్సి ఉందని ఎన్ఐఏ స్పష్టం చేసిందన్నారు. చంద్రబాబు తాను స్వయంగా అబద్ధాలు చెప్పడమే కాక, డీజీపీతోనూ చెప్పించారని, అప్పట్లో వికటాట్టహాసం చేసిన చంద్రబాబు ఇపుడు తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని ఇక్బాల్ ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్‌కు అత్యంత సన్నిహితుడైన ఫ్యూజన్ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి నేర చరిత్ర కలిగిన శ్రీనివాసరావును ఎలా పనిలో పెట్టుకున్నాడనే దానిపై కూడా ఎన్ఐఏ విచారణ చేపడుతుందని ఇక్బాల్ తెలిపారు. ఇన్ని అబద్ధాలు చెబుతున్న చంద్రబాబు ఇంకా ప్రజలను మభ్యపెట్టి, నయవంచన చేసినట్లు మాట్లాడుతున్నాడంటే ఎక్కడ ఆ కత్తి నారా కత్తిగా మారి తన మెడ మీద వేలాడుతుందోనని భయపడుతున్నాడన్నారు. ఈ కేసులో డొంక కదులుతోందని తెలిసే చంద్రబాబు తన దావోస్ పర్యటనను రద్దు చేసుకుని లోకేష్‌ను పంపించారని అన్నారు. దర్యాప్తు కొనసాగాలని ఎన్ఐఏ చెబుతుంటే... దర్యాప్తు ముగిసిందని చెప్పడం ఏమిటని మండిపడ్డారు.

సీఎంగా వైఎస్ ఎలా వ్యవహరించారో గుర్తు చేసుకో చంద్రబాబూ!

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఎలా వ్యవహరించారో చంద్రబాబు గుర్తు చేసుకోవాలని ఇక్బాల్ సూచించారు. పరిటాల రవి హత్య కేసును సీబీఐకి అప్పగించాలని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు డిమాండ్ చేస్తే వైఎస్ వెంటనే ఆదేశించారన్నారు. ప్రతిపక్షనేతపై హత్యాయత్నం జరిగినపుడు కనీస బాధ్యత లేకుండా ముఖ్యమంత్రి వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు ప్రజలకు తన మొహం చూపించే అర్హతే లేదని, ఆయన నల్లగుడ్డ కప్పుకుని ప్రజల ముందుకు రావాలని ఆయన అన్నారు. డ్వాక్రా మహిళలను ఇప్పటికే చంద్రబాబు మోసం చేశారని, పసుపు–కుంకుమ పేరుతో పోస్ట్ డేటెడ్ చెక్కులు ఇచ్చినందుకు తల ఎక్కడ పెట్టుకుంటారని ఆయన ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం

- ఎనిమిది మంది పరిస్థితి విషమం
- బాధితులంతా ఒకే గ్రామానికి చెందినవారు



ఎదురెదురుగా ఢీకొన్న లారీ, మినీ బస్సు

తిరువణ్ణామలై(తమిళనాడు): తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు సమీపంలో లారీ, మినీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. మరో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంది. కాంచీపురం జిల్లా మగరల్ గ్రామానికి చెందిన బంధువులు సుమారు 50 మంది తిరువణ్ణామలై జిల్లాలోని సెయ్యారులో జరిగే పుష్పావతి మహోత్సవానికి మినీ బస్సు, ఆటోలో శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో బయలు దేరారు. తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు సమీపంలోని తుంబి గ్రామం వద్ద వేలూరు జిల్లా వాయపందల్ గ్రామం నుంచి ఇటుకల లోడుతో చెన్నై వైపు వస్తున్న లారీ, మినీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. మినీ బస్సు, లారీ రోడ్డు పక్కనున్న పల్లపు ప్రాంతంలో బోల్తాపడ్డాయి. క్షతగాత్రుల కేకలు విన్న స్థానికులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని మినీ బస్సు కింద చిక్కుకున్న డ్రైవర్ మణిగండన్(25), బస్సులో ప్రయాణం చేసిన మగరల్ గ్రామానికి చెందిన పెరుమాల్(50), అతని భార్య అమ్ములు(40), ఉమ(30) కుప్పు(40), జయశ్రీ(40) ఆరుగురిని బయటకు తీశారు. అప్పటికే ఆ ఆరుగురు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గాంధీ, పార్‌సెల్వం, రాజారామ్, ఇళవరసి, విజయ, సరళ, తిలగం, చిన్నపొన్ను, అముద, లక్ష్మి, మేరి, నటరాజన్, మల్లిగ, ఏయుమలైతో పాటు మొత్తం 30 మందిని అంబులెన్స్ సాయంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సెయ్యారు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెంగల్‌పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఐపీఎం లేబొరేటరీకి గ్రహణం!

వ్యాధులు, కల్తీ ఆహార నిర్ధారణకు హైదరాబాద్‌పై ఆధారపడాల్సిన దుస్థితిలో రాష్ట్రం

- ఫుడ్ లేబొరేటరీకి కూడా గతి లేదు
- దీని ఏర్పాటుకు రూ.7 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో డబ్బు వెనక్కి తీసుకుంటామని కేంద్రం లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రానికి అత్యంత అవసరమైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) లేబొరేటరీ నాలుగున్నరేళ్లు గడిచినా ఏర్పాటు కాలేదు. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నారాయణగూడలో ఉన్న ఐపీఎం లేబొరేటరీ తెలంగాణకు వెళ్లింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో దీన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కనీస చర్యలు కూడా చేపట్టలేదు. వ్యాధుల ముందస్తు నిర్ధారణ, వ్యాధుల ముప్పు గుర్తించడం, అంటు వ్యాధులు మొదలుకొని అనేక వైరల్, బ్యాక్టీరియా వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి రాష్ట్రాన్ని అప్రమత్తం చేసే లేబొరేటరీ ఇది. దీంతో నమూనాలన్నింటిని హైదరాబాద్‌కు పంపించాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్రం విడిపోయాక 30 మంది వరకూ సిబ్బంది ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినా లేబొరేటరీ లేకపోవడంతో కార్యాలయానికి వచ్చిపోతున్నారు. రూ.పది కోట్లు ఖర్చు చేస్తే పూర్తి స్థాయిలో వచ్చే లేబొరేటరీ ఏర్పాటుకు సర్కారు ముందుకు రాకపోవడం విస్మయం కలిగిస్తోందని అధికారులు చెబుతున్నారు.



నమూనాలన్నీ హైదరాబాద్‌కు పంపాల్సిందే

ఆంధ్రప్రదేశ్‌లో ఐపీఎం లేబొరేటరీ ఉంటే వివిధ రకాల వ్యాధుల నిర్ధారణ మన రాష్ట్రంలోనే చేయొచ్చు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ నిర్ధారణ కేంద్రంగా దీన్ని భావిస్తారు. విదేశాలకు వెళ్లేవారికి సైతం ఐపీఎంలోనే వ్యాక్సిన్‌లు వేస్తారు. ఈ వ్యాక్సిన్‌లు వేయించుకోవడానికి ప్రతి ఒక్కరూ హైదరాబాద్ వెళ్లాల్సిందే. ఐపీఎం పరిధిలోనే ఫుడ్ సేఫ్టీ లేబొరేటరీ ఉంటుంది. ఆహార పదార్థాల నమూనాలను ఈ లేబొరేటరీలోనే పరీక్షించి నాణ్యత నిర్ధారిస్తారు. కల్తీ ఆహారానికి కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఆహార పదార్థాల నమూనాలను హైదరాబాద్‌కు పంపాల్సి రావడం, నిర్ధారణలో జాప్యం జరుగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చివరకు నీటి నమూనాలను కూడా అక్కడికే పంపాల్సి వస్తోంది. ప్రతి నమూనాను హైదరాబాద్‌కు పంపించి అక్కడ నుంచి ఫలితం వచ్చేవరకూ ఎదురుచూడటం, ఆ తర్వాత చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటం చాలా ఇబ్బందిగా ఉంటోందని అధికారులు వాపోతున్నారు. సగటున నెలకు ఒక్కో జిల్లా నుంచి 300 నుంచి 400 వరకూ ఆహార నమూనాలను హైదరాబాద్‌కు పంపాల్సి వస్తోందని చెబుతున్నారు.

ఎఫ్‌ఎస్ఎల్ మంజూరైనా..

విశాఖలో ఫుడ్ సేఫ్టీ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా తొలి దశలో రూ.50 లక్షలు బ్యాంకులో డిపాజిట్ కూడా చేసింది. ఈ నిధులు ఇచ్చి రెండేళ్లు దాటినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో రూ.50 లక్షలు బ్యాంకులో ఉండిపోయాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం.. లేబొరేటరీ నిర్మాణం చేయకపోతే నిధులు వెనక్కి తీసుకుంటామంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సమాధానమివ్వలేదు.

మొబైల్ ఫుడ్ లేబొరేటరీ ఇస్తామన్నా..

నలుగురు సిబ్బందిని నియమించుకుంటే ఒక మొబైల్ ఫుడ్ లేబొరేటరీ (వాహనంతో కూడిన లేబొరేటరీ)ని ఇస్తామని కేంద్రం తెలిపింది. ఒక ఎనలిస్ట్, టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక సహాయకుడు కలిపి నలుగురిని నియమించుకుంటే మొబైల్ లేబొరేటరీ ఇస్తామంది. అయితే ఈ సిబ్బందిని కూడా రాష్ట్ర ప్రభుత్వం నియమించలేదు. దీంతో మొబైల్ లేబొరేటరీ రాలేదు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఒక మొబైల్ లేబొరేటరీ తెచ్చుకోవడమే కాకుండా రెండో లేబొరేటరీకి కూడా ప్రతిపాదనలు పంపింది. నేడో, రేపో రెండో లేబొరేటరీ కూడా వస్తుంది. మన రాష్ట్రంలో లేబొరేటరీలు లేని కారణంగా అన్ని రకాల నమూనాల నిర్ధారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

చంద్రబాబు అవినీతిని రాష్ట్ర పర్యటనలో మోదీనే బయటపెడతారు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వెల్లడి

సాక్షి, అమరావతి/గుంటూరు (రైలుపేట): రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గుంటూరు, విశాఖ పర్యటనలో బయటపెట్టబోతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఈనెల 10న గుంటూరులో, 16న విశాఖలో మోదీ పర్యటించబోతున్న నేపథ్యంలో.. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై చర్చించేందుకు రాష్ట్ర పదాధికారులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర ముఖ్యనేతలతో కన్నా శనివారం గుంటూరులో అత్యవసర సమావేశం నిర్వహించారు. మోదీ రాష్ట్ర పర్యటన లోపే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు చేస్తున్న అవినీతి, వెన్నుపోట్లపై ప్రజలకు సాధ్యమైనంత వివరించి చెబుదామన్నారు. గతంలో అసెంబ్లీలో వేలు చూపించి మాట్లాడారని ఎమ్మెల్యే రోజాను సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. తాజాగా తమ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు బెదిరించారని సీఎంను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలా ఉండగా, కన్నా లక్ష్మీనారాయణ 4వ తేదీ నుంచి ప్రజా చైతన్య యాత్ర పేరుతో బస్సులో రాష్ట్రమంతా ప్రయాణించి కేంద్ర పథకాల గురించి వివరించనున్నారు. చండీగఢ్‌లో తయారైన ఈ బస్సును శనివారం గుంటూరు తీసుకొచ్చారు.

రేపు రాష్ట్రంలో అమిత్‌షా పర్యటన

శ్రీకాకుళం జిల్లా నుంచే కన్నా బస్సు యాత్ర ప్రారంభం

సాక్షి, అమరావతి: బీజేపీ జాతీయ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా సోమవారం రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఉదయం ఢిల్లీ నుంచి నేరుగా విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తర్వాత ఆయన విజయనగరం బయలుదేరి వెళతారు. రాష్ట్రంలోని పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే ప్రక్రియలో భాగంగా.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన పార్టీ బూత్ కమిటీ నేతలతో పాటు పార్టీ శక్తి కేంద్ర సభ్యులతో ఆయన విజయనగరంలో సమావేశమవుతారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా పలాసకు వెళ్లి..పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మొదలు పెట్టనున్న బస్సు యాత్రను ప్రారంభిస్తారు. కన్నా సోమ, మంగళవారాలు తన బస్సు యాత్రను కొనసాగించి, ప్రధాని రాష్ట్ర పర్యటన నేపథ్యంలో ఆ యాత్రకు తాత్కాలికంగా విరామం ఇస్తారు. పదో తేదీన గుంటూరులో, 16న విశాఖపట్నంలో ప్రధాని మోదీ బహిరంగ సభలు ముగిసిన తర్వాత, 17వ తేదీ నుంచి కన్నా తన బస్సు యాత్రను కొనసాగిస్తారు.

ఇరాన్ కొత్త క్షిపణి ప్రయోగం విజయవంతం

టెహ్రాన్: 1,350 కిలో మీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణిని శనివారం విజయవంతంగా పరీక్షించినట్లు ఇరాన్ ప్రకటించింది. 1979 నాటి ఇస్లామిక్ విప్లవం వార్షికోత్సవ సంబరాల ప్రారంభం రోజునే ఈ పరీక్ష జరపడం విశేషం. 2015లో ఆవిష్కరించిన, 700 కిలోమీటర్లు శ్రేణి కలిగిన సౌమర్ క్షిపణుల్లో భాగంగానే ఈ హోవీజెహ్‌ను క్షిపణిని అభివృద్ధి చేశారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.